www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



మిస్‌వరల్డ్ టాప్-24లో భారత్

'హెడ్ 2 హెడ్' పోటీల్లో 84 మంది ఔట్

రేపు ఖరారు కానున్న టాప్-10 జాబితా

2

అంతరిక్షంలో ఆయుధాలు!

శత్రు క్షిపణుల నుంచి రక్షణకు రూ.15 లక్షల కోట్లతో అమెరికా 'గోల్డెన్ డోమ్'.. మూడేళ్లలో అందుబాటులోకి

ప్రాజెక్టులో భాగంగా రోదసిలో లేజర్ ఆయుధాలు, ఏఐతో పనిచేసే స్పేస్‌బేస్డ్ సెన్సర్లు, ఇంటర్‌సెప్టర్లు!



గురువారం | 22-5-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 36 | శ్రీ విశ్వావసు నామసంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, బహుళపక్షం, తిథి: దశమి రా.1:13 తదుపరి ఏకాదశి, నక్షత్రం: పూర్వాభాద్ర సా.5:47 తదుపరి ఉత్తరాభాద్ర, వర్జ్యం: రా.2:41-4:10, దుర్ముహూర్తం: ఉ.10:02-10:54, మ.3:12-4:04, అమృతఘడియలు: ఉ.10:10-ఉ.11:41, రాహుకాలం: మ.1:30-3:00, సూర్యోదయం: 5:45, సూర్యాస్తమయం: 6:38 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



కడప జిల్లా సీకే దిన్నె మండలంలో సజ్జల కుటుంబ సభ్యుల ఆక్రమణలో ఉన్న అటవీ భూములను స్వాధీనం చేసుకుని హెచ్చరిక బోర్డు పెట్టిన అధికారులు

సజ్జల కబ్జాకు చెక్

ఆక్రమణ నుంచి 63 ఎకరాలకు విముక్తి

అటవీ భూమి 52 ఎకరాలు.. మిగిలినవి ఇరిగేషన్, అసైన్డ్ భూములు

వాటి విలువ రూ.220 కోట్లు.. అరటి, బొప్పాయి, జామ సాగు

అక్కడే గెస్ట్‌హౌస్‌లు, నిర్మాణాలు.. 'ఆంధ్రజ్యోతి' కథనంతో విచారణ

స్వాధీనం చేసుకుని హెచ్చరిక బోర్డు పెట్టిన రెవెన్యూ అధికారులు



కడప, మే 21(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా సీకే దిన్నె మండల పరిధిలో వైసీపీ నేత, జగన్ ప్రభుత్వంలో సలహాదారుగా పనిచేసిన సజ్జల రామకృష్ణారెడ్డి కుటుంబ సభ్యుల ఎస్టేట్‌లోని ఆక్రమిత భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. దాదాపు రూ.220 కోట్ల విలువ చేసే 63.72 ఎకరాలను రెవెన్యూ శాఖ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకుని హెచ్చరిక బోర్డు పెట్టారు. ఇందులో 52 ఎకరాల అటవీ భూమి ఉంది. మిగిలినవి ఇరిగేషన్, అసైన్డ్ భూములు. ప్రభుత్వ ఆదేశాల మేరకు

మిగతా 13వ పేజీలో...

అటవీ భూముల ఆక్రమణ కేసు కొట్టేయండి

అధికారులు జోక్యం చేసుకోకుండా నిలువరించండి

హైకోర్టును ఆశ్రయించిన పెద్దిరెడ్డి, కుటుంబ సభ్యులు

12



మావోయిస్టు చీఫ్

ఎన్‌కౌంటర్

అబూజ్‌మడ్‌లో నేలకొరిగిన నంబాల కేశవరావు



నంబాల కేశవరావు

మరో 26 మంది నక్సల్స్ కూడా.. ఎన్‌కౌంటర్‌లో ప్రధాన కార్యదర్శి మృతి ఇదే తొలిసారి

మావోయిస్టు పత్రిక(జంగ్) చీఫ్ ఎడిటర్ నాగేశ్వర్‌రావు మృతిచెందినట్లు ప్రచారం!

అబూజ్‌మడ్‌లో 72 గంటలపాటు ఆపరేషన్

కేశవరావుపై రూ.1.5 కోట్ల రివార్డు

ఒక జవాన్ మృతి.. ఐదుగురికి గాయాలు

అబూజ్‌మడ్‌లో కొనసాగుతున్న కూంబింగ్

ఆపరేషన్‌లో నాలుగు జిల్లాల బలగాలు

కేశవరావు స్వస్థలం ఏపీలోని శ్రీకాకుళం

వరంగల్‌లో ఇంజనీరింగ్ పూర్తి

రాడికల్ ఉద్యమం నుంచి నక్సలిజం వైపు

గణపతి తర్వాత మావోయిస్టు పార్టీ చీఫ్ పదవి

ఏడేళ్లుగా ఉద్యమాన్ని నడుపుతున్న కేశవరావు

చర్ల/హనుమకొండ/టెక్కలి/చింతపల్లి/సీలేరు/చీరాల, మే 21 (ఆంధ్రజ్యోతి): 'ఆపరేషన్ కగార్'తో ఉక్కిరిబిక్కిరవుతున్న మావోయిస్టు పార్టీకి మరో గట్టి దెబ్బ తగిలింది.! ఇప్పటికే అగ్రనాయకులను పోగొట్టుకుని, క్యాడర్ లొంగుబాట్లతో సతమతమవుతున్న మావోయిస్టు పార్టీ బుధవారం పెద్ద దిక్కును కోల్పోయింది. పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవ రాజు(71) ఛత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మడ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందారు. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం జీయన్న పేటకు చెందిన కేశవరావు వరంగల్ ఆర్ఈసీలో ఇంజనీరింగ్ పూర్తిచేశాక.. అజ్ఞాతంలోకి వెళ్లారు. నక్సలిజంపై పోలీసులు జరుపుతున్న ఐదు దశాబ్దాల పోరులో.. ప్రధాన కార్యదర్శి స్థాయి నేత మృతి చెందడం ఇదే తొలిసారి. బుధవారం నాటి ఎన్‌కౌంటర్‌లో మరో 26 మంది నక్సల్స్ చనిపోగా, వారిలో

మిగతా 14వ పేజీలో...

1 అద్భుత విజయం



మీ (భద్రతా బలగాల) అద్భుత విజయాన్ని చూసి గర్విస్తున్నా. మావోయిజం ముప్పును నిర్మూలించి, ప్రజలకు శాంతి, పురోగతితో కూడిన జీవితాన్ని అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది.

- ఎన్‌కౌంటర్‌పై ప్రధాని మోదీ

నక్సలిజం నిర్మూలనలో మైలురాయి: షా

సిక్కోలులో పుట్టి.. అంచెలంచెలుగా..

మిలటరీ ఆపరేషన్లలో సిద్ధహస్తుడు

అలిపిరి సహా 27 దాడుల్లో పాత్ర.. నంబాల ప్రస్థానం

సమగ్ర కథనాలు 14లో

నక్సల్స్ వెన్ను విరిగినట్టే!

కీలక దశకు చేరిన కగార్ ఆపరేషన్

ఒక్క ఏడాదిలోనే 540 మంది ఎన్‌కౌంటర్

అందులో నలుగురు కేంద్ర కమిటీ సభ్యులు

వేధిస్తున్న వయో భారం

ఖాళీ అయిన దండకారణ్య స్పెషల్ జోన్.. ఉనికి కోల్పోయిన ఏవోబీ కమిటీ

మావోయిస్టుల కొత్త దళపతి ఎవరు?

వేణుగోపాల్, రాజన్‌లలో ఒకరికి చాన్సు!

ప్రజాసంఘాల నేతల మనోగతం

మళ్లీ గణపతికే ఇవ్వొచ్చంటున్న ఇంకో వర్గం

సమస్యల పరిష్కారమే లక్ష్యం

అందుకే 'అక్షరమే అండగా- పరిష్కారమే అజెండాగా' నిర్వహణ

'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వేమూరి ఆదిత్య

మరో రూ.కోటితో అభివృద్ధి పనులు.. ఎమ్మెల్యే కోటంరెడ్డి హామీ

నెల్లూరు రూరల్ మండలం సౌత్ మోపూరు గ్రామంలో ఘనంగా విజయోత్సవ సభ



విజయోత్సవ సభలో మాట్లాడుతున్న నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి. చిత్రంలో 'ఆంధ్రజ్యోతి' ఈడీ వేమూరి ఆదిత్య, టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి తదితరులు

నెల్లూరు/తిరుపతి, మే 21 (ఆంధ్రజ్యోతి): "పత్రికలు సమస్యలను ఎత్తిచూపడంతోనే ఆగిపోతున్నాయి. 'ఆంధ్రజ్యోతి' మాత్రం మరో అడుగు ముందుకేసింది. సమస్యలను ఎత్తిచూపడమే కాదు.. వాటిని పరిష్కారించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ క్రమంలోనే 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' కార్యక్రమాన్ని రూపొందించాం. రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో దీని ద్వారా పలు సమస్యలను పరిష్కరించాం" అని 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వేమూరి ఆదిత్య



పేర్కొన్నారు. బుధవారం నెల్లూరు రూరల్ మండలం సౌత్ మోపూరు గ్రామంలో 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' కార్యక్రమం విజయోత్సవ సభ జరిగింది. ఈ కార్యక్రమానికి నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డితో పాటు వేమూరి ఆదిత్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకుముందు గ్రామానికి చేరుకున్న ఆదిత్యకు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి సోదరులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం హైస్కూల్ ప్రాంగణంలో

మిగతా 3వ పేజీలో...



12

కుప్పంలోని ప్రసన్న తిరుపతి గంగమ్మ జాతర సందర్భంగా అమ్మవారికి సారె తీసుకెళ్తున్న సీఎం చంద్రబాబు దంపతులు

రాష్ట్రానికి గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టు!

మూలపేట పోర్టు సమీపంలో రూ.10 వేల కోట్లతో ఏర్పాటు

దేశంలోనే అతిపెద్ద ప్రాజెక్టు.. నెదర్లాండ్స్ సమ్మిట్‌లో ఎంవోయూ

10

టీచర్ల బదిలీలు ఆరంభం!

షెడ్యూల్ విడుదల.. మొదలైన దరఖాస్తుల స్వీకరణ

ఏకకాలంలో ట్రాన్స్‌ఫర్లు, ప్రమోషన్లు కూడా

12

కిక్కురుమనలేరు

మద్యం స్కామ్‌లో పక్కాగా టెక్ ఆధారాలు

'ఆర్డర్' మెయిల్స్ నుంచి కలెక్షన్ కాల్స్ దాకా..

ఫైళ్లు, కంప్యూటర్లు, ఫోన్ల ఫోరెన్సిక్ విశ్లేషణ

నేడు పూర్తి నివేదిక కోర్టుకు సమర్పణ

తప్పించుకునే అవకాశమే లేకుండా ఉచ్చు



(అమరావతి - ఆంధ్రజ్యోతి)

నేరం చేసిన వాళ్లు అబద్ధాలు చెప్పవచ్చు! 'మాకేం తెలియదు. మేమే పాపమూ ఎరుగం' అని అమాయకత్వం నటించవచ్చు. కానీ.. టెక్నాలజీ అబద్ధం చెప్పదు! తప్పించుకోవడం అస్సలు కుదరదు! మద్యం కుంభకోణం కేసులో నిందితుల చుట్టూ 'టెక్నాలజీ' ఉచ్చు బిగుస్తోంది. 'మద్యం కుంభకోణం జరగలేదు. ఇదంతా టీడీపీ కక్షసాధింపు. రెడ్‌బుక్ రాజ్యాంగం' అంటూ వైసీపీ నేతలు, జగన్ సొంత మీడియా చేస్తున్న తప్పుడు ప్రచారానికి చెక్ చెప్పేందుకు 'సిట్' సిద్ధమైంది. మద్యం కుంభకోణంలో ఎవరి పాత్ర ఏమిటి, ముడుపుల ప్రవాహం ఎలా సాగింది.. ఎవరెవరికి చేరింది... అసలు వాటా దక్కించుకున్న 'అంతిమ లబ్ధిదారు' ఎవరు... అనే వివరాలను 'సిట్' ఇప్పటికే సేకరించింది. ఇప్పుడు... దీనికి సంబంధించిన తిరుగులేని సాంకేతిక ఆధారాలను కూడా సిద్ధం చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. గురువారం కోర్టుకు ఈ నివేదిక సమర్పించే అవకాశముంది. దీంతో... లిక్కర్ స్కామ్ నిందితులు తప్పించుకోవడం అసాధ్యమని చెబుతున్నారు.

పక్కాగా ఆధారాలు... ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ కార్యాలయం నుంచి అప్పటి ఎండీ వాసుదేవ రెడ్డి ఫైళ్లు ఎత్తుకెళ్లడం... ఆ ఫైళ్లతోపాటు

మిగతా 13వ పేజీలో...



లండన్‌లో ఇంటర్నేషనల్ బుకర్ ప్రైజ్ స్వీకారం సందర్భంగా బాను ముస్తాక్, దీపా భస్తీ

2

కన్నడ రచయిత్రికి ఇంటర్నేషనల్ బుకర్

'హార్ట్ ల్యాంప్' కథలకు ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని గెలుచుకున్న బాను ముస్తాక్

బుకర్ దక్కించుకున్న తొలి కన్నడ పుస్తకం

కథల అనువాదకురాలు దీపా భస్తీతో కలిసి లండన్‌లో పురస్కారం స్వీకరించిన బాను

అఫ్ఘానిస్థాన్‌లోకి చైనా-పాక్ ఎకనామిక్ కారిడార్

2

విస్తరించాలని మూడు దేశాల నిర్ణయం

రైస్ కార్డులో 'మ్యాపింగ్'

మంటలు!

వైసీపీ ప్రభుత్వంలో తప్పులతడకగా హౌస్ హోల్డ్ మ్యాపింగ్

దాని ఆధారంగా దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ

దీనిలో సాంకేతిక సమస్యలతో చిక్కులు

మ్యారేజీ సర్టిఫికెట్ అవసరం లేదన్న మంత్రి

సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేయకపోవడంతో ఇబ్బంది

మార్పులు చేర్పులకే ఎక్కువగా దరఖాస్తులు

కొత్త కార్డుల కోసం వచ్చినవి 59,959

సభ్యుల చేరికల కోసం 4 లక్షలకు పైగా..

ఒక్క ఉద్యోగినీ తొలగించం

సచివాలయ సిబ్బంది ఆందోళన చెందొద్దు

కార్యాలయాల సంఖ్య తగ్గించే యోచన లేదు

వాటి ద్వారా రియల్ టైమ్‌లో మరిన్ని సేవలు

సిబ్బందిని సర్దుబాటు చేశాకే బదిలీలు: డోలా

12

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

కొత్త రైస్ కార్డు దరఖాస్తులను ఆన్‌లైన్ చేసే ప్రక్రియ రసాభాసగా మారుతోంది. హౌస్ హోల్డ్ మ్యాపింగ్ కారణంగా ఎదురవుతున్న సాంకేతిక సమస్యలు ఇటు అర్జీదారులకు, అటు గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందికి పెద్ద తలనొప్పిగా మారాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎలాంటి ముందుచూపు లేకుండా తప్పులతడకగా చేసిన ఈ మ్యాపింగ్ ఆధారంగా ప్రస్తుతం రైస్ కార్డు దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తుండటం సమస్యగా మారింది. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి కొత్త రైస్ కార్డు మంజూరు చేయడంతో పాటు ఉన్న కార్డుల

మిగతా 13వ పేజీలో...

కుంకీలొచ్చేశాయ్..



బెంగళూరులో కుంకీ ఏనుగులకు పూలు జల్లి స్వాగతం పలుకుతున్న ఏపీ డిప్యూటీ సీఎం పవన్. చిత్రంలో కర్ణాటక సీఎం సిద్దరామయ్య, డిప్యూటీ సీఎం శివకుమార్ తదితరులు

రాష్ట్రానికి దేవా, కృష్ణ, అభిమన్యు, రంజన్

నాలుగు కుంకీ ఏనుగులను అప్పగించిన కర్ణాటక

పూలు చల్లి స్వాగతం పలికిన డిప్యూటీ సీఎం పవన్

12

రాహుల్, సోనియాకు 142 కోట్ల లబ్ధి!



నేషనల్ హెరాల్డ్ మనీ లాండరింగ్‌లో వారికి అనుచిత ప్రయోజనం

ప్రజల విరాళాలను ప్రైవేటు ఆస్తిగా మార్చేందుకే 'యంగ్ ఇండియా'

అది మోసపూరిత సంస్థ .. ఢిల్లీ కోర్టులో ఈడీ

2

జోరుగా వర్షాలు!

నేడు అరేబియా సముద్రంలో అల్పపీడనం

రెండు రోజుల్లో బంగాళాఖాతంలోనూ..

3



13

షర్మిలను తరలిస్తున్న పోలీసులు

షర్మిల దీక్ష భగ్నం

తొలగించిన ఉక్కు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలంటూ విశాఖలో ఆమరణ దీక్ష

రాత్రి భగ్నం చేసి తరలించిన పోలీసులు

కోల్‌కతాలోకి డ్రోన్లు?.. ఆర్మీ కేంద్రంపైకి ఒకటి?

కోల్‌కతా, మే 21: కోల్‌కతాలో డ్రోన్ల సంచారం కలకలం రేపింది. నగరంలోని ప్రముఖ ప్రదేశాలపై డ్రోన్లను పోలిన వస్తువులు ఎగురుతూ కనిపించాయి. ఆపరేషన్ సిందూర్ తర్వాత ఈ ఘటన చోటు చేసుకోవడంతో కేంద్ర, రాష్ట్ర సంస్థలు అప్రమత్తమయ్యాయి. గూఢచర్యంతో పాటు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టాయి. నగరంలోని హేస్టింగ్స్ ప్రాంతం, విద్యాసాగర్ సేతు, మైదాన్ ప్రాంతాల్లో సోమవారం రాత్రి దాదాపు పది డ్రోన్ల లాంటి వస్తువులు ఎగురుతూ కనిపించినట్లు అధికారులు బుధవారం వెల్లడించారు. ఈ ఎగిరే వస్తువులను ముందుగా హేస్టింగ్స్ పోలీసు స్టేషన్ సిబ్బంది గుర్తించారు. అవి డ్రోన్ల మాదిరిగానే ఉన్నాయని పోలీసులు తెలిపారు. దక్షిణ 24 పరగణాల జిల్లాలోని మహేశ్తల వైపు నుంచి అవి ఎగురుతూ వచ్చాయన్నారు. హేస్టింగ్స్ ప్రాంతం, రెండవ హుగ్లీ వంతెన(విద్యా సాగర్ సేతు)తో పాటు ఫోర్టు విలియం(ఆర్మీ తూర్పు కమాండ్ ప్రధాన కార్యాలయం) మీదుగా సంచరించాయని పేర్కొన్నారు. ఈ వార్తలపై రక్షణ శాఖ స్పందించింది. "డ్రోన్ వార్తల ప్రామాణికతను పరిశీలిస్తున్నాం. ఊహాగానాలను వ్యాప్తి చేయొద్దు." అని రక్షణ శాఖ కోరింది.

నన్ను పెళ్లి చేసుకోవా!!



- పాకిస్థాన్‌లోనే మన పెళ్లి!
- పాక్ ఏజెంటుతో జ్యోతి చాటింగ్

న్యూఢిల్లీ, మే 21 : పాకిస్థాన్‌కు గూఢచారిగా వ్యవహరించిన హరియాణాకు చెందిన యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాపై విచారణలో ఆ దేశ ఇంటెలిజెన్స్ అధికారి ఒకరితో ఆమె జరిపిన వాట్సాప్ చాటింగ్ తాజాగా బయటకు వచ్చింది. పాకిస్థాన్ గూఢచారి సంస్థ 'ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్' అధికారి అలి హసన్‌కు ఆమె చాలా దగ్గర అయినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. అతడితో తరచూ మాట్లాడుతూ ఉండేది. వీరిద్దరి మధ్య జరిగిన వాట్సాప్ చాట్‌లను ఈ కేసు విచారిస్తోన్న హరియాణా పోలీసులు సేకరించారు. అందులో ఒకదాంట్లో జ్యోతి హసన్‌ను "నన్ను పాకిస్థాన్‌లోనే పెళ్లి చేసుకో..." అని కోరింది. ఈ ఇద్దరి మధ్య వాట్సాప్ చాట్‌ల ద్వారా కోడ్ భాషలోనూ పలుసార్లు చర్చలు సాగాయి. భారత నిఘా కార్యకలాపాల గురించి ఈ కోడ్ భాషలో చర్చించారు. పోలీసులు తమ విచారణలో జ్యోతికి 4బ్యాంకు ఖాతాలు ఉన్నట్లు గుర్తించారు. వీటిలో ఒక ఖాతాకు దుబాయి నుంచీ లావాదేవీలు జరిపారు. ఇదిలా ఉండగా, గూఢచర్యానికి పాల్పడుతున్నాడనే ఆరోపణలతో ఢిల్లీలోని పాకిస్థాన్ హైకమిషన్‌కు చెందిన ఓ అధికారిని 24 గంటల్లోగా దేశం విడిచి వెళ్లిపోవాలని కేంద్రం ఆదేశించింది.

వేతన పెంపునకు ఒకరోజు ముందు ఉద్యోగ విరమణ చేసినా హైక్ వర్తిస్తుంది!

- కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు గొప్ప ఊరట

న్యూఢిల్లీ, మే 21: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త. వేతన పెంపునకు ఒకరోజు ముందే ఉద్యోగ విరమణ చేసే వారికి తమకు పెంపు వర్తించదేమోనన్న ఆందోళన అక్కర్లేదు! వార్షిక వేతన పెంపు తేదీకి ఒక్కరోజు ముందు రిటైర్ అయ్యే ఉద్యోగులకు కూడా నోషనల్ ఇంక్రిమెంట్ వర్తిస్తుందని డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ (డీవోపీటీ) ఒక ప్రకటనలో పేర్కొంది. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం వేతనాల పెంపునకు జనవరి 1, జూలై 1 తేదీలను ప్రతిపాదించారు. ఈ మేరకు డిసెంబరు 31, జూన్ 30 తేదీల్లో ఉద్యోగ విరమణ చేసేవారికి కూడా నోషనల్ హైక్ వర్తించనుంది. ఇదివరకు.. ఇలాంటి వాటిల్లో కోర్టు ఉత్తర్వులు జారీ అయిన కేసుల్లోనే నోషనల్ ఇంక్రిమెంట్ వర్తింపజేసేవారు. తాజాగా కేంద్రమే ప్రకటన చేయడంతో డిసెంబరు 31, జూన్ 30 తేదీల్లో రిటైర్ అయిన ఉద్యోగులకూ ప్రయోజనం కలగనుంది.

అఫ్ఘానిస్థాన్‌లోకి చైనా-పాక్ ఎకనామిక్ కారిడార్

న్యూఢిల్లీ, మే 21: చైనా-పాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్(సీపెక్)ను అఫ్ఘానిస్థాన్‌కు కూడా విస్తరించాలని నిర్ణయించారు. చైనా రాజధాని బీజింగ్‌లో బుధవారం చైనా, పాకిస్థాన్, అఫ్ఘానిస్థాన్ దేశాల విదేశాంగ మంత్రుల సమావేశం జరిగింది. సీపెక్‌ను విస్తరించాలని ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు పాక్ విదేశాంగ మంత్రి ప్రకటన ఇషాక్ ధార్ ఎక్స్‌లో పోస్టు చేశారు. సీపెక్‌ను అఫ్ఘానిస్థాన్‌కు విస్తరించడం వల్ల ఆ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం వస్తాయని, అభివృద్ధి జరుగుతుందని అన్నారు. సీపెక్‌పై తదుపరి సమావేశాన్ని అఫ్ఘానిస్థాన్‌లో నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. 60బిలియన్ డాలర్లతో నిర్మిస్తున్న ఈ కారిడార్ పాక్ ఆక్రమిత కశ్మీర్ నుంచి వెళ్తోంది. ఈ ప్రాజెక్టును భారత్ వ్యతిరేకిస్తోంది.

మాస్క్ ధరించండి..!

- కొవిడ్ లక్షణాలు కనిపిస్తే పరీక్షలు చేయించుకోండి

అమరావతి, మే 21(ఆంధ్రజ్యోతి): దేశంలో కొవిడ్ బాధితుల సంఖ్య పెరగడంతో ఆరోగ్యశాఖ ప్రజల్ని అప్రమత్తం చేసింది. ఈ మేరకు హెల్త్ డైరెక్టర్ పద్మావతి ప్రత్యేక సూచనలు చేస్తూ బుధవారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ఎవరికైనా జ్వరం, దగ్గు, జలుబు, గొంతునొప్పి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. లక్షణాలు కనిపిస్తే వెంటనే కొవిడ్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని ప్రకటనలో చెప్పారు. కొవిడ్ నిర్ధారణ అయితే హోం ఐసోలేషన్‌లో ఉండాలన్నారు. బస్సు, రైలు ప్రయాణాలు చేసినప్పుడు మాస్కు ధరించాలని చెప్పారు.

మిస్‌వరల్డ్ టాప్-24లో భారత్

- 'హెడ్ 2 హెడ్' పోటీల్లో 84 మంది ఔట్



మిస్‌వరల్డ్ 'హెడ్ 2 హెడ్' పోటీలో పాల్గొన్న సుందరీమణులు

హైదరాబాద్, మే 21(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆతిథ్యమిస్తున్న మిస్ వరల్డ్-2025 పోటీలు రసవత్తరంగా మారుతున్నాయి. పోటీలో పాల్గొన్న 108 దేశాల సుందరీమణుల నుంచి టాప్-24 జాబితాను మిస్‌వరల్డ్ నిర్వాహక సంస్థ బుధవారం ప్రకటించింది. ఇందులో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న నందినీ గుప్తా సహా.. 4 ఖండాల నుంచి 24 మంది అందగత్తెలు ఉన్నారు. వీరిలో యూరప్‌లోని పోలండ్, మాల్టా, ఇటలీ, ఎస్తోనియా, జర్మనీ, నెదర్లాండ్స్, వేల్స్, చెక్ రిపబ్లిక్, ఐర్లాండ్ దేశాలకు చెందిన 9 మంది ఉన్నారు. ఇక అమెరికా-కరేబియన్ ఖండం నుంచి అమెరికా, బ్రెజిల్, జమైకా, అర్జెంటినా, కేమెన్ ఐలాండ్స్, ట్రినిడాడ్ అండ్ టొబాగోకు చెందిన ఆరుగురు ఎంపికయ్యారు. కాగా, ఆసియా-ఓసియానా ఖండం నుంచి భారత్, శ్రీలంక, ఆస్ట్రేలియా, ఇండోనేసియా, ఫిలిప్పీన్స్ దేశాలకు చెందినవారు. ఆఫ్రికా నుంచి నైజీరియా, ఇథియోపియా, కామెరూన్, కెన్యా దేశాల సుందరీమణులు ఉన్నారు. కాగా పోటీదారులు 'బ్యూటీ విత్ పర్పస్' పేరుతో తమ సేవా కార్యక్రమాలను వివరించే 'హెడ్ 2 హెడ్' పోటీలు మంగళవారం ప్రారంభమై.. బుధవారం ముగిశాయి. రెండు రోజుల్లో మొత్తం 108 మంది ఈ పోటీలో పాల్గొన్న అనంతరం టాప్-24 జాబితాను ప్రకటించారు. దీంతో మిగతా 84 దేశాలు పోటీల నుంచి వైదొలిగాయి.

రేపు తేలనున్న తుది జాబితా..

ఈ నెల 23న నిర్వహించనున్న కీలకమైన పోటీలో 24 మంది అందాల భామలు తమ ప్రతిభను చాటనున్నారు. వీరిలో నుంచి టాప్-10ను ఎంపిక చేస్తారు. వారు ఈ నెల 31న హెచ్ఐసీసీలో జరిగే తుది పోటీల్లో పాల్గొంటా రు. ఆ పోటీల్లో టాప్-10లోనుంచి ఒక్కో ఖండం నుంచి ఇద్దరు చొప్పున 4 ఖండాలకు చెందిన 8 మందిని ఎంపిక చేస్తారు. చివరికి ఒక్కో ఖండం నుం చి ఒకరి చొప్పున నలుగురిని ఖరారు చేస్తారు. వీరిని మిస్ వరల్డ్ ఆసియా, మిస్ వరల్డ్ ఓసియానా, మిస్ వరల్డ్ ఆఫ్రికా, మిస్ వరల్డ్ యూరప్ విజేతలుగా ప్రకటిస్తారు. ఈ నలుగురిలో నుంచి మిస్ వరల్డ్ విజేతను ఎంపిక చేస్తారు. భారత్ ప్రతినిధిగా ఉన్న నందినీ గుప్తా ఆసియా-ఓసియానా ఖండం నుంచి విజేతగా నిలవాలంటే ఈ నాలుగు దేశాలతో పోటీపడాల్సి ఉంటుంది.

అంతరిక్షంలో ఆయుధాలు!

- శత్రు క్షిపణుల నుంచి రక్షణకు రూ.15 లక్షల కోట్లతో అమెరికా 'గోల్డెన్ డోమ్'



వాషింగ్టన్, మే 21: హమాస్ దాడుల నుంచి తన ప్రజలను కాపాడుకోవడానికి ఇజ్రాయెల్ 'ఐరన్ డోమ్' అనే రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నట్టే.. శత్రు దేశాల క్షిపణుల నుంచి రక్షణకు అమెరికా 'గోల్డెన్ డోమ్'ను ఏర్పాటు చేసుకోనుంది. అందులో భాగంగా.. చరిత్రలో తొలిసారి అంతరిక్షంలోనూ ఆయుధాలను మోహరించేందుకు సిద్ధమవుతోంది. అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మంగళవారం దీనిపై ఒక ప్రకటన చేశారు. 175 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.15 లక్షల కోట్లు) దాకా ఖర్చయ్యే ఈ 'గోల్డెన్ డోమ్ మిసైల్ షీల్డ్ సిస్టమ్' మూడేళ్లలో (అంటే తన పదవీకాలం పూర్తయ్యేసరికి) అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఇందుకోసం ప్రాథమికంగా దాదాపు రూ.2 లక్షల కోట్ల నిధులు కేటాయిస్తున్నట్టు చెప్పారు. గోల్డెన్ డోమ్ నిర్మాణం పూర్తయితే.. భూమికి ఆవలివైపు నుంచి వచ్చే క్షిపణులను, నింగి నుంచి ప్రయోగించిన క్షిపణులను సైతం అది అడ్డుకోగలదన్నారు. అమెరికా మనుగడకు, మన విజయాలకు ఇది అత్యంత కీలకమని వ్యాఖ్యానించారు. కెనడా కూడా ఈ ప్రాజెక్టులో భాగం కావడానికి.. ఈ వ్యవస్థ ద్వారా రక్షణ పొందడానికి ఆసక్తి చూపుతోందని చెప్పారు. గోల్డెన్ డోమ్ కొత్తదేమీ కాదని.. రోనాల్డ్‌రీగన్ అమెరికా అధ్యక్షుడిగా ఉన్నప్పుడే ఈ తరహా వ్యవస్థను ప్రతిపాదించారని ట్రంప్ గుర్తుచేశారు. అప్పట్లో ఇంత సాంకేతిక పరిజ్ఞానం లేకపోవడం వల్ల ఏర్పాటు చేయలేకపోయారన్నారు. ఎయిర్‌ఫోర్స్, స్పేస్ ఫోర్స్‌లో 30 ఏళ్ల అనుభవం ఉన్న అధికారి.. ప్రస్తుతం అమెరికా స్పేస్ ఆపరేషన్స్ వైస్ చీఫ్‌గా వ్యవహరిస్తున్న జనరల్ మైకేల్ గుట్లిన్‌కు గోల్డెన్ డోమ్ అభివృద్ధి బాధ్యతలను ట్రంప్ అప్పగించారు. కాగా.. క్రూయిజ్ క్షిపణులు, బాలిస్టిక్ క్షిపణులు, హైపర్‌సానిక్ క్షిపణులు, డ్రోన్లతో.. అమెరికాపై శత్రువులు జరిపే సాధారణ, అణు దాడులను గోల్డెన్ డోమ్ ద్వారా అడ్డుకోవచ్చని పెంటగాన్ చీఫ్ పీట్ హెగ్‌సెత్ తెలిపారు. గోల్డెన్ డోమ్ ప్రణాళికను రష్యా, చైనా వ్యతిరేకిస్తున్నాయి. ఈ వ్యవస్థ అంతరిక్షాన్ని యుద్ధరంగంగా మార్చే ప్రమాదం ఉందని, అస్థిరతలను పెంచుతుందని ఆందోళన వెలిబుచ్చాయి. 2022లో అమెరికా జోబైడెన్ హయాంలో విడుదల చేసిన మిసైల్ డిఫెన్స్ రివ్యూ నివేదికలోనే.. చైనా, రష్యాల నుంచి పెరుగుతున్న ముప్పు గురించి ప్రస్తావించింది. ఇజ్రాయెల్ 2011 నుంచి వినియోగిస్తున్న ఐరన్ డోమ్ రక్షణ వ్యవస్థ.. హమాస్ ప్రయోగించే వేలాది షార్ట్ రేంజ్ రాకెట్లను నిర్వీర్యం చేస్తున్న సంగతి తెలిసిందే. దాని స్ఫూర్తితోనే అమెరికా ఈ ప్రాజెక్టుకు గోల్డెన్ డోమ్ అనే పేరు పెట్టింది. అయితే.. ఐరన్ డోమ్ భూమ్మీద ఏర్పాటు చేసుకున్న వ్యవస్థ. కానీ, ఇప్పుడు ట్రంప్ ప్రకటించిన గోల్డెన్ డోమ్ రక్షణ వ్యవస్థలో భాగంగా నేలపైనే కాక అంతరిక్షంలోనూ ఆయుధాలను మోహరిస్తారు. ఈ వ్యవస్థ.. అమెరికా దిశగా దూసుకొచ్చే క్షిపణులను మధ్యలోనే అడ్డుకుని తుత్తునియలు చేస్తుంది. ఈ ప్రాజెక్టుకు 175 బిలియన్ డాలర్ల దాకా ఖర్చవుతుందని ట్రంప్ చెప్పినప్పటికీ.. అమెరికా బడ్జెట్ కార్యాలయం మాత్రం వచ్చే 20 ఏళ్లలో దీనికి 542 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.42 లక్షల కోట్ల) దాకా వ్యయమవుతుందని అంచనా వేస్తోంది.


ఎలా పనిచేస్తుంది?

శత్రు దేశ క్షిపణులను అడ్డుకునే.. పేట్రియాట్ మిసైల్ బ్యాటరీస్, థాడ్ (టెర్మినల్ హై ఆల్టిట్యూడ్ ఏరియా డిఫెన్స్), ఏజిస్ బాలిస్టిక్ మిసైల్ డిఫెన్స్, గ్రౌండ్ బేస్డ్ మిడ్ కోర్స్ డిఫెన్స్ (జీఎండీ), అవెంజర్ వంటి అత్యంత అధునాతన రక్షణ వ్యవస్థలు అమెరికా వద్ద ఇప్పటికే ఉన్నాయి. రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో.. రష్యా ప్రయోగించిన అత్యాధునిక క్షిపణులను అమెరికా వ్యవస్థలే సమర్థంగా అడ్డుకున్నాయి. అటు ఇరాన్ క్షిపణి, డ్రోన్ దాడుల నుంచి ఇజ్రాయెల్‌ను కాపాడింది కూడా అమెరికా రక్షణ వ్యవస్థలే. మరి కొత్తగా ఈ గోల్డెన్ డోమ్ ప్రతిపాదన ఎందుకు? అది ఎలా పనిచేస్తుంది? అంటే.. ఆ వివరాలేవీ ప్రస్తుతానికి అధికారికంగా అందుబాటులో లేవు. అయితే.. ఈ వ్యవస్థలో భాగంగా రోదసిలో 'డైరెక్టెడ్ ఎనర్జీ సిస్టమ్స్' (లేజర్లు) ఏర్పాటు చేయాల్సి ఉంటుందని కొందరు నిపుణులు చెబుతున్నారు. ఆ లేజర్లు.. అమెరికా దిశగా దూసుకొచ్చే క్షిపణులను అడ్డుకుంటాయని.. కానీ, వాటిని మోహరించడం అంత సులువు కాదని వారు పేర్కొంటున్నారు. "ఒక్కో డిఫెన్సివ్ స్పేస్ బేస్డ్ లేజర్.. హబుల్ టెలిస్కోప్ అంత ఉంటుంది" అని బ్రూకింగ్స్ ఇన్‌స్టిట్యూషన్‌కు చెందిన రక్షణ రంగ నిపుణుడు మైకేల్ ఓ హాన్లోన్ తెలిపారు. అలాంటి అత్యంత శక్తిమంతమైన ఒక్కో వ్యవస్థనూ అభివృద్ధి చేయడమే కాక.. వాటిని కక్ష్యలో, ప్రమాదకర వాతావరణంలో నిర్వహించడం కూడా సవాళ్లతో కూడుకున్న వ్యవహారమని ఆయన అభిప్రాయపడ్డారు. లాక్‌హీడ్ మార్టిన్ సీఈవో జిమ్ టైక్లెట్ ప్రకారమైతే.. గోల్డెన్ డోమ్ వ్యవస్థలో ప్రపంచవ్యాప్తంగా ఎక్కడ మిసైల్ లాంచింగ్ జరిగినా బూస్ట్ ఫేజ్‌లోనే గుర్తించే ఉపగ్రహాలు (స్పేస్‌బేస్డ్ సెన్సర్లు), దూసుకొచ్చే క్షిపణులను అడ్డుకునే స్పేస్ బేస్డ్ క్షిపణులు, ఏఐ ఆధారిత కమాండ్ సిస్టమ్స్ వంటివి ఉంటాయి.

రాహుల్, సోనియాకు 142 కోట్ల లబ్ధి!

న్యూఢిల్లీ, మే 21: నేషనల్ హెరాల్డ్ పత్రికకు సంబంధించిన మనీలాండరింగ్ వ్యవహారంలో కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ రూ.142 కోట్ల అనుచిత ప్రయోజనం పొందారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తెలిపింది. కాంగ్రెస్‌కు పార్టీకి ప్రజలిచ్చిన విరాళాలను ప్రైవేటు ఆస్తులుగా మలచుకునేందుకే 'యంగ్ ఇండియా' కంపెనీని ఏర్పాటు చేశారని.. నిజానికి అదో మోసపూరిత కంపెనీ అని పేర్కొంది. బుధవారం ఢిల్లీ రౌజ్ అవెన్యూ కోర్టు ప్రత్యేక జడ్జి విశాల్ గోగ్నే ఎదుట ఈడీ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు వాదనలు వినిపించారు. నేషనల్ హెరాల్డ్ పత్రికను ప్రచురించే అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్), దానికున్న రూ.2 వేల కోట్ల ఆస్తులపై నియంత్రణ కోసం 2010లో యంగ్ ఇండియన్ కంపెనీని ఏర్పాటు చేశారని తెలిపారు. 2023 నవంబరులో దాని ఆస్తులు జప్తు చేశామని.. అప్పటివరకు.. అంటే 13 ఏళ్లపాటు ఆయా ఆస్తులను అనుభవించారని.. అద్దెల కింద రూ.142 కోట్ల ఆదాయం అక్రమంగా పొందారని పేర్కొన్నారు. కేసు డాక్యుమెంట్లు 5 వేల పేజీలు ఉన్నాయని.. తమ స్పందన తెలియజేసేందుకు సమయమివ్వాలని రాహుల్, సోనియా తరఫు సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ కోరారు. దీంతో కోర్టు విచారణను జూలైకి వాయిదావేసింది. జూలై 2 నుంచి 8 వరకు రోజువారీ విచారణ జరుపుతామని వెల్లడించింది. నేషనల్ హెరాల్డ్/ఏజేఎల్ ఆస్తులకు సంబంధించి బీజేపీ సీనియర్ నేత సుబ్రమణ్యంస్వామి ప్రైవేటు ఫిర్యాదు చేశారు. ఢిల్లీ కోర్టు 2014లో దానిని పరిగణనలోకి తీసుకుంది. దాని ఆధారంగా 2021లో ఈడీ కేసు నమోదుచేసింది. సోనియా, రాహుల్, శామ్ పిట్రోడా, సుమన్ దూబే, యంగ్ ఇండియన్, ఇంకో రెండు అనుబంధ సంస్థలను నిందితులుగా చేర్చింది. గత నెల 9న చార్జీషీటు కూడా దాఖలుచేసింది. ఏజేఎల్ స్వాధీనంలో కాంగ్రెస్ అధ్యక్షురాలిగా తన పదవిని సోనియాదుర్వినియోగం చేశారని ఈడీ వర్గాలు తెలిపాయి. 'యంగ్ ఇండియన్, ఏజేఎల్ పరిపాలన, ఆర్థిక వ్యవహారాల అధికారాన్ని మోతీలాల్ వోరాకు అప్పగించామని.. అన్నీ ఆయనే చూసుకున్నారని సోనియా, రాహుల్ విచారణలో చెప్పారు. సోనియా అధికార దుర్వినియోగానికి పాల్పడగా.. రాహుల్ ఏజేఎల్ వాటాదారులను, ఏఐసీసీ దాతలను మోసగించారు. రూ.988 కోట్ల అక్రమంలో ఆయన క్రియాశీల పాత్ర పోషించారు' అని వెల్లడించాయి.

లోకం తీరు



కన్నడ రచయిత్రి బాను ముస్తాక్‌కు ఇంటర్నేషనల్ బుకర్ ప్రైజ్

- 'హార్ట్ ల్యాంప్' కథలకు పురస్కారం
- బుకర్ దక్కించుకున్న తొలి కన్నడ పుస్తకం



బెంగళూరు, మే 21 (ఆంధ్రజ్యోతి) : కన్నడ రచయిత్రి బాను ముస్తాక్ ప్రతిష్ఠాత్మకమైన ఇంటర్నేషనల్ బుకర్ ప్రైజ్‌ను గెలుచుకున్నారు. తన కథల పుస్తకం 'హార్ట్ ల్యాంప్'కుగాను ఆమెను 2025 సంవత్సరానికి ఈ పురస్కారం వరించింది. లండన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో మంగళవారం అనువాదకురాలు దీపా భస్తీతో కలిసి బాను అవార్డును అందుకున్నారు. బుకర్ ప్రైజ్ కన్నడ సాహిత్యానికి లభించడం ఇదే తొలిసారి. దీనిని భిన్నత్వానికి లభించిన విజయంగా రచయిత్రి బాను అభివర్ణించారు. ఆమె కర్ణాటకలోని హసన్‌లో న్యాయవాదిగా పనిచేస్తున్నారు. ముస్లిం సామాజికవర్గానికి చెందిన బాలికలు, యువతుల దైనందిన జీవితాలను తన కథల ద్వారా బాను పరిచయం చేశారు. దక్షిణాదిలో పితృస్వామిక సమాజాల్లోని మహిళల దీరోదత్తతకు 'హార్ట్ ల్యాంప్'లోని 12 కథలు అద్దం పట్టాయని బుకర్ ప్రైజ్ వర్గాలు తెలిపాయి. కాగా, అందమైన భాషకు లభించిన మరింత అందమైన విజయం అంటూ తన సంతోషాన్ని అనువాదకురాలు దీపా భస్తీ పంచుకున్నారు. బాను 1990 నుంచి 2023 వరకు రాసిన కథల్లోంచి 12 కథలను ఎంపిక చేసుకుని దీపా భస్తీ 'హార్ట్ ల్యాంప్' కథల పేరిట ఇంగ్లిషులోకి అనువదించారు. నగదు పురస్కారం కింద ఈ ఇద్దరికి చెరో 25వేల పౌండ్లు (రూ.28,76,845) లభించాయి. భారతీయ సాహిత్యానికి గత మూడేళ్లలో బుకర్ ప్రైజ్ రావడం ఇది రెండోసారి.

వెట్టిచాకిరీకి బాలుడు బలి!

- తల్లి తీసుకున్న అడ్వాన్సు సొమ్ముకు బందీగా మారిన పైనం
- సత్యవేడు నుంచి తమిళనాడుకు
- బాతులు మేపేందుకు వెళ్లి శవమై తేలి



సత్యవేడు/తిరుపతి, మే 21 (ఆంధ్రజ్యోతి): బాతులు మేపే పనికి అడ్వాన్సు తీసుకున్న ఓ గిరిజన మహిళ నిస్సహాయత.. ఆమె తొమ్మిదేళ్ల చిన్నారి కొడుకును యజమాని వద్ద తాకట్టు వస్తువుగా మార్చింది! తల్లి చెల్లించాల్సిన డబ్బు తీరేదాకా పసివాడిని పనికి పెట్టుకున్న యజమాని నిర్దాక్షిణ్యంగా బాతులు మేపే పనికి తమిళనాడుకు పంపి ఆ పసివాడి ఉసురు తీశాడు! బిడ్డ ఆచూకీ కోసం ఎంత ప్రశ్నించినా యజమాని నోరుమెదపకపోవడంతో తల్లి సత్యవేడు పోలీసులను ఆశ్రయించింది. పోలీసు విచారణలో.. తమిళనాడులోని కంచి సమీపంలో బాతులు మేపేందుకు వెళ్లి అనారోగ్యంతో మరణించిన బాలుడిని అక్కడే పాతిపెట్టినట్టు వెల్లడైంది. బుధవారం సత్యవేడు, కంచి పోలీసులు అక్కడ తవ్వించగా బాలుడి అస్తిపంజరం బయటపడింది. ఈ అమానుష ఘటనకు సంబంధించి బాధితురాలు, పోలీసుల కథనం ఇలా ఉంది. తిరుపతి జిల్లా గూడూరు మండలం నెల్లటూరు పంచాయతీ చవట గిరిజన కాలనీకి చెందిన అంకమ్మ, చెంచయ్య దంపతులకు ముగ్గురు పిల్లలు. ట్రాక్టర్ కూలీగా పనిచేసే చెంచయ్య నాలుగేళ్ల క్రితం చనిపోయాడు. రెండో కొడుకు వెంకటేశ్వర్లు (9), కుమార్తెను వెంటతీసుకుని కూలి పనులకు సత్యవేడు పంచాయతీ దళవాయి అగ్రహారానికి వచ్చింది. రెండేళ్ల క్రితం అక్కడ బాతుల వ్యాపారి ముత్తు వద్ద పనిలో చేరింది. పది నెలల క్రితం పని మానేయడంతో అడ్వాన్సు తిరిగివ్వాలని యజమాని ముత్తు పట్టుబట్టాడు. నిస్సహాయ స్థితిలో ఉన్న ఆమె.. తాను డబ్బులు తిరిగి చెల్లించేదాకా తన తొమ్మిదేళ్ల కొడుకు వెంకటేశ్వర్లును బాతులు మేపే పనికి పెట్టుకోవాలని అక్కడే వదిలిపెట్టి స్వగ్రామానికి వెళ్లింది. గత నెల రోజులుగా కొడుకు నుంచి ఫోన్ కాల్స్ రాకపోవడంతో దళవాయి గ్రామానికి వచ్చిన ఆమె.. తన కొడుకు ఎక్కడని ముత్తును ప్రశ్నించింది. రోజులు గడుస్తున్నా కొడుకు జాడ తెలియకపోవడంతో అంక మ్మ సత్యవేడు పోలీసులను ఆశ్రయించింది. రంగంలోకి దిగిన పోలీసులు ముత్తును అదుపులోకి తీసుకుని విచారించగా.. బాతులు మేపేందుకు బాలుడిని తమిళనాడులోని కంచి ప్రాంతానికి పంపించారని, అక్కడ అనారోగ్యానికి గురై చనిపోతే మృతదేహాన్ని ఆ ప్రాంతంలోనే పూడ్చిపెట్టారని తేలింది. దీంతో సత్యవేడు పోలీసులు కంచికి చేరుకుని అక్కడి పోలీసుల సాయంతో బుధవారం బాలుడి మృతదేహాన్ని పూడ్చిన చోట తవ్వించగా అస్తిపంజరం బయటపడింది. పోస్టుమార్టం నిమిత్తం ఆ అవశేషాలను చెంగల్పట్టు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, తొమ్మిదేళ్ల బాలుడు వెట్టిచాకిరీ చేస్తుండగా ప్రభుత్వ యం త్రాంగం గుర్తించలేకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ప్రభుత్వ భూమిపై ఎవరికీ హక్కుండదు

సర్కారీ స్థలాన్ని వక్ఫ్‌గా ప్రకటించిన భూమిని రక్షించే అధికారం ప్రభుత్వానికి ఉంది: కేంద్రం

- వక్ఫ్ దాతృత్వానికి సంబంధించినది
- ఇస్లాంలో ముఖ్య భాగం కాదు
- సుప్రీంకోర్టులో సొలిసిటర్ జనరల్ వెల్లడి

న్యూఢిల్లీ, మే 21: వక్ఫ్ దాతృత్వానికి సంబంధించినదని.. ఇస్లాంలో ముఖ్య భాగం కాదని కేంద్రం స్పష్టంచేసింది. ప్రభుత్వ భూమిపై ఎవరికీ హక్కుండదని తేల్చిచెప్పింది. సర్కారీ భూములు, వక్ఫ్‌గా ప్రకటించిన ఆస్తులను సంరక్షించే అధికారం ప్రభుత్వానికి ఉందని సుప్రీంకోర్టు సైతం తీర్పు ఇచ్చిందని పేర్కొంది. వక్ఫ్ సవరణ చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సీజేఐ జస్టిస్ గవాయ్, జస్టిస్ మాసిహ్‌లతో కూడిన ధర్మాసనం విచారణ జరుపుతున్న సంగతి తెలిసిందే. మంగళవారం పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, రాజీవ్ ధావన్, అభిషేక్ మను సింఘ్వీ తదితరుల వాదనలను ఆలకించింది. బుధవారం కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. 'వక్ఫ్ బై యూజర్' సూత్రాన్ని అనుసరించి వక్ఫ్ ఆస్తులుగా ప్రకటించిన ప్రాపర్టీలను తిరిగి తీసుకునే చట్టబద్ధమైన అధికారం ప్రభుత్వానికి ఉందన్నారు. 'వక్ఫ్ బై యూజర్' ప్రాథమిక హక్కు కాదన్నారు. పైగా వక్ఫ్ సవరణ చట్టం వల్ల బాధితులయ్యేవారెవరూ కోర్టుకు రాలేదని తెలిపారు. '1923 నుంచీ ఉన్న ఈ భయానక సమస్యను మేం పరిష్కరిస్తున్నాం. చట్టం చేసే ముందు రాష్ట్రప్రభుత్వాలను, రాష్ట్రాల వక్ఫ్ బోర్డులను సంప్రదించాం. జేపీసీ వేశాం. ప్రతి భాగస్వామితోనూ చర్చించాం. కొద్ది మంది పిటిషనర్లు వచ్చి.. మొత్తం ముస్లిం వర్గానికి మేం ప్రాతినిధ్యం వహిస్తున్నామని అనలేరు' అని వ్యాఖ్యానించారు. వక్ఫ్ ఆస్తుల నిర్వహణ, ఆర్థిక లావాదేవీలు వక్ఫ్‌బోర్డు విధులని..ఇవి పూర్తిగా లౌకిక కర్తవ్యాలని.. ఇద్దరు ముస్లిమేతర సభ్యులు ఉన్నంత మాత్రాన దాని స్వభావం మారదని పేర్కొన్నారు. వారు మైనారిటీగానే ఉంటారని తెలిపారు.

సెలవుల్లో పనిచేయకపోగా నిందలా!

న్యాయవాదులు వేసవి సెలవుల్లో పనిచేయకపోగా కేసులు పేరుకుపోతున్నాయంటూ కోర్టులపై నిందలు వేస్తారని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ చురకలంటించారు. ఓ పిటిషన్‌ను వేసవి సెలవుల తర్వాత విచారణకు వచ్చేలా చూడాలని న్యాయవాది ఒకరు కోరినప్పుడు జస్టిస్ గవాయ్ ఈ వ్యాఖ్యలు చేశారు. మొదటి ఐదుగురు సీనియర్ జడ్జిలు ఈ వేసవి సెలవుల్లో కూడా పనిచేయనున్నారని, నిజానికి సెలవుల్లో పనిచేయడానికి ఇష్టపడనిది న్యాయవాదులేనని అన్నారు.

ఆమె ఉగ్రవాది కాదు.. ఎవర్నీ హత్య చేయలేదు!

- పూజా ఖేడ్కర్‌కు ముందస్తు బెయిల్ ఇస్తూ సుప్రీంకోర్టు వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, మే 21: మాజీ ఐఏఎస్ ప్రొబెషనరీ అధికారిణి పూజా ఖేడ్కర్‌కు సుప్రీం కోర్టు బుధవారం ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఆమె పిటిషన్ విచారణ సందర్భంగా జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్రశర్మతో కూడిన ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ఆమె చేసిన తీవ్రమైన నేరం ఏమిటని ఢిల్లీ పోలీసులను ప్రశ్నించింది. 'ఆమె డ్రగ్స్ వ్యాపారి కాదు.. ఉగ్రవాది కాదు. హత్యకు పాల్పడలేదు. ఆమెకు ఢిల్లీ హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసి ఉండాల్సింది. ఎందుకంటే ఇప్పుడు ఆమె అన్నీ కోల్పోయింది. ఎక్కడా ఆమెకు ఉద్యోగం దొరికే అవకాశం లేదని పేర్కొంది. ఐఏఎస్ ట్రైనింగ్‌కు ఎంపికైన పూజ యూపీఎస్సీ పరీక్షల్లో ఓబీసీ, దివ్యాంగుల కోటా కోసం తప్పుడు పత్రాలు సమర్పించారన్న ఆరోపణలతో ఆమెపై ఫోర్జరీ కేసు నమోదయ్యాయి. దీంతో ఆమె ట్రెయినింగ్ కూడా రద్దయింది.

అరెస్టు చేసి ఉండకపోతే.. పేలుడే!

- అప్పటికే ఐఈడీ తయారీకి సిద్ధం
- వాటితో తిరుగుతుండగా పట్టుకున్నాం
- ఉగ్రసానుభూతి పరుడు సిరాజ్ రెహ్మాన్
- ఎఫ్ఐఆర్‌లో సంచలన విషయాలు వెల్లడి

విజయనగరం, మే 21(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లాకు చెందిన ఉగ్రవాద సానుభూతిపరుడు, నిషేధిత ఇస్లామిక్ స్టేట్(ఐఎస్)తో సంబంధాలు పెట్టుకుని పేలుళ్లకు కుట్రపన్నిన సిరాజ్ ఉర్ రెహ్మాన్ వ్యవహారంలో సంచలన విషయాలు వెలుగు చూశాయి. పోలీసులు అరెస్టు చేసి ఉండకపోతే పేలుళ్లకు పాల్పడి ఉండేవారని స్పష్టమైంది. అది కూడా విజయనగరం జిల్లాలోని జనసమ్మర్ధ ప్రాంతాన్ని అప్పటికే ఎంచుకున్నారని తెలిసింది. తాజాగా సిరాజ్‌కు సంబంధించి పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న పలు విషయాలు.. సిరాజ్.. తన స్నేహితుడు, హైదరాబాద్‌కు చెందిన సమీర్‌తో కలిసి పన్నిన కుట్రను స్పష్టం చేస్తున్నాయి. విజయనగరం నడిబొడ్డున పేలుళ్లకు సిద్ధమవుతున్న తరుణంలోనే ఉగ్ర సానుభూతిపరుడు సిరాజ్ ఉర్ రెహ్మాన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తాజాగా తెలిసింది. పేలుడు పదార్థాలు, రాకెట్ లాంచర్ల తయారీకి అవసరమైన పీవీసీ పైపు ముక్కలు, ఇతర సామగ్రిని శనివారమే కొనుగోలు చేసి ఐఈడీ(ఇంప్రవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైస్) తయారీకి సిద్ధమయ్యారు. ఈ సమయంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇదే విషయాన్ని పోలీసులు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. జనసమ్మర్ధ ప్రాంతాల్లో ఐఈడీని పేల్చేందుకు పన్నాగం పన్నినట్టు విచారణలో నిందితుడు వెల్లడించినట్లు తెలిసింది ఇక, విజయనగరంలో ఇద్దరు వ్యాపారులను పోలీసులు తాజాగా అదుపులోకి తీసుకున్నారు. ఉగ్ర సానుభూతిపరులు ఇచ్చిన సమాచారంతోనే వారిని అదుపులోకి తీసుకున్నట్టు ప్రచారం సాగుతోంది. కన్యకాపరమేశ్వరి కోవెల ప్రాంతానికి చెందిన ఇద్దరు వ్యాపారులతో పాటు మరోవ్యక్తిని రెండో పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

బ్యాంక్ అకౌంట్లపై ఆరా

సిరాజ్‌తో పాటు కుటుంబసభ్యుల బ్యాంక్ అకౌంట్ల వివరాలు ఇవ్వాలని నగరంలో అన్ని బ్యాంకుల అధికారులకు సమాచారమిచ్చారు. మరోవైపు సిరాజ్‌తో పాటు కుటుంబ సభ్యులందరికీ డీసీసీబీ బ్యాంకులో అకౌంట్‌తో పాటు మరికొన్ని బ్యాంకుల్లో ఖాతాలు ఉన్నాయని తెలిసింది. సిరాజ్ తండ్రి(ఏఎస్ఐ) సోమ, మంగళవారాల్లో బ్యాంక్ లాకర్‌ను తెరిచేందుకు ప్రయత్నించారు. లాకర్‌ను తెరిచేందుకు మొదట యూనిఫారం లేకుండా వెళ్లారు. తర్వాత పోలీసు యూనిఫాంలో వెళ్లి బ్యాంకు వెళ్లి లాకర్ తెరిచేందుకు అనుమతి కోరారు. అయితే, అప్పటికే దర్యాప్తు అధికారుల ఆదేశాలు ఉండడంతో బ్యాంకు అధికారులు అనుమతించలేదు.

ఎఫ్ఐఆర్‌లో ఏముంది?

సిరాజ్ ఎఫ్ఐఆర్‌లో పోలీసులు సంచలన విషయాలను పేర్కొన్నారు. ఈ నెల 16న కౌంటర్ ఇంటిలిజెన్స్ అధికారుల సమాచారంతో విజయనగరం పోలీసులు విజ్జీ స్టేడియం సమీపంలో సిరాజ్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద ఓ సంచిలో పేలుడుకు వినియోగించే వస్తువులు, ల్యాప్‌టాప్, ఇతరత్రా సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. తనకు ఇన్‌స్టాలో పరిచయమైన వారిని కలిసేందుకు 2024, నవంబరు 22న ముంబైకి వెళ్లాడు. అంతకుముందు 2024, జనవరి 26న సహబాజ్, జీషాన్‌లను కలవడానికి ఢిల్లీ వెళ్లాడు. సౌదీలో ఉంటున్న బిహార్‌కు చెందిన అబూతాలమ్ అలియాస్ అబూముసాబ్ అనే వ్యక్తి సూచనతో తరచూ సిగ్నల్ యాప్ ద్వారా జిహాదీ కార్యకలాపాల వైపు ఆకర్షితుడయ్యాడు. ఐఈడీ బాంబులను తయారు చేసి ముందుగా విజయనగరంలో జనసమ్మర్ధ ప్రాంతంలో పేల్చేందుకు నిర్ణయించుకున్నామని వెల్లడించాడు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం



విజయోత్సవ సభలో మాట్లాడుతున్న 'ఆంధ్రజ్యోతి' ఈడీ వేమూరి ఆదిత్య, పక్కన ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి, 'ఆంధ్రజ్యోతి' అసిస్టెంట్ ఎడిటర్ ఆర్‌ఎం ఉమామహేశ్వరరావు తదితరులు



పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించి, నగదు బహుమతి అందుకున్న విద్యార్థులతో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, 'ఆంధ్రజ్యోతి' ఈడీ వేమూరి ఆదిత్య

(మొదటి పేజీ తరువాయి)

జరుగుతున్న ప్రహరీ నిర్మాణ పనులను పరిశీలించారు. నూతన బస్ షెల్టర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. తర్వాత కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన విజయోత్సవ సభలో పాల్గొని గ్రామస్థుల స్పందన తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వేమూరి ఆదిత్య మాట్లాడుతూ... సౌత్ మోపూరులో జరిగిన అభివృద్ధి పనులు చూస్తుంటే ఆనందంగా ఉందని అన్నారు. ఇందుకు సహకరించిన ప్రజాప్రతినిధులు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్తులో మరిన్ని చేపడతామని స్పష్టం చేశారు.

40 రోజుల్లోనే పూర్తి చేశాం: ఎమ్మెల్యే

రూ.కోటితో సౌత్‌మోపూరులో అభివృద్ధి పనులు చేపడతామని జనవరిలో నిర్వహించిన కార్యక్రమంలో హామీ ఇచ్చామని... దీని ప్రకారం 40 రోజుల్లోనే పనులు పూర్తి చేసి ప్రారంభిస్తున్నామని ఎమ్మెల్యే కోటంరెడ్డి పేర్కొన్నారు. వచ్చే సంవత్సరం మరో రూ.కోటితో గ్రామంలో అభివృద్ధి పనులు చేపడతామని, వచ్చే ఏడాది ఇదే రోజులోపు పూర్తి చేస్తామని ప్రకటించారు. రాష్ట్రంలో ప్రస్తుతం మంచి ప్రభుత్వం పాలన సాగిస్తుందంటే అందులో 'ఆంధ్రజ్యోతి'ది ప్రధాన పాత్ర అని కొనియాడారు. నాడు ప్రజలను తన అక్షరాలతో చైతన్యవంతుల్ని చేసిందన్నారు. అధికారంలో ఏ ప్రభుత్వం ఉన్నా తప్పుచేస్తే తాట తీయడానికి 'ఆంధ్రజ్యోతి' ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు.



సౌత్‌మోపూరులో బస్‌షెల్టర్ నిర్మాణానికి టెంకాయ కొడుతున్న 'ఆంధ్రజ్యోతి' ఈడీ వేమూరి ఆదిత్య



విద్యార్థులకు బహుమతులు

పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన సౌత్ మోపూరు ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులు నలుగురికి వేమూరి ఆదిత్య, కోటంరెడ్డి సోదరులు నగదు బహుమతులను అందజేశారు. ఈ సభలో 'ఆంధ్రజ్యోతి' సిబ్బంది, టీడీపీ, బీజేపీ, సీపీఐ, సీపీఎం స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నేడు తిరుపతి జీవకోనలో...

'అక్షరం అండగా... పరిష్కారమే అజెండాగా' కార్యక్రమాల విజయోత్సవ సభ గురువారం ఉదయం 10గంటలకు తిరుపతి జీవకోనలో జరుగనుంది. స్థానిక అంబేడ్కర్ కూడలిలోని శ్రీలలితా త్రిపుర సుందరి ఆలయంలోని ఫంక్షన్ హాలులో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. 'ఆంధ్రజ్యోతి' ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వేమూరి ఆదిత్య హాజరవుతున్న సభలో విశిష్ట అతిథులుగా తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, నగర కమిషనర్ మౌర్య, జిల్లా ఎస్పీ హర్షవర్ధన రాజు పాల్గొంటారు.

స్లీపర్ సెల్స్‌పై విచారణ జరపండి

» డీజీపీకి హైకోర్టు ఆదేశం.. ఎన్‌ఐఏకు నోటీసులు..విచారణ నేటికి వాయిదా

అమరావతి, మే 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉగ్రవాద స్లీపర్ సెల్స్‌ను గుర్తించేందుకు చర్యలు తీసుకునేలా పోలీసులను ఆదేశించాలంటూ దాఖలైన వ్యాజ్యంపై హైకోర్టు స్పందించింది. పిటిషనర్లు ఇచ్చిన వివరాల ఆధారంగా రాష్ట్రంలో ఉన్న స్లీపర్ సెల్స్‌పై విచారణ జరిపి నివేదికను కోర్టు ముందు ఉంచాలని డీజీపీని ఆదేశించింది. జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ)కు నోటీసులు జారీ చేసింది. విచారణను గురువారానికి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ ఇటీవల ఉత్తర్వులు ఇచ్చారు.

శ్రీవారి సేవలో టాటా గ్రూప్స్ చైర్మన్



తిరుమల, మే 21(ఆంధ్రజ్యోతి): టాటా గ్రూప్స్ చైర్మన్ నటరాజన్ చంద్రశేఖర్ తిరుమల శ్రీవారిని బుధవారం ఉదయం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

టీటీడీ సేవలు భేష్!: నీరా రాడియా

తిరుమల, మే 21(ఆంధ్రజ్యోతి): భక్తులకు అందించే సేవలను టీటీడీ ఎప్పటికప్పుడు మెరుగుపరుస్తూనే ఉందని కార్పొరేట్ లాబీయిస్ట్ నీరా రాడియా అన్నారు. తిరుమల శ్రీవారిని బుధవారం ఉదయం అర్చన సేవలో దర్శించుకున్న ఆమె ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. తిరుమలలో టీటీడీ వ్యవస్థ అద్భుతంగా పనిచేస్తోందన్నారు.

టీటీడీ వాచీల ఈ-వేలం

తిరుమల, మే 21(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు ఇతర అనుబంధ ఆలయాలకు భక్తులు కానుకగా సమర్పించిన ఉపయోగించిన, పాక్షికంగా దెబ్బతిన్న 62 లాట్ల వాచీలను జూన్ 2, 3వ తేదీల్లో టీటీడీ ఈ-వేలం వేయనుంది. వీటిలో టైటాన్, సిటిజన్, సొనాటా, రాగ, టైమ్స్‌వన్, టైమ్క్స్, టైమెక్స్ తదితర స్మార్ట్ వాచీలు ఉన్నాయి. ఆసక్తి కలిగిన వారు ప్రభుత్వ ఈ-కొనుగోలు పోర్టల్‌లో రిజిస్టర్ కావాలని, ఇతర వివరాలకు 0877 2264429 నంబరును సంప్రదించాలని టీటీడీ బుధవారం ఓ ప్రకటన ద్వారా తెలిపింది.

చిన్నపిల్లల వైద్య సేవలకు టీటీడీ నూతన ట్రస్టు

తిరుపతి(వైద్యం), మే 21(ఆంధ్రజ్యోతి): టీటీడీలోని పలు ట్రస్టుల తరహాలో చిన్నపిల్లల వైద్యసేవల కోసం నూతనంగా ప్రత్యేక ట్రస్టును ఏర్పాటు చేసేందుకు నియమ నిబంధనలతో నివేదిక సిద్ధం చేయాలని ఈవో శ్యామలరావు ఆదేశించారు. తిరుపతిలోని శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయ ఆస్పత్రిని బుధవారం తనిఖీ చేసిన ఆయన.. అధికారులతో సమీక్షించారు. ఆస్పత్రిలో చిన్నారులకు మెరుగైన గుండె సంబంధిత చికిత్సలు అందించేందుకు శ్రీవెంకటేశ్వర ఆపన్న హృద టయం స్కీం ఉందని.. దీని కింద దాతలు రూ.లక్ష విరాళం అందిస్తే ఒక చిన్నారికి ఉచితంగా అపరేషన్ చేసే అవకాశం ఉంటుందన్నారు.

అక్టోబరులో విశాఖ మెట్రో పనులు ప్రారంభం

» టిడ్కో లబ్ధిదారులకు దసరాకు ఇళ్లు: మంత్రి నారాయణ

విశాఖపట్నం, మే 21 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో మెట్రో రైలు ప్రాజెక్టు పనులు అక్టోబరులో ప్రారంభిస్తామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ వెల్లడించారు. విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) కార్యాలయంలో ఆయన బుధవారం అనేక అంశాలపై ఉమ్మడి విశాఖపట్నం జిల్లా ఎమ్మెల్యేలు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. విశాఖలో మెట్రో రైలును డబుల్ డెక్కర్ మోడల్‌లో నడపడానికి డీపీఆర్ తయారుచేసి కేంద్రానికి సమర్పించామన్నారు. విశాఖ ప్రజలకు ఉపయోగపడేలా సెమీ రింగ్ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేస్తున్నామని తెలిపారు. వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి భోగాపురం విమానాశ్రయం నిర్మాణం పూర్తవుతుందని, దానికి అనుసంధానం చేస్తూ 22 రహదారులను ప్రతిపాదించగా, 15 రహదారుల పనులు మొదలయ్యాయని వెల్లడించారు. మిగిలిన వాటికి ప్రణాళికలు తయారవుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో 2014-19 మధ్య ఏడు లక్షల టిడ్కో ఇళ్లు నిర్మించాలని ప్రతిపాదించామని, గత ప్రభుత్వం రెండు లక్షల ఇళ్లు కూడా పూర్తి చేయలేకపోయిందని మంత్రి నారాయణ అన్నారు. టిడ్కో ఇళ్లు పూర్తి చేయడానికి రూ.ఏడు వేల కోట్లు అవసరమని, ఎంతైనాసరే ఖర్చు చేసి ఈ దసరాకే వాటిని లబ్ధిదారులకు అందించాలని నిర్ణయించామన్నారు. అమృత్ పథకం కింద రూ.834 కోట్లతో తాగునీటి పనులు చేపట్టనున్నామని మంత్రి వెల్లడించారు.



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి నారాయణ. చిత్రంలో ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, కొణతాల రామకృష్ణ, విష్ణుకుమార్‌రాజు, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్

జోరుగా వర్షాలు!

» నేడు అరేబియా సముద్రంలో అల్పపీడనం

» రెండు రోజుల్లో బంగాళాఖాతంలోనూ!

» కేరళలో రుతుపవనాల ప్రవేశానికి వాతావరణం అనుకూలం

విశాఖపట్నం, అమరావతి, మే 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఐదారు రోజుల నుంచి జోరుగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రికార్డుస్థాయి ఉష్ణోగ్రతలు నమోదు కావాల్సిన మే నెలలో పగటిపూట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదవుతున్నాయి. వచ్చే మూడు, నాలుగు రోజుల్లో కేరళను తాకనున్న నైరుతి రుతుపవనాలు, ఆ తర్వాత రెండు, మూడు రోజుల్లో రాయలసీమ, దక్షిణ కోస్తాల్లో ప్రవేశిస్తాయని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. అదే జరిగితే రాష్ట్రంలో ఎండల తీవ్రత తగ్గుతుందంటున్నారు. ఒకవేళ వర్షాలు తగ్గుముఖం పడితే కొన్నిచోట్ల ఎండల ప్రభావం ఉంటుందని స్పష్టంచేశారు. ప్రస్తుతం బంగాళాఖాతం నుంచి వస్తున్న తేమగాలులు, వాయవ్య భారతం నుంచి వీస్తున్న పొడిగాలుల కలయికతో వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం కోస్తాలో అనేక ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. రాత్రికి కొన్నిచోట్ల వర్షాలు పెరుగుతాయని వాతావరణ శాఖ ప్రకటించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలో 52, అనకాపల్లిలో 50, ప్రకాశం జిల్లా దొర్నాలలో 50.5 మి.మీ. వర్షపాతం నమోదైంది. గురువారం రాష్ట్రంలో అక్కడక్కడా భారీ వర్షాలు, విజయనగరం, మన్యం, అల్లూరి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో మోస్తరుగా వర్షాలు కురుస్తాయని విపత్తుల సంస్థ వివరించింది. శుక్రవారం కూడా పలు జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది.



విశాఖలో బుధవారం నాటి వర్షం దృశ్యాలు

ఉపరితల ఆవర్తనం ప్రభావం!

కర్ణాటక, గోవాకు ఆనుకుని తూర్పు అరేబియా సముద్రంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. దీని ప్రభావంతో గురువారం అదే ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడనున్నది. ఆ తర్వాత 36 గంటల్లో ఉత్తరంగా పయనిస్తూ వాయుగుండంగా బలపడుతుంది. దీని ప్రభావంతో కేరళలో నైరుతి రుతుపవనాల ప్రవేశానికి వాతావరణం అనుకూలంగా మారనుంది. అరేబియా సముద్రంలో అల్పపీడనం బలపడి వాయుగుండంగా మారిన తర్వాత నైరుతి రుతుపవనాల ప్రవేశంపై భారత వాతావరణ శాఖ ప్రకటన చేస్తుందని అంచనావేస్తున్నారు. రెండు రోజుల నుంచి కేరళ, కర్ణాటకల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. మరోవైపు, రానున్న రెండు రోజుల్లో బంగాళాఖాతంలో కూడా అల్పపీడనం ఏర్పడుతుందని అంచనా వేస్తున్నారు.

ఏపీఈఏపీసెట్ ఇంజనీరింగ్ పరీక్షలు ప్రారంభం

» తొలి రోజు 93.85 % హాజరు

జేఎన్టీయూకే, మే 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏపీఈఏపీసెట్-2025 ఇంజనీరింగ్ విభాగం ఆన్‌లైన్ ప్రవేశ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. 145 కేంద్రాల్లో 93.85 శాతం విద్యార్థులు పరీక్ష రాసారని ఈఏపీసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ వీవీ సుబ్బారావు తెలిపారు. అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షల ప్రాథమిక కీని ఈ నెల 27వ తేదీన, ఇంజనీరింగ్ పరీక్షల ప్రాథమిక కీని 28న విడుదల చేస్తామని చెప్పారు.

మద్యం స్కామ్ కేసు నిలబడదు: మిథున్‌రెడ్డి

అనంతపురం క్రైం, మే 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ తీరును ప్రశ్నించే వారు లేకుండా, ప్రతిపక్ష నేతలను భయభ్రాంతులకు గురి చేసి పాలన సాగించాలని చూస్తున్నారని, ఇది శాశ్వతం కాదని వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి అన్నారు. బుధవారం ఇక్కడ ఆయన మీడియాతో మాటాడుతూ వైసీపీ హయాంలో మద్యం స్కామ్ అంటున్నారని, ఒక్క రూపాయి కూడా సీజ్ చేయలేదని, టీడీపీ నేతలు నోటిమాటలతో అంత పెద్ద కేసు అల్లారని ఆరోపించారు. ఇవన్నీ నిలబడేవి కావని అన్నారు. రేషన్ వాహనాల రద్దు సరికాదన్నారు. హంద్రీనీవా లైనింగ్ పనుల గురించి ప్రభుత్వం పునరాలోచన చేయాలని మిథున్‌రెడ్డి కోరారు.

చిన్నారిపై లైంగిక దాడి

» ఇద్దరు బాలురపై కేసు నమోదు

ఒంగోలు క్రైం, మే 21(ఆంధ్రజ్యోతి): సభ్య సమాజం తలదించుకునేలా నాలుగేళ్ల చిన్నారిపై ఇద్దరు బాలురు లైంగిక దాడికి పాల్పడ్డారు. ఈ సంఘటన ఒంగోలులోని నాగేంద్రనగర్‌లో బుధవారం మధ్యాహ్నం జరిగింది. తల్లిదండ్రులు ఇంట్లో లేని సమయంలో పాప ఆడుకుంటుండగా తొమ్మిదేళ్లు, ఎనిమిదేళ్ల వయస్సు ఉన్న ఇద్దరు బాలురు వెళ్లి ఈ దురాగతానికి పాల్పడ్డారు. అదే సమయంలో అక్కడకి వచ్చిన బాలిక తల్లి.. పాపకు రక్తస్రావం కావడాన్ని గమనించి బాలురను నిలదీసింది. దీంతో సమీపంలో ఉన్న వారి తల్లిదండ్రులు వచ్చి బాలిక తల్లితో గొడవపడ్డారు. బాధితురాలి తల్లిదండ్రులు ఒంగోలు తాలూకా పోలీసులను ఆశ్రయించారు. అనంతరం వారిని మహిళా పోలీసు స్టేషన్‌కు పంపగా బాలికను వైద్య పరీక్షల నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. బాలురపై కేసు నమోదు చేసినట్టు సీఐ సుధాకర్ తెలిపారు.

శ్రీశైలం జలాశయానికి డిసెంబర్లో పూర్తిస్థాయి మరమ్మతులు!

» అంత ప్రమాదకర పరిస్థితేం లేదు

» ఆందోళన చెందాల్సిన పని లేదు

» జూన్ మొదటి వారంలో మళ్లీ వస్తాం!

» ఆలోగా చెప్పిన పరీక్షలు పూర్తి చేయండి

» శ్రీశైలం ఇంజనీర్లకు సీడబ్ల్యూపీఆర్ఎస్ బృందం సూచన

అమరావతి, మే 21 (ఆంధ్రజ్యోతి): ప్లంజ్ పూల్, స్టీల్ సిలెండర్లు సహా శ్రీశైలం జలాశయంలో దెబ్బతిన్న కీలక నిర్మాణాలకు వచ్చే డిసెంబర్లో పూర్తిస్థాయి మరమ్మతులు చేయాలని కేంద్ర జల-విద్యుత్ పరిశోధనా కేంద్రం (సీడబ్ల్యూపీఆర్ఎస్) శాస్త్రవేత్తల బృందం నిర్ణయించింది. భాక్రా-నంగల్ డ్యాంలో కూడా ప్లంజ్‌పూల్ దెబ్బతింటే తాము మరమ్మతు చేశామని తెలిపింది. దానితో పోల్చినప్పుడు శ్రీశైలంలో అంత ప్రమాదకర పరిస్థితేం లేదని స్పష్టంచేసింది. అనవసరంగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అభిప్రాయపడింది. మరమ్మతులు ఇప్పుడు మొదలుపెడితే వర్షాలు, వరదల రూపంలో ఆటంకాలు ఏర్పడతాయని తెలిపింది. అదే డిసెంబరులో అయితే ఇలాంటి అడ్డంకులు రావని పేర్కొంది. వచ్చే నెల మొదటివారంలో పూర్తి సన్నద్ధతతో మరోసారి శ్రీశైలం జలాశయం పరిశీలనకు వస్తామని తెలిపింది. ఈలోపు.. జలాశయంలో దెబ్బతిన్న కీలక నిర్మాణాలపై తాము సూచించిన పరీక్షలు నిర్వహించాలని శ్రీశైలం డ్యాం ఇంజనీరింగ్ అధికారులకు సూచించింది. ఈ సంస్థ శాస్త్రవేత్తలు డ్యాం ప్రాంగణంలో బుధవారం పర్యటించారు. అప్రోచ్ రోడ్, యాప్రాన్, ప్రాజెక్టు ప్రాంతంలో ఒరిగిపోయిన రాతి గోడలు, డ్యాం భద్రతలో కీలక భూమిక వహించే స్టీల్ సిలెండర్లు, అండర్ గ్రౌండ్ ప్రాంతంలో కట్టడాలు, ప్లంజ్ పూల్ ప్రాంతాలను సందర్శించారు. యాప్రాన్‌కు బోర్‌వెల్స్ సాయంతో రంధ్రాలు చేసి పరిశోధించిన నివేదికను తమకు అందించాలని ఇంజనీర్లకు సూచించారు. ప్లంజ్‌పూల్ వద్ద ఏర్పడిన భారీ గొయ్యిని ఏ పద్ధతిలో పూడ్చాలో.. తమ ప్రధాన కార్యాలయం ఉన్న పుణేలో ఓ మోడల్ రూపొందించాలని సీడబ్ల్యూపీఆర్ఎస్ శాస్త్రవేత్తలు నిర్ణయించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

విశ్వ వైజ్ఞానికుడు

విశ్వం పుట్టుక, పరిణామం గురించి వైజ్ఞానిక ప్రపంచం ఆమోదం పొందనప్పటికీ ప్రభావదాయకమైన సిద్ధాంతాన్ని అభివృద్ధిపరిచిన ఖగోళ భౌతిక శాస్త్రవేత్త జయంత్ విష్ణు నార్లికర్. భారతీయ జిజ్ఞాస, పాశ్చాత్య శాస్త్ర ప్రతిభ మేళవింపే ఆయన మేధో మూర్తిమత్వం. నార్లికర్‌ను ఆధునిక ఆర్యభట్టుగా భావించడం సముచితంగా ఉంటుంది. విశ్వసాగర తీరాన అందమైన నత్తగుల్లలు, నునుపైన గులకరాళ్లను వెతుక్కుంటూ ఆవలి ఒడ్డుకు మంగళవారం ప్రాతఃకాలంలో వెళ్లిపోయిన చిరస్మరణీయ వైజ్ఞానికుడు.

మన దేశంలో ఆధునిక విశ్వశాస్త్ర అధ్యయనాలకు ఆద్యులలో ఒకరైన నార్లికర్ సామాన్య ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి జీవితాంతం పలు విధాల కృషి చేసిన వైజ్ఞానికుడు. సివి రామన్, హోమీ భాభా, మేఘనాథ్ సాహా వలే విజ్ఞానశాస్త్ర విషయాలను ప్రజలకు సరళంగా, సుబోధకంగా వివరించగల ప్రతిభావంతుడు, ప్రశస్త విద్యాబోధకుడు. అన్నీ వేదాలలోనే ఉన్నాయట అనే ఆలోచనా ధోరణులను ఆయన గట్టిగా వ్యతిరేకించేవారు. పురాతన భారతదేశంలో విమానాలు ఉండేవని, ప్లాస్టిక్ సర్జరీ ఉండేవన్న వాదనలను ఆయన కొట్టివేసేవారు. అవి ఎంత అహేతుకమో, అసత్యాలో తన శ్రోతలు, పాఠకులు విశ్వసించేలా తేటతెల్లంగా చెప్పేవారు, రాసేవారు. శుద్ధ వైజ్ఞానిక విషయాలు ఎప్పుడూ గట్టి ప్రమాణాల ప్రాతిపదికనే ఉంటాయి సంప్రదాయ ఆలోచనా రీతులపై వైజ్ఞానిక దృక్పథం ఆధిక్యం వహించినప్పుడు మాత్రమే సమాజంలో పురోగతి సాధ్యమవుతుందని ఆయన విశ్వసించారు. 'ఆధునిక విజ్ఞానశాస్త్రాలు, సాంకేతికతలు విమర్శనాత్మక దృక్పథాన్ని పెంపొందించాయి. వాస్తవాలను అంగీకరించి గౌరవించే వైఖరులను ప్రోత్సహిస్తున్నాయి. సంప్రదాయం కేవలం ఆచారం కనుక గౌరవించడాన్ని త్యజించేలా చేశాయి. అయితే ఇప్పుడు సంప్రదాయాలే మనలను ఎక్కువగా ప్రభావితం చేస్తున్నాయి. వాస్తవికంగా ఆలోచించేందుకు అవరోధమవుతున్నాయని' నెహ్రూ స్వాతంత్ర్యానికి పూర్వం అన్న మాటలను 2003లో తన 'ది సైంటిఫిక్ ఎడ్జ్' అన్న పుస్తకంలో ఉటంకించి, మన శ్రేయస్సుకు ఎంతో ఆవశ్యకమైన వైజ్ఞానిక దృక్పథాన్ని పెంపొందించుకునేందుకు ఇంకా చాలా దూరం పయనించవలసి ఉన్నదని నార్లికర్ స్పష్టంగా చెప్పారు. వాస్తవ సమస్యలను వైజ్ఞానిక దృక్పథంతో పరిష్కరించుకోవడమే వర్తమాన భారతదేశం ముందున్న ప్రధాన సవాల్ అని ఆయన గట్టిగా అభిప్రాయపడ్డారు. సైన్స్‌ను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లినందునే నార్లికర్‌ను మరాఠీ సాహిత్య ప్రపంచం 2021లో ప్రతిష్ఠాత్మక 'అఖిల్ భారతీయ మరాఠీ సాహిత్య సమ్మేళన్'కు అధ్యక్షుడుగా ఎన్నుకుని తనను తాను గౌరవించుకున్నది. నార్లికర్ ఆత్మకథ 'ఏ టేల్ ఆఫ్ ఫోర్ సిటీస్' మరాఠీ మాతృకకు జాతీయ సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. ప్రస్తుతం ముప్పిరిగొంటున్న మతపరమైన భావోద్వేగాలను నివారించేలా ప్రజల్లో వైజ్ఞానిక దృక్పథాన్ని వికసింప చేయడమే నార్లికర్‌కు సరైన నివాళి.

విద్యాధికులు అయిన తల్లిదండ్రుల మార్గదర్శకత్వంలో మేధో శిక్షణ పొందిన నార్లికర్ ఉన్నత విద్యాభ్యాసానికి బెనారస్ నుంచి కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయానికి వెళ్లారు. గణితశాస్త్రంలో ప్రశస్త ప్రతిభాపాటవాలు, ఖగోళ శాస్త్రవేత్త ఫ్రెడ్ హోయిల్ శిష్యరికం ఖగోళ భౌతికశాస్త్రంలో పథ నిర్దేశకుడుగా ఎదిగేందుకు నార్లికర్‌కు తోడ్పడ్డాయి. నార్లికర్ తన పరిశోధనా కృషిని ప్రారంభించే నాటికే ఫ్రెడ్ హోయిల్ మరో ఇద్దరు శాస్త్రవేత్తలతో కలిసి విశ్వం పుట్టుక, పరిణామంపై స్థిరస్థితి (స్టెడీ స్టేట్) సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. విశ్వానికి ఆద్యంతాలు ఉండవని, అది ఎప్పుడూ అస్తిత్వంలో స్థిరస్థితిలో ఉంటుందని ఈ సిద్ధాంతం ప్రతిపాదించింది. 'అందరూ భావిస్తున్నట్టు ఈ సిద్ధాంత ప్రతిపాదకుల్లో తాను లేనప్పటికీ, తరువాయి దశల్లో ఆ సిద్ధాంతాన్ని మౌలికంగా గణితాత్మకంగా చేసి క్వేజై- స్టెడీ స్టేట్ కాస్మాలజీ థియరీగా అభివృద్ధి పరచడంలో ప్రధాన భాగస్వామిగా ఉన్నానని నార్లికర్ చెప్పారు. విశ్వావిర్భావానికి సంబంధించి ఇప్పటికీ ప్రబలంగా ఉన్న, విశ్వశోధనలో మౌలిక పురోగతికి విశేషంగా దోహదం చేసిన బిగ్ బ్యాంగ్ (మహా విస్ఫోటం) సిద్ధాంతానికి ప్రత్యామ్నాయంగా ప్రతిపాదించిందే స్టెడీస్టేట్ థియరీ. బిగ్ బ్యాంగ్ సిద్ధాంతాన్ని సవాల్ చేసినప్పటికీ అది ప్రతిపాదించినట్టు విశ్వం నిరంతరం విస్తరిస్తుందనే విషయాన్ని అంగీకరించి హోయిల్, నార్లికర్‌లు తమ సిద్ధాంతంలో కొన్ని మార్పులు చేసినప్పటికీ వైజ్ఞానిక జగత్తు బిగ్ బ్యాంగ్ థియరీనే ఆమోదిస్తూ వస్తోంది. 'విశ్వం మన పూర్వభావనలు లేదా పాక్షికాభిప్రాయాలకు అనుగుణంగా ఉండదు, ఆ బ్రహ్మాండాన్ని నిజాయితీగా అర్థం చేసుకునేందుకు మనం నిబద్ధమై ఉండాలని' నార్లికర్ తరచు అంటుండేవారు. 1988లో యూజీసీ ఆహ్వానంపై పూణేలో ఇంటర్ యూనివర్శిటీ సెంటర్ ఫర్ ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రో ఫిజిక్స్‌ను వ్యవస్థాపించారు. ఆ సంస్థ ద్వారా ఖగోళ, ఖగోళ భౌతిక శాస్త్ర పరిశోధనల్లో భారతీయ ప్రతిభాపాటవాలు సమున్నతంగా వెలుగొందేలా చేశారు. భారతీయ వైజ్ఞానిక పరిశోధనల వికాసానికి ఆయన అందించిన మహోన్నతసేవ ఈ సంస్థేనని ఆయన సహచరులు, విద్యార్థులు ముక్తకంఠంతో చెబుతారు.

ఇందిర, మోదీ... ఇద్దరూ ఇద్దరే!

భారతదేశం – పాకిస్థాన్ మధ్య 1971 యుద్ధం, బంగ్లాదేశ్ ఆవిర్భావం; 2025లో ఆపరేషన్ సిందూర్, ఈ రెండు సందర్భాల్లోనూ భారత్–అమెరికా మధ్య నెలకొన్న దౌత్య సంబంధాలు ప్రపంచ రాజకీయాల మీద ప్రభావం చూపాయి. భారత ప్రధాన మంత్రులు ఇందిరాగాంధీ నుంచి నరేంద్ర మోదీ దాకా, అమెరికా అధ్యక్షులు రిచర్డ్ నిక్సన్ నుంచి డొనాల్డ్ ట్రంప్ దాకా ఈ రెండు సందర్భాల్లోనూ నేతృత్వ శైలుల మధ్య తేడాలు, దౌత్య నైపుణ్యాలు, రాజకీయ వ్యూహాలు, పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాద చర్యలను అరికట్టే దిశగా భారతదేశం ఎదుర్కొన్న సవాళ్లను విశ్లేషించడం ఒక సవాలే.

1971లో అమెరికా అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్ అనుసరించిన పాకిస్థాన్ పక్షపాత దౌత్యతంత్రం; 2025లో ట్రంప్ అహంభావ, అనిర్ణయాత్మక రాజకీయ వైరుధ్యం... ఇవి రాజకీయ దౌత్య అధ్యయనాల్లో చర్చకు రావాల్సిన అంశాలు. నిక్సన్‌కు యాహ్యాఖాన్ మీద ప్రేమ లేకపోయినా, అమెరికా ప్రయోజనాల కోణంలో పాకిస్థాన్‌ను వెనకేసుకొచ్చి సహాయం అందించాడు. ట్రంప్ ప్రతిస్పందన వ్యక్తిగత ఆడంబరం. భారతదేశం–పాకిస్థాన్ ఉద్రిక్తతల మధ్య కాల్పుల విరమణకు తానే కారకుడన్నట్లు, అదేపనిగా ఆర్భాటంగా చెప్పుకున్నాడు. డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలేని నేత. అణ్వాయుధ ఉద్వేగాలకు ఆస్కారమున్న భారత ఉపఖండం విషయంలో, అగ్రరాజ్యాధినేతగా ప్రదర్శించాల్సిన గంభీరత, వ్యూహాత్మకత చతురత ట్రంప్ మాటలోను, నడతలోను ఇసుమంతైనా లేదు. ఇది దౌత్యనీతికి విరుద్ధం.

ఇందిరా గాంధీ నేతృత్వంలోని వ్యూహాత్మక, యుద్ధ–దౌత్యనీతి నిర్ణయాలు భారతదేశాన్ని శక్తివంతమైన దేశంగా నిలిపాయి. నరేంద్రమోదీ నేతృత్వంలో జాగరూకతతో, ఒక్కొక్క అడుగు ముందుకు వేయాల్సి వచ్చింది. అమెరికా విదేశీ విధానంలో సంభవించిన మార్పులు, అంతర్జాతీయ స్థితిగతులే దీనికి కారణం. నిక్సన్‌ను ధీరోదాత్తంగా ఎదుర్కొన్న ఇందిరా గాంధీ భారత్‌కు చరిత్రాత్మక విజయాన్ని అలవోకగా సమకూర్చారు. వర్తమాన వాతావరణానికి అనుగుణంగా, ట్రంప్ అనిశ్చితి నేపథ్యంలో, నరేంద్ర మోదీ అత్యంత జాగ్రత్తగా, స్వల్ప స్పందనతో సమయానుకూలంగా వ్యవహరించాల్సి వచ్చింది. అంతిమంగా, ఇందిర, మోదీలు ఇరువురూ, వారివారి పరిస్థితులకు అనుగుణంగా విజయాన్నే సాధించారు.

నిక్సన్ వ్యూహాత్మక అమెరికాకు ప్రతినిధి. ట్రంప్ చరిత్రతో సంబంధం లేకుండా, ప్రాదేశిక సమస్యల సంక్లిష్టతను పట్టించుకోకుండా, అవగాహనా రాహిత్యంతో వ్యవహరించారు. నిక్సన్ వైఖరి చర్చనీయాంశమే అయినప్పటికీ, అది సంస్థాగత పాలనాచట్రానికి అనుగుణంగా ఉన్నది. ట్రంప్ వ్యాఖ్యలు అమెరికా స్థాయికి ఏమాత్రం తగనివి. అవి విదేశాంగ విధానాన్ని వ్యక్తిగత ఆకాంక్షలుగా మలిచే ఆందోళనకర దృక్పథాన్ని ప్రతిబింబించాయి.



ఇందిరాగాంధీ యుద్ధ–దౌత్య నిర్ణయాలు భారత్‌ను శక్తివంతమైన దేశంగా నిలిపాయి. నరేంద్రమోదీ జాగరూకతతో, వ్యూహాత్మకంగా ఒక్కొక్క అడుగు వేయాల్సి వచ్చింది. అమెరికా విదేశీ విధానంలో సంభవించిన మార్పులు, అంతర్జాతీయ స్థితిగతులే దీనికి కారణం.

భారత్, అమెరికాలు కాలక్రమంలో పరిస్థితులకు అనుగుణంగా మార్పునకు గురయ్యాయి. భారత్ ఇనుమడించిన ఆత్మవిశ్వాసంతో ముందుకు దూసుకుపోతుంటే, అమెరికా దౌత్యం గణాంకాల చట్రంలో ఇరుక్కుపోయింది. లాభనష్టాలు బేరీజు వేసుకుంటూ, అసందర్భ ప్రదర్శనల దిశగా జారిపోయింది. 1971 యుద్ధం ద్వారా ఉపఖండంలో తన ప్రాదేశిక ఆధిపత్యాన్ని దృఢపరచుకున్నది భారత్. 2025 పాక్–భారత్ సంఘర్షణ 'ప్రదర్శనాత్మక దౌత్యానికి' ఉన్న పరిమితులను బహిర్గతం చేసింది.

నిక్సన్–ట్రంప్, ఇందిర–మోదీల మధ్య తారతమ్యాన్ని, 1971–2025 మధ్యన చోటుచేసుకున్న విభిన్న భౌగోళిక–రాజకీయ ఘట్టాలను విశ్లేషణ చేయడం అవసరం. నిక్సన్, ట్రంప్‌లు భారత్–పాకిస్థాన్ సంక్షోభాలకు ఎలా స్పందించారు? ఇందిర, మోదీల ప్రతిస్పందనలు ఎలా భిన్నంగా అభివ్యక్తమయ్యాయి? అనేవి పరిశోధనకు అనువైన అంశాలు. వ్యూహాత్మక దౌత్యం, ప్రదర్శనాత్మక దౌత్యం మధ్య తేడాను విశ్లేషించడం, దేశవాళీ స్థాయిలో ఇందిర, మోదీల నాయకత్వ బలాన్ని, అంతర్జాతీయ వ్యవహారాలకు ఎలా అన్వయించారో గమనించడం, భారత వ్యూహాత్మక ప్రయోజనాల కోణంలో అమెరికా నాయకత్వాన్ని విశ్లేషణతో చూపడం లాంటి అంశాలన్నీ పరిశోధనకు తగినవే.

బంగ్లాదేశ్ ఆవిర్భావాన్ని మిగతా ప్రపంచం ఆశ్చర్యంతో వీక్షిస్తుండగా, ప్రధాని ఇందిరాగాంధీ అమెరికా అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్‌కు ఆవేదనతో, ఆవేశంతో రాసిన ఉత్తరాన్ని 1971 డిసెంబర్ 17న న్యూయార్క్ టైమ్స్ 'మిసెస్ గాంధీ రైట్స్ టు ప్రెసిడెంట్: యూఎస్ కుడ్ హేవ్ అవర్టెడ్ వార్' శీర్షికతో ప్రచురించింది. దశాబ్దాలపాటు గుర్తుంచుకునే అపూర్వమైన 'దౌత్యపూరిత సంభాషణగా' భావించాల్సిన ఆ ఉత్తరంలో ఇందిరా గాంధీ– "మేము తప్పెక్కడ చేశామో మీరు చెప్పగలరా నిక్సన్?" అని అమెరికాను ధీటుగా, సూటిగా ప్రశ్నించారు. పక్షపాతంపై వ్యంగ్య స్పందనగా కాకుండా, సహేతుకమైన విమర్శగా నిలిచిందది.

ఇందిరా గాంధీ ఆవేశానికి చాలా కారణాలు ఉన్నాయి. అమెరికా అధ్యక్షుడు నిక్సన్ పాకిస్థాన్‌కు అనుకూలంగా వ్యవహరించడం, తూర్పు పాకిస్థాన్‌లో రాజకీయ పరిష్కారాన్ని సాధించడానికి ఇందిరాగాంధీ హెన్రీ కిసింజర్‌కు ఇచ్చిన సూచనలు విఫలం కావడం, అమెరికా అణ్వస్త్ర నౌక బంగాళాఖాతంలోకి ప్రవేశించడం, అమెరికా నుంచి వెలువడిన వ్యాఖ్యలన్నీ భారతదేశంపై అది కక్షపూరితంగా ఉన్నదన్న భావనను కలిగించడం... ఇవన్నీ కలిసి ఇందిరాగాంధీ నిక్సన్‌కు ఉత్తరం రాయడానికి దారితీశాయి. ఈ లేఖను ఆమె నేరుగా నిక్సన్‌కు పంపారు.

అంతర్జాతీయంగా ఒంటరిదైనా, ఇందిరాగాంధీ నాయకత్వంలో భారతదేశం 1971 యుద్ధంలో గెలిచింది. సోవియెట్ యూనియన్‌తో స్నేహ ఒప్పందం, స్వదేశీ ఆయుధ బలం ఆధారంగా బంగ్లాదేశ్‌ను స్థాపించగలిగింది. గెలుపు తరువాత కూడా ఇందిరాగాంధీ ఓర్పుతో, సంయమనంతో, రాజనీతిజ్ఞతతో వ్యవహరించారు. "మాకు ఎటువంటి పాకిస్థాన్ భూభాగం అవసరం లేదు. తూర్పు పాకిస్థాన్‌గా ఉండి, ఇప్పుడు బంగ్లాదేశ్‌గా మారిన భూభాగం పట్లా, పశ్చిమ పాకిస్థాన్ భూభాగం పట్లా మాకు ఎలాంటి ఆకాంక్షా లేదు" అని ఆమె స్పష్టం చేశారు. "మాకు శాశ్వత శాంతి కావాలి, కానీ పాకిస్థాన్ దీనికి సిద్ధంగా ఉందా?" అనే ప్రశ్న సంధించారు. రాజకీయ పరిష్కారాన్ని సాధించేందుకు అమెరికా తన శక్తి, ప్రభావం, అధికారాలను వినియోగించి ఉండినట్లయితే, భారత్, పాకిస్థాన్ మధ్య యుద్ధం తప్పించగలిగేది అని ఇందిరా గాంధీ తన లేఖలో పేర్కొన్నారు.

అర్ధ శతాబ్దం తర్వాత, 2025లో చరిత్ర మరోలా పునరావృతమైంది. ఒకవైపు, నరేంద్రమోదీ నేతృత్వంలోని భారత్, ప్రపంచీకరణ రాజకీయాలపై ఆధారపడినదిగా మారింది. మరోవైపు, పాకిస్థాన్‌ను ప్రపంచ వేదికలపై ఒంటరిపరిచే పనిలో బిజీగా ఉంది. అప్పటి భారత్ "ఒంటరిగా నిలబడి గెలిచిన దేశం" కాగా ఇప్పటి భారత్ "సహచరులతో కలిసి గెలవాలనుకునే దేశం". ప్రధాన మంత్రి మోదీ నాయకత్వంలో విజయవంతమైన ఆపరేషన్ సిందూర్ భారతదేశ సామర్థ్యాన్ని, ప్రపంచానికి చాటిచెప్పింది. తాను కోరుకున్న లక్ష్యాలను సాధించిన తరువాత పాకిస్థాన్ అభ్యర్థన మేరకు భారత్ కాల్పుల విరమణకు అంగీకరించింది. పిలవని పేరంటంలాగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వచ్చారు. సోషల్ మీడియా వేదికగా అసందర్భ ప్రకటనలు చేశారు. తానే మాట్లాడి ఇరుదేశాల మీద ఒత్తిడి పెంచి కాల్పుల విరమణ కోసం ఒప్పించానని ప్రకటించారు. అమెరికా అంతర్గత రాజకీయాల్లో తనకు మెప్పు లభించేలా ట్రంప్ వ్యవహార శైలి నడిచింది.

ఓర్పు, నేర్పు, చిత్తశుద్ధి, రాజకీయ పరిపక్వతతో ఇందిరాగాంధీ నిక్సన్‌కు ధీటుగా సమాధానం చెప్పి, దేశాన్ని గౌరవంతో ముందుకు నడిపించారు. ఇప్పుడు భారత్ ఒక గ్లోబల్ శక్తిగా ఎదిగిపోయింది. అమెరికాతో వ్యవహరించాల్సిన అవసరం వచ్చినప్పుడు ట్రంప్ నమ్మదగిన వ్యక్తి కాదని మోదీ గుర్తించి ఉంటారు. అందుకే ట్రంప్ మాటలను పట్టించుకోకుండా వ్యవహరించారు. 1971లో ప్రపంచంలో తన స్థానం కోసం పోరాడిన భారతదేశం, 2025లో ప్రపంచంలో తన గౌరవాన్ని నిలబెట్టుకునే స్థాయికి వచ్చింది. రెండు సందర్భాలూ భారతదేశానికి ఒకే పాఠాన్ని నేర్పాయి– అంతర్జాతీయ వ్యవహారాల్లో శాశ్వత మిత్రులూ, శాశ్వత శత్రువులూ ఉండరని. శక్తి సామర్థ్యాలను, మైత్రిని, విశ్వసనీయతను సమపాళ్లలో నైపుణ్యంగా వినియోగించగల నాయకత్వమే నిర్ణయాత్మకమవుతుంది. ఇందిరాగాంధీ భారత్‌ను పునర్నిర్వచించారు. అంతర్జాతీయ సంబంధాలను మోదీ నూతన దిశగా తీసుకెళ్లారు. ఇద్దరూ ఇద్దరే. ఇద్దరూ భారతదేశాన్ని ప్రపంచంలో అగ్రస్థానంలో నిలబెట్టినవారే.

■ వనం జ్వాలానరసింహారావు

ప్రవాసులపై ట్రంప్ మరో పిడుగు!

ట్రంప్ పరిపాలనా సరళిలోనే 'అమెరికా ఫస్ట్' అనే నినాదం అంతర్భాగం. ఆయనకు అమెరికా ప్రయోజనాలు మాత్రమే ముఖ్యం. అందుకోసం తీసుకునే నిర్ణయాలు మిగిలిన ప్రపంచం మీద ఎలాంటి ప్రభావం చూపిస్తాయనేది వారికి ముఖ్యం కాదు. అగ్రరాజ్యంగా అమెరికా తీసుకునే నిర్ణయాలు యావత్ ప్రపంచాన్ని కూడా ప్రభావితం చేయగల నేపథ్యంలో ట్రంప్ సర్కారు సరికొత్త ఆలోచన ప్రకంపనలు పుట్టిస్తోంది. అమెరికా పౌరులు కానివారు అంతర్జాతీయంగా చేసే నగదు చెల్లింపులపై ఐదు శాతం సుంకం విధించాలనే బిల్లును ట్రంప్ ప్రభుత్వం రూపొందించింది. ఈ బిల్లు అమెరికాలోని విదేశీయులలో, ముఖ్యంగా భారతీయ సమాజంలో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ బిల్లు గురించి మధ్య, దిగువ మధ్య తరగతికి చెందిన వారంతా బాగా ఆందోళన చెందుతున్నారు. అమెరికా నుంచి పెద్ద మొత్తాల్లో నగదు చెల్లింపులు పొందుతున్న దేశాల్లో మొదటిస్థానం ఇండియాదే. ప్రపంచ బ్యాంకు లెక్కల ప్రకారం 2023లో అంతర్జాతీయంగా అన్ని దేశాల నుంచి భారత్‌కు చేరిన నగదు చెల్లింపులు అన్నీ కలిపి 125 బిలియన్ డాలర్లు కాగా, అందులో కేవలం అమెరికా నుంచి వచ్చిన భాగమే 89 బిలియన్ డాలర్లు ఉంది! అమెరికాలోని ఆర్థిక వ్యవహారాల్లో భారతీయ సమాజం చూపించగల ముద్ర ఏమిటన్నదానికి ఈ నివ్వెరపరిచే లెక్కలే సాక్ష్యమంటూ అమెరికన్ మీడియా ప్రధానంగా ప్రస్తావించింది.

ఇంత పెద్దమొత్తాదులో అమెరికా నుంచి భారత్‌కు నగదు తరలుతుండడానికి అనేక కారణాలున్నాయి. ఇండియాలో ఉన్న తమ తల్లిదండ్రులు జీవనం గడవడానికి; తమ నుంచి ఆర్థికంగా మద్దతు ఆశించే సోదరులు, కుటుంబ సభ్యులకు పంపడానికి; వారి ఆరోగ్య అవసరాలు తీర్చడానికి డబ్బు పంపడం సర్వసాధారణం. ఇండియాలో రియల్ ఎస్టేట్‌లోను, ఇతర వ్యాపారాల్లోనూ పెట్టుబడులు పెట్టడానికి అమెరికా నుంచి నిధులు పంపేవాళ్లు కూడా ఉన్నారు. భారత్‌లో రియల్ ఎస్టేట్ రంగాలు ఆకర్షణీయమైన వృద్ధిని నమోదు చేస్తుండడంతో పాటు, స్వదేశంలో పెట్టుబడులు పెట్టడం అనేది భవిష్యత్ భద్రతకు పునాదులు వేస్తాయని వారు నమ్ముతుండడం కూడా ఇందుకు ఒక కారణం. అలాగే అమెరికాలోని పలువురు భారతీయులు రిటైర్మెంట్ తర్వాత తమ విరామ జీవితాన్ని గడపడానికి కూడా భారత్‌నే ఎంచుకుంటూ ఉంటారు. పోల్చి చూసినప్పుడు ఇండియాలో జీవనవ్యయం అమెరికా కంటే బాగా తక్కువ కావడంతో రిటైరైన తర్వాత అక్కడకు వెళ్ళే ఉద్దేశంతో ముందే పొదుపు పథకాల్లోను, బీమా, పెన్షన్ పథకాల్లోనూ సొమ్ములుపెట్టే వాళ్ల సంఖ్య కూడా ఎక్కువే.



అమెరికా నుంచి భారత్‌కు అందుతున్న నగదుకు కారణాలు ఏమైనా కావొచ్చుగాక. కానీ ఆ చెల్లింపుల మీద ఐదు శాతం సుంకం విధించాలన్న ట్రంప్ నిర్ణయం ఆ సొమ్ము అటు పంపుతున్న, ఇటు స్వీకరిస్తున్న వారి జీవితాలపై గణనీయమైన ప్రభావం చూపిస్తుంది.

అలాగే అమెరికాలోని భారతీయ సమాజం దాతృత్వానికి కూడా పెట్టింది పేరు. స్వదేశంలో వివిధ సేవా కార్యక్రమాల కోసం అమెరికా నుంచి బిలియన్లలో డాలర్లు ఖర్చు పెడుతుంటారు. సామాజిక సమస్యల కోసం, విపత్తు సమయాల్లోను ఇది మరింతగా కనిపిస్తుంటుంది. మనం ఎదిగి వచ్చిన సమాజానికి తిరిగి రుణం తీర్చుకోవడం అనేది భారతీయ సంస్కృతి మూలాల్లోనే ఉన్న అంశం కావడంతో వీరిలో ఆ వైఖరి ఎక్కువ. అమెరికాలో స్థిరపడేలా గ్రీన్ కార్డు పొందడంలో ఉన్న ఇబ్బందులు, అస్థిర పరిస్థితులు, సుదీర్ఘకాలం ఎదురుచూడాల్సిన అవసరం లాంటి వాతావరణం ఇక్కడి భారతీయ సమాజాన్ని భారత్‌కు డబ్బు తరలించేందుకు ప్రేరేపిస్తుంటుంది. అమెరికాలో ఉద్యోగాలు కోల్పోయే పరిస్థితుల్లో ఉన్నవారు– ప్రత్యేకించి హెచ్–1బి లేదా ఎల్–1 వీసాల మీద ఉన్నవారు– తమ స్వదేశంలో ఆర్థిక భద్రతకే అధిక ప్రాధాన్యం ఇస్తుండడం కూడా ఒక కారణం. తమ మిత్రులు, బంధువులకు కానుకలు పంపేవారు; అమెరికాలో చదువులకోసం భారత్‌లో తీసుకున్న విద్యారుణాలకు తిరిగి చెల్లింపులు చేసేవారు కూడా ఎక్కువే.

ఇలాంటి కారణాలతో అమెరికా నుంచి భారత్‌కు నగదు చెల్లింపులు భారీగానే జరుగుతాయి. అయితే ఇప్పుడు ఈ చెల్లింపుల మీద 5 శాతం సుంకం విధించడానికి ట్రంప్ నిర్ణయించడం వీరందరినీ కూడా ప్రభావితం చేస్తుంది. పెట్టుబడులు, రాబడి మార్గాల కోసం అమెరికా నుంచి డబ్బు పంపేవారు ఈ కొత్త సుంకాన్ని కూడా పద్దులో రాసుకుని, ఆ మేరకు తమ లాభాలు ప్లాన్ చేసుకోవడానికి ప్రయత్నిస్తారు. అయితే భారత్‌లో ఉన్న తమ కుటుంబాలు గడవడానికి, తల్లిదండ్రులను పోషించడానికి, విద్యారుణాలు చెల్లించడానికి ఇక్కడి నుంచి డబ్బు పంపుతున్న వారికి ప్రభుత్వం అదనంగా ఒక్క శాతం సుంకం విధించినా అది చాలా పెద్ద భారం.

అమెరికా నుంచి భారత్‌కు అందుతున్న నగదుకు కారణాలు ఏమైనా కావొచ్చుగాక. కానీ ఆ చెల్లింపుల మీద 5 శాతం సుంకం విధించాలన్న ట్రంప్ నిర్ణయం ఆ సొమ్ము అటు పంపుతున్న, ఇటు స్వీకరిస్తున్న వారి జీవితాలపై గణనీయమైన ప్రభావం చూపిస్తుంది. ఆర్థిక లావాదేవీల మీద సుంకాలు విధించడం వంటి నిర్ణయాలు తీసుకునే ముందు జరుగుతున్న చెల్లింపుల మౌలిక స్వభావం ఏమిటో అర్థం చేసుకోవడం ముఖ్యం. అన్ని రకాల వ్యవహారాలను ఒకే గాటన కట్టేసినట్టుగా విదేశాలకు జరిగే ప్రతి చెల్లింపు మీద గంపగుత్తగా 5 శాతం సుంకం విధించడం చాలామంది జీవితాలను ప్రభావితం చేస్తుంది. భారతీయులు మాత్రమే గాక, అనేక దేశాల నుంచి అమెరికాకు వచ్చి తమ దేశాల్లోని కుటుంబాలను పోషించుకోవడానికి ఇక్కడ కష్టపడుతున్న వారంతా కూడా ఈ నిర్ణయం వల్ల ఆందోళనకు గురవుతున్నారు.

అమెరికాలోని వ్యక్తులు తమ స్వదేశానికి పంపే సొమ్ములను, ఇతర దేశాలకు పంపే సొమ్ములను వేర్వేరుగా చూడాలి. పైగా అమెరికాలో ఉంటున్న వారిలో గరిష్ఠంగా స్వదేశంలో తల్లిదండ్రుల కుటుంబపోషణ నిమిత్తం ప్రతి నెలా వెయ్యి, రెండువేల డాలర్ల వరకు పంపడం జరుగుతుంది. నెలవారీగా జరిగే ఇలాంటి చిన్న చెల్లింపులను, స్వదేశంలో సేవా కార్యక్రమాలకు వెచ్చించే మొత్తాలను, సుంకం పరిధి నుంచి మినహాయించాలని భారతీయ సమాజం కోరుకుంటోంది. భారత్‌లో మధ్యతరగతి కుటుంబాలు అనేక కష్టనష్టాలకోర్చి, అప్పులుచేసి ఆస్తులు అమ్మి పిల్లలను అమెరికాకు పైచదువుల కోసం పంపుతుంటారు. అక్కడ ఉద్యోగాలు పొందగలిగితే తమ కష్టాలు, రుణాలు తీరుతాయనే ఆశతో అక్కడి నుంచి రాగల సొమ్ముకోసం ఎదురుచూస్తుంటారు. అలాంటి వారి జీవితాలన్నీ ఈ సుంకంతో ప్రభావితం అవుతాయి.

భారత విదేశాంగ శాఖ ఇలాంటి వ్యవహారాల్లో చొరవ చూపించాలి. వ్యాపారుల ప్రయోజనాలను అత్యధికంగా ప్రభావితం చేసే సుంకాల విషయంలో ట్రంప్ ప్రభుత్వానికి లేఖ రాసిన భారత ప్రభుత్వం, అదే విధంగా అమెరికాలోని భారతీయ సామాన్యుల కోణంలో కూడా ఆలోచించాల్సిన అవసరం ఉంది. అమెరికా నుంచి భారత్‌కు జరిగే వ్యక్తిగత చెల్లింపులలో ఒక పరిమితి వరకు సుంకాలు లేకుండా ఉండే విధానం రావాలి.

○ కృష్ణమోహన్ దాసరి
ప్రాత్రికేయుడు, డల్లాస్

విధ్వంసాన్ని ఆపకపోతే వినాశనమే

ప్రకృతి వనరులను కేవలం పారిశ్రామిక అవసరాలు తీర్చే వ్యాపార వస్తువులుగా చూసే అభివృద్ధి చెందిన దేశాల అహంకారపూరిత వైఖరే నేడు భూమ్మీద సకల జీవరాశి ఎదుర్కొంటున్న సమస్త సంక్షోభాలకూ కారణం. నిత్యం పరిశ్రమల నుంచి వెలువడుతున్న కర్బన ఉద్గారాలు, ఇతర వ్యర్థాల కారణంగా వాతావరణం నానాటికీ వేడెక్కుతోంది. భూమ్మీద జీవరాశుల మనుగడ కష్టమవుతోంది. 'ప్రకృతితో సామరస్యం, స్థిరమైన అభివృద్ధి' అనే థీమ్‌తో ఈ ఏడాది ప్రపంచ జీవవైవిధ్య దినోత్సవ వేడుకలు జరుపుకోవాలని ప్రపంచ దేశాలను ఐక్యరాజ్య సమితి కోరింది. మానవ చర్యల కారణంగా వేగంగా అంతరించిపోతున్న అనేక జీవజాతుల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని ఆయా దేశాలకు సూచించింది. పెరుగుతున్న కాలుష్యం, రెట్టింపవుతున్న భూతాపం, సహజ వనరుల క్షీణత, విచ్ఛిన్నమవుతున్న ఓజోన్ పొర వంటి సమస్యల వల్ల కోట్లాది జీవుల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ఈ పరిస్థితిని మార్చేందుకు 1972లో స్టాక్‌హోం సదస్సు, 1997లో జపాన్‌లోని క్యోటో వాతావరణ సదస్సుల్లో అనేక తీర్మానాలను ప్రవేశపెట్టారు.

పెరుగుతున్న భూతాపం వల్ల ప్రతి సంవత్సరం ఎన్నో వేల జీవజాతులు అంతరించిపోతున్నాయని జీవవైవిధ్య పితామహుడు, అమెరికా ప్రఖ్యాత శాస్త్రవేత్త ఎడ్వర్డ్ ఒ. విల్సన్ హెచ్చరిస్తున్నారు. పరిస్థితులు ఇలాగే కొనసాగితే రానున్న 30 సంవత్సరాలలో 20 శాతం జీవజాతులు పూర్తిగా అంతరించి పోతాయని చెబుతున్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 24 శాతం క్షీరదజాతులు, 12 శాతం పక్షిజాతులు అంతరించిపోయే దశలో ఉన్నాయి. జన్యు పంటలు సగానికిపైగా కనబడకుండా పోయాయి. పగడపు దిబ్బలు ఇప్పటికే 75 శాతం పైగా ధ్వంసమై పోయాయి. రానున్న 20 సంవత్సరాల్లో ప్రస్తుతమున్న 620 రకాల వానర జాతుల్లో 120కి పైగా జాతులు అంతరించిపోయే ప్రమాదముందని జీవ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఏటా రెండు బిలియన్ టన్నుల కార్బన్‌డై ఆక్సైడ్‌ను శోషించుకునే సమశీతోష్ణ మండలాల్లోని సతత హరితారణ్యాలతో పాటు, సుమారు 12 లక్షల హెక్టార్ల ఇతర అడవులు గడచిన దశాబ్ద కాలంలో నరికివేతకు గురయ్యాయని అంచనా.



ప్రపంచ జీవవైవిధ్యంలో మన దేశం 8శాతం వాటాతో 7వ స్థానంలో ఉంది. ఈ జాబితాలో ఆస్ట్రేలియా మొదటి స్థానంలో ఉండగా, బ్రెజిల్ రెండో స్థానంలో ఉంది. మారుతున్న వాతావరణ పరిస్థితుల కారణంగా భారతదేశంలో వేలాది జీవజాతులు మనుగడ కోల్పోతున్నాయని 'ఇంటర్ గవర్నమెంటల్ సైన్సు పాలసీ ప్లాట్‌ఫాం' అనే అధ్యయన సంస్థ తెలిపింది. ఈ పరిస్థితిని మార్చేందుకు అవసరమైన చర్యలను చేపట్టాలని సూచించింది.

పరిమితమైన వనరులను వినియోగించుకుని, అపరిమితమైన ఆర్థికవృద్ధిని సాధించే దిశగా పారిశ్రామిక దేశాలు ఆలోచన చేయాల్సిన సమయమిది. అప్పుడు మాత్రమే సహజవనరులపై ఒత్తిడి తగ్గి, కోల్పోయిన జీవావరణాన్ని తిరిగి పునరుద్ధరించగలిగే అవకాశం ఉంటుంది. లేకపోతే కోట్లాది జీవులకు అమ్మగా భావించే భూమాత మరుభూమిగా మారిపోతుందనటంలో ఎలాంటి సందేహమూ లేదు. అదే జరిగితే మనిషి తన మరణ శాసనం తాను రాసుకున్నట్టే.

– డాక్టర్ కె. శశిధర్
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం
(నేడు ప్రపంచ జీవవైవిధ్య దినోత్సవం)

సైన్యంపై చులకన మాటలొద్దు!

భారతదేశ సరిహద్దు సుమారు 15,200 కిలోమీటర్లు. ఇది పశ్చిమంలో గుజరాత్ నుంచి తూర్పున మిజోరాం వరకు ఉంది. ఈ సరిహద్దు అఫ్ఘానిస్థాన్, పాకిస్థాన్, చైనా, నేపాల్, భూటాన్, బంగ్లాదేశ్, మయన్మార్ దేశాల సరిహద్దులతో కూడి ఉంటుంది. ఇంత సుదీర్ఘ సరిహద్దుని వివిధ వాతావరణ పరిస్థితుల్లో కాపాడడం అంటే మాటలు కాదు. సరిహద్దు రాష్ట్రాలైన గుజరాత్, రాజస్థాన్, పంజాబ్‌లలో పగటిపూట ఉష్ణోగ్రత 55/60 డిగ్రీల సెల్సియస్ ఉంటే, రాత్రిపూట మైనస్ 20కి తగ్గిపోతుంది. అదీగాక ఈ ప్రాంతాల్లో ఎడారి విషపురుగులు, పాములు ఎక్కువ. ఇక్కడి వేడికి శరీరం బొబ్బలెక్కుతుంది. అటువంటప్పుడు బరువైన బూట్లలో ఉండే సైనికుల కాళ్ళు పుండ్లు పడిపోతాయి. అలాగే ఉత్తరాన హిమాలయాల్లో పగటి ఉష్ణోగ్రతలే మైనస్ 40/50 డిగ్రీలు ఉంటుంది. పైగా దుర్గమ పర్వత ప్రాంతం. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా లోయలోకి జారడం ఖాయం. ఎత్తైన హిమాలయాల్లో సైనికుల్ని మూడు నాలుగు నెలల కంటే ఎక్కువ ఉంచరు. అక్కడ ఉన్నన్ని రోజులు సైనికులకు స్నానం, దుస్తులు మార్చుకోవడం ఉండదు. మూడు నెలల తరువాత వారు సురక్షిత ప్రాంతాలకు వచ్చినప్పుడు చేసే మొదటి పని ఆ దుస్తులు విప్పి కాల్చేయడం! అక్కడి చలికి వేళ్ళు కొంకర్లు తిరుగుతాయి. ఫ్రాస్ట్ బైట్‌కు గురవుతారు. ఆ ఎత్తయిన ప్రాతంలో ఒకవేళ ఎవరైనా జబ్బుపడ్డా, గాయాల పాలైనా, మరణించినా, వాళ్ళను తరలించడానికి హెలికాప్టర్ ఒక్కటే మార్గం. ఆ వాతావరణంలో హెలికాప్టర్ వస్తుందో రాదో కూడా చెప్పలేం! ఇక ఈశాన్య ప్రాంతాల సరిహద్దు విషయానికి వస్తే ఆ ప్రాంతం పర్వత ప్రాంతం, పైగా దట్టమైన అడవులు. ఏ చెట్టు చాటు నుంచి ఎవరు చొరబడుతున్నారో, ఏ పొదల చాటు నుంచి ఎవరు కాల్పులు జరుపుతారో నిత్యం గమనిస్తూ కాపలా కాయాలి.

ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో సైనికులు దేశం లోపల ఉన్న మనల్ని శత్రువుల నుంచి, ఉగ్రవాదుల నుంచి భయం లేకుండా కాపాడుతుంటారు. అది నిరంతర ప్రక్రియ. ఏ మాత్రం అప్రమత్తత వీడకూడదు. అప్పుడే దేశం లోపల మనమంతా నిశ్చింతగా, సక్రమంగా మన పనులు చేసుకోగలుగుతాం, చేసుకుంటున్నాం. దేశం ఇప్పటికి ఐదు యుద్ధాలు చేసింది 1947–48, 1965–66, 1971, 1999 సంవత్సరాల్లో నాలుగు సార్లు పాకిస్థాన్‌తో యుద్ధం చేసి ఓడించింది. 1963లో చైనాతో యుద్ధం చేసి వారిని చొరబడకుండా నిలువరించింది. ఈ ఐదు యుద్ధాల్లో మన జవాన్లు, అధికారులు ఎందరో హతమయ్యారు, మరెందరో క్షతగాత్రులయ్యారు. అయినా కొన్ని కుటుంబాలు, కొన్ని ఊళ్లకు ఊళ్లే తమ కుటుంబ సభ్యులను సైన్యంలోకి పంపడానికి ఉత్సాహం చూపుతాయి. బిహార్, ఉత్తరప్రదేశ్‌లోని కొన్ని ఊళ్లలో సైనికుడు లేని ఇల్లు లేదంటే అతిశయోక్తి కాదు. దేశ సేవకి తమ వంతు పాత్ర పోషిస్తున్నామనే సంతోషం వారిది. సైన్యంలో లేనివాళ్లు సహజంగా అనుకుంటుంటారు– 'వారికేం, ప్రభుత్వం వారికి అన్ని సదుపాయాలు కల్పిస్తోంది కదా' అని. కాని అది వారికీ, వాళ్ళు చేసిన చేసిన సేవకి ప్రభుత్వం, ప్రజలు తీర్చుకుంటున్న ఋణం మాత్రమే! ఇదంతా ఎందుకు చెప్పాల్సి వస్తుందంటే, దేశం లోపల ఉన్న మనలో కొందరు సైన్యాన్ని గురించి అవమానకరంగా వ్యాఖ్యలు చేస్తున్నారు. ముఖ్యంగా బీజేపీ నాయకులు, అందునా రాజ్యాంగపరమైన పదవిలో ఉన్నవారు.



దేశం లోపల ఉన్న మనల్ని శత్రువుల నుంచి, ఉగ్రవాదుల నుంచి భయం లేకుండా సైనికులు కాపాడుతుంటారు. అయితే మనలో కొందరు సైన్యాన్ని గురించి అవమానకరంగా వ్యాఖ్యలు చేస్తున్నారు. సైనికుల మనోబలాన్ని దిగజార్చే వాఖ్యలు, చర్యలు ఇకముందు ఉండకుండా చూడాలి.

మొన్నటికి మొన్న మధ్యప్రదేశ్ కేబినెట్ మంత్రి విజయ్ షా "వాళ్ళు పహల్గమ్ టెర్రరిస్టులు మతం అడిగి హిందువులను చంపారు కాబట్టి మోదీ వాళ్ల సోదరినే వాళ్ల పీచమణచడానికి పంపారు" అని వ్యాఖ్యానించాడు. కల్నల్ సోఫియా ఖురేషి ఒక ముస్లిం వనిత కాబట్టి అలా అన్నాడు. సైన్యం గురించి అతిగొప్పగా చెప్పే మోదీ గాని, బీజేపీ కానీ ఆయన మీద ఏ విధమైన చర్య తీసుకోలేదు. కారణం, మధ్యప్రదేశ్ మొత్తం జనాభాలో 23 శాతం ఆదివాసీలున్నారు. ఈ 23 శాతంలో 35 శాతం గోండులు. ఈ విజయ్ షా గోండు సముదాయానికి చెందినవాడు. అతని మీద చర్య తీసుకుంటే గోండుల ఓట్లుతో పాటు, ఆదివాసీల ఓట్లు పడవేమో అన్న భయం. విజయ్ షా వ్యాఖ్యానించిన రెండవ రోజు అదే మధ్యప్రదేశ్ ఉపముఖ్యమంత్రి, "దేశ సైన్యంతో పాటు దేశ జనాభా మొత్తం మోదీ ముందు మోకరిల్లుతుంది" అని వాఖ్యానించారు. ఏ దేశ సైన్యం పేరు చెప్పుకుని వీళ్ళు ఓట్లు తెచ్చుకుంటారో ఆ సైన్యాన్ని ఈ విధంగా అవమానించడం సహించరాని విషయం. దేశ రక్షణను దృష్టిలో పెట్టుకుని ఇప్పటికైనా బీజేపీ ఆ ఇద్దరు మంత్రులపై చర్య తీసుకోవాలని, సైనికుల మనోబలాన్ని దిగజార్చే వాఖ్యలు, చర్యలు ఇక ముందు ఉండకుండా చూడాలని ప్రజలు కోరుకుంటున్నారు.

• పి. జయప్రకాష్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిటొపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్: editpage@andhrajyothy.com



యోగా చేస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

జిల్లా అధికార యంత్రాంగం, విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో బుధవారం పున్నమి ఘాట్‌లో యోగాంధ్ర మాసోత్సవాల ప్రారంభ కార్యక్రమం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, కలెక్టర్ లక్ష్మీశ, మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర తదితరులు పాల్గొని యోగాసనాలు వేశారు.

8

● ఆనందయోగం

● భారత్ మాతాకీ జై



ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా దేశ సరిహద్దుల్లో మన సైన్యం చూపించిన ధైర్య సాహసాలను కీర్తిస్తూ బుధవారం సాయంత్రం నగరంలో సింధీ సమాజ్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. బందరురోడ్డులో జరిగిన ఈ ర్యాలీలో సమాజ్ సభ్యులు జాతీయ జెండాలను చేతబూని, జైహింద్ నినాదాలతో ముందుకు సాగారు.

టెండర్ల మాయాజలం

గ్రామీణ నీటి సరఫరా విభాగంలో టెండర్ల మాయాజాలం నడుస్తోంది. రెండు జిల్లాల్లో నాలుగు మంచినీటి పంపింగ్ స్టేషన్లకు సంబంధించిన ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్‌ఎం) టెండర్లలో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గడువు తీరినా పాత కాంట్రాక్టరే నీటి నిర్వహణ చేపడుతుండటం, అగ్రిమెంట్ కుదుర్చుకున్నాక కూడా కొత్త కాంట్రాక్టర్ పనులు చేపట్టకపోవడం వెనుక పెద్ద కథే నడిచిందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.

గ్రామీణ నీటి సరఫరా విభాగంలో మరో మాయ

- రెండు జిల్లాల్లో నాలుగు పంపింగ్ స్టేషన్ల నిర్వహణకు టెండర్లు
- తాత్కాలిక కాలానికి జనవరిలో ఓ కాంట్రాక్టర్‌తో ఒప్పందం
- అయినా పాత కాంట్రాక్టర్‌తోనే పనుల కొనసాగింపు
- కొత్త కాంట్రాక్టర్ టెండర్‌ను ఎక్కువకు కోట్ చేయడమే కారణం
- ఐదు నెలల కాలానికి రూ.50 లక్షల వరకు దండుకునే యత్నం
- కాంట్రాక్టర్లతో ఆర్‌డబ్ల్యూఎస్ ఉన్నతాధికారుల మిలాఖత్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : గ్రామీణ నీటి సరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్)లో ఉన్నతాధికారుల తీరు వివాదాస్పదంగా మారుతోంది. ఇప్పటికే అనేక టెండర్ల వ్యవహారాలు వివాదాలమయం కాగా, తాజాగా ఉమ్మడి కృష్ణాజిల్లాలో పిలిచిన ఓఅండ్‌ఎం మంచినీటి పంపింగ్ స్టేషన్ల టెండర్లను కూడా అపహాస్యం చేశారు. ఎన్టీఆర్ జిల్లాలో చిల్లకల్లు, గౌరవరం, లింగాల ఓఅండ్‌ఎం స్కీమ్‌లకు, కృష్ణాజిల్లాలో మొవ్వ ఓఅండ్‌ఎం పంపింగ్ స్టేషన్లకు కొద్దినెలల కిందట టెండర్లు పిలిచారు. నీటిని శుద్ధిచేసి గ్రామాలకు రక్షిత మంచినీటిని సరఫరా చేసే వ్యవస్థను ఓఅండ్‌ఎం పంపింగ్ స్టేషన్లు అంటారు. ప్రజారోగ్యంలో కీలకపాత్ర పోషించే ఈ స్టేషన్ల నిర్వహణ టెండర్ల విషయంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీనివెనుక భారీ ఎత్తున ముడుపుల పర్వం నడిచిందన్న ఆరోపణలు వస్తున్నాయి.

పాత కాంట్రాక్టర్‌తోనే పనులు

వాస్తవానికి ప్రతి ఆర్థిక సంవత్సరం ప్రారంభమయ్యే నాటికి ఏడాది కాలానికి టెండర్లు పిలుస్తారు. ఏప్రిల్ 1 నుంచి మార్చి 31 నాటికి అన్నమాట. జడ్పీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా సకాలంలో శాంక్షన్లు రావు. ఈ కాలాతీతాన్ని బట్టి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తాత్కాలికంగా టెండర్లు పిలుస్తుంటారు. ఈ కోవలోనే తాత్కాలిక కాలానికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఎన్టీఆర్ జిల్లాలో 3, కృష్ణాజిల్లాలో 1 ఓఅండ్‌ఎం మిగతా 6లో..



● ముడుపులు అందాయా?

ఓఅండ్‌ఎం పంపింగ్ స్టేషన్ల నిర్వహణను ఇంకా పాత కాంట్రాక్టరే చేపడుతుండటం అనేక అనుమానాలకు తావిస్తోంది. కొత్త కాంట్రాక్టర్, పాత కాంట్రాక్టర్ మధ్య అవగాహన కుదరడంతో పాటు ఈ ఇద్దరితో ఆర్‌డబ్ల్యూఎస్ ఉన్నతాధికారులు కూడా చేతులు కలిపారన్న ఆరోపణలు వస్తున్నాయి. అదనంగా చెల్లించే డబ్బును దండుకునే ప్రణాళికలో భాగంగానే ఈ వ్యవహారం నడిచిందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.

● ఆడిట్‌కు ఏం సమాధానం చెబుతారు?

టెండరు దక్కించుకున్న కొత్త కాంట్రాక్టర్‌తో తక్కువ ధరకు పనులు చేయించకుండా పాత కాంట్రాక్టర్‌తో ఎక్కువ ధరకు ఎందుకు చేయిస్తున్నారన్న అంశంపై అనుమానాలు కలుగుతున్నాయి. ఆడిటింగ్‌లో ఆ విషయాన్ని ప్రశ్నిస్తే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఏం సమాధానం చెబుతారో అర్థంకాని పరిస్థితి.



ఈ-చలానాకు ప్రత్యేక కౌంటర్

ట్రాఫిక్ కాంప్లెక్స్‌లో ప్రారంభం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తున్న వారి నుంచి జరిమానాల చెల్లింపుల కోసం అధునాతన కౌంటర్‌ను పోలీసులు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఎంజీ రోడ్డులోని ట్రాఫిక్ కాంప్లెక్స్‌లో ఈ కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. బుధవారం నుంచి ప్రారంభమైంది. ఇంతకుముందు ఈ యూనిఫైడ్ పోలీస్ సర్వీసు సెంటర్ (యూపీఎస్సీ).. వెటర్నరీ ఆసుపత్రి పక్కన ఉండేది. ఇందులోనే పోలీసుల సేవలకు, ఇతర చెల్లింపులకు సంబంధించిన కౌంటర్లు ఉండేవి. ట్రాఫిక్ ఉల్లంఘనలకు సంబంధించిన చలానాలనూ ఇక్కడే చెల్లించేవారు. ఈ భవనంలో టాస్క్‌ఫోర్స్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడంతో యూపీఎస్సీని సూర్యారావుపేట పోలీస్‌స్టేషన్‌కు పక్కన ఉన్న పాత టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలోకి తరలించారు.

సమస్యలకు చెక్ పెట్టేందుకే..

ట్రాఫిక్ పోలీసులు నగరంలో విస్తృతంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ నిర్వహిస్తున్నారు. జరిమానా విధించిన వెంటనే దాన్ని చెల్లిస్తే గానీ పోలీసులు వాహనాన్ని విడిచిపెట్టట్లేదు. వాస్తవానికి మూడు నెలల్లోపు చలానా చెల్లించాలి. చాలామంది వాహనదారులు ఈ గడువు దాటినా చెల్లించట్లేదు. దీంతో పెండింగ్‌లో ఉండిపోతున్నాయి. ఆన్‌లైన్‌లో చెల్లించాలంటే వాహనదారుల మొబైల్ ఫోన్లలో ఈ పరివాహన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేయాల్సి వస్తోంది. ఒక్కోసారి నెట్‌వర్క్ సమస్య రావడంతో యాప్ డౌన్‌లోడ్ కావట్లేదు. ఫలితంగా వాహనదారులకు, ట్రాఫిక్ పోలీసులకు మధ్య వివాదాలు జరుగుతున్నాయి. దీంతో నగరం మధ్యలో ఉండేలా సూర్యారావుపేట పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉన్న కౌంటర్‌ను బందరు రోడ్డులోని ట్రాఫిక్ కాంప్లెక్స్‌లోకి మార్చారు. ఈ కౌంటర్ 24/7 పనిచేస్తుందని అధికారులు తెలిపారు.

డెడ్‌లైన్ @ 3 రోజులు

- కేబుల్, ఇంటర్నెట్ ఆపరేటర్లకు కార్పొరేషన్ వార్నింగ్
- నగరంలో అడ్డదిడ్డంగా టీవీ, ఇంటర్నెట్ కేబుల్స్
- స్తంభాలపై చుట్టలుగా చుట్టేసి అందవిహీనంగా..
- తొలగించాలని ఆదేశించినా స్పందన శూన్యం
- కార్పొరేషన్ సీరియస్.. మూడు రోజులే సమయం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : నగరంలో ఎక్కడ పడితే అక్కడ ఎడాపెడా లాగేసి, చుట్టలు చుట్టలుగా స్తంభాలకు కట్టేసిన కేబుల్, ఇంటర్నెట్ వైర్ల తొలగింపునకు కార్పొరేషన్ అధికారులు మూడు రోజుల డెడ్‌లైన్ విధించారు. ఈ మూడు రోజుల్లో కేబుల్ ఆపరేటర్లు, ఇంటర్నెట్ సర్వీసు ప్రొవైడర్లు స్పందించకపోతే వైర్లను తొలగించటంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకోనున్నారు. కనీసం విద్యుత్ కేబుల్స్ అయినా ఓ క్రమపద్ధతిలో ఉంటాయి. కేబుల్ ఆపరేటర్లు, ఇంటర్నెట్ సర్వీసు ప్రొవైడర్లు మాత్రం అడ్డదిడ్డంగా వైర్లు లాగేస్తున్నారు. దీనిపై దృష్టి సారించిన ప్రభుత్వం విజయవాడ నగరంలో తీగల తొలగింపునకు ఆదేశించింది. దీంతో కార్పొరేషన్ అధికారులు ఈనెల 15, 17 తేదీల్లో కేబుల్, ఇంటర్నెట్ ఆపరేటర్లను సమావేశానికి పిలిచారు. అయితే, వారు అరకొరగానే సమావేశానికి వచ్చారు. వచ్చినవారు కూడా తమ వైర్లను తొలగించలేదు. ఈ నేపథ్యంలో విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ అధికారులు బుధవారం నగరంలోని కేబుల్ ఆపరేటర్లు, ఇంటర్నెట్ సర్వీసు ఆపరేటర్లకు మీడియా ముఖంగా బహిరంగ ప్రకటన విడుదల చేశారు. గురువారం నుంచి మూడు రోజుల్లోపు వైర్లను తొలగించకపోతే ఎలాంటి నోటీసు ఇవ్వకుండా తొలగిస్తామని హెచ్చరించారు.

రోడ్లు ఛిద్రం!

లారీల్లో పరిమితికి మించి ఇసుక రవాణా

కళ్లు మూసుకుంటున్న రవాణా, పోలీసు శాఖలు

వైసీపీ హయాంలో విచ్చలవిడిగా ఓవర్‌లోడ్ 6

కూటమి ప్రభుత్వం వచ్చాక.. రోడ్లకు మరమ్మతులు

భారీ వాహనాలతో మళ్లీ దారులు ధ్వంసం



డొంకరోడ్డులో ఆక్రమణకు గురైన కార్పొరేషన్ స్థలం, ఎన్‌హెచ్‌కు చెందిన ఇల్లు

రూ.3.50 కోట్ల విలువైన కార్పొరేషన్ స్థలం

హాంఫట్

కృష్ణలంక డొంకరోడ్డులోని స్థలం, ఇల్లు ప్రైవేట్‌పరం

వారధి నిర్మాణ సమయంలో ఎన్‌హెచ్‌కు ఇచ్చిన కార్పొరేషన్

450 చ.గ స్థలంలో వాచ్‌మెన్‌కు ఇల్లు నిర్మాణం

ఆ తర్వాత ప్రైవేట్ వ్యక్తుల ఆధీనంలోకి వెళ్లిన భవనం

ఎదురింటి డోరు నెంబరుతో కరెంట్, మంచినీరు, ఇంటిపన్ను

చక్రంతిప్పిన వైసీపీ మాజీ కార్పొరేటర్

చోద్యం చూస్తున్న కార్పొరేషన్, ఎన్‌హెచ్ అధికారులు

కార్పొరేషన్‌కు చెందిన దాదాపు 450 చదరపు గజాల స్థలం, ఇల్లు ప్రైవేట్ వ్యక్తుల పరమయ్యాయి. కృష్ణలంకలో రూ.3.50 కోట్ల విలువచేసే ఈ ఇంటికి ఎదురింటి డోర్ నెంబర్ తెప్పించడంతో పాటు విద్యుత్, మంచినీరు కనెక్షన్లు తెచ్చుకుని మరీ యథేచ్ఛగా ఆక్రమించేశారు. ఈ వ్యవహారంలో స్థానిక వైసీపీ మాజీ కార్పొరేటర్ హస్తం ఉందని తెలుస్తోంది.

కృష్ణలంక, మే 21 (ఆంధ్రజ్యోతి) : కనకదుర్గమ్మ వారధి నిర్మాణ సమయంలో మెటీరియల్‌ను ఉంచేందుకు గాను కార్పొరేషన్‌కు చెందిన కృష్ణలంక నెహ్రూనగర్ డొంకరోడ్డులోని మిగతా 6లో..

ఆదివారం కురిసిన వర్షానికి కుమ్మరిపాలెంలో మునిగిన రోడ్డు (ఇన్‌సెట్‌లో) పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డులో ముందుకు కదలని మురుగునీరు



డ్రైనేజీ

నగరంలో అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ

- చిన్నపాటి వర్షానికి మునిగిపోతున్న రోడ్లు
- మురుగు నీటి పారుదల నిర్వహణలో నిర్లక్ష్యం
- పట్టించుకోని కార్పొరేషన్ ఇంజనీరింగ్ విభాగం
- ఎండకాలంలోనే పరిస్థితి ఇలా ఉంటే..
- రానున్న వర్షాకాలం దుస్థితిపై భయాందోళనలు

కార్పొరేషన్, మే 21 (ఆంధ్రజ్యోతి) : నగరంలో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా మారింది. పట్టుమని పది నిమిషాలు చిన్నపాటి వర్షం పడితే చాలు.. రోడ్లు, వీధులన్నీ చెరువులను తలపిస్తున్నాయి. నగరంలో జనాభాకు తగిన విధంగా డ్రైనేజీ వ్యవస్థ లేదు. దీంతో నిత్యం డ్రైన్లు పొంగిపొర్లుతూనే ఉన్నాయి. సమగ్ర ప్రణాళిక రూపొందించి, డ్రైనేజీని సక్రమంగా నిర్వహించడంలో వీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు విఫలమయ్యారు. గత ఆదివారం కురిసిన చిన్నపాటి వర్షానికి నగరం జలమయమైంది. వీధులు, రోడ్లు మురుగు, వర్షపునీటితో చెరువులను తలపించాయి. ఎక్కడ రోడ్డు ఉందో, ఎక్కడ డ్రైయిన్ ఉందో తెలియక పాదచారులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొందరు డ్రైన్లలో పడి గాయాలపాల య్యారు. వేసవిలోనే పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే వర్షాకాలంలో పరిస్థితి ఏమిటన్న ప్రశ్నలు కలుగుతున్నాయి. మిగతా 6లో..

డ్రైయినేజీ ఇలా అయితే ఎలా..?

డ్రైయిన్లు బ్లాక్ అయ్యి, సరిగ్గా నీరు ప్రవహించకుండా ఉండటంతో పాటు రోడ్లపై మురుగు, వర్షపు నీరు పొంగిపొర్లడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాల రాకపోకలకు ఆటంకాలు కలుగుతున్నాయి. అధికారులు ప్రణాళిక ప్రకారం వేసవిలోనే ప్రధాన డ్రైయిన్లతో పాటు అనుసంధానంగా ఉన్న డ్రైయిన్లలో పూడికతీత పనులు చేపట్టడమే ఈ సమస్యకు పరిష్కారం. డ్రైయిన్లలో మురుగు, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుని నీటి ప్రవాహానికి అడ్డు పడుతున్నాయి. దీంతో చిన్నపాటి వర్షానికి డ్రైయిన్లు పొంగిపొర్లుతున్నాయి.



పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డులో డ్రైయినేజీ దుస్థితి

25న ప్రిలిమ్స్‌కు పకడ్బందీ ఏర్పాట్లు 8 జామియా మసీదుపై పిడుగు



న్యాయమూర్తికి స్వామివారి చిత్రపటం ప్రసాదాలు అందజేస్తున్న ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు

సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకున్న తెలంగాణ హైకోర్టు జడ్జి సుధ

మోపిదేవి, మే 21 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవిలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని తెలంగాణ హైకోర్టు జడ్జి పి.సుధ కుటుంబసమేతంగా బుధవారం ఉదయం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చక బృందం వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం నాగపుట్టలో పాలుపోసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. అర్చక బృందం వేదమంత్రాలతో ఆశీర్వచనం పలికి స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.



మంత్రి అచ్చెన్నాయుడుకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో శీనా నాయక్, అర్చకులు

దుర్గమ్మ సేవలో మంత్రి అచ్చెన్నాయుడు

ఇంద్రకీలాద్రి, మే 21 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రి, దుర్గామల్లేశ్వర దేవస్థానంలో కనకదుర్గమ్మను బుధవారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు దర్శించుకున్నారు. ఆయనకు ఈవో వీకే శీనానాయక్ ఆలయ మర్యాదలతో సాదర స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వేద పండితులు ఆశీస్సులు, అమ్మవారి ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు.

28న గన్నవరంలో జాబ్‌మేళా



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ

విజయవాడ, మే 21 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. గన్నవరం నియోజకవర్గ యువతకు స్థానికంగా ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాల మేరకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఈనెల 28న ఉదయం 9 గంటల నుంచి ఈ మేళా జరుగుతుందని తెలిపారు. ఏడో తరగతి నుంచి పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, పాలిటెక్నిక్ పాస్ అయిన వారు అర్హులన్నారు. జాబ్ మేళాలో ఉమ్మడి కృష్ణా, ఏలూరు జిల్లాలోని పదికి పైగా ప్రైవేటు కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని స్కిల్ డెవలప్‌మెంట్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికేట్స్, ఫోటోలు, ఆధార్ కార్డు వెంట తీసుకురావాలన్నారు. మరిన్ని వివరాలకు 94940 05725, 63006 18985, 96666 54641 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు. దీనికి సంబంధించిన కరపత్రాలను గన్నవరం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆవిష్కరించారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గాలి

» కల్తీ విత్తనాలపై తనిఖీలు చేపట్టండి: మంత్రి అచ్చెన్న

అమరావతి, మే 21 (ఆంధ్రజ్యోతి) :వ్యవసాయ, అనుబంధ రంగాల్లో ఈ ఏడాది 15శాతం వృద్ధి రేటు సాధించాలని మంత్రి అచ్చెన్నాయుడు అధికారులకు నిర్దేశించారు. అమరావతి సచివాలయం నుంచి వ్యవసాయ అనుబంధ శాఖల ఉన్నతాధికారులతో కలిసి జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ 'ఖరీఫ్ సాగుపై పూర్తి సన్నద్ధంగా ఉండండి. ఉద్యాన పంటలు సాగు చేసేలా రైతులను ప్రోత్సహించండి. ముఖ్యంగా సన్న రకాల వరి సాగును ప్రోత్సహించండి. మంచి దిగుబడులు సాధించడమే కాకుండా, ఉత్పత్తులకు మద్దతు ధర దక్కేలా మార్కెట్ సౌకర్యాలు కల్పించి, కొనుగోలు ఏజెన్సీలతో సమన్వయం చేయండి. రసాయన ఎరువుల వాడకం తగ్గించి, ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించండి. మార్కెట్‌లోకి కల్తీ విత్తనాలు రాకుండా విస్తృతంగా తనిఖీలు చేయండి' అని మంత్రి ఆదేశించారు. వ్యవసాయ శాఖ డైరెక్టర్ డిల్లీరావు, ఉద్యానశాఖ డైరెక్టర్ శ్రీనివాసులు మాట్లాడారు.

బదిలీలపై దళారుల మాటలు నమ్మొద్దు

వ్యవసాయ అనుబంధ శాఖల్లో ఉద్యోగుల బదిలీల ప్రక్రియను ఈనెలాఖరులోగా పూర్తి చేయాలని మంత్రి అచ్చెన్నాయుడు బుధవారం అధికారులను ఆదేశించారు. బదిలీలు పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. బదిలీల విషయంలో దళారులు, మధ్యవర్తుల మాటలు నమ్మి, ఎవరికీ డబ్బులిచ్చి మోసపోవద్దని ఉద్యోగులకు సూచించారు.

తెలంగాణ కేడర్‌కు ఐపీఎస్ అభిలాషా బిష్త్

సీనియర్ ఐపీఎస్ అధికారిణి అభిలాషా బిష్త్‌ను తెలంగాణ కేడర్‌కు పంపించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ఈమేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కేంద్ర హోంశాఖ ఆదేశాల మేరకు ఆమె ఈ ఏడాది ఫిబ్రవరి 26న ఏపీలో రిపోర్ట్ చేశారు. ప్రభుత్వం ఆమెను ఏపీ రోడ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్‌గా నియమించింది. ఆతర్వాత రోజు నుంచే ఆమె నాలుగు నెలల చైల్డ్ కేర్ సెలవుపై వెళ్లారు. అనంతరం తనను తెలంగాణ కేడర్‌లో కొనసాగించాలని హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు తనను తెలంగాణ కేడర్‌కు పంపించాలని ఆమె దరఖాస్తు చేసుకోగా.. ఈమేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

50% రాయితీపై వ్యవసాయ పరికరాలు: ఆగ్రోస్

వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని 50శాతం రాయితీతో పూర్తి పారదర్శకంగా అమలు చేస్తున్నట్లు ఏపీ ఆగ్రోస్ ఎండీ డిల్లీరావు బుధవారం తెలిపారు. ట్రాక్టర్‌తో వాడే స్ప్రేయర్స్, రొటోవేటర్, బాటరీ స్ప్రేయర్స్, పవర్ స్ప్రేయర్స్, పవర్ వీడర్స్, బ్రష్ కట్టర్స్, పవర్ టిల్లర్స్, ఇతర పరికరాలు ఇస్తున్నట్లు తెలిపారు. రాయితీ పరికరాల పంపిణీకి త్వరలో మార్గదర్శకాలు జారీ అవుతాయన్నారు.

సెప్టెంబరు నాటికి సారా రహిత రాష్ట్రం: ఎంకే మీనా

వచ్చే సెప్టెంబరు నెలాఖరు నాటికి రాష్ట్రం సారా రహితం కావాలని ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎంకే మీనా అధికారులకు స్పష్టం చేశారు. మంగళగిరిలో బుధవారం జరిగిన రాష్ట్రస్థాయి అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సారా నిర్మూలనకు ప్రత్యేక వ్యూహాలు అమలుచేయాలని చెప్పారు. నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌పై నిఘా పెంచాలన్నారు.

జూన్‌లో 'ఏఐ ఫర్ ఆంధ్రా పోలీస్' హ్యాకథాన్

'ఏఐ ఫర్ ఆంధ్రా పోలీస్' పేరుతో రాష్ట్ర పోలీసు శాఖ జూన్ 27,28,29 తేదీల్లో గుంటూరులో హ్యాకథాన్ నిర్వహించనున్నట్లు డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను బుధవారం ఆయన విడుదల చేశారు. పాలనలో ఆధునిక సాంకేతికతను ప్రోత్సహించేందుకు ఈ హ్యాకథాన్ నిర్వహిస్తున్నట్లు డీజీపీ తెలిపారు.

వైద్యుల పనితీరులో మార్పు రావాలి

» రోగులకు వైద్య సేవలందించడంలో ప్రభుత్వ ఆసుపత్రిని అగ్రస్థానంలో నిలపాలి
» అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవు
» పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి
» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఆదేశం



వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, మే 21 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యానికి గురై చేతిలో చిల్లిగవ్వలేని పరిస్థితిలో నిరుపేదలు వైద్యం కోసం ప్రభుత్వాసుపత్రులకు వస్తారని, అలాంటి వారికి మెరుగైన వైద్యం అందించడం దైవసేవతో సమానమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. రోగులకు మెరుగైన సేవలందించడంలో ప్రభుత్వాసుపత్రిని అగ్రస్థానంలో నిలిపేలా టీం జీజీహెచ్ స్ఫూర్తితో పనిచేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ సమావేశం బుధవారం చైర్మన్, కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో ప్రభుత్వాసుపత్రిలో చేపట్టాల్సిన చర్యలపై సుదీర్ఘంగా చర్చించి, పలు ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా వైద్య సేవలు అందించాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చడంలో ప్రతిఒక్కరూ అంకితభావంతో పనిచేయాల్సిన అవసరముందన్నారు. ఇటీవల రాష్ట్రప్రభుత్వం ప్రభుత్వాసుపత్రుల పనితీరుపై సేకరించిన ప్రజాభిప్రాయ నివేదిక ప్రకారం విజయవాడ సర్వజనాసుపత్రిలో వైద్యుల సేవలు, సిబ్బంది పనితీరు, మందుల సరఫరా, పారిశుధ్యం ఆశించిన స్థాయిలో లేకపోవడం అత్యంత బాధాకరమైన విషయమన్నారు. దీనిపై వైద్యాధికారులు పునరాలోచన చేయాల్సిన అవసరముందన్నారు. సమావేశాలు మౌలిక వసతుల అభివృద్ధి పనులకే పరిమితం కాకూడదన్నారు. అభివృద్ధితో పాటు వైద్యులు, సిబ్బంది అందించే సేవలు పేద రోగులకు సంతృప్తికరంగా ఉన్నప్పుడే ఆశించిన ఫలితాలు సాధించేందుకు అవకాశముంటుందన్నారు. దీనికోసం అన్ని విభాగాధిపతులు, సిబ్బంది సమష్టి కృషి అవసరమన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల సేవలపై నమ్మకాన్ని కలిగించినట్టయితే ఎన్ని నిధులైనా ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా వుందన్నారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ, రాష్ట్రంలోనే అతి పెద్ద ఆసుపత్రుల్లో ఒకటైన విజయవాడ సర్వజనాసుపత్రిలో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా వుందని, మౌలిక వసతుల అభివృద్ధితో పాటు రోగులకు మరింత నాణ్యమైన సేవలందించడంలో అధికారులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలన్నారు. సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, స్వర్ణాంధ్ర విజన్-2047 దార్శనిక లక్ష్యాలను చేరుకొనేందుకు అనుగుణంగా ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది సేవలందించాలని సూచించారు. రోగులకు భరోసా కల్పించేలా సేవలందించాలన్నారు. సమావేశంలో అదనపు డీఎంఈ డాక్టర్ వెంకటేష్, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.అశోక్ కుమార్, ఆర్ఎంవోలు, వివిధ విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

సరుకు రవాణా, టిక్కెట్ల ఆదాయంలో

గణనీయమైన ప్రగతి

» డీఆర్ఎం నరేంద్ర ఎ పాటిల్



రైల్వే స్టేషన్, మే 21 (ఆంధ్రజ్యోతి) : సరుకు రవాణా, ప్రయాణికుల టిక్కెట్ల చార్జీలలో విజయవాడ రైల్వే డివిజన్ గణనీయమైన ప్రగతి సాధించిందని డీఆర్ఎం నరేంద్ర ఎ పాటిల్ తెలిపారు. డివిజనల్ రైల్వే వినియోగదారుల సలహా మండలి 133వ సమావేశం బుధవారం డివిజనల్ కార్యాలయంలో జరిగింది. సమావేశంలో డీఆర్ఎం మాట్లాడుతూ, 2024-25 ఆర్థిక సంవత్సరంలో అత్యధిక గ్రాస్ రెవెన్యూ రూ.5,836.61 కోట్లు, సరుకు రవాణా ద్వారా రూ.4,239.74 కోట్లు ఆదాయం వచ్చిందన్నారు. మొత్తంగా 38.322 మిలియన్ టన్నులు లోడింగ్ చేసినట్టు తెలిపారు. విజయవాడ డివిజన్ పరిధిలోని 21 ప్రధాన స్టేషన్లను అమృత్ స్టేషన్ స్కీమ్ కింద అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. వావిలపల్లి రాంబాబు మాట్లాడుతూ, రైళ్ల రాకపోకలు, సమయపాలన, ప్రయాణికులకు మౌలిక సదుపాయాలు తదితరాల విషయంలో చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు. సమావేశంలో సభ్యులు జె.ఎల్.ఎన్.నాగేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హోంఫట్

(5వ పేజీ తరువాయి)

దాదాపు 450 చదరపు గజాల స్థలాన్ని జాతీయ రహదారుల శాఖకు అప్పగించారు. ఆ స్థలంలో ఎన్‌హెచ్ అధికారులు ఇల్లు నిర్మించి అందులో వాచ్‌మెన్‌ను నియమించారు. ఆ వాచ్‌మెన్ వెళ్లిపోయాక ఈ ఇంటిలోకి ప్రైవేట్ వ్యక్తులు చొరబడ్డారు. జాతీయ రహదారుల శాఖలో ప్రాజెక్ట్ డైరెక్టరుగా పనిచేసిన ఓ అధికారిని మచ్చిక చేసుకుని ఈ తతంగం నడిపారు. వైసీపీకి చెందిన మాజీ కార్పొరేటర్ పల్లెం రవికుమార్ ద్వారా ఎదురింటి డోర్ నెంబర్ 41-1/12-14ను వేయించి సదరు ప్రైవేట్ వ్యక్తులు ఆ ఇంటిని ఆక్రమించారు. కరెంట్, మంచినీరు, ఇంటి పన్ను సృష్టించుకున్నారు. కారు పెట్టుకునేందుకు వీలుగా రేకులతో ప్రహరీ ఏర్పాటు చేసుకున్నారు. అంతేకాదు.. ఇంటి ఎదురు రోడ్డుపై పూలకుండీలు కూడా పెట్టారు. దీనిపై స్థానికులు నిలదీయగా, జాతీయ రహదారుల శాఖ తమకు రిజిస్ట్రేషన్ చేసిందని చెప్పారు. ఒకే రోడ్డులో రెండు ఇళ్లకు ఒకే డోరు నెంబరు తీసుకురావటంలో మాజీ కార్పొరేటర్ పల్లెం రవికుమార్ చక్రం తిప్పాడనే ఆరోపణలు ఉన్నాయి. ఆయన సహకారంతోనే ప్రభుత్వ ఇంటికి ఎదురింటి డోరు నెంబరుతో ఇంటిపన్ను, విద్యుత్, మంచినీటి కనెక్షన్ తీసుకున్నారు.

పట్టించుకోని అధికారులు

20వ డివిజన్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మించేందుకు ఇది అనువైన స్థలమని స్థానిక నాయకులు గుర్తించారు. అయితే, ఇది కార్పొరేషన్‌ది కాదని, జాతీయ రహదారులది కాదని, తమ పేరున రిజిస్టరై ఉందని ఆక్రమణదారులు వాదించడంతో ఈ వ్యవహారం బయటపడింది. రూ.కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాలు, భవనాలు ఇలా ప్రైవేట్‌పరమవుతున్నా అటు కార్పొరేషన్ అధికారులు కానీ, ఇటు జాతీయ రహదారుల శాఖ అధికారులు కానీ పట్టనట్లు వ్యవహరించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రికార్డులు పరిశీలించి చర్యలు తీసుకుంటాం..

ఆ స్థలం రికార్డులు పరిశీలించి చర్యలు తీసుకుంటాం. జాతీయ రహదారుల శాఖ వాచ్‌మెన్ అందులో ఉంటున్నారు అంటే.. అది ఇంకా కార్పొరేషన్ చేతికి వచ్చి ఉండదు. మా పరిధిలోనిది అయితే చర్యలు తీసుకుంటాం. కాకపోతే కమిషనర్‌కు చెప్పి చర్యలు తీసుకుంటాం. గత కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ జాతీయ రహదారుల శాఖకు ఆ స్థలాన్ని అప్పగించాల్సిందిగా లేఖ రాసిన విషయం నాకు తెలియదు.

- సంజయ్ రత్నకుమార్, చీఫ్‌సిటీప్లానర్

మాయా'జలం'

(5వ పేజీ తరువాయి)

పంపింగ్ స్టేషన్ల నిర్వహణకు టెండర్లు పిలిచారు. ఈ నాలుగు పంపింగ్ స్టేషన్ల టెండర్లను ఓ కాంట్రాక్టర్ దక్కించుకున్నాడు. జనవరి 18న అగ్రిమెంట్ కూడా చేసుకున్నారు. ఆరోజు నుంచే కాంట్రాక్టర్ పనిచేయాల్సి ఉంటుంది. కానీ, నాలుగు నెలలు గడిచి, ఐదో నెలలోకి ప్రవేశించినా కొత్త కాంట్రాక్టర్ వాటిని స్వాధీనం చేసుకుని నిర్వహించలేదు. పాత కాంట్రాక్టరే ఇప్పటికీ వాటిని నిర్వహిస్తున్నాడు. దీనివెనుక పెద్ద కథే నడిచింది. పాత కాంట్రాక్టర్ గతంలో 5 శాతం ఎక్కువకు కోట్ చేశాడు. కొత్త కాంట్రాక్టర్ 18 శాతం తక్కువకు కోట్ చేశాడు. దీంతో ఓఅండ్ఎం నిర్వహణకు కాంట్రాక్టర్లకు చెల్లించే ధరలో వ్యత్యాసం ఏర్పడింది. పాత కాంట్రాక్టర్ ఈ పనులు చూస్తే నెలకు దాదాపు రూ.10 లక్షల వరకు ఆదా అవుతుందని తెలుస్తోంది. ఈ లెక్కన ఈ నాలుగున్నర నెలల కాలానికి, ఆ తర్వాతకు దాదాపు రూ.అరకోటి వరకు ఆదా అయ్యే అవకాశం ఏర్పడింది. దీంతో ఇంకా పాత పద్ధతిలోనే బిల్లుల చెల్లింపు వల్ల ప్రభుత్వంపై భారం పడుతోంది. ఇంత జరుగుతున్నా అదనపు కాలం పనిచేస్తున్న పాత కాంట్రాక్టర్, అగ్రిమెంట్ చేసినా పనులు చేపట్టని కొత్త కాంట్రాక్టర్ విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

తెరపైకి కొత్త టెండర్లు

ఓవక్క ఈ టెండర్ల వివాదం నడుస్తుండగానే, మరోవైపు కొత్త వివాదానికి తెరలేపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మళ్లీ ఈ నాలుగింటికి కొత్తగా టెండర్లు పిలిచారు. ఈ టెండర్లలో కొత్త, పాత సంస్థలు పాలు పంచుకునేందుకు రంగం సిద్ధం చేశారు. సాధారణంగా ఈ రెండు కాంట్రాక్టు సంస్థలు చేసిన పనికి వారిని బ్లాక్‌లిస్టులో పెట్టాలి. ఈ పనిచేయకపోవటంతో ఉన్నతాధికారులు సదరు సంస్థలతో లాలూచీ పడ్డారన్న ఆరోపణలు వస్తున్నాయి.

'డ్రై'నేజీ

(5వ పేజీ తరువాయి)

నగరపాలక సంస్థ పూడికతీత పనులను క్రమం తప్పకుండా చేయకపోవడమే ఇందుకు కారణం. వీఎంసీ సక్రమంగా ప్రధాన డ్రెయిన్లతో పాటు అనుసంధానంగా ఉన్న డ్రెయిన్లలో పూడికతీత చేపడితే సమస్య పరిష్కారం అవుతుంది. నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉండటం వల్ల దుర్వాసన, మశూచి, డెంగ్యూ వంటి రోగాలు ప్రబలే అవకాశం ఉండటంతో పాటు రోడ్లు దెబ్బతింటాయి.

అమరావతి పరిరక్షణ ఉద్యమం కేసులో

సిటీ సివిల్ కోర్టుకు టీడీపీ నేతలు

గొల్లపూడి, మే 21 (ఆంధ్రజ్యోతి) : అమరావతి పరిరక్షణ ఉద్యమంలో భాగంగా గొల్లపూడిలో నిరసన తెలిపినందుకు వైసీపీ ప్రభుత్వం 2020లో పెట్టిన కేసులో విచారణ నిమిత్తం మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు తదితరులు బుధవారం సిటీ సివిల్ కోర్టుకు హాజరయ్యారు. చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులో సీసీ నెం.1868/2020లో దేవినేని ఉమాతో పాటు టీడీపీ నాయకులు బొమ్మసాని సుబ్బారావు, నర్రా వాసు, నూతలపాటి వెంకటేశ్వరరావు (నారద), వడ్లమూడి చలపతిరావు, ఇరుగులపాటి దిలీప్, శ్రీను నాయక్, రంగినేని నరేంద్ర, షేక్ కరీముల్లా, కారంపూడి సాయి, కోగంటి సూరిబాబు, చిగురుపాటి నాగరాజు, ధనేకుల లక్ష్మయ్య, బొర్రా తిరుపతిరావు, ఆలూరి హరికృష్ణ చౌదరి, ఈదర పూర్ణచంద్రరావు, ఆలూరి సాంబశివరావు, గొరిజాల సాంబశివరావు, కోమటి రామ్మోహనరావు తదితరులు ఉన్నారు. ఈ కేసులో తదుపరి విచారణను జులై 31కి న్యాయాధికారి వాయిదా వేశారు.

నిందితుడికే వత్తాసు!


» హైదరాబాద్ పోలీసుల తీరు
» విచారణకు వెళ్లిన నందిగామ పోలీసుల నిర్బంధం, డీసీపీ అనుచిత వైఖరి
» నగర సీపీ ఆదేశాలతో విడుదల

నందిగామ, మే 21 ఆంధ్రజ్యోతి : లైంగికదాడి, చోరీ కేసులో నిందితుడిని అదుపులోకి తీసుకొనేందుకు వెళ్లిన నందిగామ పోలీసులకు హైదరాబాద్ పోలీసులు చుక్కలు చూపించారు. తప్పుడు కేసులతో అరెస్టు చేసేందుకు వచ్చారా అంటూ నిందితుడిని వెనుకేసుకొచ్చి నందిగామ పోలీసులను నిర్బంధించిన ఘటన సంచలనం కలిగించింది. సేకరించిన సమాచారం ప్రకారం.. గుంటూరులో చార్టెడ్ అకౌంట్ (సీఏ) శిక్షణ ఇస్తున్న ఒక ప్రైవేటు సంస్థలో కతిక అమరేంద్రరెడ్డి అధ్యాపకుడిగా పనిచేస్తున్నాడు. అమరేంద్రరెడ్డి ఆడపిల్లలను ట్రాప్‌చేస్తూ పెళ్లి చేసుకుంటానని మాయచేస్తున్నాడు. ఇటీవల నందిగామ ప్రాంతానికి చెందిన విద్యార్థినిని పెళ్లి చేసుకుంటానని ప్రేమలోకి దింపాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు విద్యార్థినిని చదువు మాన్పించి సమీప బంధువైన నందిగామకు చెందిన మద్దుకూరి సాయిబాబు (చార్టెడ్ అకౌంటెంట్) వద్ద ఉద్యోగంలో పెట్టారు. ఈక్రమంలో మూడు రోజుల క్రితం అమరేంద్రరెడ్డి నందిగామ వచ్చి సదరు చార్టెడ్‌అకౌంటెంట్ కార్యాలయంలోని ఫైళ్లు, హార్డ్ డిస్కులతో పాటు సదరు యువతిని తీసుకొని వెళ్లాడు. ఘటనపై సాయిబాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇది తెలిసిన మరో యువతి తనపైనా అమరేంద్రరెడ్డి లైంగిక దాడికి పాల్పడ్డాడని ఆన్‌లైన్ ద్వారా నందిగామ పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితుడైన అమరేంద్రరెడ్డి హైదరాబాద్‌లో ఉన్నట్టు తెలుసుకుని అరెస్టు చేసేందుకు నందిగామ పోలీసులు హైదరాబాద్ వెళ్లారు. హెడ్‌కానిస్టేబుల్ నారాయణ, కానిస్టేబుల్ రాంప్రసాద్‌లు నిందితుడు ఉంటున్న ఇంటిని సమీపిస్తుండగానే ఎల్‌బీనగర్ స్టేషన్‌కు చెందిన పోలీసులు అక్కడకు చేరుకున్నారు. అమరేంద్రరెడ్డిని ఎందుకు ఇబ్బంది పెడుతున్నారంటూ నందిగామ పోలీసులపై మండిపడ్డారు. అరెస్టు వారెంట్‌లు చూపేందుకు ప్రయత్నిస్తుండగానే రాచకొండ కమిషనరేట్‌కు చెందిన డీసీపీ ప్రవీణ్‌కుమార్ వద్దకు బలవంతంగా తీసుకువెళ్లారు. అమరేంద్రరెడ్డిపై తప్పుడు కేసులు పెడతారా అంటూ మండిపడటమేకాక అతడిని అరెస్టు చేయరాదంటూ డీసీపీ హెచ్చరించారు. విషయం తెలుసుకున్న నందిగామ సీఐ విజయవాడ డీసీపీ మహేశ్వరరాజుకు సమాచారం ఇచ్చారు. ఆయన ఎల్‌బీనగర్ డీసీపీతో ఫోన్‌లో మాట్లాడినా ఫలితం లేదు. దీంతో విజయవాడ సీపీ రాజేంద్రనాథ్‌బాబు రాచకొండ సీపీతో ఫోన్‌లో మాట్లాడి విషయం తెలియజేశారు. దీంతో అప్రమత్తమైన ఎల్‌బీనగర్ డీసీపీ నందిగామ పోలీసులను విడిచి పెట్టారు. నిందితుడిని పట్టుకొనేందుకు తాము సహకరిస్తామంటూ, జరిగిన ఘటన విచారకరమని.. నందిగామ సీఐతో మాట్లాడారు. ఇంతలో అమరేంద్రరెడ్డి పరారయ్యాడు. అమరేంద్రరెడ్డిని పట్టుకొనేందుకు సహకరిస్తామంటూ రాచకొండ సీపీ హామీ ఇవ్వడంతో నందిగామ సీఐ వైవీవీఎల్ నాయుడు సిబ్బందితో కలిసి హైదరాబాద్ వెళ్లారు.

రోడ్లు ఛిద్రం!

(కంచికచర్ల - ఆంధ్రజ్యోతి)

» లారీల్లో పరిమితికి మించి ఇసుక రవాణా
» కళ్లుమూసుకుంటున్న రవాణా, పోలీసు శాఖలు
» వైసీపీ హయాంలో విచ్చలవిడిగా ఓవర్‌లోడ్
» కూటమి ప్రభుత్వం వచ్చాక.. రోడ్లకు మరమ్మతులు
» భారీ వాహనాలతో మళ్లీ దారులు ధ్వంసం





ఓవర్ లోడ్‌తో వెళుతున్న టిప్పర్, ధ్వంసమైన కృష్ణా తీర ప్రాంత రోడ్డు

టైర్ల సంఖ్యను బట్టి రవాణా వాహనాలకు అనుమతి మేరకు లోడింగ్ చేయాల్సి ఉంది. రవాణా అధికారులు పేర్కొన్నట్టుగా పది టైర్ల వాహనానికి 28 టన్నులు, 12 టైర్ల వాహనానికి 35 టన్నులు, 14 టైర్ల వాహనానికి 42 టన్నుల వరకు లోడింగ్ చేయవచ్చు. దీనికి ఐదు శాతం వరకు మార్జిన్ ఉండటంతో ఒకటి నుంచి రెండు టన్నుల వరకు ఎక్కువగా లోడింగ్ చేయవచ్చు.

> ఇసుక లారీలు, టిప్పర్ల ఓవర్ లోడ్ భారాన్ని గ్రామీణ ప్రాంతాల రోడ్లు తట్టుకోలేకపోతున్నాయి. ఎక్కడికెక్కడ రోడ్లు నిలువునా కుంగిపోతూ, ఛిద్రమవుతున్నాయి. ఇసుక వాహనాలపై పట్టాలు పకడ్బందీగా కప్పకపోవటం ప్రమాదాలకు దారి తీస్తున్నది. ఇసుక రేణువులు కళ్లల్లో పడటం వల్ల ద్విచక్ర వాహనదారులు తరుచుగా ప్రమాదాలకు గురవుతున్నారు.
>
> **దుమ్ము రేపుతున్నాయి**

అయితే ఇసుక లారీలు, టిప్పర్లకు సంబంధించి ఎక్కువగా ఓవర్‌లోడ్ వేస్తున్నారు. అనుమతి మేరకు లోడింగ్ చేయటమన్నది చాలా అరుదు. ముఖ్యంగా ఇసుక అక్రమ రవాణా విషయంలో ఓవర్ లోడింగ్ కీలక పాత్ర పోషిస్తున్నది. 12 లేదా 14 టైర్ల వాహనాలకు సామర్థ్యం మేరకు 50 నుంచి 70 టన్నుల వరకు కూడా లోడింగ్ చేస్తున్నారు. సామర్థ్యం మేరకు ఇసుక లోడింగ్ చేయని పక్షంలో ఇతర ప్రాంతాలకు అక్రమంగా తరలించే వారికి పెద్దగా గిట్టుబాటు కాదు. ముఖ్యంగా తెలంగాణా ప్రాంతానికి తరలించే వాహనాలకు ఓవర్‌లోడ్ వేయటమన్నది పరిపాటిగా మారింది. క్షేత్రస్థాయిలో అధికారులు కూడా పెద్దగా పట్టించుకోవటం లేదు. కొద్ది రోజుల క్రితం రవాణా శాఖాధికారులు నాలుగు టిప్పర్లను పరిశీలించగా, ఇసుక 80 టన్నులున్నట్టుగా గమనించారు. అధిక టన్నేజీ కల్గిన వాహనాల రాకపోకలకు గ్రామీణ ప్రాంతాల రోడ్లు తట్టుకోలేకపోతున్నాయి.

ధ్వంసమవుతున్న గ్రామీణ రోడ్లు..

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇసుక లారీల పుణ్యమా అంటూ కృష్ణానది తీరంలోని గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రోడ్లు నామరూపాలు లేకుండ ధ్వంసమయ్యాయి. బీటీ రోడ్లు మట్టిరోడ్లుగా మారాయి. అడ్డగోలుగా రేయింబవళ్లు వందల సంఖ్యలో ఓవర్ లోడ్ కల్గిన ఇసుక లారీలు, టిప్పర్లు తిరగటం వల్ల కంచికచర్ల నుంచి చెవిటికల్లు వెళ్లే రోడ్డు, కునికినపాడు, మున్నలూరు, మొగులూరు, గని ఆత్కూరు గ్రామాలకు వెళ్లే రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నాయి. నందిగామ నుంచి వయా చందర్లపాడు మీదుగా పొక్కునూరు వెళ్లే రోడ్డు, ఉస్తేపల్లి వెళ్లే రోడ్డు బాగా దెబ్బతిన్నాయి. ఈ రోడ్లపై ఎక్కడికెక్కడ పెద్ద గుంతలు పడ్డాయి. కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు వెళ్లే పరిస్థితి లేదు. ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలకు నరకయాతన పడ్డారు. అయినప్పటికీ వైసీపీ పాలకులు ఏమాత్రం పట్టించుకోలేదు. ప్రజలు పలు అవస్థలు పడుతున్నప్పటికీ ఒక్క రూపాయి కూడా నిధులు కేటాయించ లేదు. దెబ్బతిన్న రోడ్లను బాగు చేయలేదు. గత ఏడాది టీడీపీ అధికారపగ్గాలు చేపట్టగానే రాకపోకలకు ఆటంకం లేకండ తాత్కాలికంగా రోడ్లను బాగు చేశారు. రోడ్లు బాగున్నాయనుకుంటే.. మళ్లీ ఓవర్ లోడ్‌తో విచ్చలవిడిగా తెలంగాణాకు తరలుతున్న లారీల కారణంగా మళ్లీ డ్యామేజీ ఏర్పడే పరిస్థితి నెలకొంది. ఈ రోడ్లను పటిష్టం చేసి, అభివృద్ధి చేయాల్సిందిగా ప్రజలు కోరుతున్నారు.

తరచుగా ప్రమాదాలు..

ఇసుక లారీలు, టిప్పర్లపై పకడ్బందీగా పట్టాలు కప్పకపోవటం వల్ల రోడ్లపై తరుచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి.. వేగంగా వెళ్లే వాహనాల నుంచి ఇసుక రేణువులు గాలికి లేచి పడటంతో వాహనదారులు అదుపుతప్పి కాళ్లు, చేతులు విరగటంతో క్షతగాత్రులవుతున్నారు. గ్రామీణ ప్రాంతాల రోడ్లపైనే కాకుండా, నందిగామ-విజయవాడ మధ్య జాతీయ రహదారిపైనా ప్రమాదాలు జరుగుతున్నాయి.

ఇసుక అక్రమ రవాణా..

తెలంగాణాకు ఇసుక అక్రమ రవాణాను నిరోధించాల్సిన అధికారులు అలసత్వం వహిస్తున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. వాహనాల వద్ద ఎలాంటి పర్మిట్లు లేనప్పటికీ వాటికి ఎలాంటి ఆటంకాలు ఎదురుకావటం లేదు. తెలంగాణాలో ప్రవేశించగానే అక్కడి అధికారులు పట్టుకోవటం విశేషం. అక్రమ రవాణాను నిరోధించేందుకు ఆ దిశగా ఎవరూ చర్యలు తీసుకోవటం లేదు. నందిగామ సబ్ డివిజన్ పరిధిలోని కొందరు కానిస్టేబుళ్లు ఇసుక అక్రమ రవాణాకు సహకారం అందిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

విజయవాడ తూర్పు



జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు నిహారిక, కుమార్ ఎంపిక

విజయవాడ స్పోర్ట్స్: హర్యానా రాష్ట్రం పల్వాల్‌లో ఈ నెల 25నుంచి 27వరకు జరిగే అండర్-17 జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు రాష్ట్ర జట్టుకు బి.నిహారిక, బి.కుమార్‌లు ప్రాతినిధ్యం వహిస్తున్నారని రెజ్లింగ్ అసోసియేషన్ జిల్లా ఇన్‌చార్జి కార్యదర్శి డి.శ్రీనివాసరావు తెలిపారు. ఇటీవల చిత్తూరులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో త్రివేణి కళాశాలకు చెందిన నిహారిక, ఎస్‌కేపీవీ హిందూ హైస్కూల్‌కు చెందిన కుమార్ పతకాలు సాధించి జాతీయ పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు..



ఇంద్రకీలాద్రిపై ప్లాస్టిక్ వాడొద్దు

ఈవో శీనా నాయక్



ఇంద్రకీలాద్రి, మే 21 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై ప్లాస్టిక్ వాడవద్దని, అందుకు భక్తులు, వ్యాపారులు, సిబ్బంది సహకరించాలని దుర్గగుడి ఈవో వి.కె.శీనా నాయక్ సూచించారు. దేవస్థానంలో ప్రసాదాలకు, ఇతర అవసరాలకు ప్లాస్టికేతర సంచులు వాడుతుండగా, కొండ దిగువన వీధి వ్యాపారులు ఇస్తున్న ప్లాస్టిక్ సంచులు ఆలయ ప్రాంగణంలో పడేస్తున్నారని ఈవో అభిప్రాయపడ్డారు. దుర్గగుడి పరిసర ప్రాంతాల్లో బుధవారం చెప్పులస్టాండ్, మొబైల్, లగేజ్ భద్రపరచే కౌంటర్‌లను పరిశీలించారు. అధిక ధరలు ఏమైనా వసూలు చేస్తున్నారా? అని భక్తులను అడిగి తెలుసుకున్నారు. దేవస్థానం ఉచితంగా చెప్పులు భద్రపరుస్తున్నా, ఎక్కడి పడితే అక్కడ చెప్పుల గుట్టలు ఉండటం గమనించి, మైక్ ప్రచారం చేయాలని ఆదేశించారు. ఘాట్‌రోడ్‌లో దుకాణాలు పరిశీలించి ఎంఆర్పీకే విక్రయించాలని, భక్తులతో గౌరవంగా మెలగకపోతే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. ప్రోటోకాల్ దర్శనాలు నమోదు గురించి తెలుసుకున్నారు. రూ.500 టికెట్ బుకింగ్ కౌంటర్‌ను పరిశీలించారు.ఆలయ ప్రాంగణలో వాడకంలో లేకుండా ఉన్న గదులు తక్షణమే శుభ్రం చేయించాలని ఆదేశించారు. పొడి, తడి చెత్త వేరు చేస్తున్న విధానం గమనించారు. ఉచిత దర్శనం క్యూలైన్ల నుంచి ఆలయంలోకి ప్రవేశించి అమ్మవారి దర్శనం చేసుకున్నారు. పర్యటనలో ఈఈ కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



ఎయిడ్స్ నియంత్రణపై వీధి నాటిక ప్రదర్శిస్తున్న కళాకారులు

ఎయిడ్స్ నియంత్రణపై వీధి నాటిక

రాణిగారితోట, మే 21 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ నియంత్రణకు జాతీయ ఎయిడ్స్ సంస్థ సహకారంతో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, కృష్ణాజిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో రాణిగారితోటలో ఎయిడ్స్ నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై వీధి నాటిక నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఐవీ నియంత్రణకు, నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు, ఐసీటీసీ, ఏఆర్టీ సెంటర్లు, పీపీటీసీ కేంద్రాలు, మొబైల్ ఐసీటీసీ కేంద్రాలు, బ్లడ్ బ్యాంక్‌లు అందించే సేవలు, రక్తదానం తదితర అంశాలపై గుడివాడకు చెందిన యడవల్లి వీరయ్య కల్చరల్ సొసైటీ కళాకారులు ఈ వీధి నాటిక ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో స్థానిక యూపీహెచ్‌సీ డాక్టర్ బి.సందీప్, ఆర్‌పీపీ గోవర్ధన్, ఆశ వర్కర్స్ ప్రతినిధులు అమూల్య, ప్రాజెక్టు మేనేజర్ సజాత, ఔట్‌రీచ్ వర్కర్స్ పీఈఎస్‌లు పాల్గొన్నారు.



బెంజిసర్కిల్ సర్వీస్ రోడ్డులో నిలిచిన డ్రెయినేజీ నీరు

పాదచారులు, వాహనదారుల పాట్లు

బెంజిసర్కిల్, మే 21 (ఆంధ్రజ్యోతి): నిత్యం ట్రాఫిక్‌తో ఉండే బెంజిసర్కిల్ ప్రాంతంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. తరుచుగా ఈ ప్రాంతంలో ఓపెన్ డ్రెయినేజ్ నుంచి మురుగునీరు వెలుపలకు వచ్చి దుర్వాసన కొడుతోంది. బెంజిసర్కిల్ నుంచి కనకదుర్గమ్మ వారధిపైపు వెళ్లే సర్వీస్‌రోడ్డులో మురుగునీరు నిలిచి ఇటు పాదచారులకు, అటు వాహనదారులకు తీవ్ర అసౌకర్యంగా ఉంది. రోడ్డుపై నిలిచిన మురుగునీరు దుర్వాసన వెదజల్లుతూ ఈగలు, దోమలకు నిలయంగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై వీఎంసీ అధికారులు దృష్టిసారించి డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరచాలని వారు కోరుతున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధుడి మృతి

వన్‌టౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి): పాత బస్టేషన్ వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొనటంతో కృష్ణలంకకు చెందిన విష్ణుభట్ల సుబ్బరామ శాస్త్రి (60) మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. కృష్ణలంక కోదండరామాలయం వీధిలోని శ్రీకనకదుర్గా అపార్టుమెంట్‌లో విష్ణుభట్ల సుబ్బరామశాస్త్రి భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడుతో ఉంటున్నాడు. ఇతను మంగళవారం రాత్రి 10.30కు పోలీసు కంట్రోల్ రూమ్ నుంచి విజయవాడ బస్టేషన్ వైపు వెళుతుండగా పాత బస్టేషన్ సమీపంలోని గ్లోబల్ హాస్పటల్ రోడ్డులో ఆర్టీసీ బస్సు అతివేగంగా ప్రయాణించి అతనిని ఢీకొని, బస్సు వెనుక చక్రం అతని మీదుగా వెళ్లటంతో శాస్త్రి అక్కడికక్కడే చనిపోయాడు. పోలీసులు ఘటనా స్థలం వద్దకు వెళ్లి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. పోలీసులు మృతదేహాన్ని విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు గవర్నరుపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు.

అక్రమ కేసులకు బెదరని చంద్రబాబు

తూర్పు నియోజకవర్గ మినీ మహానాడులో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

బెంజిసర్కిల్, మే 21 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు రోడ్లపై తిరగకుండా అక్రమంగా కేసులు పెట్టారని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. తూర్పు నియోజకవర్గం మినీ మహానాడు బుధవారం సాయంత్రం బెంజిసర్కిల్ సమీపంలోని జ్యోతి కన్వెన్షన్ హాలులో స్థానిక ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అధ్యక్షత జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు పెట్టిన చంద్రబాబు ఏమాత్రం బెదరకుండా ధైర్యంతో కార్యకర్తలను ముందుకు నడిపారని తెలిపారు. స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, రాష్ట్ర శాలివాహన, కుమ్మరి కార్పొరేషన్ ఛైర్మన్ పేరేపి ఈశ్వర్, మాజీ ఎమ్మెల్సీ పరుచూరి అశోక్ బాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు బొప్పన భవకుమార్, షేక్ ఫిరోజ్, గన్నె ప్రసాద్, చెన్నుపాటి గాంధీ, ఉడా మాజీ ఛైర్మన్ తూమాటి ప్రేమ్‌నాథ్, జిల్లా తెలుగుయువత అధ్యక్షుడు షేక్ నాగూర్, జిల్లా మహిళా అధ్యక్షురాలు చెన్నుపాటి ఉషారాణి, నేతలు సంజయ్‌వర్మ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా అతిథులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కొద్దిసేపు మౌనం పాటించారు. కాగా మినీ మహానాడు సందర్భంగా బెంజిసర్కిల్ ప్రాంత్రం పసుపుమయంగా మారింది. అధిక సంఖ్యలో కార్యకర్తలు, నేతలు తరలివచ్చారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, వేదికపై ఎంపీ శివనాథ్, నెట్టెం, పట్టాభి తదితరులు

మినీ మహానాడు తీర్మానాలు ఇవే...

బెంజిసర్కిల్‌లోని జ్యోతి కన్వెన్షన్ హాలులో బుధవారం సాయంత్రం జరిగిన తూర్పు నియోజకవర్గం మినీ మహానాడులో పలు తీర్మానాలను ప్రవేశపెట్టి సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. రోడ్లు, డ్రెయిన్‌లు, ఇళ్లపట్టాలు, పేదలకు ఇళ్ల కేటాయింపు అంశాలపై తూర్పు నియోజకవర్గం మినీ మహానాడులో తీర్మానాలు చేసింది.

- తూర్పు నియోజకవర్గ పరిధిలోని కృష్ణానదిని అనుకొని రిటైనింగ్ వాల్ వెంట 70 అడుగుల వెడల్పుతో రోడ్డు నిర్మాణం చేయాలని, మూడు పంపింగ్ స్టేషన్‌లు ఏర్పాటుచేసి వర్షాకాలంలో నీటిని పంప్ చేయడానికి చర్యలు తీసుకోవాలని తీర్మానం చేశారు.
- ఆటోనగర్ టెర్మినల్ నుంచి రామవరప్పాడులోని ఏలూరు రోడ్డుకు కనెక్టవిటీ రోడ్డు ఏర్పాటు చేయాలని, జవహర్ ఆటోనగర్ నుంచి కానూరు ఆటోనగర్ వరకు, మహానాడు రోడ్డు నుంచి కంకిపాడు వరకు రోడ్డు నిర్మాణం చేయాలని తీర్మానం చేశారు.
- ఆటోనగర్ గేట్ దగ్గర, గమేళా పాకల దగ్గర రోడ్డుపై ఉండేవారికి జేఎన్‌యూఆర్ఎం పథకంలో భాగంగా లబ్ధిదారుని వాటాలేకుండా ఇళ్లు కేటాయించాలని తీర్మానించింది.
- రాణిగారితోట ప్రాంతంలో పశువుల ఆస్పత్రి దగ్గర, అమెరికన్ ఆస్పత్రి దగ్గర, కృష్ణలంక కరకట్ట నుంచి రెండు సబ్‌వేలు నిర్మాణంతోపాటుగా బందరురోడ్డుకు కనెక్టివిటీ ఏర్పాటు చేయాలని తీర్మానించారు.
- నియోజకవర్గ పరిధిలోని కొండ ప్రాంతాల నుంచి రోడ్లపైకి వచ్చే వర్షపునీటిని, కొండదిగువ కాలనీలో రోడ్లపై నిల్వ ఉండే మురుగునీటిని తొలగించడానికి అవుట్‌ఫాల్ డ్రెయిన్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని, స్ట్రామ్‌వాటర్ స్కీమ్‌లో భాగంగా పుల్లేటికట్ట డ్రెయిన్, మాచవరం డ్రెయిన్, నిర్మల కాన్వెంట్ నుంచి పటమట లంక ద్వారా వెళ్లే డ్రెయిన్‌నీరు రోడ్లపైకి కాకుండా మేజర్ అవుట్‌ఫాల్ డ్రెయిన్ల నిర్మాణం చేయాలని తీర్మానించారు.
- నగరవాసులకు గత ప్రభుత్వంలో వెదురుపావులూరు, అమరావతిలో కేటాయించిన ఇళ్లస్థలాలు, ఇళ్లపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. మినీ మహానాడులో చేసిన తీర్మానాలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌లు తెలిపారు.

భారత సైనికులకు సంఘీభావంగా

తిరంగా ర్యాలీ



తిరంగా ర్యాలీ లో పాల్గొన్న ఎంపీ కేశినేని శివనాథ్, సింధ్ సమాజ్ సభ్యులు తదితరులు

లబ్బీపేట, మే 21 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత సైన్యం పాకిస్తాన్ ఉగ్రమూకలకు గట్టిగా బుద్ధి చెప్పిందని ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. పహల్గాంలో దాడి చేసిన పాకిస్తాన్ ఉగ్రవాదులపై విజయం సాధించిన భారత సైనికులకు సంఘీభావంగా బృందావన్ కాలనీలోని సింధు భవన్ నుంచి పూజ్‌సిందు పంచాయిత్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం తిరంగా ర్యాలీ నిర్వహించారు, ఈ కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, పూజ్ పంచాయిత్ విజయవాడ ప్రెసిడెంట్ సి.హెచ్.దయాళ్‌చంద్ నాని, సెక్రటరీ చంద్రప్రకాష్, పైలా సోమినాయుడు, పీత బుజ్జి, పోతంశెట్టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌పై

జగన్ వైఖరి వెల్లడించాలి

పటమట, మే 21 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులపై, ఆదివాసీలపై యుద్ధం ప్రకటించిన కేంద్ర ప్రభుత్వంపై వైఎస్ జగన్మోహన్ రెడ్డి తన వైఖరి ఏమిటో తెలపాలని ఒక లేఖను సజ్జల రామకృష్ణారెడ్డికి అందించినట్లు రాడికల్ పూర్వ విద్యార్థి సంఘ నాయకుడు ఆర్.భరద్వాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆఖరి మావోయిస్టును చంపే వరకు ఆపరేషన్ కగార్ ఆగదని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ప్రకటించారని వెంటనే ఆపరేషన్ కగార్‌ను ఆపి మావోయిస్టులతో సమావేశం జరపాలని కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఐ, సీపీఎం, ఇతర ఎంఎల్ గ్రూపులు కేంద్రాన్ని డిమాండ్ చేశాయన్నారు. ఏపీలో ప్రతిపక్షంలో ఉన్న వైఎస్ జగన్మోహన్ రెడ్డి కూడా కగార్‌పై ఆయన వైఖరి ఎమిటో తెలపాలన్నారు.



మాట్లాడుతున్న గోళ్ల నారాయణరావు, ఇంతియాజ్ తదితరులు

పుస్తకాలు జీవితానికి మార్గదర్శకాలు

విశ్రాంత ఐఏఎస్ ఇంతియాజ్

విజయవాడ కల్చరల్, మే 21 (ఆంధ్రజ్యోతి) : పుస్తకాలు మన జీవితానికి మార్గదర్శకాలు అని విశ్రాంత ఐఏఎస్ ఏఎండీ ఇంతియాజ్ తెలిపారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ, గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక, స్వేచ్ఛ ఆంధ్ర సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రంథాలయ వారోత్సవాల కార్యశాల రెండో రోజు కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఇంతియాజ్ మాట్లాడుతూ యువత, పిల్లలు పఠన సంస్కృతిపై ఆసక్తి పెంచుకోవాలని హితవు పలికారు. వికాసం విద్యావనం, కుంచనపల్లి అరవింద విద్యాలయం నుంచి 20 మంది ఉపాధ్యాయులు, 15 మంది బాలబాలికలు ఈ కార్యక్రమంలో పాల్గొనడం విశేషం. ట్రెజర్ హంట్ ఆట, వ్యక్తిగత గ్రంథాలయ జర్నల్ తయారీ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలను జిల్లా కన్వీనర్ గోళ్ల నారాయణరావు, లక్ష్మయ్య ప్రసాద్, హసీనా, రెహ్మానుద్దీన్లు సమర్థవంతంగా నిర్వహించారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షులు లక్ష్మయ్య, కార్యదర్శి మనోహరనాయుడులు మాట్లాడుతూ గ్రంథాలయ సంస్కృతి తిరిగి జనజీవితంలో భాగంగా మారేలా ఈ ఉత్సవాలు దోహదపడతాయి అన్నారు. ఈ సందర్భంగా పిల్లలు తమ అభిప్రాయాలను, చదివిన పుస్తకాల అనుభవాలను పంచుకున్నారు. ముగింపుగా ప్రముఖులంతా పాల్గొని బాలబాలికలకు పుస్తకాలు అందచేయడం, విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.

చిన్నారులను ఆకట్టుకుంటున్న టాయ్ లైబ్రరీ

- జూన్ 10 వరకు ప్రతిరోజు సాయంత్రం 4నుంచి 6 వరకు ప్రవేశం
- ప్రతి శని, ఆదివారాల్లో చిన్నారుల కోసం తెరిచి ఉండే టాయ్ లైబ్రరీ

బెంజిసర్కిల్, మే 21 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల్లో పఠనాశక్తిని పెంచి వారిని గ్రంథాలయాల వైపు ఆకర్షించేందుకు బెంజిసర్కిల్ సర్వోత్తమ భవన్‌లోని సర్వోత్తమ గ్రంథాలయంలో ఏర్పాటుచేసిన టాయ్ లైబ్రరీ ఎంతగానో ఆకట్టుకుంటుంది. ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా గత నెల 23న చిన్నారుల కోసం ఆటల గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఈ గ్రంథాలయం జూన్ 10వరకు ప్రతిరోజు సాయంత్రం 4నుంచి 6 గంటల వరకు, ఆ తర్వాత ప్రతి శని, ఆదివారాల్లో సాయంత్రం 4నుంచి 6 వరకు ఇది పనిచేస్తుంది. చిన్నారులు టాయ్ లైబ్రరీకి వెళ్లి తనకు ఇష్టంవచ్చిన బొమ్మలతో ఆడుకోవచ్చు. ఈగ్రంథాలయంలో 30కి పైగా ఇండోర్ గేమ్స్‌ను అందుబాటులో ఉంచారు. రోజుకు 15ఏళ్ల వయస్సు లోపు వారు 20నుంచి 25 మంది వచ్చి టాయ్ లైబ్రరీని వినియోగించుకుంటున్నారు.



క్యారమ్స్, బొమ్మలతో ఆడుతున్న చిన్నారులు

ఏకాగ్రత, మేథాశక్తి పెరుగుతుంది

చిన్నిచిన్న ఆటల వల్ల చిన్నారుల్లో ఏకాగ్రత, మేధాశక్తి పెరుగుతుంది. తద్వారా వారిలో ఆలోచన పటిమ, గ్రహింపుశక్తి విస్తరిస్తుందని ప్రముఖ పిల్లల వైద్యనిపుణులు శ్రీముఖి అనుమోలు చెప్పారు. సర్వోత్తమ గ్రంథాలయం మినహా జిల్లాలోని ఏగ్రంథాలయంలో కూడా టాయ్ లైబ్రరీ లేదని గ్రంథాలయం కార్యదర్శి డాక్టర్ రావి శారద తెలిపారు.

తీరనున్న కరకట్టవాసుల నీటి కష్టాలు

- రూ.2.8కోట్లతో వాటర్ ట్యాంకు నిర్మాణం
- రెండేళ్లలో నిర్మాణం పూర్తి
- ఎమ్మెల్యే గద్దె చొరవతో పనులు ప్రారంభం



చురుగ్గా సాగుతున్న వాటర్ ట్యాంకు నిర్మాణ పనులు

రాణిగారితోట, ఆంధ్రజ్యోతి: రాణిగారితోట సిమెంట్ గోడౌన్‌లో నిర్మిస్తున్న వాటర్ ట్యాంక్ నిర్మాణంతో రాణిగారితోట కరకట్ట వాసుల నీటి కష్టాలు త్వరలోనే తీరనున్నాయి. రూ.2.8కోట్ల వ్యయంతో చేపట్టిన నిర్మాణ పనులు గత 15రోజుల నుంచి శరవేగంగా జరుగుతున్నాయి. రెండేళ్ల కాలవ్యవధితో చేపట్టిన ఈ నిర్మాణాన్ని కార్పొరేషన్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు, ఈ నిర్మాణం పూర్తయితే 16, 17, 18 డివిజన్లలోని భూపేష్‌గుప్తా నగర్, తారకరామనగర్ కరకట్ట ప్రాంతాలతో పాటు 17వ డివిజన్‌లోని మసీదు వెనుక ఉన్న కొంత ప్రాంతానికి నీటిని అందిస్తారు. ప్రస్తుతం ఇదే ప్రాంగణంలో ఉన్న వాటర్ ట్యాంకుతో 17, 18డివిజన్ వాసులకు మంచినీటి సరఫరా జరుగుతుంది. కరకట్ట వాసులకు మాత్రం 17వ డివిజన్‌లో ఉన్న నివాస్ పార్క్‌లోని బోర్ నుంచి నీటి సరఫరా జరుగుతుంది. ప్రస్తుతం నిర్మాణం జరుగుతున్న వాటర్ ట్యాంక్ పూర్తయితే కరకట్ట వాసులకు ఈ ట్యాంక్ నుంచి పుష్కలంగా నీటిని అందిస్తారు. ఈ నిర్మాణం ప్రారంభంలో స్థానిక ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పాత్ర ఎంతో కీలకం, అధికారులతో ఎప్పటికప్పుడు సంప్రదిస్తున్న ఆయన ఈ నిర్మాణాన్ని ముందుకు నడిపిస్తున్నారు.

నీళ్లకు ఇబ్బంది ఉండదు

వాటర్ ట్యాంక్ నిర్మాణం పూర్తయితే తారకరామానగర్‌లో నీటి అవసరాలు తీరతాయి. చాలా కాలం నుంచి ఈ ప్రాంతానికి బోర్ ద్వారా నీటి సరఫరా అవుతుంది. ఇక్కడి నీటి అవసరాలు కోసం ట్యాంక్ నిర్మించడం ఎంతో అవసరం. త్వరగా పూర్తిచేయాలి. ఈ ప్రాంత అభివృద్ధికి ఏం చేయాలనే అంశాలు ఎమ్మెల్యే దృష్టిలో ఉన్నాయి.

-కొప్పుల శ్రీనివాస్

మూడు డివిజన్లకు నీటి సరఫరా

ఈ ట్యాంకు నిర్మాణం పూర్తయితే మూడు డివిజన్లలోని వేలాది మందికి మంచి నీటి సరఫరా జరుగుతుంది. ఎటువంటి ఆటంకాలు కలగకుండా నిర్మాణం పూర్తి కావాలని కోరుకుంటున్నాం. డివిజన్‌లో ఉన్న యూజీడీ సమస్యకు కూడా త్వరలోనే ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పరిష్కారం చూపుతారు.

- కొక్కెర తిరుపతయ్య

హనుమజ్జయంతికి సర్వంసిద్ధం

మాచవరం దాసాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు

గుణదల, మే 21 (ఆంధ్రజ్యోతి): మాచవరం దాసాంజనేయ స్వామి ఆలయంలో గురువారం హనుమజ్జయంతిని పురస్కరించుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారిణి పాతూరి లోకేశ్వరి తెలిపారు. మాచవరం దాసాంజనేయ స్వామి ఆలయంలో దేవదాయశాఖ ఆదేశాల మేరకు ఈనెల 21 నుంచి 26 వరకు హనుమజ్జయంతిని పురస్కరించుకుని అత్యంత వైభవంగా ఉత్సవాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం విష్వక్సేన పూజ అంకురార్పణ, పుణ్యాహవచనం, దీక్షావస్త్ర సమర్పణ, రక్షాభందనం స్వామివారి ఉత్సవ విగ్రహానికి విశేష పూజ, తీర్థ ప్రసాదవినియోగం చేశారు. చివరగా ఈ నెల 26న సోమవారం ఉదయం 11 గంటలకు అన్న ప్రసాద వితరణ జరగనుందని తెలిపారు. సాయంత్రం 6గంటలకు ప్రత్యేకంగా అలంకరించిన ఒంటె వాహనంపై, సన్నాయి మేళతాళాల నడుమ స్వామివారి గ్రామోత్సవం ఉంటుందని ఈవో పాతూరి లోకేశ్వరి తెలిపారు.

కొరెన్నీనగర్ దాసాంజనేయ స్వామి ఆలయంలో.

భారతీనగర్: కొరెన్నీనగర్ దాసాంజనేయ స్వామి ఆలయంలో గురువారం ఆలయ, శ్రీరామభక్త సేవాసమితి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు శ్రీరామ భక్త సేవాసమితి కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి స్వామికి పంచామృత అభిషేకాలు, సహస్ర నామ ఆకు పూజ, మంత్ర పుష్పార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని తెలిపారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో హనుమాన్ చాలీసా 108సార్లు పారాయణం చేస్తామని పేర్కొన్నారు.

టీడీపీ కంచుకోట 'తూర్పు'

● ఆ ఘనత గద్దె రామ్మోహన్‌దే ● టీడీపీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం, ఎంపీ శివనాథ్ ● వైభవంగా తూర్పు నియోజకవర్గం మినీ మహానాడు



తూర్పు మినీమహానాడు సభలో ప్రసంగిస్తున్న టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టె రఘురాం

బెంజిసర్కిల్, మే 21 (ఆంధ్రజ్యోతి): తూర్పు నియోజకవర్గాన్ని తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా మర్చిన ఘనత హ్యాట్రిక్ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌కు దక్కిందని టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. తూర్పు నియోజకవర్గం మినీ మహానాడు బుధవారం సాయంత్రం బెంజిసర్కిల్ సమీపంలోని జ్యోతి కన్వెన్షన్ హాలులో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అధ్యక్షత జరిగింది. అతిథిగా హాజరైన నెట్టెం రఘురాం మాట్లాడుతూ మహానాడు అంటే తెలుగుదేశం పండుగని, పార్టీ స్థాపించిన్పటి నుంచి నేటి వరకు ప్రతి ఏడాది క్రమం తప్పకుండా మహానాడు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ప్రజాస్వామ్యయుతమైన రాజకీయాల్లో అత్యంత దారుణమైన పాలనను గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చూశామన్నారు. ఎంపీ కేశినేని శివనాథ్ అతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ ఎమ్మెల్యే గద్దె తన నియోజకవర్గంలో చేస్తున్న సేవా, సహాయ కార్యక్రమాలు చూసి తాను స్ఫూర్తి పొందానన్నారు. గత వైసీపీ హయాంలో టీడీపీ నేతలు పట్టాభిరామ్, చెన్నుపాటి గాంధీతోపాటు కృష్ణలంకలోని పార్టీ నాయకులపై వైసీపీ నేతలు దాడిచేశారని ఆయన గుర్తు చేశారు. తిరువూరు మున్సిపల్ చైర్మన్ ఎన్నికల సందర్భంగా వైసీపీ నేతలు చేసిన దౌర్జన్యాలకు టీడీపీ కార్యకర్తలు గట్టిగా సమాధానం చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌తో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీకి బలం 'పశ్చిమ' నియోజకవర్గం

● పశ్చిమ నియోజకవర్గ మినీ మహానాడులో ఎంపీ కేశినేని శివనాథ్



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్

విద్యాధరపురం, మే 21 (ఆంధ్రజ్యోతి): విజయవాడ పశ్చిమ నియోజకవర్గం టీడీపీకి బలమైన నియోజకవర్గం కావటం వల్ల తాను అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిచానని విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. తూర్పు నియోజకవర్గం నుంచి పశ్చిమ నియోజకవర్గానికి తన ఓటును మార్చుకున్నట్టు తెలిపారు. బుధవారం రాత్రి భవానీపురం ఊర్మిళానగర్‌లోని ఓ కల్యాణమండపంలో విజయవాడ పశ్చిమ నియోజకవర్గ స్థాయి మినీ మహానాడు జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని చిన్ని మాట్లాడుతూ నియోజకవర్గం పార్టీకి బలమైన నియోజకవర్గం కావటానికి తెలుగు తమ్ముళ్లే కారణమన్నారు. రొటేషన్ పద్ధతుల్లో పార్టీకోసం కష్టపడ్డ వారందరికీ పదవులు వచ్చేలా కృషి చేస్తానని తెలిపారు. కడపలో జరగనున్న మహానాడుకు నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున నేతలు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని సూచించారు. తొలుత పలువురు నేతలు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పశ్చిమలోని ప్రధాన సమస్యల పరిష్కారానికి పలు తీర్మానాలు చేసి ఆమోదించారు. ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ రాకేష్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా పాల్గొన్నారు.


దేశ రాజకీయాలనే ప్రభావితం చేసిన టీడీపీ

తిరువూరు మినీ మహానాడు సభలో ఎంపీ చిన్ని



మినీమహానాడులో ప్రసంగిస్తున్న ఎంపీ చిన్ని

తిరువూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీ దేశ రాజకీయాలపై తీవ్ర ప్రభావితం చూపిందని, ముఖ్యమంత్రి చంద్రబాబు అమలు చేస్తున్న ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను పలు రాష్ట్రాలు అనుసరిస్తున్నాయని, విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. బుధవారం ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అధ్యక్షతన నియోజవర్గం మినీమహానాడు ఒక ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించగా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టం రఘురామ్ పార్టీజెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి మినీ మహానాడును ప్రారంభించారు. పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, పార్టీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్, ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుతో పాటు పలువురు పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.







సుసంపన్న ఆరోగ్యాంధ్ర లక్ష్యం

● 21 నుంచి జూన్ 21 వరకు ఊరూ వాడా యోగాంధ్ర మాసోత్సవాలు
● కనీసం 2కోట్ల మందిని భాగస్వామ్యం చేసేలా ఉత్సవాలు
● రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు

విద్యాధరపురం, మే 21 (ఆంధ్రజ్యోతి): సుసంపన్న, ఆరోగ్య, ఆనందమయ ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఆవిష్కరించిన స్వర్ణాంధ్ర విజన్ ఎట్ 2047 సాకారం దిశగా ఈనెల 21 నుంచి జూన్ 21 వరకు యోగాంధ్ర పేరుతో ప్రత్యేక ప్రచార, జనజాగృతి నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (వైద్య ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం) ఎం.టి.కృష్ణబాబు తెలిపారు. కృష్ణానదీ తీరాన హరిత బెరంపార్కు - పున్నమీఘాట్‌లో ఎన్టీఆర్ జిల్లా అధికారులు, వీఎంసీ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన యోగాంధ్ర మాసోత్సవాల ప్రారంభంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణబాబు మాట్లాడుతూ భారతీయ ప్రధాన మంత్రి చొరవ, ఐరాస తీర్మానంతో తొలిసారిగా 2015, జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాలు జరిగాయని, ఈ ఏడాది విశాఖలో జరిగే 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ప్రధాని రానున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి మార్గనిర్దేశనంతో నెల పాటు ఊరూ వాడా ప్రత్యేక ప్రచారం నిర్వహించనున్నట్టు తెలిపారు. దాదాపు 2కోట్ల మందిని భాగస్వాములను చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు.

45 నిమిషాల కామన్ యోగా ప్రొటోకాల్

నిపుణులు రూపొందించిన 45 నిమిషాల నిడివి గల కామన్ యోగా ప్రొటోకాల్ ఆధారంగా ఔత్సాహికులకు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందజేయనున్నామని కృష్ణబాబు తెలిపారు. వారి ద్వారా ప్రతి గ్రామం, వార్డులో ప్రజలకు యోగాభ్యాసనతో శారీరక, మానసిక ఆరోగ్యానికి కలిగే ప్రయోజనాలపై అవగాహనతో పాటు అభ్యాసన చేయించడం జరుగుతుందన్నారు. ఇందుకు వీలుగా ప్రత్యేక యాప్, పోర్టల్ అందుబాటులో ఉందన్నారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర సాకారం దిశగా యోగాంధ్ర ఓ గొప్ప ముందడుగని అన్నారు. గ్రామ, వార్డు సచివాలయాలతో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, బాపూ మ్యూజియం, కొండపల్లి ఖిల్లా, గాంధీ హిల్ వంటి చారిత్రక, పర్యాటక ప్రాంతాల్లోనూ యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. ఆయుష్ డైరెక్టర్ కే దినేష్ కుమార్ మాట్లాడుతూ సీఎం ఆదేశాలకు అనుగుణంగా యోగా విశిష్టతను రాష్ట్రం నలుమూలలా వ్యాప్తి చెందేలా యోగాంధ్ర ప్రచారం నిర్వహించనున్నట్టు మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ నేటి ఆధునిక జీవన శైలిలో ఫిట్‌నెస్‌ను పెంపొందించుకోవడం సవాలుగా మారిందని, ఈ నేపథ్యంలో ఒత్తిడిని అధిగవించి రోజువారీ జీవితంలో వెలుగులు నింపుకునేందుకు ప్రతి ఒక్కరూ రోజూ కనీసం అరగంట యోగాభ్యాసాలు, ధ్యానం చేయాలని సూచించారు. విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, వీఎంసీ అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్, జిల్లా ఆయుష్ శాఖ అధికారి డాక్టర్ రామ త్లేహి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

హత్య కేసులో యావజ్జీవ ఖైదు

» ఎలమంచిలి వద్ద లారీ డ్రైవర్‌ను చంపేసిన క్లీనర్ » ఇద్దరిదీ విజయవాడ
» నేరం రుజువు కావడంతో తీర్పు వెలువరించిన విశాఖ రెండో అదనపు జిల్లా న్యాయమూర్తి

ఎలమంచిలి (అనకాపల్లి జిల్లా), మే 21 (ఆంధ్రజ్యోతి): లారీ యజమాని కమ్ డ్రైవర్ హత్య కేసులో ముద్దాయి క్లీనర్‌కు జీవిత ఖైదుతోపాటు రూ.10వేల జరిమానా విధిస్తూ విశాఖలోని రెండో అదనపు జిల్లా న్యాయమూర్తి సీకే గాయత్రి బుధవారం తీర్పు చెప్పారని పట్టణ ఎస్ఐ సావిత్రి తెలిపారు. విజయవాడకు చెందిన పాశం మల్లికార్జునరావు (40)కు సొంతంగా లారీలున్నాయి. డ్రైవర్‌గా కూడా వెళుతుంటాడు. విజయవాడకే చెందిన పిండి నాగరాజు అనే వ్యక్తి క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. 2015 నవంబరు 15న మల్లికార్జునరావు పెయింట్ లోడ్‌తో పశ్చిమబెంగాల్‌లోని సిలిగురి వెళ్లాడు. సరకు అన్‌లోడ్ చేశాక కోల్‌కతా వచ్చి, టీ పొడి లోడు ఎక్కించుకుని బెంగళూరుకు బయలుదేరారు. దారిలో ఒకచోట నాగరాజు మద్యం సేవించడంతో మల్లికార్జునరావు మందలించాడు. నవంబరు 30న తెల్లవారుజామున ఎలమంచిలి సమీపంలోని ఎర్రవరం చేరుకున్నారు. బడలికగా వుండడంతో మల్లికార్జునరావు నిద్రకు ఉపక్రమించాడు. తనను మందలించాడని కక్ష పెట్టుకున్న నాగరాజు.. జాకీ రాడ్‌తో మల్లికార్జునరావు తలపై బలంగాకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. తర్వాత మల్లికార్జునరావు జేబులోని రూ.4,300, సెల్‌ఫోన్ తీసుకుని, మృతదేహాన్ని సమీపంలోని కాలువలో పడేసి లారీతోసహా పరారయ్యాడు. లారీని బెంగళూరు తీసుకెళ్లి, సరకు అప్పగించి కిరాయి తీసుకున్నాడు. ఎర్రవరం సమీపంలో మృతదేహం పడివున్నట్టు అప్పటి వీఆర్వో జె.చిరంజీవిరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తండ్రి కనిపించడం లేదంటూ మల్లికార్జునరావు కుమారుడు చంద్రశేఖర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎలమంచిలి స్టేషన్‌లో నమోదైన కేసులో మృతదేహం మల్లికార్జునరావుదేనని గుర్తించారు. పోలీసులు విచారణలో పిండి నాగరాజు హత్య చేసినట్టు తెలింది. దీంతో అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అప్పటి సీఐ వెంకటరావు కేసు దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో ఛార్జిషీటు దాఖలు చేశారు. విశాఖపట్నం 2వ అదనపు జిల్లా కోర్టులో కేసు విచారణ జరిగింది. పోలీసుల తరపున ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాండ్రేగుల జగదీశ్వరరావు వాదించారు. నాగరాజుపై అభియోగం రుజువు కావడంతో ముద్దాయికి యావజ్జీవ కారాగార శిక్ష విధించారు.

అమరావతి మహిళలకు న్యాయం చేస్తాం

● జగన్ హయాం దాడులపై విచారణ చేపడతాం
● రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శైలజ

గుంటూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): రాజధాని ఉద్యమంలో ఉన్న మహిళలపై గత జగన్ ప్రభుత్వ హయాంలో జరిగిన దాడులపై విచారణ చేపడతామని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ చెన్నారు. జాతీయ మహిళా కమిషన్ వద్ద పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను విచారించి, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. గుంటూరు జిల్లా నంబూరులోనీ జేఎంజే శక్తి సదన్, గుంటూరు మహిళా ప్రాంగణంలోని శక్తి సదన్, వన్ స్టాప్ సెంటర్లను బుధవారం ఆమె సందర్శించారు. మౌలిక వసతులను పరిశీలించారు. శక్తి సదన్‌లో వసతి పొందుతున్న మహిళలతో మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శైలజ విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో దాడులకు, అన్యాయానికి గురైన మహిళలకు భరోసా, భద్రత కల్పించి.. వారికి న్యాయం చేయడమే రాష్ట్ర మహిళా కమిషన్ ప్రధాన అజెండా అని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కమిషన్ సెక్రటరీ బి.వసంత బాల, గుంటూరు జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరక్టర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

25న ప్రిలిమ్స్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

● 10,381 మంది అభ్యర్థులకు 25 కేంద్రాల ఏర్పాటు: ఎన్టీఆర్ కలెక్టర్ లక్ష్మీశ



సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న ఎన్టీఆర్‌జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, మే 21 (ఆంధ్రజ్యోతి): యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ఈనెల 25న దేశవ్యాప్తంగా సివిల్ సర్వీస్ ప్రిలిమినరీ పరీక్షను విజయవంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లో యూపీఎస్సీ ప్రిలిమ్స్ నిర్వహణకు చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. జిల్లాలో 25 కేంద్రాల్లో 10,381 మంది అభ్యర్థులు పరీక్ష రాసేందుకు ఏర్పాట్లు చేయాలని, ఆహ్లాదకర రమైన వాతావరణంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్ష రాసేలా ఏర్పాట్లు ఉండాలన్నారు. ఈనెల 25న ఆదివారం ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గంటల వరకు రెండు సెషన్లలో పరీక్ష జరుగనుందన్నారు. లోకల్ ఇన్‌స్పెక్టింగ్ కమ్ లైజన్ ఆఫీసర్, రూట్ అధికారులు, సూపర్‌వైజర్లు, స్ట్రాంగ్ రూమ్ భద్రతా సిబ్బందిని నియమించినట్టు వెల్లడించారు. రెవెన్యూ, పోలీసు, వైద్య ఆరోగ్యం, విద్యుత్, ఏపీఎస్ ఆర్టీసీ, మున్సిపల్ శాఖల అధికారుల సమన్వయంతో పరీక్షను విజయవంతంగా నిర్వహించనున్నట్టు కలెక్టర్ తెలిపారు. డీఆర్వో ఎం.లక్ష్మీ నరసింహం, ఆర్‌డీవో కావూరి చైతన్య, నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణ, తిరువూరు ఆర్డీవో కె.మాధురి, కలెక్టరేట్ కో-ఆర్డినేషన్ విభాగం సూపరింటెండెంట్ సలీమ్, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, లైజనింగ్ అధికారులు, సహాయ లైజనింగ్ అధికారులు, వెన్యూ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఉచితంగా పండ్ల తోటల పెంపకం

ఉపాధి హామీ పథకం ఆసరాతో ఉచితంగా పండ్ల తోటల పెంపకాన్ని చేపట్టవచ్చని, దీనిపై రైతులకు అవగాహన కల్పించి, సద్వినియోగం చేసుకొనేలా ప్రోత్సహించాలని కలెక్టర్ లక్ష్మీశ జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆయన ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటల పెంపకంతో పాటు పశుగ్రాసం పెంపకానికి సంబంధించిన సమాచారంతో కూడిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్నదాతలను ఉపాధి హామీ పథకం ద్వారా ఉచితంగా ఉద్యాన పంటల సాగు చేపట్టేలా చేయిపట్టి నడిపించాలన్నారు. మామిడి, జామ, నిమ్మ, సపోట, దానిమ్మ, డ్రాగన్‌ఫ్రూట్, కొబ్బరి, ఆయిల్‌పామ్, యాపిల్ బేర్, మునగ, మల్లి, గులాబి తోటల పెంపకానికి సన్న - చిన్న కారు రైతులు (ఐదెకరాల లోపు) అర్హులన్నారు. ఉదాహరణకు మామిడికి ఎకరానికి వివిధ రూపాల్లో రూ.1,09,950 సాయమందుతుందన్నారు. జామకు రూ.1,46,971, ఎకరంలో 1,600 మల్లెమొక్కల పెంపకానికి దాదాపు రూ.1,85,396 సహాయం అందించడం జరుగుతుందన్నారు. పశువులు కలిగిన సొంత భూమి ఉన్న సన్న, చిన్నకారు రైతులు పశుగ్రాసం పెంపకాన్ని చేపట్టవచ్చని, 0.50 ఎకరాలో పశుగ్రాసం పెంపకానికి రూ.32,992 ఖర్చవుతుందని అంచనా. వివిధ పనులకు ఈ మొత్తం మెటీరియల్ లేదా వేజ్ కాంపొనెంట్‌గా అందిస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ, వితంతు, విభిన్న ప్రతిభావంతులైన రైతులకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, 10 నుంచి 50 సెంట్ల వరకు లబ్ధి చేకూర్చడం జరుగుతుందన్నారు. ఈ ప్రయోజనాలను పొందేందుకు ఎంపీడీవో లేదా ఉపాధి హామీ ఏపీవో లేదా గ్రామ సచివాలయ ఉద్యాన అసిస్టెంట్, అగ్రికల్చర్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్‌లను సంప్రదించవచ్చని కలెక్టర్ సూచించారు. డ్వామా పీడీ ఎ.రాము, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, జిల్లా ఉద్యాన అధికారి పి.బాలాజీకుమార్, ఏడీఏ అనిత, డ్వామా జిల్లా ప్లాంటేషన్ మేనేజర్ కె.ఉష తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే

అగ్ని ప్రమాదాల నివారణ

● ఏపీ విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ డైరెక్టర్ జనరల్ మాదిరెడ్డి ప్రతాప్

వన్‌టౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ఎక్కువగా జరిగే అగ్ని ప్రమాదాలను నివారించేందుకు ప్రజలు భాగస్వామ్యం కావాలని ఏపీ విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ డైరెక్టర్ జనరల్ మాదిరెడ్డి ప్రతాప్ పిలుపు నిచ్చారు. అగ్నిమాపక సేవలు, విపత్తు స్పందన రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పెద్ద పెద్ద నగరాల్లోని ఓల్డ్ సిటీలుగా పేర్కొనే ప్రాంతాల్లో అనుకోని అగ్ని ప్రమాదం సంభవించే పరిస్థితులు అధికంగా ఉంటాయన్నారు. రహదారులు ఇరుకుగా ఉండటం, షాపులు, ఆపై అంతస్తుల్లో నివాసాలుండటం, ఇలా అనేక కారణాలు ఇబ్బందికరంగా మారతాయన్నారు. తాజాగా హైదరాబాద్ చార్మినార్ వద్ద జరిగిన అగ్నిప్రమాదాన్ని మృతుల సంఖ్య అధికంగా ఉండటాన్ని ఆయన ప్రస్తావిస్తూ ఎన్నో లోపాలున్నాయని తెలిపారు. విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి వంటి పెద్ద పట్టణాలలో సరైన జాగ్రత్తలు తీసుకోకుండా నిర్మాణాలు చేయటం వల్ల అగ్ని ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించారు. శ్రీకాకుళంలో షాపింగ్ మాల్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో అగ్నిమాపక సిబ్బంది లోపలకు వెళ్లటానికి 6 గంటలు పట్టిందన్నారు. లోపలున్న దుస్తులు కాలటంతో అధిక పొగ కమ్మేసిందని, చాలా మంది ఊపిరి ఆడక ఇబ్బంది పడ్డారన్నారు. ఈ పరిస్థితి ఇతర ప్రాంత భవనాల్లో కూడా సంభవించకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి అపార్టుమెంట్‌కు ఎన్‌వోసీ ఇచ్చే సమయంలోనే ఏర్పాట్లను పరిశీలిస్తామన్నారు. డైరెక్టర్ డి.మురళీ మోహన్, అదనపు డైరెక్టర్ టి.ఉదయకుమార్, అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ కె.వినయ్, పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు శనివారంలోపు దరఖాస్తు చేసుకోవాలి

భారతీనగర్, మే 21 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో 2025-26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు పొందటానికి ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తామని ఐటీఐ ప్రధానాధికారి, కన్వీనర్ ఎం కనకారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్ సైట్‌లో శనివారంలోపు దరఖాస్తులను పూర్తి చేసుకోవాలన్నారు. 8తి, 10వ తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 94906 39639 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.



పిడుగు పాటుకు గురైన జామియా మసీదు

జామియా మసీదుపై పిడుగుపాటు

● స్వల్పంగా ధ్వంసమైన మీనార్

జగ్గయ్యపేట, మే 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో బుధవారం ఉదయం ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షం కురిసింది. పట్టణ పరిసర ప్రాంతాల్లో పలుచోట్ల పిడుగులు పడ్డాయి. పేట నడిబొడ్డున రాజీవ్ చౌక్‌లోని జామియా మసీదుపై పిడుగుపడి మీనార్‌కు ఉన్న చంద్రవంకపై పడి స్వల్పంగా బీటలు వారింది. భారీ శబ్దం రావటంతో ఆ ప్రాంత వాసులు ఉలిక్కిపడ్డారు.

వాణిజ్య ప్రాంతం కావటంతో కొద్దినష్టంతోనే ప్రమాదం తప్పిపోవటంతో ఆ ప్రాంత వాసులు ఊపిరి పీల్చుకున్నారు.

అదనపుకట్నం కోసం భార్య హత్య

● ఆపై రోడ్డు ప్రమాదంగా చిత్రీకరణ
● భర్తకు యావజ్జీవ శిక్ష విధించిన కోర్టు
● నిందితుడిది పెనుగంచిప్రోలు

జగ్గయ్యపేట, మే 21 (ఆంధ్రజ్యోతి): వరకట్నం కోసం భార్యను వేధించటమే కాకుండా, హత్య చేసిన సంఘటనలో పెనుగంచిప్రోలుకు చెందిన వ్యక్తికి కోర్టు మంగళవారం యావజ్జీవ శిక్ష విధించింది. జగ్గయ్యపేట సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం 2016 ఏప్రిల్‌లో సర్కిల్ పరిధిలో పెనుగంచిప్రోలుకు చెందిన జిడుగు రాణిని భర్త వెంకటనారాయణతో పెద్దల కుదిర్చిన వివాహం జరిగింది. వివాహానంతరం భర్త వెంకట నారాయణ వేరే మహిళతో ఫోన్‌లో మాట్లాడుతుండటంతో పాటు శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడని తండ్రి దేవరకొండ బ్రహ్మంకు తెలియజేయగా పలుసార్లు సర్దిచెప్పి సరిగా చూసుకోవాలని అల్లుడు, కుటుంబసభ్యులకు చెప్పారు. తర్వాత 2 నెలలకు వెంకటనారాయణ తండ్రి శ్రీనివాసరావు బ్రహ్మానికి ఫోన్ చేసి బంధువుల ఇంటికి తిరిగి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్టు చెప్పాడు. జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రికి వచ్చి కుమార్తె రాణిని మృతదేహాన్ని చూసి గొంతు మీద నులిమినట్టు గుర్తులు, కుడి ముక్కురంధ్రం నుంచి రక్తస్రావమైనట్టు గుర్తులు, కుడి తొడపై గీసుకుపోయిన దెబ్బలు ఉండటంతో హత్యని జగ్గయ్యపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి సీఐ వైవీఎల్ నాయుడు హత్యకేసుగా నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రాసిక్యూషన్ వెంకటనారాయణ రాణిని హత్య చేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించాడని తగు సాక్ష్యాధారాలతో నిరూపించటంతో నందిగామ 16వ అదనపు కోర్టు హత్య చేసినందుకు జీవిత ఖైదు, రూ.5వేలు జరిమానా, వరకట్నం కోసం వేధించినందుకు 3ఏళ్ల జైలు, రూ.5వేల జరిమానా, తప్పుడు సమాచారం ఇచ్చినందుకు, సాక్ష్యాలను అదృశ్యం చేసేందుకు యత్నించినందుకు సెక్షన్ 201 కింద 3ఏళ్ల జైలు, రూ.5వేలు జరిమానా విధించిందని సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

అన్నదాత సుఖీభవ విధివిధానాలు ప్రకటించాలి

● ఏపీ కౌలు రైతు సంఘం

గవర్నర్‌పేట, మే 21 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకంపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వడంతో పాటు విధివిధానాలు ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం హరిబాబు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మంత్రివర్గ సమావేశంలో అన్నదాత సుఖీభవపై స్పష్టమైన ప్రకటన ప్రభుత్వం నుంచి రాలేదని, కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తేనే పథకం ఇవ్వనున్నట్టు ప్రచారం జరుగుతోందన్నారు. కేంద్రం మూడు విడతలుగా భూమి కలిగిన రైతులకు రూ. 6 వేలు చొప్పున జమ చేస్తోందని, కౌలు రైతులకు పథకం వర్తింపజేయడం లేదని తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకం కౌలు రైతులకు వర్తింపజేసేలా ప్రభుత్వ విధివిధానాలు ఉండాలని, వ్యవసాయ సీజన్ ప్రారంభమౌతున్న తరుణంలో వ్యవసాయ పెట్టుబడుల కోసం రూ. 20 వేలు ఒకే సారి రైతుల ఖాతాల్లో జమచేయాలని డిమాండ్ చేశారు. భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా గ్రామ సభల ద్వారా కౌలు రైతులను గుర్తించాలని, గుర్తించిన ప్రతి కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం వర్తింపజేయాలని కోరారు.

నవ్య
కుటుంబ కదంబం

కౌన్సెలింగ్

అవి బంగారు ఘడియలు

డాక్టర్! నాకు తొమ్మిదో నెల. పుట్టబోయే బిడ్డకు పాలు పట్టించే విషయంలో నాకెన్నో అనుమానాలున్నాయి. ప్రసవించిన వెంటనే బిడ్డకు రొమ్ము పాలను పట్టించకూడదనీ, వాటిని పిండేయాలనీ పెద్దలు అంటున్నారు. ఇదెంతవరకూ నిజం?

- ఓ సోదరి, హైదరాబాద్

బిడ్డ పుట్టిన తొలి 60 నిమిషాలు బంగారు ఘడియల్లాంటివి. పాలు పట్టించడానికి అవెంతో కీలకమైన ఘడియలని ప్రపంచ ఆరోగ్య సంస్థ, యునిసెఫ్‌లు గుర్తించాయి. ఒక ల్యాక్టేషన్ కన్సల్టెంట్‌గా అది ఎలాంటి ప్రసవమైనా, బిడ్డ పుట్టిన అరగంటలోపే పాలు పట్టించడంలో నేను తల్లులకు సహాయపడుతూ ఉంటాను. తల్లిపాలలో ఎంతో విలువైన కొలస్ట్రమ్ అనే పదార్థం ఉంటుంది. దీన్ని ద్రవ రూప బంగారంగా పేర్కొంటూ ఉంటారు. బిడ్డ వ్యాధినిరోధకశక్తి బలపడడానికి కొలస్ట్రమ్ తోడ్పడుతుంది. సిజేరియన్ సర్జరీతో బిడ్డను కన్న తల్లులకు ఫుట్‌బాల్ హోల్డ్ భంగిమలో తల్లిపాలు పట్టించమని నేను సూచిస్తాను. దీంతో బిడ్డకు సౌకర్యంగా పాలు పట్టించే వీలుంటుంది. అలాగే సాధారణ ప్రసవమైన పిల్లలకు పాలు పట్టించడం కోసం, క్రాస్ క్రేడిల్, హోల్డ్ భంగిమలను అనుసరించాలి. అలాగే పిల్లలు పాలు తాగిన తర్వాత తప్పనిసరిగా త్రేన్పు వచ్చేలా చూసుకోవాలి.



తొలి గంట పాలల్లో...

- **వ్యాధినిరోధకశక్తి:** తొలి పాలల్లోని కొలస్ట్రమ్‌లో యాంటీబాడీలు, వ్యాధినిరోధక కణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఇన్‌ఫెక్షన్ల నుంచి బిడ్డకు సత్వర రక్షణ కల్పిస్తాయి. అలాగే బిడ్డ వ్యాధినిరోధకశక్తి బలపడడానికి తోడ్పడతాయి
- **అనుబంధం:** రొమ్ముపాలతో తల్లికీ, బిడ్డకూ మధ్య అనుబంధం బలపడుతుంది. పాలివ్వడం ద్వారా తల్లి శరీరంలో విడుదలయ్యే ఆక్సిటోసిన్ హార్మోన్ గర్భాశయం కుంచించుకుపోవడానికీ, రక్తస్రావం తగ్గడానికీ తోడ్పడుతుంది
- **సౌకర్యం:** తొలి గంటలో పాలు తాగిన పిల్లలు, తర్వాతి కాలంలో పాలు తాగడంలో ఇబ్బందులను ఎదుర్కొనే అవకాశం ఉండదు. అలాగే తల్లుల్లో పాల ఉత్పత్తి ప్రేరేపితమవుతుంది
- **బిడ్డ ఆరోగ్యం:** తల్లి పాలు, బిడ్డ రక్తంలోని చక్కెర, శరీర ఉష్ణోగ్రత, గుండె కొట్టుకునే వేగాలను స్థిరపరుస్తాయి
- **పేగుల ఆరోగ్యం:** కొలస్ట్రమ్ సహజసిద్ధమైన విరోచనకారి. బిడ్డ తొలి విసర్జకాన్ని సులభంగా విసర్జించడానికి ఇది సహాయపడుతుంది. అలాగే దీంతో కామెర్ల ముప్పు తప్పుతుంది. బిడ్డ పేగుల్లో ప్రయోజనకరమైన బ్యాక్టీరియాను వృద్ధి చేస్తుంది.

డాక్టర్ కుడిపూడి ఊహ, ల్యాక్టేషన్ కన్సల్టెంట్,
మెడికవర్ విమెన్ అండ్ చైల్డ్ హాస్పిటల్, హైదరాబాద్

కలలను నిజం చేసేలా...

లక్ష్యం తెలుసు... కానీ దాన్ని చేరుకోవడంలో తడబడుతుంటాం. కలలు కంటాం... వాటిని నెరవేర్చుకొనే మార్గం తెలియక ఇబ్బందులు పడుతుంటాం. నైపుణ్యం ఉండి... సాధించగల సామర్థ్యం ఉండి... ఎక్కడో వెనకపడిపోతాం. ఇలాంటి అవరోధాలను దాటించి... ప్రేరణ కల్పించి... జీవితంలో ముందడుగు వేయించేవారే లైఫ్ కోచ్ అంటారు మధులిక అప్పసాని. అవార్డులందుకున్న లైఫ్ కోచ్‌గా వందల మందికి తమ లక్ష్యాలు, కలలను సాకారం చేసుకోవడంలో దోహదపడిన ఆమె... 'నవ్య'తో ముచ్చటించారు.



"ఒకప్పుడు లైఫ్ కోచింగ్ అంటే చాలామందికి తెలియదు. కానీ ఇప్పుడు అత్యంత డిమాండ్ ఉన్న రంగంగా ఎదుగుతోంది. ముఖ్యంగా కరోనా తరువాత దీని అవసరం బాగా పెరిగింది. నేను కొవిడ్ ముందు 2019 నుంచి లైఫ్ కోచ్‌గా పని చేస్తున్నా. కొవిడ్‌వల్ల ఆన్‌లైన్ తరగతులు, ఉద్యోగాలతో ఇంట్లోనే అధిక సమయం గడపడంవల్ల శారీరకంగానే కాదు, మానసికంగానూ చాలామంది గడ్డు పరిస్థితులను ఎదుర్కొన్నారు. వాటి నుంచి బయటకు రావడానికి లైఫ్ కోచ్‌లను ఆశ్రయించడం అధికమైంది. ఇదీ సైకాలజీలో ఒక భాగమే. కానీ సైకాలజీ కాదు. అంటే స్పోర్ట్స్ కోచింగ్ లాగా. ఒత్తిడి, మానసిక ఆందోళనలు, గాయాల నుంచి బయటకు రావాలనుకొంటే అది సైకాలజీకి సంబంధించింది. అలాగే భార్యాభర్తలు, కుటుంబ సభ్యుల మధ్య సంబంధాల్లో సమస్యలు వచ్చినా సైకాలజిస్టులను సంప్రతిస్తారు. కానీ లైఫ్ కోచ్‌లుగా మేము... చేసే పనికి, జీవితానికి మధ్య సమతుల్యత ఉండేలా కృషి చేస్తాం. సమయం, శక్తిసామర్థ్యాల నిర్వహణ (టైమ్, ఎనర్జీ మేనేజ్‌మెంట్) చూస్తాం. భావాలను, ఆలోచనలను స్పష్టంగా, సులభంగా ఎలా పంచుకోవాలనేది చెబుతాం. చిన్న చిన్న లక్ష్యాలను నిర్దేశించి, తద్వారా అసలైన లక్ష్యాన్ని చేరుకొనేలా ప్రేరణ నిచ్చి, ఒక ప్రణాళికను రూపొందిస్తాం.

వారి లక్ష్యానికి మా భరోసా...

నా దగ్గరకు వచ్చే క్లయింట్ తన కలను నా ముందు పెడతాడు. అతడి కలను సాకారం చేయాల్సిన బాధ్యత నాది. ఇక్కడ ఒక ఉదాహరణ చెబుతా. నాకు ఒక క్లయింట్ ఉంది. కంపెనీ టర్నోవర్‌ను 25 కోట్ల నుంచి 100 కోట్లకు పెంచాలనేది తన లక్ష్యం. కానీ 'ఇది నావల్ల కాదు' అనే అపనమ్మకం ఆమె మెదడులో పాతుకుపోయింది. తనకు అంతటి సామర్థ్యం లేదనుకొంటుంది. ఇక్కడ సమస్య ఏంటంటే... మనం కొన్నిసార్లు ఆత్మవిమర్శ చేసుకొంటూ ఎదిగేస్తాం. వేరొకరితో పోల్చుకొంటూ, అందులోనే ప్రేరణ వెతుక్కొనే ప్రయత్నం చేస్తాం. కానీ ఒక స్థాయికి వెళ్లాక పోల్చుకోవడానికి ఆ స్థాయిలో మన చుట్టూ ఎవరూ ఉండరు. ఆమె విషయంలో అదే జరిగింది. ఆమె సర్కిల్‌లో తనకంటే శక్తిమంతమైన మహిళలు ఎవరూ లేరు. అలాంటప్పుడు ఆత్మవిమర్శ, పోలిక పని చేయవు. కనుక ఆమె మదిలో మెదిలే ఆలోచనల మీద దృష్టి పెట్టి, సమయపాలన, రోజువారీ కార్యక్రమాల జాబితాను క్రమపద్ధతిలో పెట్టాం. అన్నిటినీ బేరీజు వేసుకొని, వేరొకరితో పోల్చుకోకుండా... లక్ష్యం నుంచి వెనక్కి పోకుండా... అనుకున్నది ఎలా సాధించగలదనే విషయంపై ఒక అంచనాకు వచ్చాం. దానికి అనుగుణంగా ఒక నిర్దిష్టమైన ప్రణాళిక రూపొందించి ఇచ్చాం.



అదే మా పని...

పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు, లేదా ఆ కుటుంబాల నుంచి వచ్చే వ్యక్తులు కావచ్చు, నీట్ లాంటి పోటీ పరీక్షల్లో విజయం సాధించాలనుకొనే విద్యార్థులు కావచ్చు... వీళ్లు నా వద్దకు వస్తారు. ఎక్కువగా ఒన్ టు ఒన్ కోచింగ్ ఇస్తాను. అలాగే మహిళా బృందాలకు వర్క్‌షాప్‌లు, కార్పొరేటు సంస్థల్లో సెషన్స్ నిర్వహిస్తుంటాను. ఒక రకంగా లైఫ్ కోచింగ్ అనేది ఒలింపిక్స్‌కు వెళ్లే క్రీడాకారుడిని అత్యున్నత శిఖరాలు అధిరోహించేలా తీర్చిదిద్దడం లాంటిది. అంటే ఇక్కడకు వచ్చేవారు అప్పటికే నైపుణ్యం సంపాదించి ఉంటారు. నిరూపించుకొని ఉంటారు. కాకపోతే ఫినిషింగ్ లైన్ దగ్గర్లో ఉన్నప్పుడు... 'నీవల్ల కాదు' అని ఎప్పుడో వాళ్ల అమ్మో, నాన్నో చెప్పిన మాటలో, ఇంకేదో హఠాత్తుగా గుర్తుకువస్తాయి. దాంతో ఉన్నట్టుండి వారి ప్రయాణం నెమ్మదిస్తుంది. ఈ గందరగోళాన్ని, అపనమ్మకాన్ని పారద్రోలి, లక్ష్యం వైపు నడిపించడమే మా పని.

స్పష్టత ముఖ్యం...

నా ప్రయాణంలో ఎన్నో అవార్డులు, ప్రశంసలు అందుకున్నాను. ఈ వృత్తిలో ముఖ్యంగా కావల్సింది... మనవద్దకు వచ్చేవారికి ఏంకావాలన్నది కచ్చితంగా గ్రహించగలగాలి. కొందరికి తమకు ఏంకావాలో స్పష్టత ఉండదు. ఇంకొందరికి స్పష్టత ఉంటుంది. కానీ దాన్ని ఎలా సాధించాలన్నది తెలియదు. మరికొందరికి ఎలా సాధించాలో తెలుసు. అయినా లక్ష్యాన్ని చేరుకోలేరు. తమ బలాలేంటో, బలహీనతలేంటో అవగాహన ఉన్నా... ముందుకు వెళ్లే మార్గం తెలియక బాధ పడుతుంటారు. లేదా ప్రయత్నించి విఫలమై ఉంటారు. ఇవన్నీ సున్నితమైన అంశాలు. కనుక లైఫ్ కోచ్‌గా... తొలి సెషన్‌లోనే వాళ్లకు ఏంకావాలి? ఎందుకు కావాలి? అన్నదానిపై నాకు ఒక స్పష్టత రావాలి. అప్పుడే వారిని విజయం వైపు నడిపించగలం.

అందుకే ఇటు వైపు...

మా అమ్మానాన్నలది పశ్చిమ గోదావరి జిల్లా అయినా... నా బాల్యం, విద్యాభ్యాసం అంతా హైదరాబాద్‌లోనే సాగింది. నాన్నకు కన్‌స్ట్రక్షన్ బిజినెస్ ఉంది. ఎంబీయే ఫైనాన్స్ పూర్తయిన తరువాత పుణె సింబియాసిస్ యూనివర్సిటీలో బీబీఏ చదివాను. పెళ్లి తరువాత చెన్నైలోని మా మామగారి కంపెనీలో ఎనలిస్ట్‌గా, ప్రాజెక్ట్ మేనేజర్‌గా పని చేశాను. 2016లో పెద్ద నోట్ల రద్దు తరువాత మా కంపెనీని ఒక ఫ్రెంచ్ ఎమ్మెన్సీకి అమ్మేశాం. తరువాత మావారు ఏరోస్పేస్‌కు సంబంధించి వేరే కంపెనీ కొన్నారు. అప్పటికి నాకు పెళ్లయి నాలుగేళ్లు అయిందనుకొంటా. మాకు ఇద్దరు పాపలు. ఇల్లు, పిల్లలు, కుటుంబ బాధ్యతలు ఉన్నప్పుడు... దానికి అనుగుణమైన కెరీర్‌ను ఎంచుకోవాలి కదా. అందుకే నేను లైఫ్ కోచింగ్‌లోకి వచ్చాను. నాది బిజినెస్, ఎంబీయే నేపథ్యం కాబట్టి... ఎక్కువగా పారిశ్రామికవేత్తలు, వారి కుటుంబ సభ్యులకు సంబంధించిన సమస్యలు చూస్తుంటాను. కొన్ని పత్రికలు, మ్యాగజైన్లకు ఆర్టికల్స్ కూడా రాశాను. మా నాన్న, మా మామగారే నాకు స్ఫూర్తి.

సవాళ్లు ఎన్నో...

లైఫ్ కోచ్ కావాలనుకొనేవారికి ఐసీఎఫ్ (ఇంటర్నేషనల్ కోచింగ్ ఫెడరేషన్), ఎన్‌ఎల్‌పీ (న్యూరో లింగ్విస్టిక్ ప్రోగ్రామింగ్) లాంటి ప్రముఖ సంస్థలు ఈ కోర్సులు అందిస్తున్నాయి. కోర్సు పూర్తయితే సర్టిఫికెట్ ఇస్తారు. నేను ఎన్‌ఎల్‌పీ చేశాను.

అయితే ఒక్కదాంతోనే సరిపోదు. మెరుగైన సేవలు అందించాలంటే ప్రముఖ కోచ్‌ల వద్ద శిక్షణ తీసుకొంటూ, ఇలాంటి కోర్సులు మరికొన్ని చేస్తుండాలి. లైఫ్ కోచ్‌కు ప్రధానంగా ఉండాల్సిన లక్షణం... చెప్పింది ఓపిగ్గా వినగలగడం. వారి సమస్యలపై ఒక అవగాహనకు వచ్చేవరకు సలహాలు ఇవ్వకుండా ఉండడం. అలాగే ప్రశ్నలో స్పష్టత, పొంతన తప్పనిసరి. మనం అడిగే ప్రశ్నకు అతడు నిస్సంకోచంగా బదులిస్తాడా? లేక చిన్నబుచ్చుకొంటాడా? అనేది గ్రహించగలగాలి. ఇక్కడ విద్య, విజ్ఞానం చాలా ముఖ్యం. ఎన్నో సవాళ్లతో కూడుకున్న వృత్తి ఇది.

నా క్లయింట్స్‌కు నేను సాధారణంగా ఎనిమిది సెషన్స్ తీసుకొంటాను. తొలి సెషన్‌లోనే వారేమిటి అనేదానిపై స్పష్టత వస్తుంది. ఇప్పటివరకు వర్క్‌షాప్‌ల పరంగా, వ్యక్తిగతంగా వెయ్యి మందిని కలిశాను. తమ లక్ష్యాలను, కలలను నెరవేర్చుకొనేలా ఎంతోమందికి లైఫ్ కోచింగ్ ఇచ్చాను. మా పిల్లలు చిన్నవాళ్లు కనుక ఉదయం 9 నుంచి సాయంత్రం 3 వరకు మాత్రమే ఆఫీసులో ఉంటున్నాను. ఇంటికి వచ్చాక యూరప్ తదితర ప్రాంతాల నుంచి కాల్స్ వస్తాయి. వారికి ఆన్‌లైన్‌లోనే కౌన్సెలింగ్ ఇస్తాను."

• హనుమా

'చిరు' ప్రయత్నం..!

చిరుధాన్యాలు ఆరోగ్యానికి మంచిదే. అయితే రుచికరంగా వండే క్రమంలో వాటిలోని పోషకాలు చాలావరకు పోతాయి. అలా కాకుండా వాటిల్లోని పోషకాలు నిలిచి ఉండేలా చిరుతిళ్లు తయారు చేస్తున్నారు ఢిల్లీకి చెందిన ఆంచల్ సక్సేనా. ఇతర దేశాలకు విస్తరించాలనుకుంటున్న తన 'మ్యాడ్ ఓవర్ మిల్లెట్స్' ప్రయాణంలోని విశేషాలు ఆమె మాటల్లోనే...

"బయట దొరికే చాలావరకు చిరుతిళ్లు ఎక్కువగా ప్రాసెస్ చేయడం వల్ల పోషకాలు తక్కువగా ఉంటున్నాయని కొవిడ్ సమయంలో నేను గుర్తించాను. అప్పుడే పూర్వీకుల కాలం నుంచి ఆరోగ్యానికి మంచివైన చిరుధాన్యాలను రోజువారీ చిరుతిళ్లలో భాగం చేయాలన్న ఆలోచన వచ్చింది. ఇంట్లోనే రాగులు, జొన్నలు, అవిసెగింజలు, పొద్దుతిరుగుడు గింజలు, గుమ్మడి గింజలు, సేంద్రీయ బెల్లం, నెయ్యి వంటి వాటితో ప్రయోగాలు చేశాను. ఆ తరువాత నా ఆలోచనను నా చిరకాల స్నేహితుడు హిమాన్షు మిశ్రాతో పంచుకున్నాను. హిమాన్షుకు వ్యాపార కార్యకలాపాలు, నిర్వహణపై అనుభవం ఉండడం, నాకు వంటపై మక్కువ ఉండడంతో ప్రజలకు చిరుధాన్యాలతో రుచికరమైన, ఆరోగ్యకరమైన చిరుతిళ్లు అందించడమే లక్ష్యంగా మేమిద్దరం కలిసి 2022లో 'మ్యాడ్ ఓవర్ మిల్లెట్స్' సంస్థను స్థాపించాం.



అవగాహన కల్పించడమే సవాలు

ఇప్పుడంటే ప్రజలకు చిరుధాన్యాలపై అవగాహన ఉంది. కానీ 'మ్యాడ్ ఓవర్ మిల్లెట్స్' ప్రారంభించినప్పటికి చిరుధాన్యాల ప్రయోజనాల గురించి ప్రజలకు సరైన అవగాహన లేదు. అదే మాకు పెద్ద సమస్యగా మారింది. దాంతో వినియోగదారులకు అవగాహన కల్పించడం కోసం ఎంతో కష్టపడ్డాను. చిరుధాన్యాల ఆహారపదార్థాలపై పలు చర్చల్లో పాల్గొన్నాను. వివిధ కార్యక్రమాల్లో పాల్గొని ప్రసంగించా. డిజిటల్ మీడియా, సోషల్‌మీడియా ద్వారా, ఇన్‌ఫ్లూయెన్సర్ల ద్వారా ప్రచారం చేశాను. హైదరాబాద్‌లోని ఏకైక మిల్లెట్ ఇన్‌స్టిట్యూట్ న్యూట్రిహబ్ నుంచి కూడా గుర్తింపు సాధించాం. అలాగే జిమ్‌లు, ఆర్గానిక్ దుకాణాలు, కొన్ని కార్పొరేట్ కార్యాలయాలకు తమ ఉత్పత్తుల నమూనాలను ఉచితంగా అందించాం. ఇలా ఎంతో శ్రమించి చివరికి వినియోగదారుల నమ్మకం గెలుచుకోగలిగాం. మేము రైతు ఉత్పత్తిదారుల సంఘాల (ఫార్మర్ ప్రొడక్షన్ ఆర్గనైజేషన్) నుంచి చిరుధాన్యాలు సేకరిస్తున్నాం. దీని వలన రైతులకు కూడా ప్రయోజనం చేకూరుతోంది.



లో-హీట్ బేకింగ్ (తక్కువ వేడితో వండడం) వల్ల చిరుతిళ్లలో ఫైబర్, ఇతర పోషకాలు పోకుండా ఉండడంతో పాటు చిరుతిళ్లు మనకు కావాల్సినట్టు క్రంచీగా (కరకరలాడుతూ) ఉంటాయి.

లో హీట్ బేకింగ్

తక్కువ వేడితో వండడం(లో-హీట్ బేకింగ్), వ్యాక్యూమ్ ప్యాకింగ్(ప్యాకెట్ లోపల గాలి తీసివేయడం) వంటి ఆవిష్కరణలు మా 'మ్యాడ్ ఓవర్ మిల్లెట్స్' సంస్థ ఎదుగుదలలో ఎంతో ఉపయోగపడ్డాయి. లో-హీట్ బేకింగ్ వల్ల చిరుతిళ్లలో ఫైబర్, ఇతర పోషకాలు పోకుండా ఉండడంతో పాటు చిరుతిళ్లు మనకు కావాల్సినట్టు క్రంచీగా(కరకరలాడుతూ) ఉంటాయి.

భవిష్యత్ ప్రణాళికలు

మ్యాడ్ ఓవర్ మిల్లెట్స్‌ను వచ్చే ఐదేళ్లలో పలు దేశాలకు విస్తరించాలనుకుంటున్నా. మిడిల్ ఈస్ట్, దక్షిణాసియాలకు విస్తరించాలని ప్రణాళికలు కూడా రూపొందించుకుంటున్నాం. అలాగే మన దేశంలో పెద్ద ఆహార పదార్థాల కంపెనీల సహకారం కోసం ప్రయత్నిస్తున్నాం.

ఓపికతో ఎదురుచూడండి

ఓ మహిళా వ్యవస్థాపకురాలి(ఎంటర్‌ప్రెన్యూర్)గా నేను ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నా. అయితే నాలా నచ్చిన రంగంలో లేదా వ్యాపారంలో ఎదగాలనుకునే మహిళలకు నేనిచ్చే సలహా ఏంటంటే మార్కెట్ పోకడ గురించి తెలుసుకొని ముందు చిన్నగా మొదలు పెట్టి, తర్వాత విస్తరించుకోమని. అలాగే తక్కువ ఖర్చుతో ప్రచారం కోసం డిజిటల్ మార్కెటింగ్‌ను ఉపయోగించుకోమని, విజయం కోసం ఓపికగా ఎదురుచూడమని చెప్తాను."

పాలు పాడవకుండా...

వేసవికాలంలో పాలు త్వరగా పాడవుతుంటాయి. ఉదయాన్నే చక్కగా కాచినప్పటికీ అవి ఎక్కువ సమయం వరకూ నిల్వ ఉండవు. ఒక్కోసారి మనం చేసే చిన్న పొరబాట్ల వల్ల పాలు విరిగిపోతుంటాయి. అలా కాకుండా పాలు రోజంతా తాజాగా ఉండాలంటే ఏ జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందాం...



- పాలను కాచడానికి ఉపయోగించే పాత్ర శుభ్రంగా ఉండాలి. ఈ పాత్రలో వేరే వంటకాలు చేయకూడదు. టీ, కాఫీ లాంటివి కూడా పెట్టకూడదు. ఓ మందపాటి స్టీల్ గిన్నెను పాల కోసం ప్రత్యేకంగా ఉంచుకోవడం మంచిది.
- ఉదయాన్నే తాజాగా తీసుకొచ్చిన పాలను చక్కగా కాచి చల్లార్చి ఫ్రిజ్‌లో ఉంచితే రోజంతా నిల్వ ఉంటాయి. ప్యాకెట్ పాలను మాత్రం వాటిపై ఉండే తేదీ ప్రకారం ఉపయోగించుకోవాలి. ఇవి ఎక్కువ సమయం వరకూ నిల్వ ఉండవు.
- ఒకసారి కాచిన తరవాత అలాగే బయట ఉంచితే వాటిలో బ్యాక్టీరియా పెరిగి, పాలు పాడవుతాయి.
- పాల పొంగు మీద కొంత మంది నీటి చుక్కలు చల్లుతుంటారు. అలా చేయకూడదు. దీనివల్ల పాలు తొందరగా పాడవుతాయి.
- పాలు కాచిన వెంటనే మూత పెట్టేస్తూ ఉంటారు. దీనివల్ల మూత అడుగు భాగంలో ఆవిరి బిందువులు ఏర్పడి ఆ నీటి చుక్కలు పాలలో పడతాయి. దీని వల్ల కూడా పాలు చెడిపోయే అవకాశం ఉంటుంది. పాలు పూర్తిగా చల్లారాకనే మూత పెట్టాలి.

ల్యాప్‌టాప్ వాడేటప్పుడు...



ల్యాప్‌టాప్ వాడేటప్పుడు సరైన పద్ధతులు పాటించకపోతే కంటి సమస్యలు, వెన్ను నొప్పి, మెడ కండరాలు పట్టేయడం లాంటి సమస్యలు వస్తాయని నిపుణులు చెబుతున్నారు.

- ల్యాప్‌టాప్‌ను వాడేటప్పుడు 20-20-20 రూల్ పాటించడం మంచిది. అంటే ప్రతి 20 నిమిషాలకు ఒకసారి కనీసం 20 అడుగుల దూరంలో ఉన్నవాటిని 20 సెకన్లపాటు చూస్తూ ఉండాలి. దీనివల్ల కళ్లు అలసిపోకుండా ఉంటాయి.
- ల్యాప్‌టాప్ ముందు సరైన భంగిమలో సౌకర్యవంతంగా ఉండేలా కూర్చోవాలి. వెన్నును వంచకుండా నిటారుగా ఉంచాలి. స్క్రీన్‌ను కంటి స్థాయికి కొద్దిగా కిందికి ఉంచాలి. చేతులు పొడవుగా చాచితే అందేంత దూరంలో ల్యాప్ టాప్ ఉండాలి.
- అదేపనిగా స్క్రీన్‌ను చూస్తూ పనిచేయకూడదు. మధ్యమధ్యలో కళ్లార్పుతూ ఉండాలి. అప్పుడే కళ్లకు తగినంత తేమ అంది పొడిబారకుండా ఉంటాయి. లేదంటే కళ్లు ఎరుపెక్కడం, కళ్లలో మంట లాంటి సమస్యలు వస్తాయి.
- ల్యాప్‌టాప్ స్క్రీన్ మీద కాంతి మరీ ఎక్కువ లేదా మరీ తక్కువ కాకుండా చూసుకోవాలి. కళ్లకు శ్రమ కలిగించని విధంగా ఏర్పాటు చేసుకోవాలి. మానిటర్ ముందు, వెనక ఎక్కువ కాంతి ప్రసరించకుండా చూసుకోవాలి. రాత్రిపూట చీకటి గదిలో కూర్చుని ల్యాప్‌టాప్ మీద పనిచేయకూడదు.
- ఎ విటమిన్ ఎక్కువగా లభించే పండ్లు, కూరగాయలు, ఆకుకూరలను రోజూ తీసుకోవాలి. కనీసం ఏడు లేదా ఎనిమిది గంటలు ప్రశాంతంగా నిద్రపోవాలి. దీనివల్ల కళ్లు, మెదడు, కండరాలు ఆరోగ్యంగా ఉంటాయి.

వినూత్నం

జమ్ములోని ఆలయాల్లో పూజలకు ఉపయోగించిన పూలు చెత్తకుప్పల్లోకి చేరిపోవడం, పర్యావరణాన్ని నష్టపరచడం నచ్చని, స్థానిక యువతి పాయల్ శర్మ, వాటితో పరిమళాలు వెదజల్లే అగర్‌బత్తీల తయారీకి పూనుకుంది. జీవనభృతి, ఆధ్యాత్మికత, పర్యావరణ సంరక్షణలను సమ్మిళితం చేసిన పాయల్ గురించిన కథ ఆసక్తికరమైన ఇది.

పూలకు సరికొత్త పరిమళాలు



జమ్ము నగరం చుట్టూరా లెక్కలేనన్ని ఆలయాలు, మసీదులు ఉన్నాయి. వాటిలో అనునిత్యం ఉపయోగించే టన్నులకొద్దీ పూలు చివరకు చెత్తకుప్పల్లోకీ, లేదా వీధిమూలల్లోకీ చేరిపోయి, పర్యావరణానికి హానికారకంగా మారుతూ ఉంటాయి. ఎంతో కాలంగా ఈ పరిస్థితిని గమనించిన పాయల్ శర్మకు, పవిత్రమైన పూలు అలా వృథా అయిపోవడం నచ్చలేదు. ఈ పవిత్రమైన వ్యర్థాలను ఆధ్యాత్మిక ఉపయోగాల కోసం సుస్థిరమైన మార్గంలో ఉపయోగించే వీలుందా? అనే దిశగా ఆలోచించింది. చివరకు ఈ వ్యర్థ పూలలో ఆమెకొక గొప్ప ప్రయోజనం కనిపించింది.

వ్యతిరేకతలను అధిగమించి...

పూల వృథాను అరికట్టడంతో పాటు, స్థానిక మహిళలకు జీవనభృతిని కూడా కల్పించవచ్చనే ఆలోచన తట్టడంతో మరో ఆలోచన లేకుండా, జెకె ఆరొమాటిక్ అండ్ హెర్బ్స్ అనే స్టార్టప్‌ను మొదలుపెట్టి, పూలతో అగర్‌బత్తీల తయారీ మొదలు పెట్టింది పాయల్. అయితే అనుకున్నదే తడవుగా ప్రయత్నాలు మొదలుపెట్టినా, ఆమెకు పూల సేకరణలో పలు సవాళ్లు ఎదురయ్యాయి. ఆమె వ్యాపారాన్ని సప్లయర్లు ప్రశ్నించారు. ప్రారంభంలో ఆలయాలు కూడా వ్యర్థ పూలను ఏరుకోడానికి ఆమెను అనుమతించలేదు. అయినప్పటికీ అవగాహనా కార్యక్రమాలు చేపడుతూ, వ్యర్థ పూలతో జరిగే పర్యావరణ నష్టం గురించీ, తన ప్రయత్నం లక్ష్యం గురించీ వివరిస్తూ, అందరి మనసులనూ చూరగొంది. అలా వాలంటీర్ల సహాయంతో పూలను సేకరించడం మొదలుపెట్టి, అగర్‌బత్తీల తయారీకి పూనుకుంది.



అన్నీ పర్యావరణహితమే...

సాధారణంగా వాణిజ్యపరమైన అగర్‌బత్తీల తయారీలో హానికారకమైన రసాయనాలు లేదా బొగ్గునూ వాడుతూ ఉంటారు. ఇవి పర్యావరణానికీ, ప్రజల ఆరోగ్యానికీ హానికరం. కానీ పాయల్ బొగ్గు ఏమాత్రం ఉపయోగించని అగర్‌బత్తీలను తయారు చేస్తోంది. అగరొత్తుల తయారీ కోసం ఉపయోగించే పూలను ముందుగా ఎండబెట్టి, పొడిచేసి, గుగ్గిలు, చెట్ల బంకను జోడించి ఆ మిశ్రమాన్ని అగరొత్తులుగా చుడుతుంది. ఈ పని కోసం ఆమె స్థానిక గ్రామాల్లోని మహిళలను నియమించు కుంది. పాయల్ దగ్గర గులాబీ, గంధం, లావెండర్, తులసి అగరొత్తులు తయారవుతాయి. ఇవన్నీ ఆలయాలు, ఇళ్లలో వాడకానికి ఎంతో సురక్షితమైనవి. పాయల్ బ్రాండ్ ఇన్సెన్స్ కోన్స్, ధూప్ స్టిక్స్, సేంద్రియ నూనెలను కూడా తయారు చేస్తోంది. ఇవన్నీ సింథటిక్ అడిటివ్స్ ఉపయోగించ కుండా తయారుచేసిన స్వచ్ఛమైన, సహజ సిద్ధమైన ఉత్పత్తులే కావడం విశేషం.

సాధారణంగా అగర్‌బత్తీల తయారీలో హానికారకమైన రసాయనాలు లేదా బొగ్గునూ వాడుతూ ఉంటారు. కానీ పాయల్ బొగ్గు ఉపయోగించని అగర్‌బత్తీలను తయారు చేస్తోంది.

జూలై 8 నాటికి భారత్-యూఎస్ తాత్కాలిక వాణిజ్య ఒప్పందం!

తుది దశకు చేరిన చర్చలు
బెట్టు సడలిస్తున్న రెండు దేశాలు



న్యూఢిల్లీ: ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బీటీఏ) కోసం భారత్-అమెరికా మధ్య జరుగుతున్న చర్చలు తుది దశకు చేరాయి. దీంతో జూలై 8వ తేదీ లోపే రెండు దేశాల మధ్య తాత్కాలిక ఒప్పందం కుదిరే అవకాశం ఉందని అధికార వర్గాలు చెప్పాయి. ఈ ఒప్పందం కుదిరితే జూలై 9 నుంచి భారత ఎగుమతులపై అమల్లోకి వచ్చే 26 శాతం సుంకాల బెడద తప్పుతుంది. గత నెల 2న విధించిన ఈ సుంకాల అమలును ట్రంప్ సర్కారు జూలై 9 వరకు పక్కనపెట్టింది. దీంతో ఈలోపే బీటీఏకి సంబంధించి ఏదో రూపంలో తాత్కాలిక ఒప్పందం కుదుర్చుకోవాలని భారత్ యోచిస్తోంది. ఆ తర్వాత సెప్టెంబరు లేదా అక్టోబరు నాటికి బీటీఏపై తుది ఒప్పందానికి రావాలని రెండు దేశాలు లక్ష్యంగా పెట్టుకున్నాయి.

బెట్టు సడలింపు !

ఈ తాత్కాలిక ఒప్పందం కోసం రెండు దేశాలు మెట్టు దిగుతున్నట్టు సమాచారం. అమెరికా తన దిగుమతులపై విధించిన 26 శాతం సుంకాలను పూర్తిగా ఎత్తివేస్తే, ఆ దేశ వ్యవసాయ, పాల ఉత్పత్తులు, ఆటోమొబైల్స్ ముఖ్యంగా విద్యుత్ వాహనాల (ఈవీ) దిగుమతులను కనీస దిగుమతి ధర (ఎంఐపీ)తో కోటా పద్ధతిలో అనుమతించేందుకు భారత్ సిద్ధమైనట్టు తెలుస్తోంది. మన దేశం నుంచి ఎగుమతయ్యే టెక్స్‌టైల్స్, తోలు వస్తువులు, రొయ్యలు, ప్లాస్టిక్ వస్తువులు, రసాయనాలు, నూనె గింజలు, ద్రాక్ష, అరటి పండ్లు, జెమ్స్ అండ్ జువెలరీ, ఫార్మా ఉత్పత్తులపై అమెరికా దిగుమతి సుంకాలు పూర్తిగా రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వం కోరింది. ఇందుకు ప్రతిగా తన పారిశ్రామిక వస్తువులు, వైన్స్, పెట్రో కెమికల్ ఉత్పత్తులు, పాల ఉత్పత్తులు, యాపిల్స్, జన్యుమార్పిడితో పండించిన సోయా, మొక్కజొన్న దిగుమతులపై భారత్ మరింత ఉదారంగా వ్యవహరించాలని అమెరికా కోరుతోంది. ఈ సమస్యలను అధిగమిస్తే జూలై 8లోగా రెండు దేశాల మధ్య తాత్కాలిక బీటీఏ సాధ్యమేనని అధికార వర్గాలు భావిస్తున్నాయి.

అదే బాటలో ఈయూ

స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) కోసం భారత్-యూరోపియన్ యూనియన్ (ఈయూ) మధ్య జరుగుతున్న చర్చలూ ఊపందుకున్నట్టు అధికార వర్గాలు చెప్పాయి. ఈయూతోనూ ఈ ఏడాది జూలైలోగా తాత్కాలిక ఒప్పందం కుదిరే అవకాశం ఉందని తెలిపాయి. ఇందుకోసం ఒక ఉన్నతాధికార బృందం ఈ వారం ఈయూ కేంద్రమైన బ్రస్సెల్స్ వెళ్లనుంది. తమ దేశాల నుంచి దిగుమతయ్యే ఆటోమొబైల్స్, వైద్య పరికరాలు, మద్యం, మాంసం, పౌల్ట్రీ దిగుమతులపై భారత్ సుంకాలను పూర్తిగా ఎత్తివేయడం లేదా గణనీయంగా తగ్గించాలని ఈయూ కోరుతోంది. దీనికి తోడు తమ కంపెనీలు భారత్‌లో అమ్మే వస్తువుల మేధో సంపత్తి హక్కుల (ఐపీఆర్)ను సంరక్షించాలని కోరుతోంది. అందుకు ప్రతిగా భారత్ నుంచి ఎగుమతయ్యే రెడీమేడ్ దుస్తులు, ఔషధాలు, స్టీలు, పెట్రో ఉత్పత్తులు, విద్యుత్ మెషినరీపై సుంకాలు కనీస స్థాయికి తగ్గించేందుకు లేదా పూర్తిగా ఎత్తివేసేందుకు ఈయూ సంసిద్ధత వ్యక్తం చేసింది. ఈ ఒప్పందం కుదిరితే ఈయూలోని 27 దేశాలకు భారత ఎగుమతులు గణనీయంగా పెరగనున్నాయి.

హోండా మాక్సీ స్కూటర్ ఎక్స్-ఏడీవీ



హోండా మోటార్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా (హెచ్ఎంఎస్ఐ) మార్కెట్లోకి సరికొత్త అడ్వెంచర్-మాక్సీ స్కూటర్ ఎక్స్-ఏడీవీ విడుదల చేసింది. ఈ హోండా ఎక్స్-ఏడీవీ ధర రూ.11.90 లక్షలు (గురుగ్రామ్ ఎక్స్‌షోరూమ్). హోండా బిగ్ వింగ్ షోరూమ్‌ల్లో ఈ మోటార్‌సైకిల్ అందుబాటులో ఉంటుంది. ఇప్పటికే ఈ బైక్ బుకింగ్స్ ప్రారంభించామని, జూన్‌లో డెలివరీలు ప్రారంభమవుతాయని పేర్కొంది. మాక్సీ స్కూటర్‌ను అడ్వెంచర్ మోటార్‌సైకిల్‌గా తీర్చిదిద్దినట్లు తెలిపింది.

జోస్ అలుక్కాస్‌లో శుభమాంగళ్యం ఆఫర్లు

JOS ALUKKAS

హైదరాబాద్: జువెలరీ సంస్థ జోస్ అలుక్కాస్.. పెళ్లిళ్ల సీజన్‌ను పురస్కరించుకుని శుభమాంగళ్యం పేరుతో వివాహ ఆభరణాల ఉత్సవాన్ని ప్రారంభించినట్లు ప్రకటించింది. ఇందులో భాగంగా వివాహ వేడుకల కోసం చేసే కొనుగోళ్లపై ప్రత్యేక ఆఫర్లను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపింది. ఈసీజన్‌లో ప్రత్యేక ఆఫర్‌గా బంగారం కొనుగోళ్లపై అంతే బరువు గల వెండిని ఉచితంగా అందించనున్నట్లు జోస్ అలుక్కాస్ వెల్లడించింది. అలాగే పాత బంగారం ఎక్స్ఛేంజ్‌పై తరుగు మీద బంగారు ఆభరణాలకు 30%, వజ్రాలకు 25% తగ్గింపును అందిస్తున్నట్లు తెలిపింది. దీంతోపాటు ప్లాటినం ఆభరణాల తరుగు మీద 15% తగ్గింపు అందిస్తోంది. వెండి ఆభరణాలు ఎటువంటి తరుగు లేకుండా లభిస్తాయని పేర్కొంది.

కలరా వ్యాక్సిన్ హిల్‌కాల్ ఫేజ్-3 పరీక్షలు విజయవంతం

భారత్ బయోటెక్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): భారత్ బయోటెక్ త్వరలో మరో వినూత్న వ్యాక్సిన్‌ను మార్కెట్లోకి విడుదల చేసేందుకు రెడీ అవుతోంది. కలరా మహమ్మారిని అడ్డుకునేందుకు కంపెనీ అభివృద్ధి చేస్తున్న 'హిల్‌కాల్' వ్యాక్సిన్ మూడో దశ (ఫేజ్-3) పరీక్షలు 1,800 మందిపై విజయవంతంగా పూర్తి చేసినట్టు వెల్లడించింది. దేశంలోని 10 కేంద్రాల్లో 1,800 మందిని వారి వయసు ఆధారంగా మూడు గ్రూపులుగా విభజించి కంపెనీ ఈ పరీక్షలు పూర్తి చేసింది. 'వ్యాక్సిన్లు అవసరమైన వ్యక్తులకు అందుబాటు ధరల్లో, సమర్థవంతమైన వ్యాక్సిన్లను అందజేయాలనే మా నిబద్ధతకు ఇది నిదర్శనం' అని భారత్ బయోటెక్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ కృష్ణ ఎల్లా చెప్పారు. కలరా సోకకుండా ముందు జాగ్రత్తగా నోటి ద్వారా ఈ వ్యాక్సిన్‌ను తీసుకోవచ్చు. ప్రస్తుతం ఏటా ప్రపంచవ్యాప్తంగా 28.6 లక్షల మంది కలరా బారిన పడుతుంటే వారిలో 95,000 మంది మృత్యువాత పడుతున్నారు.

ఏపీలో టంగ్‌స్టన్ ఉత్పత్తి

హిందుస్థాన్ జింక్

వేదాంత గ్రూప్ కంపెనీ హిందుస్థాన్ జింక్ లిమిటెడ్ (హెచ్‌జెడ్ఎల్) ఆంధ్రప్రదేశ్‌లో కీలకమైన టంగ్‌స్టన్, దానికి సంబంధించిన ఇతర ఖనిజాల ఉత్పత్తికి సిద్ధమవుతోంది. అనంతపురం జిల్లా బాలేపాళ్యం బ్లాకులో కంపెనీ ఈ ఖనిజాలు ఉత్పత్తి చేయనుంది. ఇందుకోసం అక్కడ 308.30 హెక్టార్లలో తవ్వకాలు జరిపేందుకు అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం లెటర్ ఆఫ్ ఇంటెంట్ (ఎల్ఓఐ) జారీ చేసింది. కేంద్ర గనుల శాఖ నిర్వహించిన ఈ-ఆక్షన్‌లో హెచ్‌జెడ్ఎల్ ప్రిఫర్డ్ బిడ్డర్‌గా ఎంపికవడంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ అనుమతి మంజూరు చేసింది. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే టంగ్‌స్టన్‌ను వ్యూహాత్మక ఖనిజంగా ప్రకటించింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

22న తేదీ			
హైదరాబాద్	520	విజయవాడ	530
వరంగల్	522	గోదావరి	517
చిత్తూరు	623	విశాఖపట్నం	545
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	125	విజయవాడ	119
వరంగల్	125	గుంటూరు	122
కరీంనగర్	125	ఒంగోలు	122
మహబూబ్‌నగర్	125	చిత్తూరు	111
కర్నూలు	125	నెల్లూరు	116
విశాఖపట్నం	116	అనంతపురం	116
గోదావరి	119		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	97,420 ▲	89,300 ▲	1,11,000 ▲
విజయవాడ	98,750 ▲	93,500 ▲	1,00,000 ▲
విశాఖపట్నం	98,220 ▲	89,300 ▲	1,11,000 ▲
రాజమండ్రి	97,420 ▲	89,300 ▲	1,01,000 ▲
ప్రొద్దుటూరు	96,450 ▲	88,730 ▲	99,500 ▲
ముంబై	95,309 ▲	87,303 ▲	97,332 ▲

మార్కెట్ లాభాల బాట

సెన్సెక్స్ 410 పాయింట్లు అప్

ముంబై: ఈక్విటీ మార్కెట్లో మూడు రోజుల వరుస నష్టాలకు తెర పడింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ వంటి బ్లూచిప్ షేర్లలో కొనుగోళ్లు బుధవారం మార్కెట్‌ను లాభాల బాట పట్టించాయి. ప్రధానంగా ఆసియా మార్కెట్లు పాజిటివ్ ట్రెండ్ ప్రదర్శించడం సెంటిమెంట్ బలపడేందుకు దోహదపడింది. సెన్సెక్స్ ఒక దశలో 835.2 పాయింట్ల లాభంతో 82,021.64 స్థాయిని తాకింది. కాని ముగింపు సమయానికి లాభాన్ని 410.19 పాయింట్లకు సరిపెట్టుకుని 81,596.63 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 129.55 పాయింట్ల లాభంతో 24,813.45 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 24 లాభాలతో ముగిశాయి. బజాజ్ ఫిన్‌సర్వ్ షేరు గరిష్ఠంగా 2.02 శాతం లాభపడగా ఇండస్ ఇండ్ బ్యాంక్ షేరు గరిష్ఠంగా 1.39 శాతం నష్టపోయింది. బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 0.90 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.51 శాతం లాభపడ్డాయి. కన్స్యూమర్ డ్యూరబుల్స్ మినహా మిగతా రంగాల వారీ సూచీలన్నీ లాభాల్లోనే ముగిశాయి.

వచ్చే వారం మూడు ఐపీఓలు: ప్రైమరీ మార్కెట్లో వచ్చే వారం మూడు ఐపీఓలు సందడి చేయనున్నాయి. లీలా ప్యాలెస్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ నిర్వహణ సంస్థ స్క్లాస్ బెంగళూరు లిమిటెడ్, ఏజీస్ వోప్యాక్ టెర్మినల్స్ ఇష్యూలు వచ్చే సోమవారం ప్రారంభమై బుధవారం ముగుస్తాయి. స్క్లాస్ బెంగళూరు లిమిటెడ్ ఇష్యూ ధర శ్రేణిని రూ.413-435గా ప్రకటించింది.

● ఏజీస్ వోప్యాక్ టెర్మినల్స్ ఇష్యూ ధర శ్రేణిని రూ.223-235గా ప్రకటించింది. ఇష్యూ ద్వారా రూ.2,800 కోట్లు సమీకరించాలని కంపెనీ భావిస్తోంది.

● ఇష్యూకి వస్తున్న మరో కంపెనీ ప్రోస్టార్మ్ ఇన్ఫో సిస్టమ్స్ లిమిటెడ్. ఈ కంపెనీ ఇష్యూ ధర శ్రేణిని రూ.95-105గా ప్రకటించింది. రూ.168 కోట్ల సమీకరణ లక్ష్యంతో కంపెనీ మార్కెట్లోకి వస్తోంది. ఈ ఇష్యూ వచ్చే మంగళవారం (27వ తేదీ) ప్రారంభమై గురువారం (29వ తేదీ) ముగుస్తుంది.

కేజీ బేసిన్ క్లస్టర్-2పై ఓఎన్‌జీసీ కసరత్తు

ఎక్సాన్, బీపీ, షెల్ కంపెనీలతో చర్చలు

న్యూఢిల్లీ: కృష్ణా-గోదావరి (కేజీ) బేసిన్‌లోని క్లస్టర్-2 ప్రాజెక్టు (కేజీ-డీడబ్ల్యూఎన్-98/2) ఉత్పత్తి పెంపుపై ఓఎన్‌జీసీ దృష్టి పెట్టింది. ఇందుకోసం తమతో భాగస్వామ్య పద్ధతిలో పని చేసేందుకు ఆసక్తి ఉన్న అంతర్జాతీయ చమురు దిగ్గజ సంస్థలతో చర్చలు జరుపుతోంది. ఇందులో భాగంగా ఇప్పటికే ఎక్సాన్ మొబిల్, బ్రిటిష్ పెట్రోలియం (బీపీ), షెల్ కంపెనీలతో చర్చలు జరిపినట్టు సమాచారం. ఈ విషయంలో ఎక్సాన్‌తో జరుగుతున్న చర్చలు ఆశాజనకంగా ఉన్నట్టు తెలుస్తోంది.

ఎందుకంటే: ఆంధ్రప్రదేశ్ తీరంలోని లోతట్టు సముద్ర జలాల్లో ఉన్న ఈ బ్లాకులో చమురు, గ్యాస్ ఉత్పత్తి కోసం ఓఎన్‌జీసీ దాదాపు 500 కోట్ల డాలర్లు (సుమారు రూ.42,500 కోట్లు) ఖర్చు చేసింది. ఈ బ్లాకు నుంచి రోజూ 45,000 బ్యారెళ్ల చమురు, 10 మిలియన్ మెట్రిక్ స్టాండర్డ్ క్యూబిక్ మీటర్ల (ఎంఎంఎస్‌సీఎండీ) గ్యాస్ ఉత్పత్తి చేయవచ్చని ముందు అంచనా వేసింది. అయితే ప్రస్తుతం ఈ ఉత్పత్తి చాలా తక్కువగా ఉంది. దీంతో అంతర్జాతీయ చమురు దిగ్గజాల అధునాతన టెక్నాలజీ, అనుభవాన్ని ఉపయోగించుకుని ఉత్పత్తి పెంచాలని ఓఎన్‌జీసీ యోచిస్తోంది.



రాష్ట్రానికి గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టు!

అమరావతి, మే 21 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా మూలపేట పోర్టు సమీపంలో రూ.10,000 కోట్లతో దేశంలోనే అతి పెద్ద గ్రీన్ హైడ్రోజన్ అమ్మోనియా ప్రాజెక్టు రానుంది. ఏటా పదివేల మెట్రిక్ టన్నుల గ్రీన్ హైడ్రోజన్-అమ్మోనియా ఉత్పత్తి చేసే ప్లాంటును మూడు దశల్లో నిర్మించేందుకు బుధవారం నెదర్లాండ్ వరల్డ్ గ్రీన్ హైడ్రోజన్ సమ్మిట్‌లో.. కేంద్ర ప్రభుత్వ గ్రీన్ అమ్మోనియా మిషన్ డైరెక్టర్ జనరల్ అభయ్ బాక్రే, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి పీవీ రమేశ్ సమక్షంలో.. జునో జౌలె గ్రీన్ ఎనర్జీ సీఈవో నాగశరత్, జర్మనీకి చెందిన ఎస్ఈటీ సెలెక్ట్ ఎనర్జీ ఎండీ ఫిలిక్స్ డేంజర్ మధ్య అవగాహనా ఒప్పందం (ఎంఓయూ)పై సంతకాలు చేశారు.

సతీశ్ సంచలనం

మలేసియా మాస్టర్స్ బ్యాడ్మింటన్

- మూడోసీడ్‌కు షాకిచ్చి రెండోరౌండ్‌కు
- ప్రణయ్, శ్రీకాంత్ ముందుకు.. సింధు ఇంటికి



సతీశ్

కౌలాలంపూర్: భారత యువ షట్లర్ సతీశ్ కరుణాకరణ్ మలేసియా మాస్టర్స్ టోర్నమెంట్‌లో సంచలనం సృష్టించాడు. సింగిల్స్ ఆరంభ రౌండ్లో సతీశ్ 21-13, 21-14తో ప్రపంచ ఏడో ర్యాంకర్, మూడోసీడ్ చో తిన్ చెన్ (చైనీస్ తైపీ)కు షాకిచ్చాడు. విఁగతా భారత షట్లర్లలో సీనియర్లు కిడాంబి శ్రీకాంత్, హెచ్ఎస్ ప్రణయ్ శుభారంభం చేయగా.. రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత పీవీ సింధు ఆరంభ రౌండ్లోనే వెనుదిరిగింది. ప్రణయ్ 19-21, 21-17, 21-16తో ఐదోసీడ్ కెంటా నిషిమొటో (జపాన్)పై, శ్రీకాంత్ 23-21, 13-21, 21-11తో లూ గువాంగ్ (చైనా)పై, ఆయుష్ షెట్టి 20-22, 21-10, 21-8తో బ్రయాన్ (కెనడా)పై గెలిచి రెండో రౌండ్ చేరారు. రజావత్ 15-21, 17-21తో హెంగ్ (సింగపూర్) చేతిలో ఓడాడు. పేలవఫామ్‌ను కొనసాగిస్తున్న సింధు 11-21, 21-14, 15-21తో గుయెన్ తుయ్ లిన్ (వియత్నాం) చేతిలో ఓడగా.. మరో ముగ్గురు మహిళా షట్లర్లు ఉన్నతి హుడా, ఆకర్షి కశ్యప్, మాళవిక కూడా పరాజయాలతో నిష్క్రమించారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల/తనీషా జోడీ 21-18, 15-21, 21-14తో ఇండోనేసియా జంట అద్నాన్/ఇన్‌దాపై నెగ్గగా.. మిగతా భారత జోడీల్లో అషిత్ సూర్య/అమృత ప్రముతేష్, రోహన్/రుత్వికా శివాని, సతీశ్/ఆద్య మిక్స్‌డ్‌లో తమ పోరును ఆదిలోనే ముగించారు.

ఇంగ్లండ్‌తో టెస్ట్ సిరీస్‌కు
24న భారత జట్టు ఎంపిక?

న్యూఢిల్లీ: ఇంగ్లండ్‌తో టెస్ట్ సిరీస్‌కు భారత జట్టును శనివారం రాత్రి ప్రకటించే అవకాశాలు ఉన్నాయి. ఆ రోజు సెలెక్షన్ కమిటీ భేటీ అనంతరం నూతన సారథితోపాటు జట్టును కూడా ప్రకటిస్తారని సమాచారం. కాగా, టెస్టులకు రోహిత్ శర్మ రిటైర్మెంట్ ప్రకటించడంతో కెప్టెన్సీ రేసులో బుమ్రా కంటే శుభ్‌మన్ గిల్ పేరు ఎక్కువగా వినిపిస్తోంది. అయితే, ఓ సెలెక్టర్ మాత్రం గిల్ సామర్థ్యాన్ని శంకిస్తున్నాడని తెలుస్తోంది.

ఈ-స్పోర్ట్స్ వరల్డ్ కప్‌నకు అర్జున్

న్యూఢిల్లీ: తెలుగు గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసి ఈ-స్పోర్ట్స్ వరల్డ్ కప్ చెస్ టోర్నీకి అర్హత సాధించాడు. 12 మంది క్రీడాకారులు పోటీపడే ఈ వరల్డ్ కప్ జులై 7 నుంచి ఆగస్టు 24 వరకు సౌదీ అరేబియాలో జరగనుంది. ఆన్‌లైన్ ఈవెంట్ అయిన చాంపియన్స్ చెస్ టూర్(సీసీటీ)లో టాప్-12లో నిలవడంతో అర్జున్ ఈ-స్పోర్ట్స్ వరల్డ్‌కప్‌నకు బెర్త్ దక్కించుకున్నాడు. దీంతో ఈ మెగా టోర్నీకి ఎంపికైన తొలి భారత ఆటగాడిగా అర్జున్ రికార్డుకెక్కాడు. సీసీటీలో భాగంగా ఈ ఏడాది ఆరంభంలో చెసబుల్ మాస్టర్స్ నిర్వహించగా.. ప్రస్తుతం క్లాసిక్ ఈవెంట్ జరుగుతోంది. ఇప్పటికే చెసబుల్ మాస్టర్స్‌లో సెమీస్ చేరిన అర్జున్.. తాజాగా చెస్ డాట్ కామ్ క్లాసిక్‌లో ప్లేఆఫ్స్‌కు చేరి వరల్డ్‌కప్ అర్హతకు కావాల్సిన పాయింట్లను దక్కించుకొన్నాడు. ఈ టోర్నీకి ఇప్పటికే కార్ల్‌సన్, నెపోమ్నియాచి, నకమురలాంటి స్టార్లు ఎంపికయ్యారు.

కనక్‌కు స్వర్ణం



న్యూఢిల్లీ: భారత యువ షూటర్ కనక్ ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ ప్రపంచ కప్‌లో స్వర్ణ పతకంతో సత్తా చాటింది. జర్మనీలోని సుల్ నగరంలో బుధవారం జరిగిన ఈ మెగా ఈవెంట్‌లోని మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఫైనల్స్‌లో 17 ఏళ్ల కనక్ 239 పాయింట్లు స్కోరు చేసి విజేతగా నిలిచింది. మాల్డోవాకు చెందిన అన్నా డుల్స్‌కు రజతం, తైపీ షూటర్ యెన్ చెంగ్‌కు కాంస్యం దక్కాయి.

నగాల్ పరాజయం

పారిస్: భారత టెన్నిస్ స్టార్ సుమిత్ నగాల్ ఫ్రెంచ్ ఓపెన్ సింగిల్స్ మెయిన్ డ్రాకు అర్హత సాధించడంలో విఫలమయ్యాడు. బుధవారం జరిగిన క్వాలిఫయింగ్ రెండో రౌండ్‌లో సుమిత్ 2-6, 4-6తో జూరిజ్ రోడియోనోవ్ (ఆస్ట్రియా) చేతిలో చిత్తయ్యాడు. అంతకు ముందు జరిగిన తొలి రౌండ్‌లో మిచెల్ క్రూగెర్ (అమెరికా)పై సుమిత్ గెలిచాడు.

ముంబై వచ్చేసింది

- ప్లేఆఫ్స్‌కు హార్దిక్ సేన
- విజృంభించిన సూర్యకుమార్
- అదరగొట్టిన శాంట్నర్, బుమ్రా
- ముగిసిన ఢిల్లీ కథ



సూర్యకుమార్ (43 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్స్‌లతో 73 నాటౌట్)



శాంట్నర్ (3/11)

ముంబై: సూర్యకుమార్ యాదవ్ (43 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్స్‌లతో 73 నాటౌట్) మెరుపులతోపాటు శాంట్నర్ (3/11) తిప్పేయడంతో.. ముంబై ఇండియన్స్ ప్లేఆఫ్స్‌కు దూసుకెళ్లింది. బుధవారం జరిగిన కీలక మ్యాచ్‌లో ముంబై 59 పరుగులతో ఢిల్లీ క్యాపిటల్స్‌ను చిత్తు చేసింది. తప్పనిసరిగా నెగ్గాల్సిన మ్యాచ్‌లో ఓడిన ఢిల్లీ నాకౌట్ రేసు నుంచి అవుటైంది. మరొక్క మ్యాచ్ మాత్రమే మిగిలివున్న ఢిల్లీ ఆ పోటీలో నెగ్గినా 15 పాయింట్లే అవుతాయి. ఇక ఐదుసార్లు టైటిల్ గెల్చుకున్న ముంబై ప్లే ఆఫ్స్ చేరడం ఇది 11వసారి. గుజరాత్, బెంగళూరు, పంజాబ్ జట్లు ఇప్పటికే ప్లే ఆఫ్స్ బెర్తులను ఖరారుచేసుకున్న సంగతి తెలిసిందే.

తొలుత ముంబై 20 ఓవర్లలో 180/5 స్కోరు చేసింది. తిలక్ వర్మ (27), నమన్ ధిర్ (24 నాటౌట్), రికెల్టన్ (25) రాణించారు. ముకేశ్ 2 వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో ఢిల్లీ 18.2 ఓవర్లలో 121 పరుగులకే కుప్పకూలింది. సమీర్ రిజ్వీ (39), విప్రజ్ (20) టాప్ స్కోరర్లు. బుమ్రా 3 వికెట్లు తీశాడు. అనారోగ్యంతో ఢిల్లీ కెప్టెన్ అక్షర్ మ్యాచ్‌కు దూరమవడంతో.. డుప్లెసి సారథిగా వ్యవహరించాడు. సూర్య 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు.

బ్యాటర్లు విఫలం: ఛేదనలో ఢిల్లీ ఘోరంగా తడబడింది. ఓపెనర్లు డుప్లెసి (6), రాహుల్ (11) స్వల్ప స్కోర్లకే పెవిలియన్ చేరారు. అభిషేక్ పోరెల్ (6)ను జాక్స్ అవుట్ చేయడంతో ఢిల్లీ 27/3తో పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో విప్రజ్, సమీర్ ఆదుకొనే ప్రయత్నం చేయడంతో.. పవర్‌ప్లే ముగిసే సరికి ఢిల్లీ 49/3తో నిలిచింది. అయితే, 8వ ఓవర్‌లో విప్రజ్‌ను శాంట్నర్ రిటర్న్ క్యాచ్‌తో వెనక్కిపంపడంతో.. నాలుగో వికెట్‌కు 28 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ధాటిగా ఆడగలిగే స్టబ్స్ (2)ను బుమ్రా ఎల్బీ చేయడంతో.. 10 ఓవర్లకే ఢిల్లీ సగం వికెట్లు చేజార్చుకొంది. రిజ్వీ, అశుతోష్ శర్మ (18) ఆరో వికెట్‌కు 38 పరుగుల భాగస్వామ్యంతో కొంతసేపు పోరాడారు. అయితే, 15వ ఓవర్‌లో వీరిద్దరినీ శాంట్నర్ అవుట్ చేయడంతో.. ఢిల్లీ ఓటమి ఖరారైంది. మాధవ్ తివారి (3), కుల్దీప్ (7), ముస్తాఫిజుర్ (0) సింగిల్ డిజిట్‌కే వెనుదిరిగారు.

ఆఖర్లో అదరగొట్టారు: మందకొడి పిచ్‌పై ఢిల్లీ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేసినా.. డెత్ ఓవర్లలో సూర్యకుమార్, నమన్ ఆరో వికెట్‌కు అజేయంగా 21 బంతుల్లో 57 పరుగులు జోడించడంతో ముంబై సవాల్ విసరగలిగే స్కోరు చేసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ముంబైకి శుభారంభం దక్కలేదు. రోహిత్ శర్మ (5) విఫలమైనా.. మరో ఓపెనర్ రికెల్టన్, విల్ జాక్స్ (13 బంతుల్లో 3 ఫోర్లు, ఓ సిక్సర్‌తో 21) దూకుడుగా ఆడారు. దీంతో పవర్‌ప్లేను ముంబై 54/2తో ముగించింది. మూడు ఫోర్లు, సిక్స్‌తో జోరుమీదున్న జాక్స్‌ను ముకేశ్ వెనక్కిపంపడంతో.. రెండో వికెట్‌కు 25 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఇక, మధ్య ఓవర్లలో స్పిన్నర్లు కుల్దీప్, విప్రజ్ పరుగులను కట్టడి చేయడంతో.. 7-15 ఓవర్ల మధ్య ముంబై 60 పరుగులే చేయగలిగింది. ఏడో ఓవర్‌లో రికెల్టన్‌ను కుల్దీప్ అవుట్ చేసి షాకిచ్చాడు. ఈ దశలో సూర్య, తిలక్ ఆచితూచి ఆడుతూ.. నాలుగో వికెట్‌కు 55 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొనే ప్రయత్నం చేశారు. అయితే, కీలక సమయంలో తిలక్‌ను ముకేశ్ వెనక్కిపంపగా.. కెప్టెన్ హార్దిక్ పాండ్యా (3)ను చమీర క్యాచవుట్ చేశాడు. కానీ, చివరి రెండు ఓవర్లలో సూర్య, నమన్ చెలరేగి 48 పరుగులు పిండుకోవడంతో.. ముంబై స్కోరు 180 పరుగుల మార్క్‌ను అందుకొంది. 19వ ఓవర్‌లో ముకేశ్ బౌలింగ్‌లో సూర్య సిక్స్‌తో ఫిఫ్టీ పూర్తి చేసుకోగా.. 4,6,6,4 బాదిన నమన్ ఏకంగా 27 పరుగులు రాబట్టాడు. చమీర వేసిన ఆఖరి ఓవర్‌లో సూర్య రెండు ఫోర్లు, రెండు సిక్స్‌లతో ఫినిషింగ్ టచ్ ఇచ్చాడు.

పాయింట్ల పట్టిక

జట్లు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
గుజరాత్	12	9	3	0	18	0.795
బెంగళూరు	12	8	3	1	17	0.482
పంజాబ్	12	8	3	1	17	0.389
ముంబై	13	8	5	0	16	1.292
ఢిల్లీ	13	6	6	1	13	0.019
కోల్‌కతా	13	5	6	2	12	0.193
లఖ్‌నవూ	12	5	7	0	10	-0.506
హైదరాబాద్	12	4	7	1	9	-1.005
రాజస్థాన్	14	4	10	0	8	-0.549
చెన్నై	13	3	10	0	6	-1.030

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

నేటి మ్యాచ్

వేదిక అహ్మదాబాద్

గుజరాత్ x లఖ్‌నవూ — రా.7.30 నుంచి

1 ఐపీఎల్ చరిత్రలో తొలి నాలుగు మ్యాచ్‌లు గెలిచినా.. ప్లేఆఫ్స్‌కు దూరమైన మొదటి జట్టుగా ఢిల్లీ

స్కోరుబోర్డు

ముంబై: రికెల్టన్ (సి) తివారి (బి) కుల్దీప్ 25, రోహిత్ (సి) పోరెల్ (బి) ముస్తాఫిజుర్ 5, విల్ జాక్స్ (సి) విప్రజ్ (బి) ముకేశ్ 21, సూర్యకుమార్ (నాటౌట్) 73, తిలక్ (సి) రిజ్వీ (బి) ముకేశ్ 27, హార్దిక్ (సి) ముకేశ్ (బి) చమీర 3, నమన్ ధిర్ (నాటౌట్) 24, **ఎక్స్‌ట్రాలు: 2; మొత్తం: 20 ఓవర్లలో 180/5; వికెట్ల పతనం:** 1-23, 2-48, 3-58, 4-113, 5-123; **బౌలింగ్:** ముకేశ్ 4-0-48-2, చమీర 4-0-54-1, ముస్తాఫిజుర్ 4-0-30-1, విప్రజ్ నిగమ్ 4-0-25-0, కుల్దీప్ 4-0-22-1.

ఢిల్లీ: రాహుల్ (సి) రికెల్టన్ (బి) బౌల్ట్ 11, డుప్లెసి (సి) శాంట్నర్ (బి) చాహర్ 6, పోరెల్ (స్టంప్డ్) రికెల్టన్ (బి) జాక్స్ 6, రిజ్వీ (బి) శాంట్నర్ 39, విప్రజ్ (సి అండ్ బి) శాంట్నర్ 20, స్టబ్స్ (ఎల్బీ) బుమ్రా 2, అశుతోష్ (స్టంప్డ్) రికెల్టన్ (బి) శాంట్నర్ 18, మాధవ్ తివారి (బి) బుమ్రా 3, చమీర (నాటౌట్) 8, కుల్దీప్ (సి/సబ్) బవ (బి) కర్ణ్ శర్మ 7, ముస్తాఫిజుర్ (బి) బుమ్రా 0, **ఎక్స్‌ట్రాలు: 1; మొత్తం: 18.2 ఓవర్లలో 121 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-12, 2-20, 3-27, 4-55, 5-65, 6-103, 7-104, 8-108, 9-120, 10-121; **బౌలింగ్:** బౌల్ట్ 4-0-29-1, దీపక్ చాహర్ 3-0-22-1, విల్ జాక్స్ 1-0-16-1, శాంట్నర్ 4-0-11-3, బుమ్రా 3.2-0-12-3, కర్ణ్ శర్మ 3-0-31-1.

'ఎక్స్‌ట్రా టైమ్' ఇప్పుడా ?

తమకు అన్యాయం జరిగిందన్న నైట్‌రైడర్స్

న్యూఢిల్లీ: ఈ సీజన్ మధ్యలో ఐపీఎల్ మ్యాచ్‌లకు ఎక్స్‌ట్రా టైమ్ (అదనపు సమయం)ను కేటాయించడాన్ని కోల్‌కతా నైట్‌రైడర్స్ యాజమాన్యం తప్పుపట్టింది. ఈ అంశంలో తమకు అన్యాయం జరిగిందని ఆ జట్టు సీఈవో వెంకీ మైసూర్.. ఐపీఎల్ సీఓఓ హేమంగ్ అమిన్‌ను ఈ-మెయిల్ ద్వారా ప్రశ్నించాడు. ప్లేఆఫ్స్ నేపథ్యంలో వర్షం కారణంగా కీలకమైన మ్యాచ్‌లు రద్దు కాకూడదన్న ఉద్దేశంతో ఈసారి లీగ్‌లో మిగతా మ్యాచ్‌లకు అదనంగా గంట సమయాన్ని కేటాయించారు. అయితే, ఈ కొత్త నిబంధనను ఐపీఎల్ పునరుద్ధరణ జరిగిన మూడ్రోజుల తర్వాత అంటే.. ఈనెల 20 నుంచి జరిగే మ్యాచ్‌ల నుంచి వర్తిస్తుందని ప్రకటించారు. దీనిపైనే వెంకీ మైసూర్ మండిపడ్డాడు. 'ఐపీఎల్ పునరుద్ధరణతోనే అదనపు గంట సమయం ప్రస్తావన ఎందుకు తీసుకురాలేదు? లీగ్ మళ్లీ మొదలయ్యాక తొలి మ్యాచ్‌లో భాగంగా ఈనెల 17న బెంగళూరులో ఆర్సీబీతో నైట్‌రైడర్స్ పోరు వర్షంతో రద్దయింది. దీంతో మా జట్టు ప్లేఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించింది. మ్యాచ్‌కు రెండ్రోజుల ముందే బెంగళూరులో భారీ వర్షం పడింది. మా మ్యాచ్‌కు కూడా వర్షం ముప్పు ఉందని వాతావరణ శాఖ ముందే హెచ్చరించినా.. బీసీసీఐ, ఐపీఎల్ సీఓఓ అప్పుడు మౌనంగా ఉన్నారు. మ్యాచ్‌లకు అదనంగా గంట సమయం ఉంటుందని ఆరోజే ప్రకటించి ఉంటే.. మా మ్యాచ్ కనీసం ఐదు ఓవర్లపాటైనా జరిగి ఉండేది. అప్పుడు మా జట్టు ప్లేఆఫ్స్ అవకాశాలకు చాన్స్ ఉండేదేమో! ఇప్పుడేమో ఈనెల 20 నుంచి మ్యాచ్‌లకు ఎక్స్‌ట్రా టైమ్ వర్తిస్తుందని చెబుతున్నారు. ఈ విషయంలో మాకు అన్యాయం జరిగినట్టే కదా!' అని ఈ-మెయిల్‌లో వెంకీ మండిపడ్డాడు. కోల్‌కతానే కాదు మరికొన్ని జట్లు కూడా.. సీజన్ మధ్యలో నిబంధనల మార్పును తప్పుపడుతున్నాయి.



పవన్ మూర్తీభవించిన ధర్మాగ్రహం


ఎమ్ఎమ్ కీరవాణి

"ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌గారిని మీరంతా పవర్‌స్టార్ అని పిలుస్తారు. ఆయన మూర్తీభవించిన ధర్మాగ్రహం అని నేను అంటాను. ఆగ్రహం మనందరికీ వస్తుంది. కానీ సమాజం కోసం వచ్చేది ధర్మాగ్రహం. ఆయనకు మాత్రమే సరిపోయేలా 'హరిహర వీరమల్లు'ను తీర్చిదిద్దారు" అని సంగీత దర్శకుడు ఎమ్.ఎమ్.కీరవాణి అన్నారు. పవన్‌కల్యాణ్, నిధి అగర్వాల్ జంటగా జ్యోతికృష్ణ తెరకెక్కించిన చిత్రం 'హరిహర వీరమల్లు'. ఏ.ఎం.రత్నం నిర్మించారు. జూన్ 12న చిత్రం విడుదలవుతోంది. బుధవారం ఈ చిత్రం నుంచి మూడో గీతం 'అసుర హననం'ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ "జయాపజాయాలతో సంబంధం లేకుండా దూసుకుపోయే కార్చిచ్చు పవన్. ఆయనతో మొదటిసారి చేస్తున్న సినిమా కాబట్టి ఎంతో శ్రద్ధతో పనిచేశాను" అని చెప్పారు. చిత్రదర్శకుడు జ్యోతికృష్ణ మాట్లాడుతూ "పవన్‌కల్యాణ్‌గారిని డైరెక్ట్ చేయడమనేది ప్రతీ ఒక్క దర్శకుడి కల. అది ఓ పెద్ద అవార్డుతో సమానం. కత్తికీ, ధర్మానికీ మధ్య జరిగే యుద్ధమే ఈ కథ" అని తెలిపారు. చిత్ర నిర్మాత ఏ.ఎం.రత్నం మాట్లాడుతూ "సినిమా అద్భుతంగా వచ్చింది. తెలుగులో పాటూ విడుదలయ్యే అన్ని భాషల్లో భారీ విజయం సాధిస్తుంది" అని అన్నారు.

మాజీ రాష్ట్రపతి కలామ్ బయోపిక్‌లో ధనుష్



తమిళ హీరో ధనుష్ హీరోగా మరో క్రేజీ ప్రాజెక్ట్ సిద్ధమవుతోంది. మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త ఏ.పీ.జే అబ్దుల్ కలామ్ జీవితం ఆధారంగా తెరకెక్కనున్న బయోపిక్‌లో ఆయన నటించనున్నారు. బుధవారం, కేన్స్ చిత్రోత్సవంలో ఈ సినిమా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ చిత్ర టైటిల్ 'కలామ్'. 'ద మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా' అనేది ఉపశీర్షిక. 'తానాజీ: ద అన్‌సంగ్ వారియర్', 'ఆదిపురుష్' చిత్రాల దర్శకుడు ఓం రౌత్ తెరకెక్కించనున్నారు. అభిషేక్ అగర్వాల్, భూషణ్‌కుమార్, అనిల్ సుంకర, కృషన్‌కుమార్ నిర్మించనున్నారు. అబ్దుల్ కలామ్ జీవితాన్ని, భారతీయ అంతరిక్ష, రక్షణ రంగాలకు ఆయన చేసిన అపూర్వ సేవలను ఈ చిత్రం ద్వారా హృద్యంగా ఆవిష్కరించనున్నారు. ఇతర వివరాలను త్వరలోనే ప్రకటించనున్నారు.



'కన్నప్ప' నుంచి కిరాత లుక్!

మలయాళంలో వరుసగా బ్లాక్ బస్టర్ హిట్స్ సాధిస్తూ యువ హీరోలతో పోటీ పడుతూ ముందుకు దూసుకుపోతున్నారు మోహన్ లాల్. మంచి విష్ణు ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన 'కన్నప్ప' చిత్రంలో ఆయన కిరాత పాత్రతో అలరించబోతున్నారు. బుధవారం మోహన్‌లాల్ పుట్టిన రోజు సందర్భంగా 'కన్నప్ప' చిత్రంలోని ఆయన పాత్రకు సంబంధించిన గ్లింప్స్‌ను విడుదల చేశారు. దైవిక శక్తితో ముడిపడున్న కిరాత పాత్రను ఇందులో మోహన్‌లాల్ పోషించారు. మోహన్‌లాల్ అభిమానులనే కాకుండా ప్రేక్షకుల్ని మెప్పించే విధంగా ఈ పాత్రను తీర్చిదిద్దారు. జూన్ 27న ప్రపంచ వ్యాప్తంగా 'కన్నప్ప' విడుదల కానుంది. ప్రస్తుతం మంచు విష్ణు ఈ చిత్రం ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నారు.

మోహన్‌లాల్ జీవిత చరిత్ర 'ముఖరాగం'

బుధవారం 65వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన మోహన్‌లాల్ ఈ సందర్భంగా ఓ ఆసక్తికరమైన విషయాన్ని తన అభిమానులతో పంచుకున్నారు. 'ముఖరాగం' పేరుతో తన జీవిత కథ పుస్తకరూపంలో రానున్నదని ఆయన వెల్లడించారు. తన 47 ఏళ్ల నట జీవితంలో జరిగిన ఎన్నో ఆసక్తికరమైన సంఘటనలు, విశేషాలు ఈ పుస్తకంలో ఉంటాయనీ, భానుప్రకాశ్ అనే రచయిత వీటికి అక్షర రూపం ఇచ్చారనీ మోహన్‌లాల్ చెప్పారు. దాదాపు వెయ్యి పేజీలు కలిగిన ఈ పుస్తకం డిసెంబర్ 25న విడుదలవుతుందని ఆయన తెలిపారు.

జోరుగా ప్రీ ప్రొడక్షన్...



అల్లు అర్జున్ కథానాయకుడిగా తమిళ దర్శకుడు అట్లీ ఓ చిత్రాన్ని తెరకెక్కించనున్న సంగతి తెలిసిందే. 'ఏఏ22.. ఏ6' వర్కింగ్ టైటిల్. సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ నిర్మించనున్నారు. ఇటీవలె సినిమాను అనౌన్స్ చేసి ఓ ఆసక్తికరమైన వీడియోను విడుదల చేశారు. ప్రస్తుతం శరవేగంగా పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఈ పనుల్లో భాగంగా దర్శకుడు అట్లీ బుధవారం హైదరాబాద్‌కు చేరుకున్నారు. అల్లు అర్జున్‌ను కలసి ప్రీ ప్రొడక్షన్ పనులను చర్చించనున్నారు. జూన్‌లో చిత్రీకరణను ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నారు. అంతర్జాతీయ స్థాయిలో తెరకెక్కనున్న ఈ చిత్రం ప్రేక్షకులను ఓ కొత్త లోకంలోకి తీసుకెళ్లేలా ఉంటుందని మేకర్స్ తెలిపారు.

ప్రతిభ కలిగిన వారికోసం 'దిల్‌రాజు డ్రీమ్స్'



తన మొదటి సినిమా పేరునే ఇంటి పేరుగా మార్చుకున్న దిల్‌రాజు ఇప్పటివరకూ ఎంతో మంది కొత్త దర్శకులను, సాంకేతిక నిపుణులను పరిశ్రమకు పరిచయం చేశారు. తాజాగా ఆయన మరో అడుగు ముందుకు వేసి తెలుగు చిత్ర పరిశ్రమకు మరింత మంది ప్రతిభ కలిగిన వారిని పరిచయం చేయడం కోసం ఏకంగా 'దిల్‌రాజు డ్రీమ్స్' పేరుతో ఓ సంస్థను ఏర్పాటు చేశారు. దీని ద్వారా యువ ప్రతిభావంతులకు మంచి అవకాశాలు కల్పించాలని నిర్ణయించుకున్నారు. జూన్ నుంచి ఆయన సిద్ధం చేసిన ఆన్‌లైన్ ఫ్లాట్‌ఫామ్ యాక్టివ్ అవుతుంది. ఈ సంస్థ వెబ్‌సైట్‌లో యువ ప్రతిభావంతులు తమ వివరాలను నమోదు చేస్తే దిల్ రాజు డ్రీమ్స్ బృందం స్వయంగా వారిని సంప్రదిస్తుంది. తమ ఆలోచనలను యువ ప్రతిభావంతులు ఈ బృందం దృష్టికి తీసుకెళ్లవచ్చు. తమ టాలెంట్‌ను నిరూపించుకోవాలనుకొనే వారు ఎంతో మంది ఎవరిని ఎలా ఎప్రోచ్ అవ్వాలో, ముందుకు ఎలా వెళ్లాలో తెలియక ఇబ్బంది పడుతున్నారు. అటువంటి వారికి నిజంగా ఇది గోల్డెన్ ఛాన్స్.

నెలకు రూ.40 లక్షలు కావాలి

- ఫ్యామిలీ కోర్టులో రవి మోహన్ భార్య ఆర్తి పిటీషన్




సినీ హీరో రవి మోహన్ నుంచి జీవనాంశం కోరుతూ ఆయన భార్య ఆర్తి రవి చెన్నై ఫ్యామిలీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విడాకులు కోరుతున్న భర్త నుంచి నెలకు రూ.40 లక్షలు ఇప్పించాలని ఆమె ఆ పిటిషన్‌లో కోరారు. దీన్ని విచారణకు స్వీకరించిన కోర్టు కౌంటర్ దాఖలు చేయాలని రవి మోహన్ న్యాయవాదులను ఆదేశిస్తూ తదుపరి విచారణను జూన్ 12వ తేదీకి వాయిదా వేసింది. విచారణ సందర్భంగా ఇద్దరికీ కౌన్సిలింగ్ ఇచ్చినా ఫలితం లేకపోయింది. తన భర్త నుంచి నెలకు రూ.40 లక్షల భరణం కావాలని ఆర్తి ఈ సందర్భంగా కోరారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

కేన్స్‌లో మెరిసి.. శ్రీదేవిని గుర్తుచేసి



హీరోయిన్ జాన్వీ కపూర్ 78వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్లో తళుక్కున మెరిశారు. ఆమె కేన్స్ రెడ్‌కార్పెట్‌పై దర్శనమివ్వడం ఇదే తొలిసారి. పొడవాటి పింక్ కలర్ గౌన్‌లో ఉన్న ఆమె తన తల్లి, దివంగత హీరోయిన్ శ్రీదేవిని గుర్తుచేశారు. జాన్వీతో పాటు 'హోమ్ బౌండ్' చిత్రబృందం కూడా ఈ వేడుకలో పాల్గొన్నారు. అన్‌సర్టెన్ రిగార్డ్ వి భాగంలో ఈ సినిమాను కేన్స్‌లో ప్రదర్శించనున్నారు. ఈ ఏడాది భారత్ నుంచి ఈ చిత్రోత్సవానికి ఎంపికైన ఏకైక సినిమా ఇదే కావడం విశేషం. 'మసాన్' ఫేమ్ నీరజ్ ఘైవాన్ తెరకెక్కించారు. ఇషాన్ కట్టర్ కథానాయకుడు. మరోవైపు కేన్స్ రెడ్‌కార్పెట్‌పై నటి, మాజీ మిస్ హర్యానా టైటిల్ విన్నర్, రుచి గుజ్జర్ మెడలో ప్రధాని నరేంద్ర మోదీ ఫొటోలు ఉన్న నెక్లెస్ ధరించి అందరి దృష్టినీ ఆకట్టుకున్నారు. ఈ నెల 13న ప్రారంభమైన ఈ వేడుక 24వ తేదీ వరకు జరుగుతుంది. ఇప్పటికే భారత్ నుంచి ఊర్వశీ రౌతేలా, 'లాపతా లేడీస్' ఫేమ్ నితాన్షీ గోయల్ తదితరులు రెడ్ కార్పెట్‌పై హొయలొలికించిన సంగతి తెలిసిందే.



'సారీ సార్ షో లేదు'

- పెద్ద సినిమా వసూళ్లలో వాటాపైనే ఎగ్జిబిటర్ల ఆశలు
- అద్దె అయితే రూ. వేలల్లో, వాటా అయితే రూ. లక్షల్లో ఆదాయం
- మల్టీప్లెక్స్‌ల బాటలోనే ఆదాయాన్ని పంచాలంటున్న ఎగ్జిబిటర్లు
- నేడు తుది నిర్ణయం

'ఇకపై సినిమా ప్రదర్శనలకు అద్దె ప్రాతిపదికన థియేటర్లను ఇవ్వడం ఆపేస్తున్నాం. సినిమాకు వచ్చిన వసూళ్లను బట్టి వాటాలు పంచాలి. ఈ ఒప్పందానికి నిర్మాతలు, పంపిణీదారులు అంగీకరిస్తే సరే. లేదంటే జూన్ 1 నుంచి థియేటర్లను మూసేస్తాం'... ఇదీ ఇటీవలే రెండు తెలుగు రాష్ట్రాల ఎగ్జిబిటర్లు హైదరాబాద్‌లో సమావేశమై తీసుకున్న నిర్ణయం. ఆకాశాన్నంటిన అగ్రతారల పారితోషికాలు, పాన్ ఇండియా పేరుతో తడిసి మోపడవుతున్న నిర్మాణ వ్యయం, థియేటర్లపై ప్రేక్షకుల శీతకన్ను లాంటి సమస్యలతో ఇప్పటికే ఇండస్ట్రీ కుదేలైంది. సమ్మెకు ఎగ్జిబిటర్లు నిర్ణయం తీసుకోవడంతో ఇప్పుడు మూలిగే నక్కమీద తాటికాయ పడ్డట్లైంది.

ఐదేళ్ల క్రితం 3500 వరకూ ఉన్న సింగిల్ స్ర్కీన్లు ఇప్పుడు 1300కు తగ్గిపోయాయి. సమీప భవిష్యత్‌లోనూ ఈ పరిస్థితి మారేలా కనిపించడం లేదు. థియేటర్లలో సినిమాలు చూసే ప్రేక్షకుల సంఖ్య తగ్గడం ఓ కారణమైతే, వసూళ్లలో న్యాయమైన భాగం తమకు దక్కకపోవడం వల్ల నష్టాలు వచ్చి సింగిల్ స్ర్కీన్లు మూసేయాల్సి వస్తోందనేది ఎగ్జిబిటర్ల వాదన. తమకు రాబడి పెరిగితే థియేటర్లను మూసేయకుండా ఎలాగోలా నెట్టుకొస్తామని ఎగ్జిబిటర్లు చెబుతున్నారు. వసూళ్లలో వాటాల విధానం వల్ల ఇరుపక్షాలు లాభపడడమే కాదు ఇండస్ట్రీ కూడా పదికాలాలు పచ్చగా ఉంటుందని వారు అంటున్నారు.

12 టికెట్లు తెగితేనే షో

'ఈ ఏడాది సంక్రాంతి పండుగ తర్వాత పైసా ఆదాయం చూడలేదు. ఫిబ్రవరి నుంచి విపరీతమైన నష్టాలు వస్తున్నాయి. నెల నెలా రెండు మూడు లక్షల రూపాయల వరకూ నష్టపోతున్నాం. అదే వాటాల విధానంలో అయితే సినిమా దెబ్బతిన్నా ఎంతో కొంత చేతికొస్తుంది' అంటున్నారు ఎగ్జిబిటర్లు. 'హైదరాబాద్‌లోని మెయిన్ థియేటర్లలో సైతం 12 టికెట్లు తెగితేనే షో వేస్తున్నాం. లేకపోతే వేయడం లేదని ఓ సీనియర్ ఎగ్జిబిటర్ చెప్పారు. 'కనీసం పదిమంది పైన వస్తేనే షో వేస్తాం లేదంటే వేయం' అని ప్రేక్షకులకు ముందే చెప్పి టికెట్లు ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. షో పడకపోతే డబ్బు వాపసు ఇస్తున్నారు. షో పడుతుందో లేదో అనే సందేహంతో అరగంట ముందే ఏసీ వేస్తే వృథా అవుతుందని ఆపుతున్నామని వారు చెప్పారు. ఇటీవలే ఓ అగ్ర కథానాయిక నిర్మించిన లో బడ్జెట్ చిత్రం విడుదలైంది. ఆ సినిమా ఒక థియేటర్‌లో 8 రోజులు నడిస్తే జనాల్లేక 17 ఆటలు బంద్ చేశారు. అంటే రోజూ రెండు షోలు రద్దయ్యాయి. హైదరాబాద్‌లోని మెయిన్ సెంటర్లలో ఉన్న థియేటర్లలో ప్రదర్శనకు కనీసం 12 మంది ప్రేక్షకులు కూడా రావడం లేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. మల్టీప్లెక్స్‌లో కూడా ఇదే పరిస్థితి. వాటికి రోజుకు ఐదు షోలకు అనుమతులు ఉన్నా అందులో సగం షోలు కూడా పడట్లేదు. మల్టీప్లెక్స్‌ల్లో బుకింగ్ కౌంటర్ దగ్గరకు వెళ్లిన ప్రేక్షకులకు 'సారీ సార్ షో లేదు' అనే సమాధానం తరచూ ఎదురవుతోంది.

చాలాకాలంగా మల్టీప్లెక్స్‌ల్లో వాటాల విధానమే అమల్లో ఉంది. ఒప్పందాన్ని బట్టి వచ్చిన వసూళ్లలో 45-55 లేదా 40-60 నిష్పత్తిలో పంచుకుంటున్నారు. ఇప్పుడు ఇదే విధానాన్ని తమకి కూడా వర్తింపజేయాలనేది సింగిల్ స్ర్కీన్ల యజమానుల డిమాండ్.

టికెట్ రేట్లు పెంచినా అద్దె పెరగలేదు

సినిమాకు వసూళ్లు ఎంత వచ్చినా థియేటర్ల అద్దెను మాత్రం నిర్మాతలు, పంపిణీదారులు పెంచడం లేదని, ప్రభుత్వాల నుంచి జీవోలు తెచ్చుకొని టికెట్ ధరలు భారీగా పెంచుకొని వారు లాభపడుతున్నారని. అందులో తమకు మాత్రం ఎలాంటి వాటా దక్కడం లేదని థియేటర్ల యజమానులు వాపోతున్నారు. 'పెద్ద సినిమాలకు వచ్చిన వసూళ్లను నిర్మాతలు, పంపిణీదారులు పూర్తిగా తమ జేబుల్లో వేసుకుంటున్నారని. ఇదే విధానం కొనసాగితే మున్ముందు మరిన్ని సింగిల్ స్ర్కీన్లు మూతపడడం ఖాయమని చెబుతున్నారు. 'తాము కూర్చున్న కొమ్మనే వారు నరుక్కుంటున్నారు. అదనపు షోలు, బెనిఫిట్ షోల వల్ల మాకు పైసా ఆదాయం లేదు. టికెట్ ధరలు పెంచుకునేందుకు ప్రభుత్వాల నుంచి జీవోలు తెచ్చుకుంటున్న నిర్మాతలు థియేటర్ల అద్దెను మాత్రం పెంచడం లేదు' రాసుకుంటున్నారు. అవకాశాన్ని బట్టి దాని అర్థాన్ని అన్వయించుకుంటున్నారు. ఒక పెద్ద సినిమా విడుదలై రూ. 40 లక్షల వసూళ్లు వస్తే ఎగ్జిబిటర్‌కు రూ. లక్ష ఇస్తున్నారు. రూ. 39 లక్షలు నిర్మాతలు, పంపిణీదారులు తీసుకుంటున్నారు. అక్కడ అద్దె విధానంలో లెక్క గట్టి చెల్లింపులు చేస్తున్నారు. అదే ఏదైనా చిన్న సినిమాకు రూ. 40 వేల వసూళ్లు వస్తే మాత్రం రూ. 20 వేలు ఇస్తున్నారు. అదేమంటే 50-50 పర్సంటేజీ అంటున్నారు. ప్రింట్ సిస్టమ్ ఉన్నప్పుడు ఎగ్జిబిటర్ నష్టపోతే ఆ నష్టపోయిన సొమ్మును కట్టి పంపిణీదారుడు తన ప్రింట్ తీసుకెళ్లేవాడు. ఇప్పుడు ఆ అవకాశమూ ఎగ్జిబిటర్లకు లేదు.

అని ఎగ్జిబిటర్లు చెబుతున్నారు. షేరింగ్ విధానంలో అయితేనే థియేటర్లను ఇస్తామని లేదంటే థియేటర్లను మూసేస్తాం తప్ప అద్దె విధానంలో మాత్రం ఆడించం అని ఇప్పటికే గోదావరి జిల్లాల్లో థియేటర్ల యజమానులు తేల్చిచెప్పారు. ఈ విషయం మీద ఇప్పటికే పలు సార్లు చర్చలు జరిగాయి. గురువారం జరిగే సమావేశంలో తుది నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంది.

పంపిణీదారుడిదే పై చేయి

ఒప్పంద పత్రంలోనే పంపిణీదారులు తమకు అనుకూలంగా ఉండేలా రెంట్/పర్సంటేజీ విధానంలో చెల్లింపులు అని

నేడు తుది నిర్ణయం

ముందు కనీసం రెండు మూడు నెలలయినా పర్సంటేజీ విధానంలో ఆడించి చూస్తే అవగాహన వస్తుంది. బాగుంటే ఫర్వాలేదు లేదంటే సూపర్‌మార్కెట్లకో, గోడౌన్లకో కిరాయికి ఇచ్చుకోక తప్పదంటున్నారు ఎగ్జిబిటర్లు. బుధవారం డిస్ట్రిబ్యూటర్లు, నిర్మాతలు విడివిడిగా సమావేశమయ్యారు. డిస్ట్రిబ్యూటర్ల సమావేశంలో షేరింగ్ విధానంపై ఏకాభిప్రాయం కుదరలేదని సమాచారం. తొందపడి ఓ నిర్ణయానికి రావొద్దు, సావధానంగా చర్చించి ఓ నిర్ణయానికి వద్దాం అని పంపిణీదారులు ఎగ్జిబిటర్లను కోరారు. నిర్మాత దిల్‌రాజు, సురేశ్‌బాబు, నాగవంశీ, దానయ్య, సునీల్ నారంగ్, ఏఎం రత్నం తదితరులు సమావేశమై ఎగ్జిబిటర్ల సమస్యలపై చర్చించారు. పరిశ్రమకు చెందిన అన్ని విభాగాలతో ఓ కమిటీ వేసి, అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయాలు తీసుకోవాలని నిర్మాతలు ప్రతిపాదించారు. నిర్మాతల మండలి గురువారం మరోసారి సమావేశమై తుది నిర్ణయం తీసుకోనుంది. తర్వాత రెండు మూడు రోజుల్లో నిర్మాతలు, పంపిణీదారులు, ఎగ్జిబిటర్ల ఉమ్మడి సమావేశం తెలుగు ఫిల్మ్ ఛాంబర్ నేతృత్వంలో జరుగుతుంది. ఆ సమావేశం పూర్తయ్యాకనే మీడియా ముందుకొచ్చి వివరాలను ప్రకటించాలని, అప్పటివరకూ ఎక్కడా దీనిపై స్పందించకూడదనిని నిర్మాతలు, పంపిణీదారులు, ఎగ్జిబిటర్లు, నిర్ణయం తీసుకున్నారు.

- ఇటీవలే ఓ యువ హీరో నిర్మించిన మిడ్‌రేంజ్ సినిమా విడుదలైంది. 50-50 పర్సంటేజీ విధానంలో ఆ హీరో, పంపిణీదారుడు కలసి ఎగ్జిబిటర్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారు. తొలి రోజు ఆటకు రూ. 4 లక్షల చొప్పున వసూళ్లు వచ్చాయి. ఒప్పందం ప్రకారం చెరో రెండు లక్షలు తీసుకోవాలి. కానీ వసూళ్లు ఎక్కువగా వచ్చాయని చెప్పి ఎగ్జిబిటర్‌కు రూ. లక్ష చేతులో పెట్టి రూ. 3 లక్షలు డిస్ట్రిబ్యూటర్ తీసుకున్నారు. చేసేదేం లేక ఎగ్జిబిటర్ మిన్నకున్నాడు.
- హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ థియేటర్‌లో పెద్ద హీరో సినిమాకు బెనిఫిట్ షో వేస్తే రూ. 13 లక్షల వసూళ్లు వచ్చాయి. కానీ థియేటర్ యజమానికి మాత్రం ఒప్పందం ప్రకారం ఆటకు రూ. 20 వేలు చొప్పున కిరాయి మాత్రమే దక్కింది. మిగిలిన సొమ్మంతా డిస్ట్రిబ్యూటర్లు, నిర్మాతల చేతికివెళ్లింది. అదే 40 శాతం వాటా గనుక ఇస్తే రూ. 5 లక్షల వరకూ ఎగ్జిబిటర్‌కు వస్తాయి. అంతా నిర్మాతలు, పంపిణీదారులకే దక్కితే మాకేం మిగులుతుంది అని ఎగ్జిబిటర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

నిర్మాణరంగంలోకి హీరో యశ్ మాతృమూర్తి



కన్నడ హీరోగా కెరీర్ ప్రారంభించి పాన్ ఇండియా స్థాయికి ఎదిగిన యశ్ ప్రస్తుతం 'రామాయణ' చిత్రంలో రావణుడిగా నటిస్తున్న సంగతి విదితమే. ఆయన మాతృమూర్తి పుష్ప అరుణ్‌కుమార్ ఇప్పుడు నిర్మాతగా మారారు. కొత్త టాలెంట్‌ను ప్రోత్సహించడం కోసం ఆవిడ చిత్ర నిర్మాణసంస్థను ఏర్పాటు చేసి 'కొత్తలవాడి' చిత్రం తీస్తున్నారు. పృథ్వీ అంచార్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి సిరాజ్ దర్శకుడు. ఈ సినిమా పై ఉన్న అంచనాలను మరింత పెంచుతూ మేకర్స్ బుధవారం టీజర్ విడుదల చేశారు. మాస్, కమర్షియల్ ఎలిమెంట్స్‌తో ఈ టీజర్ ఆకట్టుకుంటోంది.


పర్సెంటేజీ విధానాన్ని అమలు చేయాలి

ప్రతాని రామకృష్ణ గౌడ్



థియేటర్ల బంద్ విషయంపై తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఛైర్మన్ ప్రతానిరామకృష్ణ గౌడ్ స్పందించారు. "2002 వరకూ పర్సెంటేజీ విధానమే అమల్లో ఉండేది. ఆ తర్వాత అది రెంట్ విధానంలోకి మారింది. అప్పటి నుంచే సింగల్ థియేటర్లకు కష్టాలు మొదలయ్యాయి. నిర్మాతలకు, డిస్ట్రిబ్యూటర్లకు, ఎగ్జిబిటర్లకు పర్సెంటేజీ విధానమే లాభదాయకమైనది. చిన్న నిర్మాతలకు మరింత మేలు జరుగుతుంది. ఇప్పుడు థియేటర్స్ మూతపడితే మాలాంటి నిర్మాతలకు భారీ నష్టం జరుగుతుంది" అని ప్రతాని అన్నారు. ఆయన నటించి స్వీయ దర్శకత్వం వహించి ఆర్.కె ఫిల్మ్స్ బ్యానర్‌పై నిర్మించిన 'దీక్ష' చిత్రం విడుదలకు సిద్ధమైంది.

హాస్యంతో అలరిస్తుంది



ఆద్యంతం వినోద ప్రధానంగా సాగే కుటుంబ కథా చిత్రం 'వీరరాజు 1991'. రుద్ర వీరాజ్ హీరోగా నటిస్తూ దర్శకత్వం వహించారు. కిరణ్ చెరుకూరి నిర్మించారు. అజయ్ ఘోష్, బెనర్జీ కీలకపాత్రలు పోషించారు. నేడు ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా బుధవారం చిత్రబృందం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. రుద్రవీరాజ్ మాట్లాడుతూ 'ఈ కథ ఆద్యంతం హాస్యంతో నవ్విస్తుంది. వ్యంగ్యం, వినోదం కలబోసిన సినిమా ఇది' అని చెప్పారు. పాత్రల తాలూకు భావోద్వేగాలను ప్రేక్షకులు అనుభూతి చెందుతారని నిర్మాత తెలిపారు.

మంచి నటిగా గుర్తుండిపోవాలి

ఆకాంక్ష సింగ్

'మళ్లీరావా' ఫేమ్ ఆకాంక్ష సింగ్ నటించిన చిత్రం 'షష్ఠి పూర్తి'. డా.రాజేంద్రప్రసాద్, అర్చన, రూపేశ్ ప్రధాన పాత్రల్లో పవన్ ప్రభ తెరకెక్కించారు. రూపేశ్ నిర్మించారు. ఈ నెల 30న సినిమా విడుదలవుతున్న సందర్భంగా మీడియాతో ముచ్చటించారు ఆకాంక్ష. "తెలుగులో చాలా గ్యాప్ తర్వాత చేస్తున్న చిత్రమిది. ఇందులో జానకి అనే గ్రామీణ అమ్మాయి పాత్రలో కనిపిస్తాను. నా పాత్రలో ఎన్నో షేడ్స్ ఉంటాయి. అద్భుతమైన కథతో పాటు ఉన్నతమైన సాంకేతిక విలువలు ఉన్న చిత్రమిది. ఈ చిత్ర ప్రయాణం ఓ మరిచిపోలేని అనుభూతి. సినిమా కేవలం షష్ఠిపూర్తి గురించే కాకుండా అన్ని రకాల అంశాలనూ టచ్ చేస్తుంది. దర్శకుడు పవన్‌కు అద్భుతమైన విజన్‌తో పాటు మంచి క్లారిటీ ఉంటుంది. రాజేంద్రప్రసాద్‌గారు గొప్ప నటుడు. ఆయన నుంచి చాలా నేర్చుకున్నాను. నన్ను ఓ మంచి నటిగానే ప్రేక్షకులు గుర్తుపెట్టుకోవాలనేది నా కోరిక. అందుకు తగ్గట్లుగానే మంచి కథల్ని, గుర్తుండిపోయే పాత్రల్నీ ఎంపిక చేసుకుంటాను. ఇళయరాజాగారి సంగీతం ప్రధానాకర్షణ. తల్లిదండ్రుల గురించి గొప్ప సందేశమిచ్చే ఈ చిత్రాన్ని అందరూ చూడాలి" అని చెప్పారు.





రిమాండ్‌లో ఉన్న పీఎస్సార్ ఆంజనేయులును విజయవాడ కోర్టుకు తెస్తున్న పోలీసులు

నాపై ఆరోపణలు నిరాధారం

» గ్రూప్-1 కేసులో బెయిలివ్వండి: హైకోర్టును కోరిన పీఎస్ఆర్

అమరావతి, మే 21(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష మూల్యాంకనంలో అక్రమాలపై విజయవాడ సూర్యారావుపేట పోలీసులు నమోదు చేసిన కేసులో బెయిల్ కోసం సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ట్రయల్ కోర్టు బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించడంతో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. తనపై పోలీసులు చేసిన ఆరోపణలు అన్నీ నిరాధారమైనవేనని పిటిషన్‌లో పేర్కొన్నారు. హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగానే గ్రూప్-1 జవాబు పత్రాలను మాన్యువల్‌గా మూల్యాంకనం చేపట్టామన్నారు. ఈ వ్యాజ్యం గురువారం విచారణకు రానుంది. కాగా, గ్రూప్-1 కేసులో అరెస్టయి విజయవాడ జిల్లా జైల్లో ఉన్న పమిడికాల్వ మధుసూదన్ (ధాత్రి మధు) దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను విజయవాడ మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి దేవిక తిరస్కరించారు. మరోవైపు, ముంబై నటి కాదంబరీ జెత్వాని కేసులో ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు రిమాండ్‌ను వచ్చే నెల 4 వరకు న్యాయస్థానం పొడిగించింది.

రాజ్ కసిరెడ్డిని మరోసారి కస్టడీకి ఇవ్వండి

» ఏసీబీ కోర్టులో సిట్ పోలీసుల పిటిషన్.. విచారణ నేటికి వాయిదా

విజయవాడ, మే 21(ఆంధ్రజ్యోతి): మద్యం కేసులో ప్రధాన నిందితుడు కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి (రాజ్ కసిరెడ్డి)ని మరోసారి కస్టడీకి ఇవ్వాలని సిట్ పోలీసులు విజయవాడ ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇప్పటికే వారం రోజులపాటు రాజ్ కసిరెడ్డిని కస్టడీకి తీసుకుని విచారించారు. తాజాగా మాజీ ఐఏఎస్ అధికారి కె.ధనుంజయ్‌రెడ్డి, జగన్ ఓఎస్డీ పి.కృష్ణ మోహన్‌రెడ్డి అరెస్టయిన నేపథ్యంలో కేసులో పెండింగ్‌లో ఉన్న కీలక అంశాలను రాబట్టేందుకు సిట్ అధికారులు రాజ్ కసిరెడ్డిని కస్టడీకి తీసుకోవాలని భావిస్తున్నారు. ఆయన్ను మూడు రోజులపాటు కస్టడీకి ఇవ్వాలని కోర్టును కోరారు. పిటిషన్‌పై విచారణను న్యాయాధికారి పి.భాస్కరరావు గురువారానికి వాయిదా వేశారు. ఇక ధనుంజయ్‌రెడ్డి, పి.కృష్ణమోహన్‌రెడ్డి, గోవిందప్ప బాలాజీని కస్టడీకి ఇవ్వాలని సిట్ అధికారులు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ కూడా గురువారానికి వాయిదా పడింది. అలాగే, ఈ కేసులో సజ్జల శ్రీధర్‌రెడ్డి, దిలీప్ బెయిల్ పిటిషన్లపై విచారణను ఏసీబీ కోర్టు గురువారానికి వాయిదా వేసింది.

పైలట్ అనిల్‌కు నాలుగో నోటీసు

» జూన్ 10న హాజరు కావాలని సూచన

చెన్నేకొత్తపల్లి, మే 21(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలం కుంటి మద్ది హెలీప్యాడ్ ఘటనలో విచారణకు జూన్ 10న హాజరు కావాలని పైలట్ అనిల్ కుమార్‌కు పోలీసులు బుధవారం వ్యాట్సాప్ ద్వారా నాలుగో నోటీసు జారీ చేశారు. జగన్ పర్యటన సందర్భంగా హెలిప్యాడ్ వద్ద చోటు చేసుకున్న ఘటనలపై విచారణకు రావాలని ఇదివరకే ఆయనకు మూడు నోటీసు జారీ చేశారు.

తురకా కిశోర్‌ను కస్టడీకి ఇవ్వండి

» మాచర్ల కోర్టులో పోలీసుల పిటిషన్... నేడు నిర్ణయం

మాచర్లటౌన్, మే 21(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా మాచర్ల మున్సిపల్ మాజీ చైర్మన్, వైసీపీ నేత తురకా కిశోర్‌ను ఐదు రోజుల పాటు విచారించేందుకు తమ కస్టడీకి ఇవ్వాలని మాచర్ల పట్టణ పోలీసులు స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో బుధవారం పిటిషన్ దాఖలు చేశారు. న్యాయమూర్తి ప్రశాంత్ తీర్పును గురువారానికి వాయిదా వేశారు.

అటవీ భూముల ఆక్రమణ కేసును కొట్టేయండి

» హైకోర్టును ఆశ్రయించిన పెద్దిరెడ్డి, కుటుంబ సభ్యులు

అమరావతి, మే 21(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా పులిచర్ల మండలం మంగళంపేట గ్రామం పరిధిలోని వివిధ సర్వేనెంబర్లలో తమ ఆధీనంలో ఉన్న 75.74 ఎకరాల భూమి నుంచి ఖాళీ చేయించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారంటూ వైసీపీ ఎమ్మెల్యే(పుంగనూరు) పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన సోదరుడు, తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకానాథ్‌రెడ్డి, కుమారుడు, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, పెద్దిరెడ్డి తమ్ముడి సతీమణి పి.ఇందిరమ్మ హైకోర్టును ఆశ్రయించారు. భూమి విషయంలో జోక్యం చేసుకోకుండా అధికారులను నిలువరించాలని కోరారు. వీరి పిటిషన్‌పై హైకోర్టు గురువారం విచారణ జరపనుంది.

వాన్‌పిక్ కేసు విచారణ 8 వారాలకు వాయిదా

» వేసవి సెలవుల తర్వాత విచారిస్తామన్న సుప్రీం

న్యూఢిల్లీ, మే 21(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ అక్రమాస్తుల వ్యవహారంలో భాగమైన.. వాడరేవు, నిజాంపట్నం పోర్ట్స్ అండ్ ఇండస్ట్రియల్ కారిడార్ ప్రాజెక్ట్(వాన్‌పిక్) భూముల కేసును సుప్రీంకోర్టు మరోసారి వాయిదా వేసింది. ఈ కేసులో తనను నిందితుడిగా చేర్చడంపై వైసీపీ సీనియర్ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి వేసిన పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. ఆ తీర్పును గతేడాది మే 30న ఆయన సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఆ వ్యాజ్యం బుధవారం జస్టిస్ జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ రాజేశ్ బిందాల్‌తో కూడిన ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. సుప్రీంకోర్టుకు వేసవి సెలవుల తర్వాత కేసు విచారణ చేపడతామని ధర్మాసనం స్పష్టం చేసింది.

సంజయ్ బెయిల్ రద్దు పిటిషన్‌పై సుప్రీం విచారణ జూలై 23కి వాయిదా

న్యూఢిల్లీ, మే 21(ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక విభాగంలో అవినీతి ఆరోపణల కేసులో ఆంధ్రప్రదేశ్ సీఐడీ మాజీ చీఫ్ సంజయ్ ముందస్తు బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. అగ్నిమాపక శాఖలో అవినీతి ఆరోపణల నేపథ్యంలో సంజయ్‌పై ఏపీ ప్రభుత్వం కేసు నమోదు చేసింది. ఆయనకు హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఆ తీర్పును ఈ ఏడాది మార్చి 5న ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఆ పిటిషన్ బుధవారం జస్టిస్ అహసనుద్దీన్ అమానుల్లా,జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాతో కూడిన బెంచ్ ఎదుట విచారణకు వచ్చింది. సీనియర్ న్యాయవాది అందుబాటులో లేని కారణంగా విచారణను వాయిదా వేయాలని ప్రభుత్వం కోరడంతో విచారణను బెంచ్ జూలై 23కి వాయిదా వేసింది.

తెలుగు ప్రొఫెసర్లకు అరుదైన గౌరవం

» ఫెలో ఆఫ్ ది రాయల్ సొసైటీలో సభ్యులుగా జగదీశ్, మల్లికార్జున్



జగదీశ్, మల్లికార్జున్

కంది, మే 21(ఆంధ్రజ్యోతి): ఐఐటీ హైదరాబాద్‌తో అనుబంధమున్న ఇద్దరు విశిష్ట ప్రొఫెసర్లు.. అందులోనూ తెలుగు శాస్త్రవేత్తలకు అరుదైన గౌరవం దక్కింది. ప్రతిష్ఠాత్మక ఫెలో ఆఫ్ ది రాయల్ సొసైటీలో సభ్యులుగా ప్రొఫెసర్లు చెన్నుపాటి జగదీశ్, మల్లికార్జున్ తాటిపాముల చోటు సంపాదించారు. ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీహెచ్‌లో డైరెక్టర్ బీఎస్ మూర్తి వీరితో బుధవారం వర్చువల్‌గా భేటీయై మాట్లాడారు. ఈ ఇద్దరు ప్రొఫెసర్లు ఐఐటీహెచ్ విద్యార్థుల పరిశోధనలకు ఎంతో సహకరించారన్నారు.

గంగమ్మ సేవలో సీఎం చంద్రబాబు

కుప్పంలో సతీసమేతంగా పట్టువస్త్రాల సమర్పణ

కుప్పం, మే 21(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు, భువనేశ్వరి దంపతులు బుధవారం చిత్తూరు జిల్లా కుప్పంలో వెలసిన శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబను దర్శించుకున్నారు. ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు, పసుపు కుంకుమ సారె సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. మూడున్నర దశాబ్దాలుగా చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో వారం రోజులుగా గంగజాతర వైభవంగా జరుగుతోంది. ఉత్సవాల చివరి రోజైన బుధవారం అమ్మవారి విశ్వరూప దర్శనం జరిగింది. ఈ నేపథ్యంలో సతీసమేతంగా కుప్పం విచ్చేసిన చంద్రబాబు.. సంప్రదాయ దుస్తులు ధరించి, టీటీడీ నుంచి తెచ్చిన పట్టువస్త్రాలు, పసుపు కుంకుమ సారె తీసుకుని ఊరేగింపుగా అమ్మవారి చెంతకు వచ్చారు. ప్రభుత్వం తరఫున అమ్మవారికి సారె సమర్పించారు. గంగమ్మను దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు.



గంగమ్మకు పట్టువస్త్రాలతో కూడిన సారెను సమర్పిస్తున్న చంద్రబాబు దంపతులు

కుంకీలు వచ్చేశాయ్



మావటీలతో సహ రాష్ట్రానికి వస్తున్న కుంకీ ఏనుగులు

దేవా, కృష్ణ, అభిమన్యు, రంజన్ రాక

» ఏనుగులను అందజేసిన కర్ణాటక

» పూలు చల్లి స్వాగతం పలికిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

బెంగళూరు, అమరావతి, మే 21(ఆంధ్రజ్యోతి): ఏపీకి కర్ణాటక ప్రభుత్వం నాలుగు కుంకీ ఏనుగులను అందజేసింది. రాష్ట్రంలో ఏనుగుల గుంపులను తరిమికొట్టేందుకు ఆరు కుంకీ ఏనుగులను ఇవ్వాలని ఉపముఖ్యమంత్రి, అటవీశాఖ మంత్రి పవన్‌కల్యాణ్ ఇటీవల కోరడంతో ఆయన సమక్షంలోనే రాష్ట్ర అటవీశాఖ అధికారులకు కుంకీ ఏనుగులను కర్ణాటక బుధవారం అప్పగించింది. బెంగళూరులోని విధానసౌధ వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు. కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, అటవీశాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రే ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. శిక్షణ పూర్తికాకపోవడం, ఏనుగుల ఆరోగ్య కారణాల రీత్యా మిగిలిన రెండింటిని ఇప్పుడు ఇవ్వలేకపోతున్నట్లు కర్ణాటక అటవీశాఖ తెలిపింది. ఏనుగుల అప్పగింతకు సంబంధించిన విధివిధానాలు, ఒప్పంద పత్రాలు, లైసెన్సులను పవన్‌కల్యాణ్‌కు సిద్ధరామయ్య అందజేశారు. ఈ సందర్భంగా గజ పూజ నిర్వహించారు. అనంతరం కర్ణాటక అధికారులు జెండా ఊపి కుంకీ ఏనుగులను సాగనంపగా, పవన్ పూలుజల్లుతూ స్వాగతం పలికారు. కుంకీ ఏనుగులు కృష్ణ(15 ఏళ్లు) అభిమన్యు(14), దేవా(39), రంజన్(26)ను కర్ణాటక అటవీ అధికారుల నుంచి ఏపీ అధికారులు స్వీకరించారు. కర్ణాటక మావటీలు 2నెలల పాటు కుంకీ ఏనుగులతోపాటు ఉండి, ఏపీ మావటీలకు శిక్షణ ఇవ్వనున్నారు. త్వరలో మరో 2ఏనుగులు ఇస్తామని ఈ సందర్భంగా సిద్దరామయ్య చెప్పారు. ఏపీ అవసరాలకు అనుగుణంగా భవిష్యత్తులో మరిన్ని ఏనుగులను ఇవ్వడానికీ ఆయన సంసిద్ధత వ్యక్తం చేశారు. కుంకీ ఏనుగుల ఆరోగ్య సంరక్షణ బాధ్యతను ఎప్పటికప్పుడు స్వయంగా పర్యవేక్షిస్తానని పవన్‌కల్యాణ్ హామీ ఇచ్చారు. ఇరు రాష్ట్రాల మధ్య స్నేహ సంబంధాలు కొనసాగాలని ఆకాంక్షించారు. కన్నడ, ఇంగ్లిష్, తెలుగు భాషల్లో పవన్ ప్రసంగించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్‌ను సిద్దరామయ్య, కర్ణాటక మంత్రులు ఘనంగా సత్కరించారు.

తుంగభద్ర జలాలపై చర్చించాలి: డీకే

తుంగభద్ర నదీజలాల్లో కర్ణాటక వాటాను సద్వినియోగం చేసుకునే విషయమై చర్చలు జరిపేందుకు ఏపీ సీఎం చంద్రబాబు అవకాశం ఇవ్వాలని కర్ణాటక డీసీఎం, జలవనరుల మంత్రి డీకే శివకుమార్ కోరారు. కుంకీ ఏనుగుల అప్పగింత కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తుంగభద్ర జలాల అంశంపై చర్చించేందుకు పవన్‌కల్యాణ్ చొరవ చూపాలని కోరారు. 'మీరే ముందుండి సమావేశాన్ని ఏర్పాటు చేయించాలి' అని విజ్ఞప్తి చేశారు.

నేడు రావివలస ప్రజలతో పవన్ మాటామంతీ..!

టెక్కలి, శ్రీకాకుళం, మే 21(ఆంధ్రజ్యోతి): ప్రజలతో మమేకమై వారి సమస్యలు ఆలకించి.. వారి నుంచి ఫిర్యాదులు, వినతులు స్వీకరించేందుకు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శ్రీకారం చుట్టిన స్ర్కీన్ గ్రీవెన్స్ కార్యక్రమం "మన ఊరి కోసం మాటామంతీ"కి సర్వం సిద్ధమైంది. శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలం రావివలస ప్రజలతో పవన్ గురువారం ఉదయం 8.30 నుంచి 10.35 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. వెండితెర వేదికగా వర్చువల్ పద్ధతిలో జరిగే కార్యక్రమం కోసం టెక్కలిలోని భవానీ థియేటర్‌ను ఎంపిక చేశారు.

ఒక్క ఉద్యోగినీ తొలగించం

» సచివాలయ సిబ్బంది ఆందోళన చెందొద్దు

» సిబ్బందిని సర్దుబాటు చేశాకే బదిలీలు: మంత్రి డోలా

అమరావతి, మే 21(ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాల్లో పని చేసే ఉద్యోగులెవరినీ తొలగించబోమని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి స్పష్టం చేశారు. సచివాలయాల సంఖ్యను తగ్గించే ఆలోచన కూడా ప్రభుత్వానికి లేదన్నారు. రేషనలైజేషన్‌పై ఉద్యోగులు ఆందోళన చెందాల్సిన పనిలేదని, పని విభజన శాస్త్రీయంగా చేయాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని వివరించారు. పనిభారం తగ్గించేలా రేషనలైజేషన్ ఉంటుందన్నారు. బుధవారం అమరావతి సచివాలయంలో మంత్రి మీడియాతో మాట్లాడారు. సచివాలయాల ద్వారా రియల్ టైమ్‌లో ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలు అందించే విధంగా వాటిని తీర్చిదిద్దుతామన్నారు. ఇందుకోసం సచివాలయాలను ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజించామని, ఆ ప్రకారం సిబ్బందిని సర్దుబాటు చేస్తామని తెలిపారు. 2,500 జనాభా గల గ్రామ సచివాలయంలో ఆరుగురు సిబ్బందిని, 2,500-3,000 జనాభా గల సచివాలయాల్లో ఏడుగురు, 3 వేలకుపైన జనాభా గల సచివాలయాల్లో 8మంది సిబ్బంది ఉండేలా విభజించామన్నారు. అదేవిధంగా క్లస్టర్ విధానం అనుసరిస్తామని, అందుకు అనుగుణంగా సిబ్బందిని సర్దుబాటు చేశాక బదిలీలు ఉంటాయని తెలిపారు. ప్రస్తుత సాధారణ బదిలీల సమయంలో సచివాలయాల సిబ్బంది బదిలీల ప్రక్రియను చేపట్టబోమని మంత్రి స్పష్టం చేశారు. త్వరలో మూడు అంచెల విధానాన్ని అమల్లోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. ప్లానింగ్ బోర్డులు ఏర్పాటు చేసి.. జిల్లా స్థాయిలో జిల్లా అధికారి, మండల స్థాయిలో ఎంపీడీవో, నియోజకవర్గ స్థాయిలో ఒక అధికారికి కొంతమంది సిబ్బందిని ఇచ్చి.. వారిద్వారా గ్రామ, వార్డు సచివాలయాల పనితీరును నిరంతరం పర్యవేక్షించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మహిళా సంరక్షణ కార్యదర్శులు పోలీస్ శాఖలోకి వెళ్లడమా లేక ఐసీడీఎస్‌లోకి వెళ్లడమా అనేది వారికే ఆప్షన్ ఇచ్చామని మంత్రి పేర్కొన్నారు.

పోలవరం ఎత్తిపోతల వద్దు

» కొల్లి నాగేశ్వరరావు వర్ధంతి సభలో నిపుణులు, ఉద్యమకారుల డిమాండ్

అమరావతి, మే 21(ఆంధ్రజ్యోతి): పోలవరం ఎత్తిపోతల పథకాన్ని నిర్మించవద్దని సామాజిక ఉద్యమకారులు, సాగునీటి రంగ నిపుణులు డిమాండ్ చేశారు. రూ.912.84 కోట్ల అంచనాతో తయారుచేసిన ఈ ప్రతిపాదనను రద్దుచేసి రూ.1,000 కోట్లతో రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల్లోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. పోలవరం-బనకచర్ల పథకంపై తక్షణమే అఖిలపక్ష సమావేశం ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు ఈ పథకాన్ని ఉపసంహరించుకుని పోలవరం-సోమశిల అనుసంధాన పథకాన్ని చేపట్టాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పూర్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లి నాగేశ్వరరావు వర్ధంతి సభ బుధవారం విజయవాడలో జరిగింది. దీనికి కొల్లి నాగేశ్వరరావు అధ్యయన కేంద్రం సమన్వయకర్త టి.లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. నదుల అనుసంధాన ఆవశ్యకత-ప్రతిపాదనలు-సానుకూల, ప్రతికూలాంశాలపై చర్చించారు. పోలవరం గరిష్ఠ ఎత్తు 45.72 మీటర్లపై సీఎం చంద్రబాబు విస్పష్ట ప్రకటన చేయాలని సభ డిమాండ్ చేసింది. జలాశయ గర్భంలో 32-35 మీటర్ల వద్ద నుంచి నీటిని తోడేందుకు గతంలో జగన్ ప్రభుత్వం ఎత్తిపోతల పథకాన్ని తలపెట్టిందని, దానిని తక్షణమే రద్దు చేయాలని స్పష్టం చేసింది. రాయలసీమ, ఉత్తరాంధ్రలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల పూర్తికి ప్రాధాన్యమివ్వాలని కోరింది. పోలవరం-బనకచర్ల పథకంపై చర్చించి గోదావరి వరద జలాలను సద్వినియోగం చేసుకోవడానికి, బచావత్ ట్రిబ్యునల్ ద్వారా సంక్రమించిన కృష్ణా జలాలను పరిరక్షించుకోవడానికి.. రాయలసీమకు కృష్ణా జలాల తరలింపు ద్వారా శాశ్వత కరువు నివారణ చర్యలు చేపట్టడంపై సీఎం అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు.

మావోయిస్టుల హత్య.. ఫాసిస్టు చర్య

» ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపేయాలి: న్యూడెమొక్రసీ రాష్ట్ర కార్యదర్శి దివాకర్

శ్రీకాకుళం, మే 21(ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు, మరో పాతిక మందికిపైగా మావోయిస్టుల హత్యను ఫాసిస్టు చర్యగా సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ ఏపీ రాష్ట్ర కమిటీ పేర్కొంది. ఈమేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి దివాకర్ బుధవారం ఒక ప్రకటన జారీ చేశారు. 'ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నారాయణపూర్ జిల్లా అబూజ్‌మడ్‌లో కేంద్ర సాయుధ బలగాల కాల్పుల్లో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజుతో పాటు 25 మందికిపైగా మృతి చెందినట్లు తెలిసింది. పహల్గామ్ 'ఉగ్రవాద' నేరస్థులను శిక్షించలేని పాలకులు ఆదివాసీ, మావోయిస్టుల్ని హత్య చేసి గర్వంగా ప్రకటన ఇవ్వడం ఫాసిస్టు నీతికి నిదర్శనం. శాంతి చర్చలకు మావోయిస్టు పార్టీ కేంద్ర ప్రభుత్వాన్ని పదేపదే కోరుతున్న సమయంలో ఇలాంటి చర్యకు ఒడిగట్టడం దారుణం. ఆదివాసీలను ఖాళీ చేయించి అటవీ సంపదను బడా కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టడానికే ఆపరేషన్ కగార్ చేపట్టింది. ఆపరేషన్ కగార్‌ను ఆపాలి. ప్రభుత్వం చేస్తున్న ఈ హత్యలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ చేయాలి' అని డిమాండ్ చేశారు. బూటకపు ఎన్‌కౌంటర్‌లో మరణించిన నంబాల కేశవరావు, మిగతా మావోయిస్టు పార్టీ సభ్యులకు విప్లవ జోహార్లు తెలిపారు.

నిధి భవన్‌లో మంటలు



మంగళగిరి ఆటోనగర్‌లో ఉన్న నిధి భవన్‌లో చోటు చేసుకున్న అగ్నిప్రమాదంలో దగ్ధమైన చాంబర్

» ఆర్థిక శాఖ ప్రధాన కార్యాలయం రెండో అంతస్తులో అగ్నిప్రమాదం

» ఆ సమయంలో విధుల్లో 300 మంది

» 'మదనపల్లె'ను తలపిస్తున్న ప్రమాదం?

» నష్టం పరిమితమే: మంత్రి పయ్యావుల



నిధి భవన్ నుంచి వెలువడుతున్న దట్టమైన పొగలు

మంగళగిరి, మే 21(ఆంధ్రజ్యోతి): ఆర్థిక శాఖ ప్రధాన కార్యాలయం నిధి భవన్‌లో బుధవారం ఉదయం అగ్నిప్రమాదం సంభవించింది. ఉద్యోగులు విధులకు హాజరైన కొద్దిసేపటికే రెండో అంతస్తులో మంటలు వ్యాపించి దట్టమైన పొగలు అలముకున్నాయి. దీంతో అప్రమత్తమైన ఉద్యోగులు భయంతో కేకలు వేస్తూ కిందకు పరుగులు తీశారు. ప్రమాదం జరిగిన సందర్భంలో దాదాపు 300 మంది ఉద్యోగులు విధుల్లో ఉన్నారు. వెంటనే మంగళగిరి అగ్నిమాపక శాఖ కార్యాలయానికి సమాచారం అందించడంతో సిబ్బంది నిధి భవన్‌కు చేరుకున్నారు. దట్టమైన పొగలు కమ్ముకోవడంతో ప్రమాదం ఎక్కడ మొదలైందో తెలుసుకోవడంలో కాస్తంత ఆలస్యమైంది. చివరకు ఎట్టకేలకు మంటలను అదుపు చేశారు. విద్యుత్ సరఫరాను నిలిచివేసి ఉద్యోగులను ఇళ్లకు పంపించివేశారు. పే అండ్ అకౌంట్స్ యాంటీ రూమ్‌లోని ఫ్రిజ్ లేక ఏసీ నుంచి మంటలు చెలరేగినట్టు ప్రాథమికంగా గుర్తించారు. నిధి భవన్‌లో ఫైర్ సేఫ్టీ లేకపోవడంవల్లనే ఈ పరిస్థితి తలెత్తిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. కార్యాలయంలోని కంప్యూటర్లు, ముఖ్యమైన ఫైళ్లు, ఉద్యోగుల జీతభత్యాల బిల్లులు, వివిధ శాఖలకు సంబంధించిన బిల్లుల ఫైళ్లు కాలిపోయి ఉండవచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏ మేరకు నష్టం వాటిల్లిందనేది ఇంకా స్పష్టత రాలేదు. ఆర్థికశాఖలో కీలకమైన ఖజానా, వర్క్ అకౌంట్స్, పే అండ్ అకౌంట్స్, స్టేట్ ఆడిట్, ఏపీసీఎఫ్ఎస్ఎస్, ఏపీజీఎల్ఐ విభాగాలు ఉన్న నిధి భవన్‌లో అగ్నిప్రమాదం చోటుచేసుకోవడం కలకలం రేపింది. కాగా, నిధి భవన్‌ను ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ పరిశీలించారు. అగ్నిప్రమాదానికి గల కారణాలను నిధి భవన్, అగ్నిమాపక శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. "అగ్నిప్రమాదం జరిగిన వెంటనే ఉద్యోగులు కిందకు వచ్చేశారు. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించడంతో నష్టం పరిమితంగానే ఉంది. ఇప్పటికే క్లూస్, ఫోరెన్సిక్ నిపుణులు ఆధారాలను సేకరించారు." అని మంత్రి తెలిపారు.

అనుమానాలెన్నో...

అగ్నిప్రమాదం జరిగిన తీరుపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. యాదృచ్ఛికమా, లేక ఎవరైనా ఉద్దేశపూర్వకంగా ఈ ఘటనకు పాల్పడ్డారా అన్న సందేహాలు కలుగుతున్నాయి. మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రమాదాన్ని తలపించేలా ఈ ఘటన ఉంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఆర్థిక శాఖలో అనేక అవకతవకలు జరిగినట్టు ఆరోపణలున్నాయి. త్వరలో వాటికి సంబంధించిన ఆడిట్ జరగనుంది. అవి బయట పడకుండా ఉండేందుకే ఈ అగ్నిప్రమాదాన్ని సృష్టించారా అనే అనుమానాలను పలువురు వ్యక్తం చేస్తున్నారు.

టీచర్ల బదిలీలు మొదలు

మొదలైన దరఖాస్తుల స్వీకరణ

» షెడ్యూల్ విడుదల.. వెంటనే ప్రక్రియ

» ఏకకాలంలో ట్రాన్స్‌ఫర్లు, ప్రమోషన్లు

అమరావతి, మే 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది. బదిలీలకు సంబంధించిన షెడ్యూల్‌ను విడుదల చేసిన పాఠశాల విద్యాశాఖ ఆ వెంటనే దరఖాస్తుల ప్రక్రియను కూడా ప్రారంభించింది. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి. విజయరామ రాజు బుధవారం షెడ్యూలు ఉత్తర్వులు జారీ చేశారు. కొద్దిసేపటికే బదిలీలకు సంబంధించిన దరఖాస్తుల ప్రక్రియను చేపట్టారు. జూన్ 11తో మొత్తం బదిలీల ప్రక్రియ పూర్తికానుంది. ప్రభుత్వ, జిల్లా, మండల పరిషత్, మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లకు ఈ బదిలీల ఉత్తర్వులు వర్తిస్తాయి. ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు(ఎస్ఏ), సెకండరీ గ్రేడ్ టీచర్ల(ఎస్జీటీ)కు వేర్వేరుగా షెడ్యూలు రూపొందించారు. కాగా, ఎస్జీటీల బదిలీలు కూడా ఆన్‌లైన్ విధానంలోనే జరుగుతాయని తాజా ఉత్తర్వుల్లో పేర్కొన్నా, దీనిపై కొంత సందిగ్ధత నెలకొంది. మాన్యువల్ విధానంలో ఎస్జీటీల బదిలీలు చేపడతామని ఉపాధ్యాయ సంఘాల చర్చల్లో అధికారులు హామీ ఇచ్చారు. దీంతో ఎస్జీటీల బదిలీల విధానాన్ని మార్చే అవకాశం ఉంది. ఉపాధ్యాయుల బదిలీలతో పాటు పదోన్నతుల ప్రక్రియను కూడా ఏకకాలంలో చేపడుతున్నారు. దీనికి సంబంధించిన షెడ్యూలు కూడా విడుదల చేశారు. బదిలీలకు మే 31 కటాఫ్ తేదీగా పేర్కొన్నారు. బదిలీల ప్రక్రియ ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికనే జరుగుతుంది. జిల్లా కలెక్టరు, జిల్లా పరిషత్ చైర్మన్ల ఆధ్వర్యంలో అధికారులతో ఏర్పాటయ్యే కమిటీల నేతృత్వంలో బదిలీల ప్రక్రియ జరుగుతుంది.

హేతుబద్ధీకరణ పాయింట్లు ఇలా..

కేటగిరీ-1 ప్రాంతంలో ఉన్నవారికి ఏడాదికి ఒకటి, కేటగిరీ-2లో ఉంటే ఏడాదికి 2, కేటగిరీ-3లో ఉంటే ఏడాదికి 3, కేటగిరీ-4లో ఉంటే 5 చొప్పున హేతుబద్ధీకరణ పాయింట్లు కేటాయిస్తారు. ఐటీడీఏల్లో పనిచేస్తున్న టీచర్లకు ఏడాదికి ఒక పాయింట్ అదనంగా వస్తుంది. అయితే, ప్రస్తుత పాఠశాలలో ఎనిమిదేళ్లకు మించి పనిచేస్తున్నా గరిష్ఠంగా 8 పాయింట్లే ఇస్తారు. అలాగే ప్రత్యేక కేటగిరీల వారికి విడిగా పాయింట్లు ఉంటాయి. అనధికారికంగా విధులకు గైర్హాజరైన వారికి నెలకు ఒక పాయింట్ చొప్పున గరిష్ఠంగా 10 మైనస్ పాయింట్లు ఇస్తారు.

బదిలీలు, పదోన్నతుల షెడ్యూలు	హెచ్ఎం	స్కూల్ అసిస్టెంట్	ఎస్జీటీ
బదిలీలకు దరఖాస్తులు	మే 21 - 22	మే 21- 24	మే 21- 27
దరఖాస్తుల పరిశీలన	మే 21 - 22	మే 21- 25	మే 21-28
ప్రొవిజనల్ సీనియారిటీ జాబితా	మే 24	మే 26- 27	మే 31
ప్రొవిజనల్ జాబితాపై అభ్యంతరాలు	మే 25	మే 28	మే 28- జూన్ 1
అభ్యంతరాలకు పరిష్కారం	మే 26	మే 28- 29	మే 28- జూన్ 2
తుది సీనియారిటీ జాబితా విడుదల	మే 27	మే 31	జూన్ 6
వెబ్ ఆప్షన్లు పెట్టుకునే గడువు	మే 28	జూన్ 1- 2	జూన్ 7- 10
బదిలీల ఆర్డర్లు విడుదల	మే 30	జూన్ 4	జూన్ 11
ప్రమోషన్ కౌన్సెలింగ్	మే 30 (ఎస్ఏ నుంచి)	జూన్ 5 (ఎస్జీటీ నుంచి)	-
పదోన్నతుల జాబితా విడుదల	మే 31	జూన్ 6	-


జీవోలో మార్పులు చేయాలి

ఉపాధ్యాయ బదిలీల జీవోలో కొన్ని అసంబద్ధ అంశాలున్నాయని, వాటిని మార్చాలని ఏపీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి. హృదయరాజు, ఎస్. చిరంజీవి కోరారు. ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ చేపట్టాలని, పోస్టుల బ్లాకింగ్ తొలగించాలని పేర్కొన్నారు. రెండుసార్లు రేషనలైజేషన్‌కు గురైన వారికి పాత స్టేషన్ పాయింట్లు కల్పించే ఆప్షన్ ఇచ్చేలా మార్పులు చేయాలని కోరారు. ఈ అంశాలపై ఇటీవల ఉపాధ్యాయ సంఘాలతో నిర్వహించిన చర్చల్లో అధికారులు హామీ ఇచ్చారని బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.



బెంగళూరు ఎయిర్‌పోర్ట్‌ను సందర్శించిన బాబు

బెంగళూరులోని కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో కొత్తగా అభివృద్ధి చేసిన టెర్మినల్-2ను ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం సందర్శించారు. విమానాశ్రయ సీఈవో హరి మారర్‌తో కలిసి టెర్మినల్-2లో సౌకర్యాలపై దేశీయ, అంతర్జాతీయ ప్రయాణికులతో, అధికారులతో మాట్లాడి తెలుసుకున్నారు. ఈ విశేషాలను ఆయన 'ఎక్స్'లో పంచుకున్నారు. 'టెర్మినల్-2ను సహజ వాతావరణం మధ్య అత్యాధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేశారు. ఇది చాలా ఆకర్షణీయంగా ఉంది. విమానాశ్రయంలో సహజ ఉద్యానవనాన్ని భాగంగా చేయడం ఆకట్టుకుంటోంది. విమానాశ్రయాన్ని మల్టీ మోడల్ ట్రాన్సిట్ హబ్‌గా తీర్చిదిద్దడం అద్భుతం' అని చంద్రబాబు ఎక్స్‌లో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రపంచ స్థాయి విమానాశ్రయాలను అభివృద్ధి చేయాలన్న తన ఆలోచనకు ఈ సందర్శన ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.



యోగాంధ్ర వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు, సత్యకుమార్, కృష్ణబాబు

రికార్డు సృష్టించేలా యోగా డే

జూన్ 21న విశాఖ ఆర్కే బీచ్‌లో 5 లక్షల మందితో భారీ కార్యక్రమం.. హాజరు కానున్న ప్రధాని మోదీ

- రాష్ట్రవ్యాప్తంగా 2 కోట్ల మంది పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నాం
- ఈ నెల రోజులూ 'యోగాంధ్ర-2025'
- పాఠశాలల్లో ప్రతిరోజూ గంట శిక్షణ: సీఎం

అమరావతి, మే 21(ఆంధ్రజ్యోతి): ప్రపంచానికి భారతదేశం అందిస్తున్న గొప్ప వరం యోగా అని, ప్రతి ఒక్కరి జీవితంలో ఇది భాగం కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. యోగాకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన ఘనత ప్రధాని మోదీకి దక్కుతుందన్నారు. జూన్ 21న విశాఖపట్నంలో నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ప్రధాని హాజరవుతారని తెలిపారు. రికార్డు సృష్టించేలా యోగా డే నిర్వహిస్తామన్నారు. బుధవారం ఉండవల్లిలోని తన నివాసంలో సీఎం విలేకరులతో మాట్లాడారు. 'మే 21 నుంచి జూన్ 21 వరకు నెల రోజుల పాటు యోగాంధ్ర-2025 పేరుతో రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించాం. యోగా మన దేశానికి వారసత్వంగా వస్తోంది. భారతీయ జీవన విధానంలో



విజయవాడలోని కృష్ణానదీ తీరంలో బుధవారం యోగాసనాలు చేస్తున్న ప్రజలు

ఇది ఒక భాగం. మోదీ కృషి వల్ల 2014 డిసెంబరులో ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశంలో ప్రపంచమంతా యోగా దినోత్సవం జరపాలని తీర్మానించారు. యోగా ఒక ప్రాంతానికో, ఒక మతానికో సంబంధించినది కాదు. ప్రపంచంలోని అన్ని దేశాల్లో జరుపుకొనే కార్యక్రమం. పోటీ ప్రపంచంలో ఒత్తిడి అనివార్యంగా మారుతోంది. ఒత్తిడికి యోగా ఒక్కటే మందు. ప్రపంచ రికార్డు సృష్టించేలా నేటి నుంచి యోగాంధ్ర-2025 పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తాం. జూన్ 21న విశాఖ ఆర్కే బీచ్ నుంచి భోగాపురం వరకు 5 లక్షల మందితో ఉదయం 7-8 గంటలు కార్యక్రమం నిర్వహిస్తాం. అదే సమయంలో రాష్ట్రవ్యాప్తంగా 2 కోట్ల మందికి తగ్గకుండా యోగా కార్యక్రమంలో పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నాం. 10 లక్షల మందితో యోగా కోర్సులు చేయించి, వారికి సర్టిఫికెట్లు కూడా అందజేయాలని నిర్ణయించాం. అంతర్జాతీయ యోగా డే కార్యక్రమాల పర్యవేక్షణకు మంత్రి లోకేశ్ నేతృత్వంలో మంత్రుల బృందాన్ని ఏర్పాటు చేశాం' అని చంద్రబాబు తెలిపారు.

విస్తృతంగా అవగాహన: 'రాష్ట్రంలో రూ.5 కోట్ల కంటే ఎక్కువ ఆదాయం వచ్చే ఆలయాలు 21 ఉన్నాయి. అలాగే అమరావతి బుద్ధ స్తూపం, లేపాక్షి శిల్పారామం, గండికోట, అరకు, లంబసింగి, కోనసీమ, అఖండ గోదావరి ఇలా 100 వరకు పర్యాటక, ఆధ్యాత్మిక ప్రదేశాల్లో యోగా ప్రాముఖ్యతను వివరించే ఏర్పాట్లు చేశాం. పెయింటింగ్, వ్యాసరచన, ఇతరత్రా కార్యక్రమాల ద్వారా యోగాపై ప్రజల్లో అవగాహన కల్పిస్తాం. ఇంటింటి ప్రచారం చేయాలని నిర్ణయించాం' అని వరించారు. ఈ సందర్భంగా యోగాంధ్ర వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

యోగా డేకు పకడ్బందీ ఏర్పాట్లు!

- నోడల్ అధికారిగా ఎంటీ కృష్ణబాబు
- 23 మంది అధికారులకు బాధ్యతలు.. సీఎస్ ఉత్తర్వులు

అమరావతి, మే 21(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహణకు ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. విశాఖపట్నంలోని ఆర్కే బీచ్‌లో జరిగే ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ హాజరుకానున్న నేపథ్యంలో మరింత అట్టహాసంగా నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. ఏర్పాట్లను సీఎం ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. ఏర్పాట్ల నిర్వహణ, కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా 23 మంది అధికారులను నియమించింది. వారందరికీ వివిధ రకాల బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. యోగా డే నిర్వహణ బాధ్యతలు ఆరోగ్యశాఖ ప్రత్యేక సీఎస్ ఎంటీ కృష్ణబాబుకు అప్పగించారు. కార్యక్రమ బాధ్యతలు మొత్తం విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.హరేంధిరప్రసాద్‌కు అప్పగించారు. యోగా డే మినిట్ టూ మినిట్ కార్యక్రమాన్ని రూపొందించడం, జిల్లా అధికారులతో సమన్వయం, ప్రధాన మంత్రి కార్యాలయంతో సమన్వయం బాధ్యతలను జీఏడీ పొలిటికల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనాకు అప్పగించారు. 23 మంది అధికారులు విశాఖ జిల్లా కలెక్టర్‌తో పాటు నోడల్ అధికారితో సమన్వయం చేసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

షర్మిల దీక్ష భగ్నం

- తొలగించిన ఉక్కు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలంటూ విశాఖలో ఆమరణ దీక్ష
- రాత్రి భగ్నం చేసి తరలించిన పోలీసులు



ఆమరణ నిరాహార దీక్షలో పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

కూర్మన్నపాలెం (విశాఖపట్నం), మే 21(ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంటు పరిరక్షణ కోసం ప్రాణత్యాగానికైనా సిద్ధమని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రకటించారు. కర్మాగారంలో తొలగించిన కాంట్రాక్టు కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉక్కు కార్మికుల ఆందోళనకు మద్దతుగా బుధవారం కూర్మన్నపాలెంలో షర్మిల ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్టీలుప్లాంటులో తొలగించిన రెండు వేల మంది కాంట్రాక్టు కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలన్నారు. కాంగ్రెస్ హయాంలో లాభాల్లో ఉన్న స్టీలుప్లాంటు బీజేపీ అధికారంలోకి రాగానే నష్టాల్లోకి ఎలా వెళ్లిందో చెప్పాలన్నారు. బీజేపీ ప్రభుత్వం ఉక్కు కర్మాగారానికి ముడి సరకు అందకుండా చేసిందన్నారు. రూ.పదకొండు వేల కోట్లు ఇచ్చి స్టీలుప్లాంటును ఆదుకున్నామని చెప్పడం పచ్చి అబద్ధమన్నారు. అందులో ఎనిమిది వేల కోట్లు బ్యాంకు రుణాల కింద తీసుకున్నారని, మిగిలిన మూడు వేల కోట్లు ఇవ్వాలంటే.. ఐదు వేల మంది కార్మికులను తొలగించాలని నిబంధన పెట్టారని, ఇప్పటికే రెండు వేల మందిని తొలగించారని, మరో మూడు వేల మందికి తొలగించడానికి సిద్ధపడుతున్నారన్నారు. స్టీల్‌ప్లాంటును నిర్వీర్యం చేసి అదానీకి ఇద్దామని ప్రధాని మోదీ చూస్తున్నా, కూటమి ప్రభుత్వం చోద్యం చూస్తోందని షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులను తొలగిస్తుంటే చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఎందుకు అడ్డుకోవడం లేదని ప్రశ్నించారు. విశాఖ ఉక్కును అమ్మేస్తుంటే ఏం చేస్తున్నారంటూ ప్రశ్నించారు. తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకునేంత వరకూ ఇక్కడి నుంచి కదిలేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు సీహెచ్ నరసింగరావు, మంత్రి రాజశేఖర్, డి.ఆదినారాయణ, గంగారావు, జెర్రిపోతుల ముత్యాలు, నీరుకొండ రామచంద్రరావు, లక్కరాజు రామారావు, కేఎస్ఎన్ రావు తదితరులు పాల్గొన్నారు.

షర్మిలను విమానాశ్రయానికి తరలించిన పోలీసులు

షర్మిల ఆమరణ నిరాహార దీక్షను పోలీసులు భగ్నం చేశారు. బుధవారం రాత్రి తొమ్మిది గంటలకు షర్మిలను శిబిరం నుంచి తరలించేందుకు పోలీసులు ప్రయత్నించగా కార్మికులు, కాంగ్రెస్ కార్యకర్తలు ప్రతిఘటించారు. అయినప్పటికీ పోలీసులు ఆమెను బలవంతంగా శిబిరం నుంచి బయటకు తీసుకువచ్చి, విమానాశ్రయానికి తరలించారు.

నీతి ఆయోగ్ ఎజెండాలో పోలవరం!

- నేడు ఢిల్లీకి చంద్రబాబు

న్యూఢిల్లీ, మే 21(ఆంధ్రజ్యోతి): నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొనడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం ఢిల్లీకి రానున్నారు. ఏపీ విధాన రోడ్ మ్యాప్‌ను ఆ భేటీలో సమర్పిస్తారు. శుక్రవారం కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ సహా ఏడుగురు కేంద్ర మంత్రులతో వరుస భేటీలు నిర్వహిస్తారు. గవర్నింగ్ కౌన్సిల్ భేటీలోనే పోలవరం ప్రాజెక్టుపై నెలకొన్న అంతర్రాష్ట్ర వివాదాలపై చర్చించనున్నారు. ప్రధాని స్వయంగా ఈ అంశంపై దృష్టి సారించారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

కార్యకర్తల బాధ్యత నాది

- ఇంటికి పెద్దకొడుకులా అండగా ఉంటా: లోకేశ్.. బాలకోటిరెడ్డి కుటుంబ సభ్యులకు భరోసా

అమరావతి, మే 21(ఆంధ్రజ్యోతి): 'తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలం. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తల బాధ్యత నేను తీసుకుంటా. ఇంటికి పెద్ద కొడుకులా అండగా ఉంటా' అని రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చారు. వైసీపీ గూండాల చేతిలో హత్యకు గురైన పల్నాడు జిల్లా రొంపిచర్ల మండల టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ వెన్నా బాలకోటిరెడ్డి కుటుంబ సభ్యులను బుధవారం ఉండవల్లిలోని తన నివాసానికి పిలిపించుకుని మాట్లాడారు. లోకేశ్‌ను కలిసిన వారిలో బాలకోటిరెడ్డి భార్య నాగేంద్రమ్మ, సోదరుని కుమారులు నరసింహారెడ్డి, రామకృష్ణారెడ్డి ఉన్నారు. బాలకోటిరెడ్డిని హత్య చేసిన నిందితులు స్వేచ్ఛగా తిరుగుతున్నారని, వారిని కఠినంగా శిక్షించాలని వారు లోకేశ్‌ను కోరారు. తాము ఆర్థికంగా చాలా నష్టపోయామని, ఉపాధి హామీ, గృహ నిర్మాణం బిల్లులు పెండింగ్‌లో ఉండటంతోపాటు తమ ఇల్లు కూడా తాకట్టులో ఉందని తెలిపారు. లోకేశ్ మాట్లాడుతూ బాలకోటిరెడ్డి కుటుంబానికి జీవితాంతం అండగా ఉంటానని, పెండింగ్ బిల్లులు చెల్లించి, తాకట్టు నుంచి ఇంటిని విడిపిస్తానని హామీ ఇచ్చారు. నిందితులకు శిక్షపడేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.



వైసీపీ నేతల చేతిలో హత్యకు గురైన పల్నాడు జిల్లా రొంపిచర్ల మండల టీడీపీ అధ్యక్షుడు బాలకోటిరెడ్డి కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న మంత్రి లోకేశ్

సజ్జల కబ్జాకు చెక్



(మొదటి పేజీ తరువాయి)

కలెక్టర్ ఇదివరకే విచారణ జరిపి నివేదిక పంపారు. సజ్జల కుటుంబ సభ్యులు అటవీశాఖ, ఇరిగేషన్, పేదల భూములు కబ్జా చేసినట్టు గుర్తించారు. దీంతో చర్యలకు ఉపక్రమించారు. సర్వే నంబర్ 1629లో ఆక్రమణలో ఉన్న 52.42 ఎకరాలను స్వాధీనం చేసుకోవాలని జిల్లా ఫారెస్టు అధికారిని కడప జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ఆదేశించారు. అలాగే సర్వే నం. 1626/1, 2, 27లో అన్యాక్రాంతానికి గురైన భూములు స్వాధీనం చేసుకోవాలని జీఎన్ఎస్ఎస్ సూపరింటెండెంట్‌కు, అనుమతి లేకుండా గెస్ట్‌హౌస్‌లు, ఇతర నిర్మాణాలు చేపట్టినందుకు వాటిపై చర్యలు తీసుకోవాలంటూ సీకేదిన్నె పంచాయతీ కార్యాలయానికి వేర్వేరుగా ఆదేశాలు జారీ చేశారు. దీంతో అధికారులు సజ్జల ఎస్టేట్‌లోని ఆక్రమిత భూములను స్వాధీనం చేసుకున్నారు.

ఏం జరిగిందంటే...: కడప నగరాన్ని ఆనుకుని ఉన్న సీకేదిన్నె మండల పరిధిలో సజ్జల రామకృష్ణారెడ్డి కుటుంబానికి ఎస్టేట్ ఉంది. ఇక్కడ ఆయన సోదరుడు సజ్జల జనార్దనరెడ్డి, అన్న కొడుకు సందీప్‌రెడ్డి, సజ్జల దివాకర్‌రెడ్డి, ఇతర కుటుంబ సభ్యుల పేరిట 137.45 ఎకరాల భూమి ఉంది. సజ్జల సందీప్‌రెడ్డికి 71.49 ఎకరాలు, సజ్జల జనార్దనరెడ్డికి 16.80 ఎకరాలు, సజ్జల పార్వతికి 0.42 ఎకరాలు, నర్రెడ్డి భాగవతి పేరిట 19.82 ఎకరాలు, ఎదుగూరి సత్య పేరిట 21.40 ఎకరాలు, మరొకరి పేరిట 7.50 ఎకరాలు, ఇంకొకరి పేరిట 0.71 ఎకరాలు.. మొత్తం 137.40 ఎకరాలు ఉంది. ఇదంతా పట్టాభూమి. ఇవన్నీ సర్వే నం. 1559 నుంచి 1627, 1629 వరకు పలు నంబర్లతో ఉన్నాయి. సజ్జల కుటుంబ సభ్యులు ఇవే సర్వే నంబర్లలో అటవీశాఖ భూములతో పాటు ఎస్టీలకు కేటాయించిన భూములను, చెరువు కుంటల భూములు ఆక్రమించేశారు. సర్వే నం.1629లో అటవీ శాఖకు 11,129.33 ఎకరాల భూమి ఉంది. ఇందులో సజ్జల కుటుంబం 52.40 ఎకరాలు ఆక్రమించింది. సొంత భూములలో ఆక్రమించిన భూములు కలిపేసుకుని మొత్తం 201.17 ఎకరాలకు కంచె వేసుకుంది. ఆక్రమిత భూముల్లో అరటి, బొప్పాయి. జామ, ఇతర పంటలు సాగు చేశారు. గెస్ట్ హౌస్‌లు, అదనపు గదులునిర్మించారు. ఈ విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' ఈ ఏడాది జనవరి 2న 'రిజర్వు ఫారెస్టులో సజ్జల సామ్రాజ్యం' అనే కథనం ప్రచురించింది. దీనిపై ప్రభుత్వం స్పందించి సమగ్ర విచారణకు ఆదేశించింది. కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ఈ వ్యవహారాన్ని చాలా సీరియస్‌గా తీసుకుని ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటుచేసి సర్వే చేయించారు.

అణువణువూ సర్వే..: సజ్జల కుటుంబ సభ్యులు ఉద్దేశపూర్వకంగా అటవీ భూములను ఆక్రమించి పర్యావరణానికి, జీవవైవిధ్యానికి తీవ్ర నష్టం కలిగించారని విచారణలో తేలింది. వన్యప్రాణుల ఆవాసాలను ధ్వంసం చేసి వాటి ఉనికికే ముప్పు తెచ్చారు. 52.40 ఎకరాల అటవీ భూమిని, ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన భూములు, వాగులు, వంకలు ఆక్రమించేశారని కమిటీ నిగ్గుతేల్చింది. ఈ వ్యవహారంపై సజ్జల కుటుంబీకులు హైకోర్టును ఆశ్రయించి తప్పుడు సమాచారం ఇచ్చారు. కలెక్టర్ శ్రీధర్ పకడ్బందీగా, లోతుగా విచారించారు. ఐదు, ఆరుసార్లు జేసీ అదితిసింగ్, కడప ఆర్డీవో, అటవీశాఖాధికారులతో కలిసి సజ్జల ఎస్టేట్‌కు వెళ్లి అణువణువునా సర్వే చేయించారు. అయితే అటవీశాఖాధికారులు ఈ భూములు తమవి కావని తప్పించుకునే ప్రయత్నం చేశారు. 1919 అటవీశాఖ గెజిట్‌తో పాటు రికార్డుల ప్రకారం సరిహద్దులు, రెవెన్యూ శాఖ వద్ద ఉన్న పురాతన డేటాను నిపుణులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి క్షుణ్నంగా శోధించారు. చివరికి సజ్జల ఫ్యామిలీ 63.72 ఎకరాలను కబ్జా చేసినట్లు గుర్తించారు.

ఎస్టీల భూములూ కబ్జా: ఎస్టీల కోసం 1993 నవంబరు 21న అప్పటి ప్రభుత్వం బుక్కే దేవి పేరిట 1.34 ఎకరాలు, బుక్కే లక్ష్మికి 1.30 ఎకరాలు, పాలగిరి కంభక్క పేరిట ఎకరా, పాలగిరి కమాల్‌బీ పేరిట 1.50 ఎకరాలు.. మొత్తం 5.14 ఎకరాలు ఇచ్చింది. ఈ భూమినంతా సజ్జల కుటుంబీకులు తమ ఎస్టేట్‌లో కలిపేసుకున్నారు.

స్వాధీనం చేసుకున్న భూములివే..

- కడప జిల్లా సీకేదిన్నె మండలంలో సర్వే నంబర్ 1629లో 52.40 ఎకరాల అటవీభూమి
- సర్వే నంబర్ 1627లో గాలేరు-నగరి ప్రాజెక్టు పాయవంక కోసం కేటాయించిన 1.05 ఎకరాలు
- సర్వే నంబర్ 1626/1లో పాయవంక కోసం కేటాయించిన 5.16 ఎకరాలు
- సర్వే నంబర్ 1626/2లో 1.84 ఎకరాలు
- సర్వే నంబర్ 1606/3లో 0.82 సెంట్లు అసైన్డ్‌వేస్ట్ ల్యాండ్
- సర్వే నంబర్ 1612లో 1.25 ఎకరాలు
- సర్వే నంబర్ 1614/2లో 1.20 ఎకరాల అసైన్డ్‌భూమి

'కిక్కు'రుమనలేరు!

(మొదటి పేజీ తరువాయి)

అదే కార్యాలయంలో సీజ్ చేసిన కంప్యూటర్లు, మద్యం డిపోల్లో సేకరించిన డిజిటల్ ఆధారాలతో మొదలుకుని.. ఇటీవల హైదరాబాద్‌లో ఏ1 రాజ్ కసిరెడ్డి ఇళ్లు, కార్యాలయాల్లో స్వాధీనం చేసుకున్న కంప్యూటర్లు, హార్డ్‌డిస్క్‌లు, నిందితుల సెల్‌ఫోన్లు... ఇలా కీలక ఆధారాలన్నింటినీ సిట్ అధికారులు ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌కు పంపించారు. ఉన్నతస్థాయి సాంకేతిక పరిజ్ఞానంతో వాటిని విశ్లేషించి.. నిర్ధారణ నివేదిక తెప్పించుకున్నారు. దానితోపాటు సీజ్ చేసిన పరికరాలను కోర్టుకు సమర్పించబోతున్నారు.

ఎలా చేశారంటే..

మద్యం కుంభకోణంలో ప్రధాన భూమిక పోషించింది బ్రాండ్ల ఆర్డర్లు! వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు... సేల్స్ డిమాండ్‌కు అనుగుణంగా కంప్యూటరే ఆర్డర్లు ఆటోమేటిక్‌గా పెట్టే సాఫ్ట్‌వేర్ ఉండేది. ఈ విధానాన్ని ఆర్డర్ ఫర్ సప్లై(ఓఎఫ్ఎస్) అంటారు. ఇందులో... మానవ ప్రమేయమేదీ ఉండదు. దీనినే కొనసాగిస్తే కమీషన్లు దక్కే అవకాశముండదని గత పాలకులు గ్రహించారు. ఆటోమేటిక్ విధానాన్ని ఆపేసి కొత్తగా మెయిల్ ద్వారా ఆర్డర్లు పెట్టాలని ఆదేశాలు జారీ చేశారు. లిక్కర్ షాపు నుంచి మెయిల్ వస్తే... డిపో మేనేజర్లు సరుకు పంపించాలన్న మాట! కానీ... ఇందులోనే భారీ మతలబు చేశారు. లిక్కర్ షాపుల మెయిల్స్ అన్నీ మేనేజర్ల కంప్యూటర్ల నుంచే ఆపరేట్ అయ్యేవని 'సిట్' అధికారులు గుర్తించారు. సీజ్ చేసిన కంప్యూటర్లను ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌కు పంపి పరీక్షించినప్పుడు ఈ విషయం పక్కాగా నిర్ధారణ అయ్యింది. మేనేజర్ల కంప్యూటర్లలో వారి పరిధిలోని షాపుల మెయిల్ ఐడీలు నిర్వహించిన స్ట్రోక్స్ స్పష్టంగా కనపడ్డాయని ఎఫ్ఎస్ఎల్ నివేదిక ఇచ్చింది.

ఆ తర్వాత ఏమైందంటే..

లెక్క ప్రకారం... డిపో మేనేజర్లు డిస్టిలరీలకు ఆర్డర్లు ఇవ్వాలి. కానీ... అది కూడా చేయలేదు. ఏ1 రాజ్ కసిరెడ్డి నుంచి ఏ3 సత్యప్రసాద్‌కు వచ్చే సూచన మేరకే ఆర్డర్లు ఇచ్చేవారు. ప్రతి శుక్రవారం సాయంత్రం అనూష అనే ఉద్యోగి రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ మద్యం షాపుల్లో అమ్ముడైన లిక్కర్ బ్రాండ్ల వివరాలను రాజ్ కసిరెడ్డి మొబైల్ వాట్సా‌ప్‌కు పంపేవారు. ఆ వివరాల ఆధారంగా కసిరెడ్డి దగ్గర పనిచేసిన ముప్పిడి అవినాశ్‌రెడ్డి, బూనేటి చాణక్య తదితరులతో కూడిన బృందం వ్యాపారులకు ఫోన్లు చేసి కమీషన్లు సిద్ధం చేయాలని ఆదేశించేవారు. శనివారం ఏపీఎస్‌బీసీఎల్ నుంచి బిల్లు మొత్తం మద్యంవ్యాపారుల ఖాతాల్లో పడగానే... కమీషన్‌ను రాజ్ కసిరెడ్డి మనుషులు సూచించిన ప్రాంతంలో వారికి అందజేసేవారు.

సైబర్ ఫోరెన్సిక్ ఏమి తేల్చింది..

డిపో మేనేజర్లకు సత్య ప్రసాద్ పంపించిన లిక్కర్ బ్రాండ్ల ఆర్డర్ డేటా వివరాలన్నీ సైబర్ ఫోరెన్సిక్ వెలికి తీసింది. ఏ రోజు సత్యప్రసాద్ మొబైల్ నుంచి డిపో మేనేజర్లకు ఏ బ్రాండ్ల జాబితా వచ్చిందో పక్కా టెక్నాలజీతో తేల్చేసింది. ఆ బ్రాండ్ల వ్యాపారులకు అంతకు ముందు బిల్లులు ఏపీఎస్‌బీసీఎల్ నుంచి విడుదల య్యాయా? ఆ తర్వాత కసిరెడ్డి కలెక్షన్ గ్యాంగ్ సభ్యుల నంబర్లతో మద్యంవ్యాపారులకు ఏ సమయంలో ఫోన్లు వచ్చాయి.. వారెంతసేపు మాట్లాడుకున్నారు.. అంతా అయ్యాక కలెక్షన్ బృందం కసిరెడ్డితో మాట్లాడిన వివరాలన్నీ సమయాలతో సహా సైబర్ ఫోరెన్సిక్ పూర్తిస్థాయిలో తేల్చేసింది. అనూషతోపాటు కార్యాలయంలో ఆర్డర్లు చూసే పనిచేసే సేఫ్ మొబైళ్ల నుంచి నివేదిక తీసుకున్నఅధికారులు.. హైదరాబాద్‌లో కసిరెడ్డి కార్యాలయాలు, ఇంట్లో సీజ్ చేసినవాటినీ ఎఫ్ఎస్ఎల్‌కు పంపి సైబర్ ఫోరెన్సిక్ నివేదిక తెప్పించుకున్నారు.

మ్యాపింగ్ మంటలు!

(మొదట పేజీ తరువాయి)

విభజన, కుటుంబ సభ్యుల చేర్పులు, తొలగింపులు, చిరునామా మార్పులు, అనర్హుల కార్డులు సరెండర్ చేసేందుకు ఈ నెల 7 నుంచి రాష్ట్రవ్యాప్తంగా దరఖాస్తుల స్వీకరణకు ప్రభుత్వం అనుమతించింది. దీంతో గ్రామ, వార్డు సచివాలయాల వద్ద అర్జీదారులు క్యూ కడుతున్నారు. వీరిలో కొత్త కార్డుల కోసం వచ్చేవారి కంటే ఉన్న కార్డులో సభ్యులను చేర్చడం లేదా తొలగించడం కోసం వస్తున్న దరఖాస్తులే ఎక్కువగా ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తుల్లో ఇలాంటి చిన్నచిన్న సవరణల కోసం వచ్చిన దరఖాస్తులే 80శాతానికి పైగా ఉన్నాయి.

పిల్లల పేర్లు చేర్చడానికి తంటాలు

ఐదు, పదేళ్ల క్రితమే వివాహమైన దంపతులు ఇప్పుడు తమ రైస్ కార్డులో పిల్లలను చేర్పించడానికి హౌస్ హోల్డ్ మ్యాపింగ్ కారణంగా నానా తంటాలు పడాల్సి వస్తోంది. కుటుంబ సభ్యులందరూ ఒకేచోట నివసిస్తున్నట్లుగా మ్యాపింగ్ జరగకపోతే వారి దరఖాస్తులు ఆన్‌లైన్ కావడం లేదు. ఉద్యోగాల రీత్యా, ఇతరత్రా కారణాలతో కొందరు భార్యాభర్తలు వేర్వేరు ప్రాంతాల్లో నివసిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో నిర్వహించిన హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో భార్య, పిల్లలు ఒకచోట.. భర్త పేరు వేరే ప్రాంతంలో మ్యాపింగ్ అయ్యాయి. ఇప్పుడు వారు తమ పిల్లలను రైస్ కార్డులో చేర్చాలంటూ దరఖాస్తు చేసుకున్నారు. దాన్ని సచివాలయ సిబ్బంది ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే సమయంలో నివాసం దగ్గర ఎర్రర్ చూపిస్తోంది. భర్త పేరు లేకుండా భార్య, పిల్లలు విడిగా దరఖాస్తు చేసుకునే అవకాశం లేదు. హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో మార్పులు, చేర్పులు చేసే అవకాశం సచివాలయాల సిబ్బందికి లేకపోవడంతో ఈ సమస్య పరిష్కారం కావడం లేదు. ప్రస్తుతం మార్పులు చేర్పులకే ఎక్కువగా దరఖాస్తులు వచ్చాయి. కొత్త కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులు 59,959 కాగా, సభ్యుల చేరికల కోసం 4 లక్షలకు పైగా వచ్చాయి. ఈ సాంకేతిక సమస్యలను ఆధార్ కార్డును ప్రామాణికంగా తీసుకునైనా పరిష్కరించకపోతే ప్రభుత్వం నుంచి లబ్ధి పొందే అవకాశాన్ని కోల్పోతామని వారంతా ఆందోళ చెందుతున్నారు.

కార్డుదారులకు అసౌకర్యం ఉండొద్దు: నాదెండ్ల

వచ్చే నెల రేషన్ సరుకులను జూన్ 1 నుంచి చౌక ధరల దుకాణాల ద్వారా సక్రమంగా పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశించారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అత్యంత సున్నితమైనదైనందున కార్డుదారులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా సరుకులు పంపిణీ చేయాలని సూచించారు. బుధవారం అన్ని జిల్లాల జేసీలతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కొత్త రేషన్ కార్డులు, ఇతర సేవల కోసం దరఖాస్తులు దాఖలు చేసే ప్రక్రియలో ప్రజలు ఎదుర్కొంటున్న సాంకేతిక సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. అవసరమైతే దరఖాస్తు గడువు పొడిగించే ఆలోచన చేస్తామని పేర్కొన్నారు. మ్యారేజీ సర్టిఫికెట్ అవసరం లేకుండా సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేస్తామని, ఒకటి, రెండు రోజుల్లో అన్నీ పరిష్కారం అవుతాయని స్పష్టం చేశారు.

వివాహ ధ్రువీకరణ పత్రం చిక్కులు

- కొత్త రైసు కార్డు కావాల్సిన నవ దంపతులు తమ దరఖాస్తుకు మ్యారేజ్ సర్టిఫికెట్ జత చేయాలని ప్రభుత్వం తొలుత నిబంధన విధించింది. దీనిపై పెద్దఎత్తున నిరసనలు రావడంతో వ్యక్తంకావడంతో మ్యారేజ్ సర్టిఫికెట్ అవసరం లేదని పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. అయినా కూడా గ్రామ, వార్డు సచివాలయాల సాఫ్ట్‌వేర్‌లో ఆ మేరకు మార్పులు చేయకపోవడంతో దరఖాస్తులు ఆన్‌లైన్ కావడం లేదు.
- తల్లిదండ్రులతో కలసి ఉంటున్న ఇద్దరు కుమారులు వివాహాలు చేసుకుని వేరు కాపురాలు పెట్టినప్పటికీ.. వారిలో ఒక్కరికే కొత్త కార్డు మంజూరుకు అవకాశం ఇవ్వడంతో మరొక కుమారుడు కొత్త కార్డు పొందే అవకాశాన్ని కోల్పోవాల్సి వస్తోంది.
- ఇతర సేవల కోసం వస్తున్న దరఖాస్తుదారుల బయోమెట్రిక్ పడకపోయినా దరఖాస్తులు ఆన్‌లైన్ కావడం లేదు. ఒకవేళ అన్నీ సక్రమంగా సరిచేసుకుని దరఖాస్తులను అప్‌లోడ్ చేద్దామన్నా చాలాచోట్ల సర్వర్లు మొరాయిస్తుండటంతో దరఖాస్తులు ఆన్‌లైన్ కావడం లేదు.
- దరఖాస్తు స్వీకరణ సమయంలో ఆధార్ కార్డులో ఉన్న చిరునామానే పరిగణనలోకి తీసుకుంటున్నారు. వివాహమైన తర్వాత ఆధార్‌లో భార్య ఇంటి పేరు మారకున్నా, భార్యాభర్తల ఇంటి పేరు వేర్వేరుగా ఉన్నా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు తీసుకోవడం లేదని చెబుతున్నారు. దీంతో దరఖాస్తుదారులు ఆందోళన చెందుతూ సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొనడంతో ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందికి తాజాగా మార్గదర్శకాలు జారీ చేసింది.

సమస్య: భార్యాభర్తలు విడాకులు తీసుకుంటే వారి రైస్ కార్డు సెపరేట్ అవుతుందా?
పరిష్కారం: విడాకులు మంజూరు చేస్తూ కోర్టు ఇచ్చిన తీర్పు కాపీ ఉంటే స్ప్లిట్టింగ్ రేషన్ కార్డు సర్వీసులో 'సింగిల్ మెంబర్ విత్ డివోర్స్ స్ప్లిట్' అనే ఆప్షన్ సెలెక్ట్ చేసుకుని రైస్ కార్డును సెపరేట్ చేయవచ్చు.
సమస్య: ఒక రైస్‌కార్డులో పెళ్లి అయిన రెండు కుటుంబాలు ఉండి వారు ఒకే హౌస్‌హోల్డ్‌లో ఉంటే వారి కార్డును విభజన చేయవచ్చా?
పరిష్కారం: పెళ్లి అయ్యి రెండు కుటుంబాలు ఉంటే స్ప్లిట్టింగ్ రేషన్ కార్డు సర్వీసులో చేసుకోవచ్చు. ప్రస్తుతానికి హౌస్ హోల్డ్ నుంచి స్ప్లిట్టింగ్ ఆప్షన్ లేదు.
సమస్య: ఒకే రైస్‌కార్డులో తల్లి/ తండ్రి, కొడుకు, కోడలు, మనవలు ఉండి.. తల్లి/తండ్రి చనిపోతే ఆ కార్డులో నుంచి కొడుకు కుటుంబాన్ని స్ప్లిట్ చేసి తల్లి/తండ్రిని సింగిల్‌గా చేయవచ్చా? అలా చేయడానికి సెపరేట్‌గా హౌస్‌హోల్డ్ ఉండాలా?
పరిష్కారం: ఇలాంటి వాటికి ముందు హౌస్‌హోల్డ్ సర్వేలో స్ప్లిట్టింగ్ చేసిన తర్వాత రేషన్ కార్డు స్ప్లిట్టింగ్ చేయవచ్చు.
సమస్య: రైస్‌కార్డులో భార్యను చేర్చడానికి కచ్చితంగా మ్యారేజ్ సర్టిఫికెట్ ఉండాలా? ఆమె ఆధార్ కార్డులో భర్త పేరు ఉంటే సరిపోతుందా? లేక భర్త ఆధార్ ఆధారంగా రైస్‌కార్డులో చేర్చవచ్చా?
పరిష్కారం: మ్యారేజ్ సర్టిఫికెట్ అవసరం లేదు. పెళ్లి కార్డు ఉంటే దానిని ఆధారంగా దరఖాస్తు చేసుకోవచ్చు.
సమస్య: రైస్ కార్డులో భార్య/పిల్లలను చేర్చడానికి భర్త/తండ్రి హౌస్‌హోల్డ్‌లో నమోదై ఉండాలా?
పరిష్కారం: కార్డులో చేర్పులు చేయడానికి హౌస్‌హోల్డ్ సర్వేతో సంబంధం లేదు.

మావోయిస్టు చీఫ్ ఎన్‌కౌంటర్

కొత్త దళపతి ఎవరు?

వేణుగోపాల్, రాజన్‌లలో ఒకరికి చాన్సు!

ప్రజాసంఘాల నేతల మనోగతం

మళ్లీ గణపతికే ఇవ్వొచ్చంటున్న ఇంకో వర్గం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

సీపీఐ మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు (బస్వరాజ్, బీఆర్) ఎన్‌కౌంటర్‌లో మరణించడంతో తదుపరి సారథి ఎవరన్న ఆసక్తి సర్వత్రా ఏర్పడింది. కేంద్ర కమిటీలోని 17 మంది సభ్యుల్లో ఎవరు దళపతి కానున్నారు..? బెంగాల్‌కు చెందిన రాజనా..? లేక తెలంగాణలోని ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన మల్లోజుల వేణుగోపాల్‌కు అవకాశం దక్కుతుందా అన్న చర్చ జరుగుతోంది. వేణుగోపాల్ ప్రస్తుతం పొలిట్ బ్యూరో సభ్యుడిగా ఉన్నారు. దండకారణ్యంలో కీలక బాధ్యతలు చూస్తున్నారు. కేంద్ర కమిటీ అధికార ప్రతినిధిగానూ వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. వీరిద్దరిలోనే ఒకరికి అగ్ర పదవి లభించే అవకాశం ఉందని ప్రజాసంఘాల నేతలు చెబుతున్నారు. తిప్పిరి తిరుపతి, బాలకృష్ణ వంటి నేతలు కూడా కేంద్ర కమిటీ సభ్యులుగా ఉన్నారు. అయితే తాజా పరిస్థితుల్లో మాజీ దళపతి గణపతికే పార్టీ బాధ్యతలు కట్టబెట్టే అవకాశం ఉందని ఓ వర్గం నేతలు చెబుతున్నారు. ప్రస్తుతం ఆయన అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ కేంద్రం బాధ్యతల్లో ఉన్నారు. 70 ఏళ్ల వయస్సుడైన ఆయనకు క్లిష్ట సమయంలో మరోసారి పార్టీ పగ్గాలు అప్పగిస్తారా అన్న చర్చ కూడా నడుస్తోంది. 2004లో సీపీఐ మావోయిస్టు పార్టీ ఏర్పాటుకు ముందు గణపతి పీపుల్స్‌వార్‌కు కేంద్ర కమిటీ కార్యదర్శిగా 15 ఏళ్లపాటు పనిచేశారు. పీపుల్స్‌వార్-ఎంసీసీ విలీనమై మావోయిస్టు పార్టీ ఆవిర్భవించిన తర్వాత 2004 నుంచి 2018 వరకు ఆయన ఆ పార్టీ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ఆ సమయంలో బస్వరాజ్ మిలిటరీ కమిషన్ చీఫ్‌గా ఉన్నారు. తీవ్ర అనారోగ్య సమస్యలతో గణపతి బాధ్యతలు వదులుకోవడంతో 2018లో బస్వరాజ్ పార్టీ ప్రధాన కార్యదర్శి అయ్యారు. మిలిటరీ కమిషన్ ఇన్‌చార్జిగానూ ఆయనే ఉన్నట్లు తెలిసింది. ఇప్పుడు ఎన్‌కౌంటర్‌లో ఆయన మరణించడంతో రెండు పదవులు ఖాళీ అయినట్లయింది. అసలే ఆ పార్టీ తీవ్రమైన గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటోంది. ఎప్పుడు, ఎవరు పారామిలిటరీ డ్రోన్ కెమెరాలకు చిక్కుతారు.. ఎవరు, ఎప్పుడు ఎన్‌కౌంటర్లో మరణించారన్న వార్త వస్తుంది అన్న భయం పార్టీతోపాటు ప్రజాసంఘాల్లోనూ నెలకొంది. ఈ నేపథ్యంలో అగ్ర పదవిని అనుభవజ్ఞుడైన గణపతికే తిరిగి కట్టబెడతారా.. లేక కొత్తగా మరొకరిని ఎంపిక చేస్తారా అన్నది త్వరలో తేలనుంది.

ఆస్పత్రి నుంచి తీసుకెళ్లి చంపారు!

రాజకీయ ఖైదీల విడుదల కమిటీ ఆరోపణ


అమరావతి, మే 21(ఆంధ్రజ్యోతి):సీపీఐ(మావోయిస్టు) పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు(బస్వరాజ్) ఎన్‌కౌంటర్ బూటకం అని రాజకీయ ఖైదీల విడుదల కమిటీ నేత బల్లా రవీంద్రనాథ్ ఆరోపించారు. తీవ్ర అనారోగ్యంతో ఒడిశాలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నంబాలను పోలీసులు అదుపులోకి తీసుకొని, ఆ తర్వాత ఎన్‌కౌంటర్ చేశారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఎన్‌కౌంటర్‌పై స్వతంత్ర న్యాయవిచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.

మావోయిస్టు 'ఉంగా' లొంగుబాటు

ఎటపాక, మే 21(ఆంధ్రజ్యోతి): సీపీఐ (మావోయిస్టు) పార్టీ సభ్యుడు ముచ్చకీ ఉంగా అలియాస్ కిశోర్ ఎటపాక స్టేషన్‌లో లొంగిపోయాడు. కేసు వివరాలను రంపచోడవరం ఓఎస్డీ జగదీష్ అడహల్లీ వెల్లడించారు. 'ఉంగా స్వగ్రామం సుక్మా జిల్లా దంతేష్పురం గ్రామం. దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీ మాడ్ డివిజన్ ఒకటో కంపెనీ, ఒకటో ప్లటూన్ సభ్యుడుగా వ్యవహరిస్తున్న ఉంగా 2020లో మావోయిస్టు పార్టీలో చేరాడు. ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన పలు ఎదురు కాల్పులు, రోడ్లు తవ్విన ఘటనలో నిందితుడిగా పోలీసు రికార్డులో ఉన్నాడు' అని ఓఎస్డీ తెలిపారు.

(మొదటిపేజీ తరువాయి)

పలువురు అగ్రనాయకులు, కేశవరావు అంగరక్షకులున్నారని పోలీసులు అనుమానిస్తున్నారు. మావోయిస్టు పార్టీ పత్రిక అవామ్-ఇ-జంగ్ చీఫ్ ఎడిటర్ సజ్జా వెంకట నాగేశ్వర్‌రావు కూడా మృతిచెందినట్లు ప్రచారం జరుగుతున్నా.. పోలీసులు నిర్ధారించలేదు. మావోయిస్టులు జరిపిన కాల్పుల్లో ఓ డీఆర్‌జీ జవాను మృతిచెందగా.. మరో ఐదుగురు కానిస్టేబుళ్లు గాయపడ్డారు. ఛత్తీస్‌గఢ్ పోలీసుల కథనం ప్రకారం.. మూడంచెల భద్రత ఉండే మావోయిస్టు ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతోపాటు.. పార్టీ అగ్ర నాయకులు, కేంద్ర కమిటీ సభ్యులు, డీవీసీఎం నేతలు అబూజ్‌మడ్ అడవుల్లో సమావేశమైనట్లు ఈ నెల 19న ఇంటెలిజెన్స్ వర్గాలు ఛత్తీస్‌గఢ్ పోలీసులకు ఉప్పందించాయి. దాంతో అదే రోజు తెల్లవారుజామున నారాయణపూర్, బీజాపూర్, దంతేవాడ, కొండగావ్ జిల్లాలకు చెందిన డీఆర్జీ బలగాలు, స్థానిక పోలీసులు కూంబింగ్ చేపట్టారు. "72 గంటల పాటు ఆపరేషన్ కొనసాగింది. ఈ క్రమంలో బుధవారం ఉదయం బలగాలపై మావోయిస్టులు కాల్పులు జరిపారు. మావాళ్లు ఎదురు కాల్పులు జరిపారు. మూడు గంటలపాటు ఇరువైపులా కాల్పులు కొనసాగాయి. మావోయిస్టుల వైపు కాల్పులు నిలిచిపోయిన తర్వాత.. బలగాలు గాలింపును కొనసాగించాయి. 27 మంది మావోయిస్టుల మృతదేహాలు, ఏకే-47, ఎస్ఎల్ఆర్, ఇన్సాస్, కార్బైన్ తుపాకులు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నాం" అని నారాయణపూర్ పోలీసులు మీడియాకు తెలిపారు. మృతుల్లో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు అలియాస్ బీఆర్ దాదా అలియాస్ గంగన్నను గుర్తించామన్నారు. ఈయనకు మరో 10 పేర్లున్నట్లు తెలిపారు. మిగతా వారిలో కేశవరావు అంగరక్షకులు, దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ, పీఎల్‌జీఏ నేతలు, సభ్యులు ఉన్నట్లు అనుమానం వ్యక్తం చేశారు. మృతులను ఇంకా గుర్తించాల్సి ఉందన్నారు. కేశవరావుపై ఛత్తీస్‌గఢ్ పోలీసులు రూ.కోటిన్నర రివార్డు ప్రకటించగా.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్రల్లో కూడా రివార్డులున్నట్లు వెల్లడించారు. కాగా.. మృతిచెందిన మిగతా మావోయిస్టుల వివరాలు గురువారానికి తెలిసే అవకాశాలున్నాయి.



కాలేజీ రోజుల్లో కేశవరావు(ఫైల్)



ఏపీలోని శ్రీకాకుళం జిల్లా జీయన్నపేటలో కేశవరావు నివాసం


సిక్కోలులో పుట్టి.. అంచెలంచెలుగా అగ్రస్థానానికి

నంబాల కేశవరావు స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం జీయన్నపేట గ్రామం. వాసుదేవరావు, భారతమ్మ దంపతులకు 1954లో కేశవరావు జన్మించారు. వాసుదేవరావు ఉపాధ్యాయుడు కాగా.. భారతమ్మ గృహిణి. కేశవరావు పెద్దన్నయ్య ఢిల్లీశ్వర్‌రావు, తమ్ముడు రాంప్రసాద్ విశాఖలో ఉంటున్నారు. అక్క ఉష విజయవాడలో, చెల్లెలు జలజాక్షి శేఖరాపురంలో, మరో సోదరి సత్యవతి హైదరాబాద్‌లో నివసిస్తున్నారు. చిన్నప్పటి నుంచి కబడ్డీ ఆటగాడిగా పేరున్న కేశవరావు నౌపడా హైస్కూల్‌లో 8-10 తరగతులు చదివారు. టెక్కలి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ పూర్తిచేశారు. వరంగల్ ఆర్ఈసీలో బీటెక్ పూర్తిచేశారు. అప్పటికే రాడికల్ స్టూడెంట్స్ యూనియన్(ఆర్ఎస్‌యూ)లో క్రియాశీలంగా ఉన్న కేశవరావు.. ఎంటెక్ చదువుతున్న సమయంలో(1975) మెస్‌లో జరిగిన ఓ గొడవ(ఒకరు మృతిచెందారు)కుతోడు.. జాతీయ ఎమర్జెన్సీ కారణంగా అజ్ఞాతంలోకి వెళ్లారు. నక్సల్‌బరి ఉద్యమంలో చేరారు. జీయన్నపేటలో తన మిరప పొలం పనులు చూసుకుంటుండగా.. తనకోసం పోలీసులు రావడంతో కొండల్లోకి పారిపోయారు. పోలీసులు అతణ్ని చింతపల్లి అడవుల్లో అరెస్టు చేసి, విశాఖ కేంద్ర కారాగారానికి తరలించారు. బెయిల్‌పై బయటకు వచ్చాక.. పూర్తిగా అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. అప్పటి నుంచి 45 ఏళ్లుగా ఇంటిముఖం చూడకుండా, పీపుల్స్‌వార్.. ఆ తర్వాత మావోయిస్టు పార్టీల్లో కీలక భూమిక పోషించారు.

మిలటరీ ఆపరేషన్లలో సిద్ధహస్తుడు

కేశవరావు తొలుత గంగన్న అనే పేరుతో సీపీఐఎంఎల్ తూర్పుగోదావరి జిల్లా సభ్యుడిగా పనిచేశారు. రాష్ట్రకమిటీ సభ్యుడిగా బాధ్యతలు స్వీకరించాక బసవరాజుగా పేర్గాంచారు. క్రమంగా అగ్రనాయకుడిగా మారారు. ఈయన 1987లో బస్తర్ అడవుల్లో శ్రీలంకకు చెందిన ఎల్‌టీటీఈ విలిటెంట్ల వద్ద ప్రత్యేక శిక్షణ పొందినట్లు సమాచారం. 1992లో సీపీఐ(ఎంఎల్) కేంద్ర కమిటీ సభ్యుడిగా పనిచేశారు. 2000-04 మధ్య కాలంలో పీపుల్స్ వార్ కేంద్ర మిలటరీ కమిషన్(సీఎంసీ) కార్యదర్శిగా కొనసాగారు. 2004లో పీపుల్స్‌వార్, సీపీఐ(ఎంఎల్) తదితర గ్రూపులు సీపీఐ(మావోయిస్టు) పార్టీగా రూపాంతరం చెందాయి. అప్పటి నుంచి ముప్పాల లక్ష్మణరావు అలియాస్ గణపతి మావోయిస్టు పార్టీకి ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ఆయన హయాంలో కేశవరావు మిలటరీ ఆపరేషన్లలో కీలక పాత్ర పోషిస్తూనే.. 2018 వరకు కేంద్ర మిలటరీ కమిషన్ చీఫ్‌గా పనిచేశారు. వివిధ రాష్ట్రాల్లో సాయుధ పోరాటాన్ని ఉధృతం చేశారు. 16 రాష్ట్రాల్లో రెడ్ కారిడార్‌ను నడిపారు. బలగాలపై మెరుపు దాడులు చేసేవారు. మిలటరీ ఆపరేషన్లలో నంబాల చెప్పిందే వేదంగా పార్టీలో కొనసాగుతుందని సమాచారం. 2018 నవంబరు 10న గణపతి అనారోగ్య కారణాలతో రాజీనామా చేయగా.. కేశవరావు ప్రధాన కార్యదర్శి బాధ్యతలను స్వీకరించారు. పీఎల్‌జీఏ దళాలకు సైతం నంబాల ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు.. హిడ్మా వంటి వాళ్లు ఇతని శిష్యులేనని ఛత్తీస్‌గఢ్ పోలీసులు తెలిపారు.

అలిపిరి సహా.. 27 దాడుల్లో కీలక పాత్ర



నక్సల్ ఉద్యమాన్ని, మావోయిస్టు పార్టీగా మార్చిన తర్వాత.. నంబాల 27 ముఖ్య దాడులు చేసినట్లు పోలీసులు చెబుతున్నారు

2003 అక్టోబరు 1న చంద్రబాబు నాయుడుపై అలిపిరి వద్ద 17 క్లైమోర్ మైన్స్‌తో జరిగిన దాడిలో ఈయనే ప్రధాన సూత్రధారి.

ఒడిసాలోని కోరాపూట్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని ఆయుధాగారంపై దాడి చేసి, ట్రక్కుల నిండా తుపాకులను దోచుకుపోయిన ఘటన వెనక ఈయనే ప్రధాన నిందితుడు..

2010లో ఛత్తీస్‌గఢ్‌లోని చింతల్నార్ ఘటనలో వ్యూహం కేశవరావుదే. కూంబింగ్‌కు వెళ్లి తిరిగి వస్తున్న సీఆర్పీఎఫ్ జవాన్లు రెండు కొండల మధ్యకు రాగానే.. మావోయిస్టులు కాపుకాచి, కాల్పులు జరిపేలా వ్యూహరచన చేశారు. ఈ ఘటనలో 74 మంది జవాన్లు చనిపోయారు. తాడిమెట్లలో 76 మంది జవాన్ల మృతి


2013లో సల్వాజుడుం వ్యవస్థాపకుడు మహేంద్రకర్మపై దాడి వ్యూహం కూడా కేశవరావుదే. ఈ ఘటనలో మహేంద్రకర్మతో పాటు మరో 27 మంది మరణించారు

2018 సెప్టెంబరు 23న అరకులో తెలుగుదేశం పార్టీ నాయకుడు కిడారి సర్వేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సివేరి సోమ హత్యకేసులో నంబాల ప్రధాన నిందితుడు

2021లో బీజాపూర్‌లోని తెర్రం(హిడ్మా స్వస్థలం) అడవుల్లో 22 మంది జవాన్లు, 2020లో సుకుమాలో 17 మంది జవాన్లను హతమార్చిన ఘటనలకు నంబాల సూత్రధారి

2019లో దంతేవాడలో బీజేపీ ఎమ్మెల్యే భీమా మండవి, నలుగురు గన్‌మన్ల హత్యలో ఇతనే ప్రధాన నిందితుడు

నాగేశ్వర్‌రావు మృతిపై ప్రచారం



నాగేశ్వర్‌రావు(ఫైల్)

అబూజ్‌మడ్ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పత్రిక అవామ్-ఇ-జంగ్ చీఫ్ ఎడిటర్ సజ్జా వెంకట నాగేశ్వర్‌రావు(61) కూడా మృతిచెందినట్లు ప్రచారం జరుగుతోంది. ఆయన స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లా చీరాల మండలం దేవాంగపురి గ్రామం. ఆయన గుంటూరులో డిప్లొమా పూర్తిచేసి, 30 ఏళ్ల క్రితం అజ్ఞాతంలోకి వెళ్లారు. యూజీ, డీసీఎస్‌గా పనిచేసి, అవామ్-ఇ-జంగ్ ఎడిటోరియల్ బోర్డులో సేవలందించారు. చీఫ్ ఎడిటర్ స్థాయికి ఎదిగారు. ఛత్తీస్‌గఢ్ పోలీసులు నాగేశ్వర్‌రావు మృతిని నిర్ధారించలేదు. అయితే.. బాపట్ల జిల్లా పోలీసులు మాత్రం తమకు పైనుంచి ఆదేశాలు వచ్చాయని, ఈ నేపథ్యంలో నాగేశ్వర్‌రావు వివరాలను సేకరిస్తున్నామని తెలిపారు. ఇతనిపై వేటపాలెం ఠాణాలో ఓ కేసు ఉన్నట్లు సమాచారం.

నక్సలిజం నిర్మూలనలో మైలురాయి: అమిత్‌షా



మావోయిస్టు పార్టీ అగ్రనేత నంబాల కేశవరావు మృతిచెందడంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఎక్స్‌లో స్పందిస్తూ.. నక్సలిజం నిర్మూలనలో ఇదో మైలురాయి విజయంగా అభివర్ణించారు. "2026 మార్చి 31 నాటికి నక్సలిజాన్ని నిర్మూలించేందుకు మోదీ సర్కారు దృఢ సంకల్పంతో ఉంది. కర్రెగుట్టల ఆపరేషన్ తర్వాత.. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రల్లో 54 మంది నక్సల్స్ అరెస్టయ్యారు. 84 మంది పోలీసుల ఎదుట లొంగిపోయారు" అని ఆయన వ్యాఖ్యానించారు.

వెన్ను విరిగినట్టే!

దళపతిని కోల్పోయిన మావోయిస్టులు

కేంద్ర కమిటీ కార్యదర్శి స్థాయి నేత ఎన్‌కౌంటరులో హతమవ్వడం ఇదే తొలిసారి

కీలక దశకు చేరిన కగార్ ఆపరేషన్.. ఒక్క ఏడాదిలోనే 540 మంది ఎన్‌కౌంటర్

కేంద్రం అత్యాధునిక సాంకేతిక యుద్ధం .. వేలాది బలగాల గుప్పిట్లో దండకారణ్యం

(అమరావతి- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

భారత విప్లవోద్యమ చరిత్రలో తొలిసారి మావోయిస్టులు తమ దళపతిని ఎన్‌కౌంటర్‌లో కోల్పోయారు. కేంద్రం సాగిస్తున్న సాంకేతిక యుద్ధంతో ఏడాది కాలంగా విలవిల్లాడుతున్న మావోయిస్టులకు ఇది శరాఘాతమే.! వెన్ను విరిగినట్టే! మే నెల మావోయిస్టు పార్టీ ఉనికికి కీలకమైనది. మరో నాలుగు రోజుల్లో, అంటే ఈ నెల 25న నక్సల్బరీ ఆవిర్భావ దినోత్సవం రాబోతుంది. అలాంటి మే నెలలోనే నక్సల్స్‌కు ఊహించని దెబ్బ తగిలింది. ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్‌లో జరిగిన హోరాహోరీ ఎదురు కాల్పుల్లో బుధవారం ఆ పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావు మరణించారు. ఈ సంఘటన మావోయిస్టుల ఏరివేత యుద్ధం చేస్తున్న కేంద్ర సాయుధ బలగాలకు పెద్ద విజయమని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా 'ఎక్స్'లో ప్రకటించారు. బస్వరాజ్ మరణం మావోయిస్టు పార్టీకి ఎంత నష్టం అనేదానికి ఈ ప్రకటనే సాక్ష్యం. మావోయిస్టు పార్టీకి కేంద్ర కమిటీ అంటేనే నిర్దేశిత వ్యవస్థ. ఆ కమిటీకి ప్రధాన కార్యదర్శి అంటే గుండెకాయ. కేంద్ర బలగాలు ఆ గుండెకాయను మట్టుబెట్టాయి. కేంద్రం 2026 మార్చి నాటికి మావోయిస్టులను లేకుండా చేస్తానని ప్రకటించింది. ఆపరేషన్ కగార్‌ను ప్రారంభించింది. కానీ, గడువుకు చాలా ముందే, ఇంత త్వరగా కేంద్రం కమిటీ కార్యదర్శి, దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ నేతలు అనేక మంది ఒకే ఎన్‌కౌంటర్‌లో హతమవ్వడం భద్రతాబలగాల ఆధిపత్యాన్ని నిరూపిస్తోంది.

హడలెత్తిస్తున్న హైటెక్ వార్...

2024లో ఆపరేషన్ కగార్ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు 540 మంది మావోయిస్టులు మరణించారు. టాప్ నాయకత్వం నుంచి జిల్లా కమిటీ సభ్యుని దాకా మరణించినవారిలో ఉన్నారు. యూపీఏ హయాంలో ఆపరేషన్ గ్రీన్‌హంట్‌లో భాగంగా సగటున ఏడాదికి 80 మంది మావోయిస్టులు మరణించేవారు. ఇప్పుడు ఆపరేషన్ కగార్ అందుకు భిన్నంగా సాగుతోంది. ఒక విధంగా అత్యాధునిక సాంకేతిక యుద్ధం సాగుతోంది. వేలాది పారామిలటరీ బలగాలు, రాష్ట్ర ప్రత్యేక బలగాలు ఈ యుద్ధంలో పాల్గొంటున్నాయి, అడవులను జల్లెడ పట్టేందుకు హైటెక్ విధానాలను అనుసరిస్తున్నారు. మానవ రహిత డ్రోన్లను వాడి విజయాలు సాధిస్తున్నారు. దండకారణ్యంలో ఇద్దరు లేదా ముగ్గురి కంటే ఎక్కువ మంది కదలికలు ఉన్నా, ఆయుధాలు, ఇతర సామగ్రిని సైతం కనిపెట్టి భద్రతా బలగాలకు వాటి లోకేషన్‌తో కూడిన వివరాలను మ్యాప్‌లతో సహా అందించే అత్యాధునిక వార్ కేటగిరీ సైలెంట్ కిల్లర్ డ్రోన్‌లను ఉపయోగిస్తున్నారు. అవి ఒకటో, రెండో కాదు. మావోయిస్టులకు పట్టున్న అబూజ్‌మడ్, నారాయణపూర్, బీజాపూర్, కాంకేర్, ఆంధ్రా-ఒడిసా బోర్డర్....ఇలా ఆయా ప్రాంతాలను బట్టి, అవసరాలను బట్టి లెక్కకు మించిన డ్రోన్లను రోజువారీగా ఉపయోగిస్తున్నారు. దీనివల్ల భద్రతా బలగాలు అడవుల్లోని భారీ కొండలు, గుట్టలు ఎక్కి, దిగాల్సిన పనిలేదు. అనుమానంతో ఓ డ్రోన్‌ను ఫ్లైయింగ్ చేపిస్తే 18-25 కిలోమీటర్ల పరిధిలోని అడవిలో ఎక్కడ ఏం ఉందో సులువుగా కనిపెట్టవచ్చు. ఇవి భద్రతా బలగాల చేతికి అందిన తర్వాతే గత ఏడాది కాలంగా ఎన్‌కౌంటర్ల సంఖ్య పెరిగిపోయింది. సగటున ఒక్కో సంఘటనలో 20 -30 మంది చొప్పున మరణిస్తున్నారు. మానవ రహిత డ్రోన్లు అడవుల్లో ఉన్న మావోయిస్టుల జాడను లోకేషన్‌తో సహా ఇస్తుండటంతో వారున్న ప్రాంతాలను బలగాలు రెండు లేదా మూడు గంటల వ్యవధిలోనే చుట్టుముడుతున్నాయి. డ్రోన్ సర్వైలెన్స్ ఇచ్చే డేటాతో ఒకేసారి వేలాది మంది భద్రతా బలగాలు మావోయిస్టులపై దాడులు చేస్తున్నాయి. దీంతో మావోయిస్టుల వైపు ప్రాణనష్టం చాలా ఎక్కువగా ఉంటోంది.

వేధిస్తున్న వయోభారం

మావోయిస్టులను వేధిస్తున్న మరో సమస్య వయోభారం. పార్టీ కేంద్ర కమిటీలో మిగిలిన అగ్రనాయకుల్లో ఎక్కువ మంది 60 నుంచి 75 ఏళ్ల మధ్యలో ఉన్నారు. వీరిలో చాలామంది వయోభారంతో, అనారోగ్యాలతో కదల్లేని స్థితిలో ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మిగిలిన అగ్రనాయకత్వాన్ని కాపాడుకోలేని పరిస్థితి వారికి ఏర్పడింది. 2010 ప్రాంతాల్లో 96 జిల్లాల్లో బలమైన ప్రభావం చూపిన మావోయిస్టు పార్టీ 2023 నాటికి 46 జిల్లాలకు పరిమితమైంది. ఆపరేషన్ కగార్ తర్వాత ఆరు జిల్లాలకే పరిమితమైంది.

షెల్టర్ జోన్‌లలోకి తిరోగమనం..

వరుస ఎన్‌కౌంటర్లతో గడ్డు పరిస్థితుల్లో ఉన్న మావోయిస్టు పార్టీ కేంద్రంతో చర్చలకు సిద్ధమని ప్రకటించింది. కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ రెండుసార్లు శాంతి చర్చల ప్రతిపాదన చేశారు, కేంద్రం ఈ ప్రతిపాదనపై సానుకూలంగా స్పందించలేదు సరికదా...మావోయిస్టు గెరిల్లాలకు ఆశ్రయమైన కర్రెగుట్టల ప్రాంతాన్ని జల్లెడ పట్టించింది. ఇక చర్చలకు కేంద్రం అవకాశం ఇవ్వదని మావోయిస్టు పార్టీకి సంకేతాలు వెళ్లాయి. వార్ జోన్ నుంచి షెల్టర్ జోన్‌కు వెళ్లాలని పార్టీ ముఖ్యనేతలకు కేంద్ర కమిటీ నుంచి సూచనలు వెళ్లినట్లుగా ఇటీవలి తనిఖీల్లో వెలుగు చూసిన పలు డాక్యుమెంట్ల ద్వారా తెలుస్తోంది.



ఎందుకీ పరిస్థితి?

ఒకప్పుడు నక్సల్స్‌కు అడవులు సురక్షితమైనవి. అడవుల్లో ఉంటూనే దళాల నిర్మాణం చేసి విముక్తి ప్రాంతాలను ప్రకటించారు. నగర, పట్టణ ప్రాంతాల్లో యాక్షన్ టీమ్‌లను ఏర్పాటు చేసి ప్రభుత్వానికి సవాల్ విసిరారు. అయితే టెక్నాలజీ పెద్దగా లేని సమయంలో నక్సల్స్ ఏరివేతకు పోలీసు బలగాలు ప్రధానంగా మేధస్సును నమ్ముకొని పనిచేశాయి. కోవర్ట్ సిస్టమ్‌ను డెవలప్ చేసి కీలకనేతలను మట్టుబెట్టారు. అడవుల్లోకి వెళ్లి నక్సల్స్‌ను తుదముట్టించాలని కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు పారామిలటరీ బలగాలను రంగంలోకి దింపి ప్రత్యేక చర్యలు చేపట్టాయి. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ప్రభుత్వం మావోయిస్టుల ఏరివేతకు అత్యాధునిక ఆయుధాలు వినియోగించింది. చీకట్లో కూడా నక్సల్స్‌ను గుర్తించేందుకు నైట్‌విజన్ గ్లాసెస్‌ను వినియోగించింది. ఆ తర్వాత అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకుంది. మావోయిస్టుల ఏరివేతకు సాధారణ డ్రోన్లను ఉపయోగించారు. వాటిని నక్సల్స్ కూల్చివేశారు. కానీ 2023 నుంచి అత్యాధునికమైన మానవ రహిత, శబ్దరహిత యుద్ధడ్రోన్లను మావోయిస్టు ఆపరేషన్‌కోసం కేంద్రం ఉపయోగిస్తోంది. ఒకవైపు పెరిగిన నిర్బంధం, మరోవైపు డ్రోన్‌దాడులు, ఆధునిక ఆయుధాల ప్రయోగంతో ఇంకా సంప్రదాయ కాలి నడక మార్గాల్లోనే పయనిస్తున్న మావోయిస్టులు మృత్యువులోకి వెళ్లిపోతున్నారు. అసలు అడవుల్లోనే ఉంటూ మావోయిస్టులు సాయుధపోరాటం ప్రాణాలు కాపాడుకోవడం ఎలా? అన్నది ఇప్పుడు మావోయిస్టు పార్టీ ముందున్న అతిపెద్ద సవాల్. కేంద్రం కోరుతున్నట్లుగా మావోయిస్టులు అస్త్రసన్యాసం చేసి సాయుధంగా లొంగిపోలేరు. అలాగని అడవుల్లోనే ఉంటూ పాత పద్ధతులు, కాలం చెల్లిన వ్యూహాలతో సాయుధపోరాటం అంటే విడతల వారీగా మృత్యువును ఆహ్వానించడమే అవుతుంది.

ఖాళీ అవుతున్న కమిటీలు..

గత ఏడాది సెప్టెంబరు నాటి మావోయిస్టు పార్టీ డాక్యుమెంట్ ప్రకారం కేంద్ర కమిటీ సభ్యులు 21 మంది. పొలిట్ బ్యూరో సభ్యులు 13మంది. కానీ తాజా పరిణామాలతో కమిటీ సభ్యుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. మావోయిస్టు పార్టీకి దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ (డీకేఎస్‌జెడ్‌సీ) కీలకమైనది. ఇందులో నుంచే అనేక మంది కేంద్ర కమిటీ, పొలిట్‌బ్యూరోలో సభ్యులుగా ఉన్నారు. గత ఏడాది కాలంగా ఈ కమిటీలో 18 మంది ఎన్‌కౌంటర్‌లో మరణించారు. ఉప కమిటీల పరిధిలో 120 మంది మరణించారు. దీంతో దండకారణ్య ప్రత్యేక జోనల్ కమిటీ దాదాపుగా ఖాళీ అయినట్లేనని పోలీసువర్గాలు చెబుతున్నాయి. దక్షిణాదిలో కేరళలోనే ఆ పార్టీకి కొంత పట్టు ఉంది. గత ఏడాది జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు రాష్ట్రకమిటీ సభ్యులు అక్కడ ఎన్‌కౌంటర్‌లో మరణించారు. ఏపీ, తెలంగాణల్లో ప్రత్యేకంగా దళాలు లేని పరిస్థితి. ఆంధ్రా-ఒడిశా సరిహద్దు కమిటీలో 18 మంది కీలక నేతలు ఉన్నా వ్యక్తులుగానే ఉన్నారని సమాచారం. వరుస ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో ఏఓబీ కమిటీ కూడా ఉనికిని కోల్పోయే పరిస్థితి వచ్చిందని ప్రజాసంఘాలు చెబుతున్నాయి.



టాప్ ఆర్డర్ కూలిందిలా..

బెంగాల్‌లోని నక్సల్బరీలో 1967 మే 25న మొదలైన సాయుధ రైతాంగ తిరుగుబాటును అసలైన మార్గంగా గుర్తించినవారిని నక్సల్స్‌గా వ్యవహరిస్తున్నారు. 1968లో వీరంతా చారుమజుందార్ నాయకత్వాన్ని అంగీకరించి, ఆయన కేంద్ర కమిటీ కార్యదర్శిగా సీపీఐ(ఎం.ఎల్.) పార్టీని ఏర్పాటుచేశారు. ఉమ్మడి ఏపీ నుంచి పంచాది కృష్ణమూర్తి కేంద్ర కమిటీ సభ్యునిగా ఉండేవారు. ఆ తర్వాత ఎన్‌కౌంటరులో ఆయన మరణించారు. చారుమజుందార్ పోలీసులకు పట్టుబడి 1972 జూలై 28న కస్టడీలో చనిపోయారు. పోలీసుల అదుపులో ఉండగా ఒక కేంద్ర కమిటీ కార్యదర్శి మరణించిన తొలి సంఘటన అది. ఆ తర్వాత జరిగిన అతిపెద్ద సంఘటన బస్వరాజ్ ఎన్‌కౌంటరే. 1980లో పీపుల్స్‌వార్ ఏర్పడే నాటికి సీపీఐ(ఎం.ఎల్.)గా ఉన్న పార్టీలో అనేక మంది సాయుధపోరాట పంథాలో సాగారు. కానీ పార్టీకి సారథ్యం వహిస్తున్నవారెవ్వరూ ఎన్‌కౌంటర్లలో మరణించలేదు. పీపుల్స్‌వార్ 1980లో కొండపల్లి సీతారామయ్య నేతృత్వంలో ఆవిర్భవించిన తర్వాత అనేక రాష్ట్ర కమిటీ నేతలు ఎన్‌కౌంటర్లలో చనిపోయారు. ఉమ్మడి ఏపీలో గ్రేహౌండ్స్ బలగాల ఆపరేషన్స్‌లో రాష్ట్ర కార్యదర్శి పులిఅంజయ్య, ఆ తర్వాత మాధవ్ చనిపోయారు. 1999 డిసెంబరులో పీపుల్స్‌వార్ కేంద్ర కమిటీ సభ్యులు నల్లా ఆదిరెడ్డి, ఎర్రంరెడ్డి సంతోశ్ రెడ్డి, శీలం నరేశ్ ఎన్‌కౌంటర్‌లో మరణించారు. 2004లో పీపుల్స్‌వార్ దండకారణ్యంలోని ఎంసీసీతో విలీనం తర్వాత సీపీఐ(మావోయిస్టు) పార్టీగా అవతరించింది. ఆ తర్వాత 2009లో కేంద్రం మావోయిస్టుల ఏరివేత కోసం ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను ప్రారంభించింది. ఇక అప్పటి నుంచి కీలక నేతల ఎన్‌కౌంటర్లు సెలక్టీవ్‌గా జరిగాయి. ఆజాద్ (చెరుకూరి రాజ్‌కుమార్), కిషన్‌జీ (మల్లోజుల కోటేశ్వరరావు), పటేల్ సుధాకర్‌రెడ్డి(సూర్యం), శాఖమూరి అప్పారావు వంటి అనేక మంది కేంద్ర కమిటీ, పొలిట్ బ్యూరో సభ్యులు ఎన్‌కౌంటర్లలో మరణించారు. ఆపరేషన్ కగార్‌లో వరస ఎన్‌కౌంటర్లు మొదలయ్యాయి. ఛత్తీస్‌గఢ్-ఒరిశా సరిహద్దుల్లో గరియాబంద్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కేంద్ర కమిటీ సభ్యుడు చలపతి మరణించారు. ఆ తర్వాత ఛత్తీస్‌గఢ్ కమిటీ కీలక నేత రాంజీ మరణించారు. ఇప్పుడు కేంద్ర కమిటీ కార్యదర్శి బస్వరాజ్‌నే కోల్పోయారు. మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా ముప్పాళ్ల లక్ష్మణ్‌రావు తప్పుకొన్న తర్వాత బాధ్యతలు స్వీకరించిన కేశవరావు ఉత్తరాది, దక్షిణాది మావోయిస్టు దళాలతో సమన్వయం చేసుకుంటూ పార్టీని నడిపారు. మావోయిస్టు పార్టీని దేశమంతటా విస్తరించడంలో ప్రధానపాత్ర పోషించారు. కరోనా కాలం కూడా మావోయిస్టులను భయపెట్టింది. తెలంగాణ కార్యదర్శి హరిభూషన్ కరోనాతో ఉద్యమంలోనే మరణించారు. కేంద్ర కమిటీ సభ్యునిగా ఎన్‌కౌంటరులో మరణించిన నల్లా ఆదిరెడ్డి భార్య సరోజినిని కరోనా బలి తీసుకుంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.